
'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 310

మంగళవారం 23-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



విశ్వాసం.. స్వేచ్ఛ.. విజయం

ఇదే నా పని శైలి.. సీనియర్లు అన్ని మ్యాచ్‌లు ఆడాల్సిందే: గంభీర్ - 12లో



భారత్‌తో బంధం

ఒలింపిక్స్‌లో వేరే దేశాల తరఫున భారత సంతతి క్రీడాకారులు - 12లో



ఆహార బోర్డులు ప్రదర్శిస్తే చాలు

కావడి యాత్రలో హోటళ్ల యజమానులు ఏ రకమైన ఆహారమో తెలిపే బోర్డులు ప్రదర్శిస్తే సరిపోతుందని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

వివరాలు 6లో ▸



వాళ్లూ ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరొచ్చు

ప్రభుత్వ ఉద్యోగులు హిందుత్వ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరడంపై 1966 నుంచి ఉన్న నిషేధాన్ని కేంద్రం ఎత్తివేసింది.


వివరాలు 6లో ▸



అడ్వాంటేజ్ హారిస్

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌ను ఓడించడమే లక్ష్యమన్న అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మద్దతు పెరుగుతోంది.

వివరాలు 6లో ▸



'సరైన' సమాధానమేంటి?

నీట్-యూజీలో ఒక ప్రశ్నకు ఇచ్చిన రెండు ఆప్షన్లలో ఏది సరైన సమాధానమో తేల్చాలని ఐఐటీ ఢిల్లీని సుప్రీంకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸

ఆకాంక్షలు ఆవిరి!

ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఇప్పటికిప్పుడు అమలు చేయలేం

ఉభయసభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం

- వనరుల సమీకరణ చాలా కష్టంగా ఉంది.. నిధుల లేమితో సంక్షిప్తంగా అభివృద్ధి ప్రణాళిక
- రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉంది
- ఉదారంగా సాయం అందించాలని కేంద్రాన్ని కోరాం
- రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలు సహకరించాలి
- అర్థవంతమైన చర్చల తర్వాతే పూర్తి స్థాయి బడ్జెట్
- హామీల అమలుపై చేతులెత్తేసిన చంద్రబాబు సర్కార్

10 లో




ఆత్మస్తుతి.. పరనింద!

- గవర్నర్ ప్రసంగంలో అసత్యాలు, అవాస్తవాలను వల్లె వేయించిన కూటమి ప్రభుత్వం
- అరాచక పాలన కప్పిపుచ్చేందుకే వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిందలు
- ఖజానాలో రూ.7–8 వేల కోట్లు నిధులున్నా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేని దైన్యం
- 2019 నాటికి రూ.వంద కోట్లే ఉన్నా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన జగన్

10 లో

ఏం చేయాలన్నా డబ్బుల్లేవు



- ప్రభుత్వం వచ్చి నెల కాకుండానే జగన్ విమర్శలు
- ఇసుక విధానంపై సూచనలు చేయండి
- రాజకీయ ప్రతీకారాలకు పోవద్దు
- ఎన్డీఏ పక్ష ఎమ్మెల్యేల సమావేశంలో సీఎం చంద్రబాబు
- సీఎం నిర్ణయాలను సమర్థిస్తానన్న డిప్యూటీ సీఎం పవన్

2లో

ఆర్థికంగా ఏపీ బలోపేతం

- కేంద్ర ఆర్థిక సర్వే (2023-24)లో వెల్లడి
- అప్పుల భారం, ద్రవ్యలోటు తగ్గుతోంది.. వ్యయంలో నాణ్యత పెరిగింది
- పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు, వసతులు పెరిగాయి
- ఎఫ్‌ఆర్‌బీఎంకు లోబడే అప్పులు.. పరోక్షంగా వైఎస్ జగన్ పాలనకు కితాబు

2లో

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

హత్యా రాజకీయాలకు నిరసనగా సభ నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్



అసెంబ్లీ గేటు వద్ద వైఎస్సార్‌సీపీ సభ్యులను అడ్డుకుంటున్న పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత దారుణం

2 లో

దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలు రాజ్యమేలుతున్నాయి

హత్యాకాండపై అసెంబ్లీలో నిరసన గళం వినిపించిన ప్రతిపక్షం

నల్ల కండువాలతో ఉభయ సభల సమావేశానికి హాజరైన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

పోలీసుల అతిపై జగన్ ఆగ్రహం

- హత్యా రాజకీయాలను నిరసిస్తూ నల్ల కండువాలతో అసెంబ్లీ వరకు వైఎస్సార్‌సీపీ సభ్యుల నిరసన ర్యాలీ
- గేటు వద్ద విపక్ష సభ్యులను అడ్డుకుని ప్లకార్డులు చించేసిన పోలీసులు.. మీకు ఆ అధికారం ఎవరు ఇచ్చారంటూ నిలదీసిన వైఎస్ జగన్
- పోలీసుల జులుం ఎల్లకాలం చెల్లదని ఫైర్
- మీ టోపీపై 3 సింహాలు ఉన్నది అధికారపార్టీకి సెల్యూట్ కొట్టడానికి కాదు.. ప్రజాస్వామ్యం పరిరక్షణకంటూ హితవు

2 లో

హామీలపై నిలదీస్తారనే పూర్తిస్థాయి బడ్జెట్‌పై 'భయం'

2 లో

ఈ ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనిపిస్తోంది: వైఎస్ జగన్

రేపు ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ ధర్నా

2 లో

నేడు హస్తినకు వైఎస్ జగన్

అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులు

3 లో

బీఏసీ సమావేశంలో నిర్ణయం

ఆగని తవ్వకాలు

ప్రస్తుతం కృష్ణా నదిలో ఇసుక తవ్వకాల నిలిపివేత

అయినా తవ్వేసి సొమ్ము చేసుకుంటున్న తెలుగుదేశం నాయకులు

నిషేధిత ప్రాంతాలైన గురువులగారి ర్యాంపు, యనమలకుదురు నుంచి భారీగా తరలింపు.. ఇక్కడ టీడీపీ నేతల వాహనాలకే అనుమతి

రొయ్యూరు, మద్దూరుల్లో యథేచ్ఛగా ఇసుక తోలకం

గతంలో ట్రాక్టరు ఇసుక ధర రూ.3,500.. ప్రస్తుతం రూ.7 వేలు

చోడవరం స్టాక్‌యార్డులో ఇసుకను మింగేసిన టీడీపీ నేత

పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: తెలుగుదేశం నేతలు కృష్ణానదిని చెరబట్టారు. కృష్ణాజిల్లాలో యథేచ్ఛగా ఇసుకను దోపిడీ చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఇసుక అక్రమ తవ్వకాలపై ఆంక్షలు విధించింది. ఈ నేపథ్యంలో కృష్ణానది వెంబడి ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. అయినా తెలుగుదేశం నేతలు మాత్రం ఇసుక దందాను ఆపటం లేదు. విజయవాడలో కనకదుర్గ వారధికి ముప్పు ఏర్పడుతుందని 20 ఏళ్లుగా గురువులగారి ర్యాంపు, యనమలకుదురు ఘాట్‌లలో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉంది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ట్రాక్టర్ల ద్వారా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. పెదపులిపాక ఇసుక రేవులో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని కోర్టుకు వెళ్లడంతో అక్కడ ఇసుక తవ్వకాలపై స్టే విధించారు. అయినా అక్కడ కూడా ఇసుక తవ్వేస్తున్నారు. చోడవరంలో ఇసుక దోపిడీ బహిరంగంగానే సాగుతోంది. తెలుగుదేశానికి చెందిన వారి ట్రాక్టర్లను మాత్రమే ఇసుక రీచ్‌లోకి రానిస్తున్నారు. ఇంకా ఎవరైనా వస్తే అనుమతించటం లేదు. పొరపాటున ఇతరుల వాహనంలో ఇసుక లోడ్ అయినా.. దాన్ని అక్కడే బయట పోయించి ఖాళీ వాహనాలను తిప్పి పంపుతున్నారు. ఇక్కడ రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటలకు వరకు విచ్చలవిడిగా ఇసుక తరలిపోతోంది. కొన్ని రీచ్‌లలో పట్టపగలు కూడా ఇసుక తోడి యథేచ్ఛగా తరలిస్తున్నారు. నది వెంబడి ఉన్న మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, చల్లపల్లి, శ్రీకాకుళం ప్రాంతాల్లో సైతం ఇసుక దందా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. కొన్నిచోట్ల ఎడ్లబండ్ల ద్వారా ఇసుకను బయటకు తరలించి అక్కడ లారీల్లో లోడ్‌చేసి విజయవాడకు, జిల్లాలోని ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు.



విజయవాడ పరిసరాలకు ప్రాంతాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తున్న దృశ్యం



చోడవరం స్టాకు యార్డులో టీడీపీ నేతలు తరలించగా మిగిలిన ఇసుక

స్టాక్‌యార్డుల్లో నిల్వల్ని మింగేశారు

ఎన్నికలకు ముందు కృష్ణాజిల్లాలో చోడవరం, తోట్లవల్లూరు, మద్దూరు, శ్రీకాకుళం స్టాక్‌యార్డుల్లో ఇసుక నిల్వలున్నాయి. కూటమి అధికారంలోకి రాగానే ఆ నిల్వల్ని టీడీపీ నాయకులు మాయం చేశారు. ఉదాహరణకు పెనమలూరు నియోజకవర్గంలోని చోడవరంలో ఇసుక నిల్వల్ని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖ్యనేత మింగేశారు. అక్కడ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఆ ఇసుకను లారీ రూ.16 వేల నుంచి రూ.20 వేల చొప్పున అమ్మేశారు. ప్రస్తుతం స్టాక్‌యార్డుల్లో నిల్వలు లేవని చూపారు. కృష్ణానది వెంబడి జరుగుతున్న ఇసుక అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమార్కులకు వరం..

కృష్ణాజిల్లా పరిధిలోని స్టాక్‌యార్డుల్లో ప్రస్తుతం ఇసుక నిల్వలు లేవు. దీంతో ఈ జిల్లా వాసులు ఇసుకను ఎన్టీఆర్ జిల్లా స్టాక్ పాయింట్ల నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకుని తెలుగు తమ్ముళ్లు ఇసుక ధరను భారీగా పెంచారు. గతంలో విజయవాడ, తాడిగడప, కంకిపాడు ప్రాంతాల్లో ట్రాక్టరు ఇసుక ధర రూ.3 వేల నుంచి రూ.3,500 మాత్రమే ఉండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక ట్రాక్టరు ఇసుక ధర రూ.7 వేలకు చేరింది. దీంతో వినియోగదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఈ ఇసుక దందా అంతా టీడీపీ నేతల కనుసన్నల్లోనే సాగుతోంది.ఇసుకలో జోక్యం చేసుకోవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు పైకి చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో ఇసుక దందాకు ఆయనే ఊతం ఇస్తున్నారు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా నామమాత్రపు దాడులు చేసి, అరకొర ట్రాక్టర్లను పట్టుకుని వదిలేస్తున్నారు.



ఉపాధికి ఊతం.. ధరలకు కళ్లెం

మోదీ 3.0 ఆర్థిక సర్వేలో ప్రభుత్వం ఉద్ఘాటన

ఈ ఏడాది జీడీపీ వృద్ధి రేటు 6.5-7 శాతంగా అంచనా

లక్షలాది ఉద్యోగాల కల్పనే లక్ష్యం

2030 నాటికి ఏటా 78.5 లక్షల ఉద్యోగాల సృష్టి

తయారీ, ఎగుమతులకు చైనా పెట్టుబడుల దన్ను

నిర్మాణాత్మక సంస్కరణలతో 7 శాతం పైగా వృద్ధి

ప్రైవేటు పెట్టుబడులు, చిన్న పరిశ్రమలకు ఊతం

విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని పూడ్చాల్సిందే

కార్మిక, వ్యవసాయ సంస్కరణలు తక్షణావసరం

పార్లమెంట్‌లో సర్వేను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్

దేశంలో లక్షలాది ఉద్యోగాలను సృష్టించడంతో పాటు ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించడమే లక్ష్యమని కేంద్ర ప్రభుత్వం ఉద్ఘాటించింది. అధికధరలతో అల్లాడుతున్న ప్రజలకు ఆర్థిక ఉపశమనం కల్పించాల్సిన అవసరం ఉందని తేల్చిచెప్పింది. ముచ్చటగా మూడోసారి కొలువుదీరిన మోదీ 3.0 సర్కారు, ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడానికి ముందు 2023–24 ఆర్థిక సర్వేను పార్లమెంట్ ముందుంచింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం సర్వేను ప్రవేశపెట్టారు. గడిచిన ఏడాది కాలంగా ఆర్థిక వ్యవస్థ పురోగతి, సవాళ్లు, రాబోయే కాలంలో చేపట్టాల్సిన నిర్మాణాత్మక, విధానపరమైన సంస్కరణలను సర్వేలో ప్రభుత్వం ప్రస్తావించింది. లక్షలాదిగా ఉద్యోగాలను కల్పించాలంటే ప్రైవేటు రంగ పెట్టుబడులను పెంచడంతో పాటు వ్యవసాయ, కార్మిక సంస్కరణలను వేగవంతం చేయాల్సిన తరుణం ఆసన్నమైందని పేర్కొంది. తద్వారా ఈ బడ్జెట్లో తమ ప్రాధాన్యతలను స్పష్టం చేసింది.

13 లో

బడ్జెట్ మథనంలో అమృతం చిలికేనా

- నేడే కేంద్ర బడ్జెట్-2024
- రికార్డు స్థాయిలో వరుసగా ఏడోసారి ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్

6 లో

ప్రతి ఊరికీ కావాలి ఇలాంటి స్టీల్ బ్యాంక్

- 11లో

విశాఖ రైల్వేజోన్ పట్టాలెక్కేనా!?

- కొత్త లైన్లకు కేంద్రం నిధులిచ్చేనా!?
- రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులపై డిమాండ్ చేయని చంద్రబాబు
- 2014–18 మధ్య నిధులు సాధించలేని చంద్రబాబు

3 లో



ప్రధాని గొంతే నొక్కజూస్తారా!

6 లో

విపక్షాలపై మోదీ ధ్వజం

ఇది అమృతకాల బడ్జెట్

వికసిత భారత్‌కు పునాది

విపక్షాలు ప్రధాని గొంతునే నొక్కే అప్రజాస్వామ్య పోకడలకు పోతున్నాయి. కేంద్ర బడ్జెట్.. 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాకారం చేసుకునే కలకు పునాది కానుంది. మూడేళ్లుగా ఏటా 8 శాతం చొప్పున వృద్ధితో దేశం శరవేగంగా దూసుకుపోతోంది.

– ప్రధాని నరేంద్ర మోదీ

ఉగ్ర గోదావరి



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి వరద ఉధృతి

- కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకు ప్రమాదకర స్థాయిలో గోదావరి
- భద్రాచలం వద్ద 49.40 అడుగులకు వరద.. రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- పోలవరంలోకి 11,06,947 క్యూసెక్కులు.. దిగువకు వదిలేస్తున్న అధికారులు
- ధవళేశ్వరం నుంచి 12,05,126 క్యూసెక్కులు సముద్రంలోకి
- మంగళవారం వరద ఉధృతి మరింత పెరుగుతుందని సీడబ్ల్యూసీ అంచనా

5 లో

మీడియా పాయింట్

వైఎస్సార్‌సీపీ గొంతు నొక్కే ప్రయత్నం



రాష్ట్రంలో శాంతిభద్రతలు ఘోరంగా విఫలమయ్యాయి. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో రోజుకో హత్య, అత్యాచారం జరుగుతున్నాయి. చంద్రబాబు పథకాలు అమలు చేయలేకే.. ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజలతో కలసి పోరాటం చేస్తాం.

– వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ

హోం మంత్రి అనిత ఏంచేస్తున్నారు?



రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తుంటే హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారు. ముచ్చుమర్రిలో బాలిక అదృశ్యమైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఎనిమిదేళ్ల చిన్నారిని రేప్‌చేసి చంపితే.. హోంమంత్రిగా ఆ కుటుంబాన్ని పరామర్శించాల్సిన బాధ్యత లేదా? దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కనీసం స్పందించకపోవడం బాధాకరం. – తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ

బ్లడ్‌గేమ్ ఆడుతున్న చంద్రబాబు



శాంతిభద్రతల గురించి మాట్లాడితే హోం మంత్రి అనిత లాఠీలు, గన్నులు పట్టుకుని తిరగాలా? అని అడుగుతున్నారు. అలా తిరగాల్సిన పనిలేదు. అవి పట్టుకుని తిరుగుతున్న పోలీసులకు స్వేచ్ఛనిచ్చి, వారిపని వారు చేసుకునే అవకాశం ఇవ్వాలి. చంద్రబాబు బ్లడ్‌గేమ్ ఆడుతున్నారు.

– డి.సి.గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

గవర్నర్ స్పందించకపోతే ఎలా?



కూటమి పాలనలో హత్యలు, హత్యాయత్నాలు, దాడుల గురించి ఆదివారం గవర్నర్‌కు వైఎస్ జగన్ వివరించారు. కానీ అసెంబ్లీ ప్రసంగంలో గవర్నర్ కనీసం ప్రజలకు ధైర్యం చెప్పే ప్రయత్నం చేయలేదు. గవర్నర్ స్పందించకపోతే ఎలా? ఇంకెవరికి చెప్పుకోవాలి.

– చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్సీ

రాష్ట్రంలో అరాచక, ఆటవికపాలన



వైఎస్సార్‌సీపీని అణగదొక్కడమే ప్రభుత్వ లక్ష్యం. ఈ నెల రోజుల పాలనలో అదే జరిగింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఎన్నికల తరవాత అంతులేని దారుణాలు జరిగాయి. కేంద్ర సంస్థలతో విచారణ జరిపిస్తే వాస్తవాలు బయటకు వస్తాయి.

– బొమ్మి ఇజ్రాయేల్, ఎమ్మెల్సీ

శాంతిస్థాపనకు గవర్నర్ చొరవ చూపాలి



గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్ సత్వరమే జోక్యం చేసుకుని రాష్ట్రంలో అరాచకాలను అంతమొందించాలి. తక్షణమే శాంతి స్థాపనకు చొరవ చూపాలి. లేకపోతే రాష్ట్రంలో ప్రజలు, ప్రతిపక్ష పార్టీ నేతలు, ఓటు వేసినవారు జీవించలేని పరిస్థితి నెలకొంటుంది.

– మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్సీ

ఓటు వేయని వారు లక్ష్యంగా దాడులు



రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ఆ వెంటనే.. ఈ ఎన్నికల్లో తమకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుంది. ముఖ్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను వేధించడమే పనిగా పెట్టుకుంది. గవర్నర్, ప్రధాని, కేంద్ర హోం మంత్రి జోక్యం చేసుకుని వీటిని ఆపాలి.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

ప్రభుత్వ ఆస్తులపైనా దాడులు, దౌర్జన్యాలు



లోకేశ్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. అందులో భాగంగానే కేవలం మా పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లు, ఆస్తులు, వ్యాపార సంస్థలపై మాత్రమే కాకుండా.. చివరకు ప్రభుత్వ ఆస్తులపైనా దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయి.

– సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్సీ

రక్షణ లేకుండా పోయింది



వైఎస్సార్‌సీపీ తరఫున పార్లమెంటు, శాసనసభలకు ఎన్నికైనవారికి, పోటీచేసిన వారికి రక్షణ లేకుండా పోయింది. పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్పని పరామర్శించడానికి వెళ్లిన మా పార్టీ లోక్‌సభాపక్ష నాయకుడు, ఎంపీ మిథున్‌రెడ్డిపై టీడీపీ మూకలు హత్యాయత్నం చేశాయి.

– సానేపల్లి మంగమ్మ, ఎమ్మెల్సీ

మంత్రులకు బుర్ర పనిచేయడంలేదు



నెలన్నర కాలంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దాడులు, ఆస్తుల ధ్వంసం, హత్యలు, మానభంగాలు, లాకప్‌డెత్‌లు, ఆత్మహత్యలు తప్ప ఏమీ కనిపించడంలేదు. అసమర్థ పాలన వల్ల ప్రజల్లో అప్పుడే చెడ్డపేరు మూటగట్టుకున్నారు. అందుకే మంత్రులంతా మతితప్పి మాట్లాడుతున్నారు. మంత్రులకు బుర్ర పనిచేయటం లేదు.

– దాసరి సుధ, ఎమ్మెల్యే

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కనిపించడం లేదు



రాష్ట్రంలో ఎక్కడా ప్రజాస్వామ్య వ్యవస్థ అనేది కనిపించడం లేదు. రాజ్యాంగం, చట్టం, పోలీసువ్యవస్థ.. అన్నీ నిర్వీర్యమయ్యాయి. రెడ్ బుక్ రాజ్యాంగం 45 రోజులుగా ఇక్కడ పనిచేస్తోంది. – బి.విరూపాక్షి, ఎమ్మెల్యే

యంత్రాంగాన్ని రాజకీయమయం చేశారు



వివక్ష లేకుండా ప్రజలందరి ప్రయోజనాలను రక్షించడానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని వినియోగించాల్సింది పోయి.. ప్రభుత్వ యంత్రాంగాన్ని పూర్తిగా రాజకీయమయం చేశారు. హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహించే ఉద్దేశంతోనే ఇవన్నీ చేస్తున్నారు.

– మత్స్యరస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యే

పథకం ప్రకారం చేస్తున్న దుర్మార్గాలు



రాష్ట్రంలో నెలన్నర రోజులుగా పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీని అణగదొక్కడానికి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఉండకూడదన్న లక్ష్యంతో ఇవన్నీ చేస్తున్నారు. వాటిని అడ్డుకోవద్దని అధికారులను నిర్దేశించారు. దీంతో టీడీపీ గూండాలు రెచ్చిపోయి దారుణాలకు పాల్పడుతున్నారు.

– రేగం మత్స్యలింగం, ఎమ్మెల్యే

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించండి

- హత్యా రాజకీయాలకు నిరసనగా సభ నుంచి వైఎస్సార్‌సీపీ సభ్యుల వాకౌట్
- నల్ల కండువాలతో ఉభయ సభల సమావేశానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



నల్ల కండువాలు ధరించి వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలిసి అసెంబ్లీకి ర్యాలీ వస్తున్న వైఎస్ జగన్



వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలిసి సభ నుంచి వాకౌట్ చేసి వెళుతున్న జగన్

సాక్షి, అమరావతి: కూటమి సర్కారు హత్యా రాజకీయాలపై శాసనసభ సాక్షిగా ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నిగ్గదీసింది. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని సోమవారం అసెంబ్లీ వేదిక నిరసన గళం విప్పింది. ఈ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ధ్వజమెత్తింది. దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలు నశించాలని ఎలుగెత్తింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్రంలో యథేచ్ఛగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, హింసాత్మక ఘటనలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళన నిర్వహించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల దారుణ వైఫల్యానికి నిరసనగా మెడలో నల్ల కండువాలు ధరించి ఉభయ సభల సంయుక్త సమావేశానికి హాజరయ్యారు. టీడీపీ మూకల హింసకు నిరసనగా ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీగా ఉదయం అసెంబ్లీలోకి ప్రవేశించారు.

హత్యా రాజకీయాలకు నిరసనగా వాకౌట్

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగాన్ని ప్రారంభిస్తున్న క్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారి స్థానాల్లో నిలుచుని ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, సేవ్ డెమొక్రసీ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీరి నిరసనల మధ్యనే గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. అనంతరం విపక్ష ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు స్పీకర్ పోడియం వద్దకు వెళ్లారు. పోడియం ముందు ఫ్లోర్ వద్దకు చేరుకుని నినాదాలు చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ హత్యా రాజకీయాలకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు.

రెడ్ బుక్‌దే రాజ్యం..

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రదర్శించిన ప్లకార్డులు రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులకు అద్దం పట్టాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైఎస్సార్‌సీపీ కార్యాలయాల కూల్చివేతలు, హత్యలు, అత్యాచారాలు, వైఎస్సార్‌సీపీ నేతల ఆస్తుల విధ్వంసం తదితర హింసాత్మక ఘటనలకు సంబంధించిన ఫోటోలను ప్లకార్డుల్లో ప్రదర్శించారు. వినుకొండలో నడి రోడ్డుమీద వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీకి చెందిన జిలానీ కిరాతకంగా హత్య చేసిన ఘటనకు సీఎం చంద్రబాబుదే బాధ్యతని ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రంలో రాజ్యాంగం కనిపించడం లేదని, రెడ్ బుక్ రాజ్యమేలుతోందని నినదించారు.

పోలీసుల అతిపై వైఎస్ జగన్ ఆగ్రహం

వైఎస్సార్‌సీపీ సభ్యుల చేతిలోని ప్లకార్డులు చించివేయడంపై ఫైర్



వైఎస్సార్‌సీపీ సభ్యుల చేతిలోని ప్ల కార్డులు లాక్కుని చించివేసిన పోలీసులపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: శాసనసభ గేటు వద్ద సోమవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకుని పోలీసులు ప్లకార్డులు లాక్కుని చించివేయడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలని అడ్డుకునే అధికారం మీకు ఎవరిచ్చారు? ప్లకార్డులు లాక్కుని చించేసే అధికారం ఎవరు ఇచ్చారు? అని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, శాంతి భద్రతలు మచ్చుకైనా కనిపించడం లేదని ధ్వజమెత్తారు. చట్టప్రకారం పని చేసి శాంతి భద్రతలను పరిరక్షించాలని పోలీసులకు సూచించారు. పోలీసుల జులుం ఎల్లకాలం చెల్లబోదని, ఈ విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. 'మీ టోపీపై మూడు సింహాలు ఉన్నది అధికారంలో ఉన్న వారికి సెల్యూట్ కొట్టడానికి కాదు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి..' అని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నుంచి ప్లకార్డులు లాక్కుని చించి వేసిన పోలీసు అధికారినుద్దేశించి పేర్కొన్నారు. వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. ఇంతలో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయం ఆసన్నమవడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులను అసెంబ్లీ ప్రాంగణంలోకి పోలీసులు అనుమతించారు. చివరిలో వైఎస్ జగన్ అసెంబ్లీ ప్రాంగణంలోకి అడుగుపెట్టారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగిస్తున్న హత్యా రాజకీయాలు, అరాచకపాలన, దారుణకాండను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ సభ్యులతో కలిసి మెడలో నల్లకండువా ధరించి అసెంబ్లీ వరకూ వైఎస్ జగన్ నిరసన ప్రదర్శన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను వినుకొండలో నడిరోడ్డుపై టీడీపీ కార్యకర్త హత్య చేసిన ఫోటోలతోపాటు రాష్ట్రంలో టీడీపీ కూటమి అరాచకాలను ప్రతిబింబించే ఫోటోలతో ప్లకార్డులను ప్రదర్శించారు. 'సేవ్ డెమొక్రసీ.. హత్యా రాజకీయాలు నశించాలి.. వియ్ వాంట్ జస్టిస్' అని నినాదాలు చేస్తూ ర్యాలీగా అసెంబ్లీ గేటు వద్దకు చేరుకున్నారు.

హామీలపై నిలదీస్తారనే పూర్తిస్థాయి బడ్జెట్‌పై 'భయం'

- ఈ ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనిపిస్తోంది: వైఎస్ జగన్
- దేశంలో 7 నెలలు ఓట్ ఆన్ అక్కౌంట్ మీద నడుస్తున్న తొలి సర్కారు ఇదే
- చంద్రబాబు పాపాలు వేగంగా పండే రోజు దగ్గర్లోనే ఉంది
- ఈ అరాచకాలు, హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడీలపై రేపు ఢిల్లీ వేదికగా ఎండగడతాం
- మాతో కలిసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకొని పోరాటం కొనసాగిస్తాం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కూటమి సర్కారు పాలనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అడుగడుగునా భయంతో సీఎం చంద్రబాబు విలవిలలాడిపోతున్నారని చెప్పారు. ఆ భయాన్ని పోగొట్టుకోవడానికి, ప్రజల్లో భయోత్పాతం సృష్టించేందుకు హింసాకాండను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అరాచక పాలనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, అందుకే ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనబడుతోందని చెప్పారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు అరాచకాలను ప్రోత్సహిస్తూ భయానక వాతావరణాన్ని కల్పిస్తున్నారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం ఎక్కువ రోజులు మనుగడ సాగించేలా కనపడటం లేదన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా 'ఎక్స్'లో వైఎస్ జగన్ పోస్టు చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే..

హామీలపై నిలదీస్తారనే భయంతో...

కేవలం 50 రోజుల్లోనే ఈ ప్రభుత్వం అన్నిటా వైఫల్యం చెందింది. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. ఈ అరాచక పాలన పట్ల ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. అందుకే ప్రభుత్వం వేసే ప్రతి అడుగులోనూ భయం కనబడుతోంది. ఈ ప్రభుత్వం ఎంతగా భయపడుతోందంటే.. ఈ ఏడాది కనీసం పూర్తి స్థాయి బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేకపోతోంది. దేశంలో తొలిసారిగా ఒక రాష్ట్రం ఏడాదిలో 7 నెలలు ఓట్ ఆన్ అక్కౌంట్ మీదే నడుస్తుందంటే ప్రభుత్వానికి ఎంత భయం ఉందో అర్థమవుతోంది. ఎన్నికల ముందు ప్రజలను మోసం చేసి మభ్యపుచ్చి ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే చంద్రబాబు ఎంతగా భయపడుతున్నారంటే.. పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే ఆ హామీలను అమలు చేయలేమన్న గుట్టు బయట పడుతుందన్న భయం నెలకొంది. ఎన్నికల్లో ఇచ్చిన మోసపూరిత హామీలను అమలు చేయని పరిస్థితిలో ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారో అన్న భయం ఆయన్ను ఆవరించింది. అందుకే ప్రజల దృష్టిని మళ్లించి అరాచకాలను ప్రోత్సహించడం ద్వారా భయానక పరిస్థితులు కల్పిస్తున్నారు. హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, ఆస్తుల విధ్వంసం.. వీటన్నింటి ద్వారా ఎవరూ తనను ప్రశ్నించే సాహసం చేయకూడదనే పరిస్థితి సృష్టిస్తున్నారు.

అసెంబ్లీలో హక్కుగా మైక్ ఇస్తే..

ప్రస్తుతం అసెంబ్లీలో రెండే పక్షాలున్నాయి. ఒకటి అధికార పక్షం. మరొకటి ప్రతిపక్షం. ప్రతిపక్షంగా ఒకే పార్టీ ఉంది కాబట్టి ఆ పార్టీనే విపక్షంగా గుర్తించాలి. ఆ పార్టీ నాయకుడినే ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించాలి. అయితే ఆ పని చేస్తే అసెంబ్లీలో కూడా ప్రశ్నిస్తారన్న భయంతో చంద్రబాబు ఉన్నారు. ప్రతిపక్ష పార్టీని, ప్రతిపక్ష నేతను చట్టబద్ధంగా గుర్తిస్తే ప్రజా సమస్యలు ప్రస్తావించేందుకు అసెంబ్లీలో ఒక హక్కుగా మైక్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే అసెంబ్లీలో హక్కుగా మైక్ ఇస్తే ప్రజల తరఫున సభలో చంద్రబాబు ప్రభుత్వాన్ని విపక్షనేత ఎండగడతారని, వారి నిజ స్వరూపం ప్రజలకు తెలుస్తుందన్న భయంతో ఈ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీని, ప్రతిపక్ష నాయకుడిని గుర్తించడం లేదు.

ఢిల్లీ వేదికగా అరాచకాలను ఎండగడతాం..

ప్రభుత్వం ఏర్పడి 50 రోజులు గడుస్తున్నా చంద్రబాబు ఇన్ని భయాలతో పరిపాలన చేస్తున్నాడు. అచ్చం శిశుపాలుడి పాపాల మాదిరిగా చంద్రబాబునాయుడి పాపాలు కూడా వేగంగా పండే రోజు దగ్గర్లోనే ఉంది. నాతోపాటు మా పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు ఢిల్లీ వేదికగా ఈ అరాచకాలను ఎండగడతాం. రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడీని 24వ తేదీన ఫోటో గ్యాలరీ, నిరసన కార్యక్రమాల ద్వారా వివిధ పార్టీ నాయకుల దృష్టికి, దేశం దృష్టికి తీసుకొస్తాం. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాల్సిన అవసరాన్ని, పరిస్థితులను వివరిస్తాం. ఈ కార్యక్రమంలో మాతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకొని పోరాటం కొనసాగిస్తాం.

రేపు ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ ధర్నా

నేడు హస్తినకు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న ఆటవిక పాలనను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంసిద్ధమైంది. ఇందులో భాగంగా.. ఈనెల 24న ఢిల్లీ వేదికగా ధర్నా నిర్వహించి రాష్ట్రంలో సాగుతున్న అరాచకాలపై గళమెత్తాలని పార్టీ నిర్ణయించింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు చేస్తున్న ఈ పోరాటంలో కలిసొచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోతామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. ఇక ఢిల్లీలో బుధవారం జరిగే ధర్నాలో ఫొటో గ్యాలరీ ఏర్పాటుచేయడంతో పాటు వీడియోల ద్వారా దేశ ప్రజలందరికీ తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నామని ఆ పార్టీ ఎంపీలు తెలిపారు. ఈ అంశంపై రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రిని కలిసేందుకు ఇప్పటికే అపాయింట్‌మెంట్ కోరామని.. లోక్‌సభ, రాజ్యసభలోనూ పెద్దఎత్తున తమ పార్టీ వాణి వినిపిస్తామని వారు తెలిపారు.

నేడు ఢిల్లీకి జగన్..

ఇదిలా ఉంటే.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం ఉ.9 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరి ఢిల్లీ వెళ్తారు. మూడ్రోజులపాటు అక్కడే ఉంటారు. ఈనెల 24న ధర్నాలో పాల్గొంటారు. ఇక ఈ ధర్నాకు అన్ని రాజకీయ పార్టీలను కూడా ఆహ్వానించారు.

ఏం చేయాలన్నా డబ్బుల్లేవు

ప్రభుత్వం వచ్చి నెల కాకుండానే జగన్ విమర్శిస్తున్నారు

- ఇసుక విధానంపై సూచనలు చేయండి
- రాజకీయ ప్రతీకారాలకు పోవద్దు
- ఎన్డీఏ పక్ష ఎమ్మెల్యేల సమావేశంలో సీఎం చంద్రబాబు
- సీఎం నిర్ణయాలను సమర్థిస్తానన్న డిప్యూటీ సీఎం పవన్



సాక్షి, అమరావతి : పనులు చేయడానికి డబ్బుల్లేవని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. ముందుగా రోడ్ల గుంతలు పూడుద్దామని చెప్పారు. సోమవారం అసెంబ్లీ కమిటీ హాలులో జరిగిన ఎన్డీఏ పక్ష ఎమ్మెల్యేల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వచ్చి నెల కాకుండానే అప్పుడే జగన్ విమర్శలు మొదలు పెట్టేశారన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం సరికాదని చెప్పారు. తప్పులు చేయడం, వాటిని పక్క వారిపై నెట్టేయడం జగన్‌కు అలవాటని అన్నారు. వివేకా హత్యను వేరే వాళ్ల మీదకు నెట్టే ప్రయత్నం చేశారని, వినుకొండలోనూ అదే జరుగుతోందని చెప్పారు. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యపై జగన్ ఏకంగా రాష్ట్రపతి పాలన పెట్టాలంటున్నారని చెప్పారు. మదనపల్లి సబ్ కలెక్టర్ ఆఫీసులో ఫైల్స్ తగలబడటాన్ని అగ్నిప్రమాదంగా చెబుతున్నా, అనేక అనుమానాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఘటన చూశాక పరిపాలన ఎంత పతనమైందో బయటపడిందన్నారు. శాంతిభద్రతల విషయంలో చాలా గట్టిగా ఉంటామని, ఏ పార్టీ వాళ్లైనా సహించేది లేదని అన్నారు. తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిద్దామని, రాజకీయ కక్ష సాధింపులు వద్దని చెప్పారు. ఇసుక విషయంలో చిన్న విమర్శ కూడా రాకూడదని చెప్పారు. క్వారీల్లో ఇసుక తవ్వకం, రవాణా ఖర్చులు, సీనరేజ్ మాత్రమే వసూలు చేస్తామన్నారు. ప్రతి నెలా పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు పాల్గొనాలని సూచించారు. పవన్‌కళ్యాణ్ కోరినట్లుగా డొక్కా సీతమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

చంద్రబాబు నిర్ణయాలకు సహకరిస్తాం : పవన్



జగన్‌కు ఇంకా తత్వం బోధ పడలేదని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. గ్రూపు తగాదాకు రాజకీయ రంగు పులిమి అవాస్తవాలతో కుట్రలకు తెరలేపుతున్నారని విమర్శించారు. సభలోకి వచ్చే ముందు పోలీసులతో గొడవ, గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగలాలని ఎమ్మెల్యేలను రెచ్చగొట్టడం ఆయన అహంకార ధోరణికి నిదర్శనమని అన్నారు. చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా తాను, తన పార్టీ నూరు శాతం సహకరిస్తామని తెలిపారు. ఏపీకి సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, రాష్ట్రానికి వీలైనన్ని ఎక్కువ నిధులు తెచ్చుకుందామని బీజేపీ నేత, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. జగన్ ఇదే ధోరణి కొనసాగిస్తే భంగపాటు తప్పదన్నారు. కూటమిలోని మూడు పార్టీల మధ్య సమన్వయం అవసరమని అన్నారు.

ఆర్థికంగా ఏపీ బలోపేతం

- కేంద్ర ఆర్థిక సర్వే (2023-24)లో వెల్లడి
- అప్పుల భారం, ద్రవ్యలోటు తగ్గుతోంది.. వ్యయంలో నాణ్యత పెరిగింది
- పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు, వసతులు పెరిగాయి
- ఎఫ్ఆర్‌బీఎంకు లోబడే అప్పులు..
- పరోక్షంగా వైఎస్ జగన్ పాలనకు కితాబు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా బలోపేతమవుతోందని కేంద్ర ప్రభుత్వం 2023-24 ఆర్థిక సర్వేలో వెల్లడించింది. ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడాన్ని కొనసాగిస్తున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటని స్పష్టం చేసింది. ఆర్‌బీఐ నివేదికలతో పాటు కాగ్ గణాంకాల ఆధారంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులను అంచనా వేసినట్లు సర్వే నివేదిక తెలిపింది. ఏపీ సహా 23 పెద్ద రాష్ట్రాలు ఆర్థికంగా బలోపేతమవుతున్నాయని.. ద్రవ్య లోటు, అప్పులు భారం తగ్గుతోందని సర్వే నివేదిక స్పష్టం చేసింది. అలాగే ఏపీ సహా పలు రాష్ట్రాల వ్యయంలో నాణ్యత పెరిగిందని.. మూలధన వ్యయంపై ప్రభుత్వాలు దృష్టి సారించడం మెరుగుపడిందని తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పథకాల ద్వారా గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పించారని వెల్లడించింది. మహిళల సాధికారత, సామాజిక భద్రత, ఆరోగ్యం, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలను కల్పించినట్లు తెలిపింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు ఏర్పాటు పాలనాపరమైన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను చూపించిందని నివేదిక పేర్కొంది. వివిధ పథకాలు, కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రజల జీవన నాణ్యతను మెరుగుపడుతోందని.. తద్వారా గ్రామీణ ప్రాంతాలు పురోగతి సాధిస్తున్నాయని నివేదిక స్పష్టం చేసింది. వ్యవసాయ రంగంలో సాంకేతికత ఆధారంగా దిగుబడి అంచనాలను ఏపీతో పాటు తొమ్మిది రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని.. తద్వారా రైతులకు ప్రయోజనం కలుగుతోందని నివేదిక తెలిపింది. మొత్తంగా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలనకు కేంద్ర ప్రభుత్వం పరోక్షంగా కితాబిచ్చింది.

ఏపీ అప్పు రూ.4.85 లక్షల కోట్లు

ఆంధ్రప్రదేశ్ సహా అన్ని రాష్ట్రాలు తమ ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టానికి(ఎఫ్ఆర్‌బీఎం) అనుగుణంగా పరిమితికి లోబడి అప్పులు చేస్తున్నాయని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం పార్లమెంట్‌లో వెల్లడించారు. కేంద్ర ఆర్థిక శాఖతో పాటు ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులకు లోబడి రాష్ట్రాల అప్పులు ఉంటాయని ఆయన తెలిపారు. 2024 మార్చి నాటికి ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.4,85,490 కోట్లుగా ఉందని కేంద్ర మంత్రి తెలిపారు.

ఇదండీ సంగతి



విశాఖ రైల్వేజోన్ పట్టాలెక్కేనా!?

కొత్త లైన్లకు కేంద్రం నిధులిచ్చేనా!?

- రైల్వే బడ్జెట్‌లో కేటాయింపులపై డిమాండ్ చేయని చంద్రబాబు
- 2014-18 మధ్య నిధులు సాధించలేని వైనం
- రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర మంత్రుల వద్ద ఊసెత్తని టీడీపీ, జనసేన ఎంపీలు
- ప్రస్తుత ఎన్డీయేలో భాగస్వామిగా అయినా సాధిస్తారా?
- దీర్ఘకాలంగా నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టులకైనా మోక్షం లభిస్తుందా?

సాక్షి, అమరావతి: పదేళ్లుగా వేధిస్తున్న రాష్ట్ర విభజన గాయాలకు ఈసారైనా కాస్త సాంత్వన కలుగుతుందా? విశాఖపట్నం రైల్వేజోన్ పట్టాలు ఎక్కుతుందా? 2014–18 మధ్య కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి కూడా రైల్వే ప్రాజెక్టులను సాధించలేని చంద్రబాబు ఇప్పుడైనా తీసుకొస్తారా? కేంద్ర ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులు సాధిస్తాయా!?.. ..ఇదీ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం వినిపిస్తున్న డిమాండ్. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 కేంద్ర బడ్జెట్‌ను లోక్‌సభలో మంగళవారం ప్రవేశపెట్టనున్నారు. ఇందులో రాష్ట్రానికి రైల్వే కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.



పట్టాలెక్కని దశాబ్దాల డిమాండ్..

విశాఖపట్నం కేంద్రంగా ప్రత్యేక రైల్వేజోన్ ఏర్పాటు చేయాలన్నది దశాబ్దాల డిమాండ్. అహేతుకంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్ పార్టీ ఏపీకి సాంత్వన కలిగించేందుకు 2014లో విభజన చట్టంలో ప్రత్యేక రైల్వేజోన్ హామీనిచ్చింది. ఆ తర్వాత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వ హయాంలో రైల్వేజోన్ అంశం నత్తనడకను తలపిస్తోంది. దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుచేస్తామన్నారుగానీ ఇప్పటివరకు మళ్లీ ఆ ఊసెత్తలేదు. పైగా.. 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం రైల్వేజోన్ గురించి పట్టించుకోనేలేదు. ఇక 2019–24 మధ్య వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దీని గురించి గట్టిగా పట్టుబట్టింది. కీలక ప్రతిపాదనలతో కూడిన నివేదికను అప్పట్లో కేంద్రానికి ప్రత్యేకంగా సమర్పించింది. దీంతో విశాఖ కేంద్రంగా 'దక్షిణ కోస్తా రైల్వేజోన్' ఏర్పాటుకు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రైల్వే శాఖ రూపొందించింది. భవనాలు, ఇతర అవసరాల కోసం విశాఖలో దాదాపు 950 ఎకరాలు అందుబాటులో ఉందని అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలో.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఒత్తిడితో విశాఖపట్నంలో రైల్వేజోన్ కార్యాలయాల నిర్మాణానికి ఇటీవల రూ.170 కోట్లు సైతం మోదీ సర్కారు కేటాయించింది. కానీ, రైల్వేజోన్ ఆచరణలోకి రావాలంటే సాంకేతికంగా కీలక అంశాలపై కేంద్రం మౌనం వహిస్తోంది. మరోవైపు.. విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటునకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైల్వేశాఖకు భూమి కూడా కేటాయించింది. కానీ, ఆ భూమిపై అనవసర రాద్ధాంతం చేస్తూ కేంద్రం ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తోంది. అవసరమైతే ప్రత్యామ్నాయంగా మరోచోట భూమి కేటాయిస్తామని చెప్పినా సరే కేంద్రం నుంచి స్పందన శూన్యం.

కీలక ప్రాజెక్టులపై వరాల జల్లు కురిసేనా?

రాష్ట్రంలో పలు కీలక రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. దీర్ఘకాలంగా నత్తనడకన సాగుతున్న ఈ ప్రాజెక్టులకు చంద్రబాబు ప్రభుత్వం తగినన్ని నిధులు రాబడుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర నుంచి భారీగా నిధుల కేటాయింపునకు నిరీక్షిస్తున్న కీలక రైల్వే ప్రాజెక్టులివే..

- బెంగళూరు-కడప రైల్వేలైన్
- విజయవాడ-గూడూరు మూడో రైల్వేలైన్
- నడికుడి-శ్రీకాళహస్తి లైన్
- నరసాపురం-కోటిపల్లి లైన్
- డోన్-అంకోలా లైన్
- విజయవాడ-ఖరగ్‌పూర్, విజయవాడ-నాగ్‌పూర్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు
- రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ
- కొత్త ఆర్వోబీల నిర్మాణం

రైల్వే ప్రాజెక్టు ఊసెత్తని బాబు, పవన్..

ఇక కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కీలక భాగస్వాములుగా ఉన్నప్పటికీ టీడీపీ, జనసేన రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి ప్రాజెక్టుల సాధనపై ఇప్పటి వరకు దృష్టిసారించనేలేదు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చంద్రబాబు నెలరోజుల్లోనే నాలుగుసార్లు ఢిల్లీ వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతుందని తెలిసినా సరే ఆయన రైల్వే ప్రాజెక్టుల గురించి కేంద్రం వద్ద ప్రస్తావించలేదు. మరోవైపు.. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అయితే సరేసరి. టీడీపీ, జనసేన ఎంపీలు రైల్వే ప్రాజెక్టులపై కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లలేదు. నిజానికి.. విశాఖపట్నం రైల్వేజోన్ ఏర్పాటు చేయాలంటే.. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు కోస్తా రైల్వేజోన్, సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వేజోన్‌లతో ఏపీ పరిధిలో ఆస్తుల పంపకం, కొత్త డివిజన్ల ఏర్పాటు, ఉద్యోగుల కేటాయింపు, కొత్త కార్యాలయాల ఏర్పాటు తదితర అంశాలను కొలిక్కి తెచ్చి దక్షిణ కోస్తా రైల్వేజోన్‌ను ఆచరణలోకి తీసుకురావాలి. కానీ, ఆ దిశగా చంద్రబాబు, పవన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడమేలేదు.

నేతల సిఫార్సు.. పోస్టింగ్‌కు ఎస్ బాస్

పోలీసు బదిలీల్లో పైరవీలు

- ప్రజాప్రతినిధుల సిఫార్సు ఉంటేనే పోస్టింగ్
- ఎమ్మెల్యేల వద్దకు క్యూ కట్టిన ఎస్సైలు, సీఐలు
- హైవే, ప్రధాన పోలీస్‌స్టేషన్లకు విపరీతమైన డిమాండ్
- భీమవరం టూటౌన్ సీఐ పోస్టుకు ఐదుగురు ఆశావహులు
- ఏలూరు రేంజ్‌లో 111 మంది ర్యాంకర్ ఎస్సైలకు బదిలీలు
- మరో మూడు, నాలుగు రోజుల్లో సీఐల బదిలీలు
- సీఐ పోస్టుకు రూ.10 లక్షలపైమాటే
- మెట్ట ప్రాంతంలో భారీగా బేరసారాలు



సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలీస్ శాఖలో బదిలీల జాతర ప్రారంభమైంది. ఎస్పీల బదిలీలు పూర్తయితే కొత్త అధికారులకు బాధ్యతలు తీసుకునే క్రమంలో ఎస్సైలు, సీఐల బదిలీల కోలాహలం ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం కొలువు తీరడంతో ప్రజాప్రతినిధులు మండలంలో తహసీల్దార్లు మొదలుకొని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల వరకు అందరి బదిలీలపై దృష్టి సారించడంతో ఎస్సైలు, సీఐలు ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కట్టారు. రకరకాల సిఫార్సులతో, భారీ పైరవీలతో పోస్టింగుల కోసం తంటాలు పడుతున్నారు. విజయవాడ కమిషనరేట్‌తో కలుపుకొని ఏలూరు రేంజ్‌లోని మూడు ఉమ్మడి పోలీస్ జిల్లాల్లో 200 సర్కిళ్లు ఉన్నాయి.

సీఐల బదిలీల హడావుడి

ఏలూరు రేంజ్‌లో సీఐల బదిలీల హడావుడి ప్రారంభమైంది. వాస్తవానికి పనితీరు, గతంలో కేసులు పరిష్కరించిన వైనం, రివార్డులు, అవార్డులు, చార్జి మెమోలు, మెమోలు ఇలా అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకుని పోస్టింగులు ఇస్తుంటారు. వీటన్నింటితో పాటు స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు అనధికారికంగా తప్పనిసరి. ఈ పర్యాయం మాత్రం స్థానిక ప్రజాప్రతినిధి సిఫార్సు, సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయడం, పైరవీలకు ప్రాధాన్యం ఇచ్చేలా బదిలీలకు తెరలేచినట్టు సమాచారం. ఇప్పటికే రేంజ్ పరిధిలోని 43 నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు రేంజ్ ఐజీకి సీఐ పోస్టింగుల కోసం భారీగా సిఫార్సు లేఖలు పంపారు. ఆయా జిల్లాల ఎస్పీలకు కూడా ఎస్ఐ పోస్టుల కోసం సిఫార్సు లేఖలు పంపారు. అన్నింటినీ పరిశీలించి బదిలీలు మరో మూడు రోజుల్లో నిర్వహించనున్నారు.

హైవేకు స్పెషల్ డిమాండ్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో జాతీయ రహదారి అధికంగా ఉంది. జాతీయ రహదారిపై ఉండే దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు, తణుకు, తాడేపల్లిగూడెం, రూరల్, కొవ్వూరు తదితర పోలీస్ స్టేషన్లకు అత్యధిక డిమాండ్ ఉంది. ఒక్కో స్టేషన్‌కు సగటున ముగ్గురికి పైగా ఆశావహులు ప్రయత్నాల్లో ఉన్నారు. సంపన్న ప్రాంతంగా పేరున్న కొవ్వూరు, భీమవరం టూటౌన్‌కు విపరీతమైన డిమాండ్ ఉంది. ఒక్క భీమవరం టూటూన్ కోసం ఐదుగురు పోటీలో ఉన్నారు. స్థానికంగా పేకాట, కోడిపందేలతో పాటు రోజువారీ ఆదాయ వనరులు అత్యధికంగా ఉండటం, ప్రభుత్వ వైన్ షాపులకు అనుబంధంగా బెల్టుషాపులు ఏర్పాటు చేయడం, ఇతర కారణాలతో డిమాండ్ కొనసాగుతోంది. ఎన్నికలకు ముందు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు ఇచ్చి ఎన్నికల విధులు కేటాయించారు. తాజాగా ఐదు రోజుల క్రితం పోస్టింగులు మంజూరు చేశారు. ఈ క్రమంలో రెగ్యులర్ ఎస్సై, సీఐల బదిలీలకు రంగం సిద్ధమైంది.

మనోడైతే ఓకే..

పార్టీకి అనుకూలంగా ఉండి, సంబంధిత ప్రజాప్రతినిధి సొంత సామాజికవర్గం గాని, లేదంటే ఆయా నియోజకవర్గంలో అత్యధిక ఓటింగ్ ఉన్న సామాజికవర్గానికి చెందిన సీఐ అయితే ఓకే. లేకపోతే వేరే స్టేషన్ చూసుకోవాలని ఎమ్మెల్యేలు ముఖం మీదనే చెబుతున్నారు. గతంలో మంచి పోస్టింగులు నిర్వహించినప్పటికీ మనకు అనుకూలంగా ఉంటే ఓకే. లేదంటే పోస్టింగే లేదని తేల్చిచెబుతున్నారు. ఇక సీఐ, ఎస్సై బదిలీలను అధికార పార్టీ చోటా నేతలు ఆదాయ వనరుగా మలుచుకున్నారు. ప్రధానంగా మెట్ట ప్రాంతంలో ద్వితీయ శ్రేణి నేతలు ఆశావహులతో బేరసారాలు నిర్వహించి ఎమ్మెల్యేలతో ఖరారు చేయిస్తున్నారు. పోస్టింగ్‌కు సిఫార్సు లెటర్లు ఇస్తున్నారు. ఏలూరు జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో, కొల్లేరు ఉన్న మరో రెండు నియోజకవర్గాల్లో ఈ తరహా పైరవీలు జరుగుతున్నాయి. ఎస్సై పోస్టుకి సగటున రూ.5 లక్షలు, సీఐ పోస్టుకు సగటున రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు, జాతీయ రహదారి వెంబడి ఉండే సర్కిళ్లకు, కీలక ప్రాంతాల్లో అత్యధిక ఆదాయ వనరులు ఉన్న సర్కిళ్లకు స్పెషల్ రేట్లు పోలీసు వర్గాల్లో ప్రచారంలో ఉన్నాయి.

ప్రజల ఆకాంక్షలపై నీళ్లు చల్లిన గవర్నర్ ప్రసంగం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ చేసిన ప్రసంగం ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'గవర్నర్ ప్రసంగం గత ప్రభుత్వ వైఫల్యాలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తుందనే ప్రస్తావన లేదు. విభజనతో తీవ్రంగా రాష్ట్రం నష్టపోయిందన్న గవర్నర్... ఆ లోటును పూడ్చడానికి అవసరమైన ప్రత్యేకహోదా సాధన, విభజన హామీల అమలు ప్రస్తావన చేయకపోవడం అన్యాయం. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు నిర్దిష్టమైన ప్రకటన ఏదీ గవర్నర్ ప్రసంగంలో లేకపోవడం దురదృష్టకరం. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ప్రస్తావనే లేకపోవడం విస్మయానికి గురిచేసింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ ప్రభుత్వ ఖజానా ఎన్నడూ లేనంత సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని చెప్పిన గవర్నర్ ప్రసంగం రానున్న రోజుల్లో ప్రజలపై అదనపు భారాలను మోపడానికి అవసరమైన నేపథ్యాన్ని సృష్టించేదిగా ఉంది..' అని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. అదేవిధంగా పార్లమెంట్ అఖిలపక్ష భేటీలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ ప్రస్తావించకపోవడాన్ని శ్రీనివాసరావు తప్పుబట్టారు. అఖిలపక్ష భేటీలో ఇతర పార్టీలు ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టినా... టీడీపీ సభ్యులు మౌనం వహించడం రాష్ట్రానికి అన్యాయం చేయడమేనని మండిపడ్డారు.

చిరుద్యోగుల వేతనాల్లో రికవరీకి ఆదేశం

- ఈ–పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్లు రూ.15 వేలకు మించి వేతనం తీసుకుంటే రికవరీ
- ఇకపై మాత్రం రూ.18,500 చొప్పున చెల్లింపునకు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖలో గౌరవ వేతనంపై పనిచేసే కొందరి చిరుద్యోగుల జీతాల్లో రికవరీకి ప్రభుత్వం ఆదేశాలు చేసింది. ఈ–పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్లుగా పనిచేసే వారు రూ.15 వేలకు మించి గౌరవ వేతనం తీసుకుంటే ఆ మొత్తాలను వెంటనే వారి నుంచి రికవరీ చేయాలంటూ పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం రెండు రోజుల క్రితం డీపీవోలకు ఆదేశాలిచ్చింది. రాష్ట్రంలో 10 వేలకు పైబడి జనాభా ఉండే గ్రామ పంచాయతీలో ఒకరు చొప్పున ఈ–పంచాయత్ ఆపరేటర్ పని చేస్తున్నారు. 10 వేలలోపు జనాభా ఉండే గ్రామ పంచాయతీల్లో 10 వేల జనాభాకు పరిమితమై వివిధ గ్రామ పంచాయతీలను క్లస్టర్‌గా పేర్కొంటూ.. ఒక్కో క్లస్టర్‌కు ఒకరు చొప్పున ఈ- పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారు. వీరంతా పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చే ఆర్థిక సంఘం అడ్మినిస్ట్రేటివ్ నిధుల నుంచి, లేదా పంచాయతీ సాధారణ నిధుల నుంచి వేతనాలు పొందుతుంటారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్నచోట ఎక్కడైనా స్థానికంగా ఆయా పంచాయతీ తీర్మానాలకు అనుగుణంగా ప్రతినెలా రూ.15 వేలకు మించి వేతనాలు తీసుకుని ఉంటే వారి నుంచి అధికంగా తీసుకున్న వేతనాలను వెనక్కి తీసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. కాగా.. ఈ–పంచాయత్ కంప్యూటర్ ఆపరేటర్ల గౌరవ వేతనం ఇక నుంచి ప్రతి నెలా రూ.18,500 చొప్పున చెల్లించాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం


గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో డిప్లొమా కోర్సులకు పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్స్‌ను ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకూ నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

రొయ్యకు వరుణ గండం



మేత తినక చనిపోతున్న రొయ్యలు

- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గడంతో తెగుళ్ల దాడి
- పెట్టుబడులు పెరగడంతో తగ్గుతున్న ధర



భీమవరం: ఎడతెరపిలేని వర్షాలు ఆక్వా పరిశ్రమను నిలువునా ముంచేశాయి. ముఖ్యంగా రొయ్య రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వారం రోజులుగా ముసురు, భారీ వర్షాలకు చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గి రొయ్యలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. మేత తినక చనిపోతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1.20 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. రొయ్యలకు వైట్‌గట్, వైరస్ వంటి తెగుళ్ల కారణంగా కౌంటు రాకముందే పట్టుబడులు పట్టాల్సి రావడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. పెట్టుబడులు పెరగడంతో వ్యాపారులు ధరలు తగ్గిస్తున్నారని, దీంతో మరింత ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో రొయ్య రైతులు నష్టాల పాలవకుండా తగు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు.

- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గకుండా నిత్యం ఏరియేటర్లు తిప్పాలి.
- విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ఏరియేటర్లను వినియోగించుకునేందుకు జనరేటర్లు, ఆయిల్ ఇంజిన్లను సిద్ధం చేసుకోవాలి.
- రొయ్యల్లో ఆక్సిజన్ కొరత నివారణకు పొటాషియం పర్మాంగనేట్ పొడిని సిద్ధంగా ఉంచుకుని అవసరమైన మేరకు చెరువుల్లో చల్లాలి.
- వర్షం కారణంగా చెరువుల్లో నీటి మట్టం మరీ పెరగకుండా 50 సెంటీమీటర్ల లోతు వరకు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గుతున్నందున రొయ్యలు మేత సక్రమంగా తినే అవకాశం లేదు. దీంతో అవసరం మేరకు మాత్రమే మేతలు వేసి ఖర్చు తగ్గించుకోవాలి.
- చెరువు గట్లు పల్లంగా ఉన్న చోట గండ్లు పడకుండా పటిష్టం చేసుకోవాలి. గట్లు ఎత్తు తక్కువ ఉన్న చెరువుల్లో రొయ్యలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేసుకోవాలి.

చేప విలవిల

కొల్లేరు సరస్సుకు ఎగువ నుంచి నీటిని పంపించే గుండేరు, తమ్మిలేరు వాగులు పొంగిపొర్లుతున్నాయి. నీటి మట్టాలు పెరిగితే చేపల చెరువుల గట్లు కొట్టుకుపోయే అవకాశం ఉంది. ఆక్సిజన్ సమస్య ఏర్పడితే రాత్రి, తెల్లవారుజాము, ఉదయం సమయాల్లో చేపలు చనిపోతాయి. రోహు, కట్లలలో పెద్ద చేపలు ముందు చనిపోతాయి. చేప నీటి ఉపరితలంపై, గట్ల వద్ద నోటితో గాలి పీలుస్తాయి. మేత తినడం తగ్గిపోతుంది. నీరు ఆకుపచ్చ రంగుకు మారి, పులిసిన వాసన వస్తాయి. చేపలు నోరు తెరిచి చనిపోవడం, నలుపు వర్ణం కోల్పోయి తెల్లబడటం, శరీరం మెత్తబడడం జరుగుతుంది. చేప మొప్పలు ఎర్ర రంగుకి, తర్వాత లేత గులాబీ రంగుకు మారతాయి.

ఇవి పాటించాలి

- చేపల చెరువుల్లో మేత, సేంద్రీయ ఎరువులు మానేయాలి.
- చనిపోయిన చేపలను చెరువు నుంచి తొలగించాలి.
- కాల్షియం పెరాక్సైడ్ ఎకరానికి 1 నుంచి 2 కేజీలు, హైడ్రోజన్ పెరాక్సైడ్ 2 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి.
- ఉదయం సమయంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రతను తగ్గించడానికి సున్నం ఎకరానికి 20–25 కేజీలు చల్లాలి.
- ఆక్సిజన్ లోటు నుంచి కోలుకున్న చేపలకు ప్రతి టన్ను మేతకు 10–15 కేజీల మినరల్ మిక్చర్ వరుసగా 15 -20 రోజులు పాటు అందించాలి.
- నీటిలో అమ్మోనియా ఉంటే యుక్కా పొడి 250–500 కేజీలు ఎకరానికి పిచికారి చేయాలి.

ఆక్సిజన్ కొరతతోనే తెగుళ్లు



గత 15 రోజులుగా వర్షాలు కురవడంతో రొయ్యల చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గి ఆక్సిజన్ కొరత ఏర్పడడంతో రొయ్యలకు వైట్‌గట్, వైరస్ వంటి వ్యాధులు సోకుతున్నాయి. దీంతో మేత సక్రమంగా తినకపోవడమేగాక తెగుళ్ల కారణంగా రొయ్యలు చనిపోతున్నాయి. రొయ్యల ప్లాంట్ యజమానులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల తీవ్రంగా నష్టపోతున్నాం.

– భోగిరెడ్డి శ్రీనివాసరావు, రొయ్యల రైతు, తోలేరు, వీరవాసరం మండలం

ముందస్తు చర్యలతో నష్ట నివారణ



భారీ వర్షాల కారణంగా రొయ్యలు, చేపల చెరువుల వద్ద రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలు తగ్గుతాయి. ప్రధానంగా ఆక్సిజన్ కొరత కారణంగా రొయ్యలకు ఇబ్బంది ఏర్పడుతుంది. అందువల్ల నిత్యం ఏరియేటర్లు తిరిగేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అవసరం మేరకే మేత వేయాలి.

– ఎల్ఎల్ఎస్ రాజు, మత్స్యశాఖ ఇన్‌చార్జ్ ఏడీ, భీమవరం

అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులు

బీఏసీ సమావేశంలో నిర్ణయం

- ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పెట్టే ప్రతిపాదనపై చర్చ లేదు!



సాక్షి, అమరావతి: అసెంబ్లీ సమావేశాలను ఐదు రోజులు నిర్వహించాలని శాసనసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ(బీఏసీ) సమావేశంలో నిర్ణయించారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన సోమవారం అసెంబ్లీలో జరిగిన బీఏసీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, శాసన వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జనసేన తరఫున మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ తరఫున విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు. మొదటి రోజు గవర్నర్ ప్రసంగంతో సభ వాయిదా పడిన నేపథ్యంలో మిగిలిన నాలుగు రోజులు సభ ఎలా నిర్వహించాలనే దానిపై చర్చించారు. రెండో రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టి దానిపై చర్చించాలని నిర్ణయించారు. ఆ తర్వాత మూడు రోజులు పలు బిల్లులు ప్రవేశపెట్టాలని, మూడు శ్వేతపత్రాలు విడుదల చేయాలని నిర్ణయించారు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పెట్టే ప్రతిపాదన ఏదీ ఈ సమావేశంలో చర్చకు రాలేదు.

అరుదైన పంటలు.. అద్భుత లాభాలు

- కరువు నేలపై సిరుల పంట

గార్లదిన్నె: ప్రయోగాలకు ఎప్పుడూ ముందుండే ఉమ్మడి అనంత జిల్లా రైతులు అరుదైన ఉష్ణ మండల దేశాల పండ్ల తోటల సాగుతో లాభాలు గడిస్తున్నారు. ఒక్కసారి మొక్క నాటితే ఏళ్ల తరబడి లాభాలు తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్, ఖర్జూర సాగుతో ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాంటి వారిలో అనంతపురం రూరల్ మండలం సిండికేట్ నగర్‌కు చెందిన రైతు రమణారెడ్డి ఒకరు.

పట్టువదలకుండా...

గార్లదిన్నె మండలం మర్తాడు, కోటంక గ్రామాల్లో తనకున్న భూముల్లో రైతు రమణారెడ్డి డ్రాగన్‌ఫ్రూట్, ఖర్జూర పంటల సాగు చేపట్టారు. 2016లో యూట్యూబ్ చానల్‌లో డ్రాగన్‌ఫ్రూట్ సాగు పరిశీలించిన ఆయన మహారాష్ట్రలోని సోలాపూర్ నుంచి లోకల్ అంట్లు తీసుకువచ్చి నాటాడు. తొలి పంట చేతికి అందలేదు. పంట పూర్తిగా నష్టపోయాడు. అయినా ఆయన పట్టువిడవకుండా కరోనా సమయంలో థాయిలాండ్ నుంచి జైన్ రకం ఒక్కొక్క కొమ్మకు రూ.250లు వెచ్చించి దాదాపు 6 వేల కొమ్మలు కొనుగోలు చేసి తెప్పించాడు. మూడు నెలల పాటు నర్సరీలో కొమ్మలు పెంచిన అనంతరం తన భూమిలో నాటాడు. ప్రతి మొక్కకూ ఓ స్తంభాన్ని నాటి, దానిపై రింగ్ ఏర్పాటు చేశాడు. ఎకరాకు 2 వేల కొమ్మలు చొప్పున మర్తాడులో 3 ఎకరాలు, కోటంకలో 3 ఎకరాల్లో నాటిన మొక్కలు ప్రస్తుతం విరగ్గాసాయి. ప్రస్తుతం డ్రాగన్ ఫ్రూట్ పంట మూడు టన్నుల మేర కోత కోసి, మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒక్కసారి మొక్క నాటితే దాదాపు 30 నుంచి 40 సంవత్సరాల పాటు దిగుబడి పొందవచ్చునని రైతు తెలిపారు.

పెట్టుబడి అధికమైనా...

సాధారణంగా డ్రాగన్ ఫ్రూట్ పంట తక్కువ నీటితో పండుతుంది. ఒక ఎకరా విస్తీర్ణంలో పంట సాగుకు దాదాపు రూ.5లక్షల నుంచి రూ.6 లక్షల వరకూ పెట్టుబడులు వస్తాయి. నూతన సాంకేతికత విధానాలతో పాటు సరైన యాజమాన్యం పాటిస్తే రూ.4 లక్షల అదనపు ఖర్చు వస్తుంది. ఎడారి మొక్క కావడంతో కాయ దశలో మాత్రమే పురుగు ఆశించే అవకాశం ఉంది. ఏడాదిలో మూడు సార్లు పురుగు నివారణ మందులు పిచికారీ చేసుకుంటే మంచి ఫలితాలు ఉంటాయి. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో ఒక గంట పాటు నీటి తడులు ఇస్తే చాలు. హైబ్రీడ్ రకం కావడంతో పంట సాగు చేసిన 8 నెలల్లో కోత దశకు వస్తుంది. జూన్ నుంచి డిసెంబర్ వరకూ పంట కోతలు ఉంటాయి. ఎంత లేదన్నా.. ఎకరాకు పది టన్నుల దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.1.20 లక్షల ధర పలుకుతోంది. జిల్లాలో మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో పంట దిగుబడులను చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించాల్సి వస్తోంది. నాణ్యమైన పంట ఉత్పతులున్నాయంటేఈ ప్రాంత వ్యాపారులు నేరుగా తోట వద్దకే వచ్చి పంట కొనుగోలు చేస్తున్నారనిరైతు వివరించారు.



డ్రాగన్ ఫ్రూట్ పంటను కోస్తున్న దృశ్యం

రోజూ ఆదాయమే...

ప్రస్తుతం మార్కెట్‌లో డ్రాగన్‌ఫ్రూట్ కిలో రూ.150 నుంచి రూ.200తో అమ్ముడు పోతోంది. దీంతో చాలా మంది చిరువ్యాపారులు నేరుగా రోజూ రైతు రమణారెడ్డి తోట వద్దకెళ్లి కిలో రూ.120 చొప్పున హోల్‌సేల్ ధరతో కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతుకు రోజూ ఆదాయం ఉంటోంది. అలాగే డ్రాగన్‌ఫ్రూట్ అంటు కూడా రూ.50తో విక్రయిస్తుండడంతో చాలా మంది రైతులు పంట సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. డ్రాగన్‌ఫ్రూట్‌తో పాటు మూడు ఎకరాల్లో రైతు రమణారెడ్డి ఖర్జూర పంట సాగునూ చేపట్టారు. అబూదాబీ నుంచి ఒక్కొక్క మొక్కను రూ.4,500 చొప్పున 500 ఆడ, 50 మగ మొక్కలు కొనుగోలు చేసి, పంట సాగు చేపట్టారు. ఖర్జూర సాగుకు మొక్క కొనుగోలు సమయంలో అయ్యే ఖర్చు తప్ప సాగు సమయంలో ఎలాంటి పెట్టుబడులూ అవసరం లేదని రైతు తెలిపారు. నీటి తడులు కూడా చాలా తక్కువగా ఉంటాయన్నారు. ఎకరా విస్తీర్ణంలో 100 చెట్లు సాగు చేయవచ్చునన్నారు. ఐదేళ్లలో ఒక్కొ చెట్టు వంద కిలోల దిగుబడి ఇస్తుందని, ఎకరా విస్తీర్ణంలో పది టన్నుల దిగుబడి చేతికి వస్తుందన్నారు.



ఖర్జూరం పంట



ఏకాంతవాసి అయిన ఒక సన్యాసి ఓసారి అన్నాడు:
'నన్ను ఈ ప్రపంచంతో ముడివేస్తున్న అన్నింటినీ వదులుకున్నాను.
కానీ ఒక్క ఆకాశపు అందం మాత్రం నన్ను వెంటాడుతోంది.'
– యోషిదా కెంకో

సాక్షి
మంగళవారం, 23 జూలై 2024

మలుపు తిప్పిన నిష్క్రమణ

అందరూ అనుమానిస్తున్నట్టే జరిగింది. చెప్పాలంటే అనివార్యమైనదే అయింది. మరో నాలుగు నెలల్లో అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికలు ఉన్నాయనగా రెండోసారి ఆ పదవికి ఎన్నికయ్యేందుకు చేస్తున్న ప్రచారం నుంచి డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత దేశాధ్యక్షుడు జో బైడెన్ పక్కకు తప్పుకున్నారు. వైట్‌హౌస్ పీఠానికి రేసు నుంచి వైదొలగుతున్నట్టు ఆదివారం ఆయన ఆకస్మికంగా చేసిన ప్రకటన ఒక విధంగా సంచలనమే. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఒక పార్టీ అభ్యర్థి ఇలా అర్ధంతరంగా బరిలో నుంచి వైదొలగిన ఘటన మునుపెన్నడూ జరగనిదే. అలాగని కొద్ది వారాలుగా అమెరికాలో జరుగుతున్న పరిణామాల రీత్యా బైడెన్ ప్రకటన మరీ అనూహ్యమేమీ కాదు. ఎన్నికల్లో పోటీ పడకున్నా, పదవీకాలం పూర్తయ్యే వరకు దేశాధ్యక్షుడిగా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తానని ప్రకటించిన ఆయన తన స్థానంలో పార్టీ అభ్యర్థిగా కమలా హ్యారిస్ పేరు ప్రస్తావించడం, ఆమె అభ్యర్థిత్వాన్ని తోటి డెమోక్రాట్లు బలపరుస్తుండడంతో అమెరికా ఎన్నికల కథ ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. ఇటీవలే ప్రత్యర్థి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్న ఘటనతో అన్నీ ప్రతికూలంగా కనిపిస్తున్న వేళ డెమోక్రాటిక్ పార్టీకి ఇది కొత్త ఊపిరి పోస్తోంది. మళ్ళీ ఆశలు చిగురింపజేస్తోంది.

ఇరవై తొమ్మిదేళ్ళ వయసులో జో బైడెన్ జాతీయస్థాయి రాజకీయ జీవితం ప్రారంభించారు. రిపబ్లికన్ సెనేటర్‌ను ఓడించడం ద్వారా 1972లో ఆయన కెరీర్ మొదలైంది. సరిగ్గా 52 ఏళ్ళ తర్వాత అమెరికా చరిత్రలో అత్యంత పెద్ద వయసు అధ్యక్షుడైన ఆయన యుద్ధం చేయకుండానే అస్త్రసన్యాసం చేయాల్సి వచ్చింది. నెలన్నర క్రితం కూడా బరిలో నుంచి తప్పుకొనేది లేదని బల్లగుద్ది చెప్పిన బైడెన్ ఇప్పుడిలాంటి నిర్ణయం తీసుకున్నారంటే... ఒక రకంగా అది ఆయన స్వయంకృతం. మరోరకంగా క్షేత్రస్థాయి పరిస్థితుల పట్ల పెరిగిన అవగాహన అని చెప్పక తప్పదు. ఆయనలో ఈ ప్రాప్తకాలజ్ఞతకు చాలా కారణాలే దోహదపడ్డాయి. ట్రంప్‌తో తొలి చర్చలోనే తడబడడం దగ్గర నుంచి నడకలో, నడతలో, మాటలో మార్పు తెచ్చిన వయోభారం, అభ్యర్థిని మార్చాలంటూ సొంత పార్టీ వారి నుంచే కొంతకాలంగా పెరుగుతున్న ఒత్తిడి వరకు ఇలా అనేకం అందులో ఉన్నాయి. అలాగే, ఆరునూరైనా సరే ముందనుకున్నదే చేసి తీరాలన్న మంకుపట్టు కన్నా రాజకీయాల్లో పట్టువిడుపులు ముఖ్యమనీ, కళ్ళెదుటి వాస్తవాలను బట్టి విజయం కోసం ఆట తీరు మార్చడం కీలకమనీ డెమోక్రాటిక్ పార్టీ అర్థం చేసుకుంది. అందుకే, బైడెన్ పోటీ ఉపసంహరణ నిర్ణయం తీసుకుంది. దీన్ని స్వాగతించాల్సిందే తప్ప తప్పుబట్టడానికి లేదు.

ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన పదవికి డెమోక్రాటిక్ అభ్యర్థిగా బరిలో దిగేందుకు 59 ఏళ్ళ కమలా హ్యారిస్ ఇప్పుడు ముందు వరుసలో ఉన్నారు. భారతీయ మూలాలున్న ఈ లాయర్ మొదట అటార్నీ జనరల్‌గా ఎదిగి, ఆ పైన సెనెటరయ్యారు. నిజానికి, అమెరికా ఉపాధ్యక్ష పదవిని చేపట్టిన తొలి మహిళ, తొలి నల్లజాతి అమెరికన్, తొలి దక్షిణాసియా అమెరికన్ ఆమే! ఉపాధ్యక్షురాలిగా ఆమె అద్భుతాలు చేయకపోయినా, చిందరవందరైన డెమోక్రాటిక్ పార్టీని మళ్ళీ చక్కదిద్ది గాడిన పెట్టగలరని ఆశ. ఇప్పుడు ఆమె ముందున్న అసలు సవాలదే. ఆమెను అభ్యర్థిగా ప్రకటించడానికి డెమోక్రాట్లు జాగు చేయకపోవచ్చు. అదే జరిగాక... ఎంతైనా స్త్రీ అనీ, ఆమె జాతి ఫలానా అనీ ప్రత్యర్థి ట్రంప్ బృందం ప్రచార దాడులు ప్రారంభించడం ఖాయం. అయితే, గతంలో ఇలానే బరాక్ ఒబామాపై ప్రచారాలు సాగినా, అవేవీ ఓటర్లు పట్టించుకోలేదు. అధ్యక్షుడిగా ఆయన రెండు సార్లు గెలిచారన్నది గమనార్హం. ధాటిగా మాట్లాడుతూ, ప్రచారం చేసే సత్తా ఉన్న కమల ఎన్నికల్లో అద్భుతం చేసినా ఆశ్చర్యం లేదు. ఒకవేళ ట్రంప్‌కు అడ్డుకట్ట వేయలేకున్నా, కనీసం ఆయన తలతిక్క నిర్ణయాలు తీసుకొనే వీలు లేని రీతిలో అమెరికన్ కాంగ్రెస్ ఎన్నికయ్యేలా చేయగలరని విశ్లేషణ.

పునర్వైభవం కోసం డెమోక్రాట్లు అంతా ఏకమవుతున్న వేళ సొంత నియోజకవర్గమంటూ లేని కమల ముందుగా భాగస్వాముల్ని, సమర్థకుల్ని, సహాయకుల్ని, అనుభవజ్ఞులూ – ప్రతిభావంతులైన బృందాన్నీ సమకూర్చుకోవాలి. కీలక రాష్ట్రాల్లో వారే ఆమెకు అండ. నిజానికి, పరిస్థితులు చూస్తుంటే ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు అమెరికా ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని నాయకత్వ కొరత పీడిస్తున్నట్టుంది. ఇటు డెమోక్రాట్లు, అటు రిపబ్లికన్లు – ఇరు పక్షాల్లోనూ ప్రజాదరణతో పాటు నేర్పు, ఓర్పున్న సమర్థులైన నాయకులెవరూ కనిపించడం లేదు. ఎవరూ రెండుసార్లకు మించి దేశాధ్యక్ష పదవిని చేపట్టరాదన్న అమెరికా రాజ్యాంగం ఒబామా లాంటి వారి పునఃప్రతిష్ఠకు అడ్డంకిగా మారింది. అది లోటే అయినా, ఆ నిబంధనలోని విస్తృత ప్రజాస్వామ్యస్ఫూర్తి, దూరాలోచన అర్థం చేసుకోదగినవే. అనుభవం లేనంత మాత్రాన అధ్యక్షబాధ్యతల్లో విఫలమవుతారనీ లేదు. మునుపటి అధ్యక్షులు చాలామంది అందుకు ఉదాహరణ. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటే, ఏ కొత్త బాధ్యతా కష్టం కాదు. పైగా, ట్రంప్‌కు మళ్ళీ పట్టం కట్టడానికి సుతరామూ ఇష్టం లేని అమెరికన్లకు ఇప్పుడు కమల మినహా ప్రత్యామ్నాయం లేదు. అదీ ఆమెకు కలిసిరావచ్చు. అయితే, హత్యాయత్నం తర్వాత పిడికిలి పైకెత్తి, పోరాటానికి నినదించి హీరో స్థాయికి పెరిగిన ట్రంప్ ప్రాచుర్యాన్ని తక్కువగా అంచనా వేయలేం. యువ ఓటర్లను ఆకర్షించడం కోసం ఉపాధ్యక్ష పదవికి 39 ఏళ్ళ జె.డి. వాన్స్‌ను ఎంపిక చేసుకొని ట్రంప్ మంచి ఎత్తుగడే వేశారు. మొత్తానికి, రోజులు గడుస్తున్నకొద్దీ అమెరికా ఎన్నికలు మరింత ఆసక్తికరంగా మారడం ఖాయమనిపిస్తోంది. ఎందుకంటే, అయిపోయిందనుకున్న ఆట అసలు ఇప్పుడే మొదలైంది!

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు
ఆషాఢ మాసం, **తిథి:** బ.విదియ ప.12.51 వరకు, తదుపరి తదియ,
నక్షత్రం: ధనిష్ఠ రా.11.46 వరకు, తదుపరి శతభిషం,
వర్జ్యం: లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.13 నుండి 9.05 వరకు,
తదుపరి రా.10.59 నుండి 11.43 వరకు, **అమృతఘడియలు:** ప.1.54 నుండి 3.24 వరకు.

సూర్యోదయం : 5.39
సూర్యాస్తమయం: 6.33
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సమ్మిళిత అభివృద్ధే లక్ష్యం కావాలి!

విశ్లేషణ



సుష్మా రామచంద్రన్

దేశీయ ఆర్థిక వ్యవస్థ 8 శాతం వద్ద స్థిరంగా వృద్ధి చెందుతూ ఉండొచ్చు; అయితే బయటి ఎదురుగాలులు ఈ వృద్ధిని దెబ్బ తీయొచ్చు. వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సమాన స్థాయిలో మద్దతునిస్తూ, మౌలిక సదుపాయాలు, సేవల వంటి కీలక రంగాలను బలోపేతం చేయడంపై బడ్జెట్ దృష్టి పెట్టాలి. ప్రైవేట్ పెట్టుబడులకు సులభతర వాతావరణాన్ని సృష్టించే దిశగా కూడా ముందుకు సాగాలి. ఐఐటీలు, ఐఐఎమ్‌ల వంటి అద్భుతమైన ఉన్నత విద్యా సంస్థలతో కూడిన దేశంలో ప్రాథమిక, మాధ్యమిక విద్య దుర్భర స్థితిలో ఉంది. సమాజంలోని అన్ని వర్గాలూ ప్రయోజనాలను పొందేలా చూసుకోవాలి. భారీస్థాయిలోని మన యువ జనాభా శ్రామికశక్తిలోకి ప్రవేశించడానికి సన్నద్ధం అయ్యేలా కేంద్ర, రాష్ట్రాలు కలిసి పని చేయాలి.

భౌగోళిక రాజకీయ రంగంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో కేంద్రంలోని కొత్త ప్రభుత్వం తన మొదటి బడ్జెట్‌ను సిద్ధం చేస్తోంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్–హమాస్ వివాదం తగ్గుముఖం పట్టే సూచనలు కనిపించడం లేదు. దేశీయ ఆర్థిక వ్యవస్థ దాదాపు 8 శాతం వద్ద స్థిరంగా వృద్ధి చెందుతూ ఉండవచ్చు. అయితే బాహ్య వాతావరణపు స్థిరత్వాన్ని బట్టి ఇది మారవచ్చు. ప్రపంచ చమురు ధరలు తగ్గింపు స్థితిలోనే ఉంటాయనీ, ఎగుమతి వృద్ధిని ప్రభావితం చేసిన మాంద్యం పోకడల నుండి పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థలు బయటపడతాయనీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆశిస్తూ ఉండవచ్చు. అంతర్జాతీయ సముద్ర మార్గాలను కలహాలు లేకుండా ఉంచడం కూడా వచ్చే పోయే వాణిజ్య ఖర్చులలో అనవసరమైన పెరుగుదలను నివారించడంలో కీలకం. స్పష్టంగా, బయటి ఎదురుగాలులు భారతదేశ వృద్ధి కథనాన్ని చెడగొట్టే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. అందువల్ల, వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సమాన స్థాయిలో మద్దతునిస్తూ, మౌలిక సదుపాయాలు, సేవల వంటి కీలక రంగాలను బలోపేతం చేయడంపై బడ్జెట్ దృష్టి పెట్టడం అవసరం.

మౌలిక వసతుల రంగంలో, గత కొన్నేళ్లుగా నమోదైన మూలధన వ్యయంలో విపరీతమైన పెరుగుదలను విధాన రూపకర్తలు కొనసాగించడం మంచిది. 2024–25 మధ్యంతర బడ్జెట్ మూలధన వ్యయంలో అంతకుముందు నమోదైన 30 శాతం పెరుగుదలను సుమారు 16.9 శాతానికి తగ్గించింది. దేశంలోని విస్తారమైన మౌలిక సదుపాయాల అంతరం కారణంగా మూలధన వ్యయంలో అధిక పెరుగుదల అవసరం. ఇది భారీ సంఖ్యలో నైపుణ్యం కలిగిన ఉద్యోగాలను వెంటనే సృష్టించలేకపోయినా, ఉపాధి కల్పనపై నిస్సందేహంగా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ. 2.11 లక్షల కోట్లను బదిలీ చేసిన వాస్తవం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ దిశలో కొనసాగడానికి గణనీయమైన ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

ప్రభుత్వ రంగం కంటే వెనుకబడిన ప్రైవేట్ పెట్టుబడులకు సులభతర వాతావరణాన్ని సృష్టించే దిశగా కూడా బడ్జెట్ ముందుకు సాగాలి. ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకాలు వంటి అమలులో ఉన్న విధానాలు తయారీకి ప్రోత్సాహాన్ని ఇస్తాయి. ఈ విధానాలను మరింత క్రమబద్ధీకరించాలి. 1991 ఆర్థిక సంస్కరణల కాలం నుండి నియంత్రణ వాతావరణం కచ్చితంగా చాలా ప్రగతి సాధించింది. కానీ గతంతో పోల్చడం అసందర్భం అవుతుంది. ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో ఇప్పుడు పోల్చుకోవలసి ఉంది. వియత్నాం, ఇండోనేషియా వంటి దేశాలు సరళమైన, సులభమైన పెట్టుబడి విధానాలను అందిస్తున్నాయి. బహుళజాతి సంస్థలు



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

అక్కడ స్థావరాన్ని ఏర్పరచుకోవడానికి ఇది ఒక ఆకర్షణ. దీనికి విరుద్ధంగా భారతదేశం అంత ఆకర్షణీయంగా కనిపించడం లేదు.

దేశీయ పెట్టుబడిదారులు అధిక మూలధనం, లాజిస్టిక్స్ ఖర్చులతో పోరాడవలసి ఉంటుంది. అయినప్పటికీ, కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేయడానికి అవసరమైన అనుమతులు సమృద్ధిగా లభించకపోవడం అనేది దేశీయ, విదేశీ పెట్టుబడిదారులకు ప్రధాన అడ్డంకిగా మిగిలిపోయింది. ఈ సమస్యలు ఇప్పుడు ఎక్కువగా రాష్ట్రాలు లేదా స్థానిక మునిసిపాలిటీల స్థాయిలో ఉన్నాయి. సులభతరమైన వ్యాపారాన్ని ఈ స్థాయికి తీసుకురావడం తదుపరి తరం సంస్కరణల్లో భాగం కావాలి.

మరో తరం సంస్కరణలు అవసరం

ఫిబ్రవరిలో 2024–25 మధ్యంతర బడ్జెట్‌తో విడుదల చేసిన ఆర్థిక ప్రకటనలో ఇది ఇప్పటికే పరిగణించబడుతుందనే సూచన కనిపిస్తోంది. ఇది మండలం, జిల్లా, గ్రామ స్థాయిలలో పాలనను మెరుగుపరచడం గురించి ప్రస్తావించింది. వృద్ధి, అభివృద్ధి ఆధారిత సంస్కరణల కోసం రాష్ట్రాలకు 75,000 కోట్ల రూపాయల రుణాన్ని కూడా అందించారు. ఆరోగ్యం, విద్య, నైపుణ్యం, భూసేకరణ వంటి వాటిపై దృష్టి కేంద్రీకరించడమైనది.

సంస్కరణలు చేపట్టేందుకు రుణాలు అందుబాటులో ఉన్నప్పటికీ, అన్ని రాష్ట్రాలు సహకరించకపోవడమే ఈ ప్రణాళికలోని ఏకైక చిక్కు. బీజేపీ పాలిత రాష్ట్రాలు కేంద్రం నుంచి వచ్చే ఆదేశాలకు కట్టుబడి ఉండాల్సి ఉంటుంది, కానీ ఇతర రాష్ట్రాల నుంచి అదే స్పందన రాకపోవచ్చు. అందుకే తదుపరి తరం సంస్కరణలను ప్రారంభించే లక్ష్యం పాక్షికంగా మాత్రమే విజయవంతమవుతుంది. అదే సమయంలో, ముఖ్యంగా దక్షిణ భారతంలోని కొన్ని రాష్ట్రాలు, ఇప్పటికే నియంత్రణ ప్రక్రియలను క్రమబద్ధీకరించినట్లు తెలుస్తోంది. ఫలితంగా ఇన్వెస్టర్లు వారికి అండగా నిలుస్తున్నారు. ఉదాహరణకు, ఆపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు కొత్త ప్రాజెక్ట్‌లను ప్రధానంగా తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసుకొంటున్నాయి. ఈ రాష్ట్రాలు అవలంబించిన విధానాలను అధ్యయనం చేయాలి. ఇతర రాష్ట్రాల్లోనూ వీటిని పునరావృతం చేయాలి.

ఈ సందర్భంలో, విద్య, నైపుణ్యాలకు చెందిన క్లిష్టమైన విభాగానికి బడ్జెట్ కేటాయింపులు అవసరం. ప్రభుత్వ ఎజెండాలో ఉద్యోగాల కల్పన ఎక్కువగా ఉండాల్సి ఉండగా, అనేక రంగాలు నైపుణ్యం కలిగిన సిబ్బంది కొరతను ఎదుర్కొంటున్నాయన్నది వాస్తవం. విద్య రకం, పరిశ్రమకు అవసరమైన నిర్దిష్ట నైపుణ్యాల మధ్య అసమతుల్యత కూడా ఉంది. ఈ సమస్యను పరిష్కరించడానికి దీర్ఘకాలిక విధాన చికిత్సలను రూపొందించాలి. అయితే స్వల్ప కాలంలో, రాబోయే బడ్జెట్‌లో నైపుణ్యం కలిగిన సంస్థలకు తగిన కేటాయింపులను అందించవచ్చు.

అదనంగా, విద్యపై ఎక్కువ శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది. ఐఐటీలు, ఐఐఎమ్‌ల వంటి అద్భుతమైన ఉన్నత విద్యా సంస్థలతో కూడిన దేశం ఇది. కానీ ప్రాథమిక, మాధ్యమిక విద్య దుర్భరమైన స్థితిలో ఉంది. ఇక్కడ కూడా, మన భారీస్థాయిలోని యువ జనాభా శ్రామికశక్తిలోకి ప్రవేశించడానికి బాగా సన్నద్ధం అయ్యేలా కేంద్ర, రాష్ట్రాలు కలిసి పని చేయాలి.

జీడీపీ, ఉపాధి కల్పనలకు సహకారం అందిస్తున్నందున ప్రయాణం, పర్యాటకం వంటి సేవలకు ఆర్థిక మంత్రిత్వ శాఖ కూడా మరింత మద్దతు ఇవ్వాలి. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికీ, మెరుగైన ఆర్థిక ఎంపికలు అందుబాటులోకి రావడానికీ హోటళ్లకు మౌలిక సదుపాయాల స్థితిని ఆతిథ్య పరిశ్రమ కోరుతోంది. కోవిడ్ ప్రభావిత పతనం నుండి ఈ రంగం బలంగా పుంజుకుంటోంది. అయితే కొంత లక్ష్యిత మద్దతు ఉపాధి అవకాశాలను విస్తరిస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయడం తక్షణ అవసరం. వాటిని ఏర్పాటు చేయడానికి ప్రోత్సాహకాలతో పాటు, రైతులు రిటైల్ మార్కెట్‌లను ప్రత్యక్ష మార్గంలో అందుకోవడానికి తగిన వ్యవస్థలను ఏర్పాటు చేయడం అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని ఆదాయ మార్గాల కల్పనతో పాటు మౌలిక వసతుల కల్పనను తక్షణ ప్రాతిపదికన చేపట్టాలి. లేకుంటే రానున్న సంవత్సరాల్లో పట్టణ, గ్రామీణ అంతరం మరింత విస్తరిస్తూనే ఉంటుంది. సమాజంలోని అన్ని వర్గాలూ ప్రయోజనాలను పొందగలిగేలా చూసుకోవాలి. దేశవ్యాప్తంగా ఆకాంక్షలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయని ఇటీవలి ఎన్నికలు తెలియజేశాయి. సంక్షేమ విధానాలకు స్వాగతమే. అయితే దీర్ఘకాలంలో అవి స్థిరమైన అభివృద్ధికి దారితీయాలి.

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఎలా భరిస్తున్నారో!



డోనాల్డ్ ట్రంప్ మీద (అమెరికా) మీడియాలో వరుసగా తొమ్మిదేళ్లుగా దూషణలు కొనసాగుతున్నాయి. కానీ బైడెన్ ఒక్క నెల కూడా వాటిని తట్టుకోలేకపోయారు.

– డేవిడ్ సాక్స్, ఆంట్రప్రెన్యూర్

బడ్జెట్ లాభించేనా?



రానున్న మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా ఎన్నికల్లో బీజేపీ ప్రదర్శనను నిర్ణయించే అంశాల్లో నిర్మలా సీతారామన్ బడ్జెట్ ఒకటి. మూడింట రెండు రాష్ట్రాలు దాదాపుగా చేజారిపోయాయి. దాన్ని తిరగదిప్పడానికి రానున్న నెలల్లో బీజేపీ ఏం చేస్తుందో చూద్దాం.

– వైభవ్ సింగ్, మీడియా పర్సనాలిటీ

విషయం అర్థం చేసుకోండి!



నా టైమ్‌లైన్ మీద చాలా ఆగ్రహం కనబడుతోంది. మరీ సూటిగా మాట్లాడటం వల్ల ఇలాంటి స్పందన వస్తున్నట్టుంది. ఐపీఎస్, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్, ఇంకా రక్షణ రంగం లాంటివాటిల్లో ఈ (దివ్యాంగుల) కోటాను ఎందుకు అమలు చేయలేదో హక్కుల కార్యకర్తలు పరిశీలించాలి. ఐఏఎస్ అనేది వాటికి భిన్నం కాదనేంతవరకే నా అభిప్రాయం. అందరినీ కలుపుకొనిపోయే సమాజంలో జీవించాలన్నదే మన కల. స్పందనారాహిత్యం అనేదానికి నా మనసులో చోటు లేదు. జై హింద్!

– స్మితా సభర్వాల్, ఐఏఎస్ అధికారిణి

అలా వస్తుంటే...



విమానాశ్రయంలో గుండ్రటి లగేజ్ బెల్ట్ మీదుగా మన బ్యాగు వస్తున్నప్పుడు చూడటంలో ఉండే సంతోషం వేరు!

– మోనికా హాలన్, రచయిత్రి

తినకూడదా?



ఇండియాలో అసాధారణ ద్రవ్యోల్బణం ఉంది. సగటు ద్రవ్యోల్బణం 5.2 శాతం కాగా, కూరగాయలది 30 శాతం. కూరగాయలకు పెట్టే ఖర్చు చాలా చిన్న విషయమైన ధనికులకు అది ఎక్కువ కాదు. కానీ ఆహారం, కూరగాయల మీద ఎక్కువ ఖర్చుపెట్టే మధ్యతరగతి, పేదవాళ్లకు ఇది ఎంతో ఎక్కువ.

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

పర్యటించనేలేదా?



రానున్న నెలల్లో చైనాలో పర్యటించే యోచన బైడెన్‌కు లేకపోతే గనక, జిమ్మీ కార్టర్ తర్వాత పదవిలో ఉండగా చైనాను సందర్శించని మొదటి అమెరికా అధ్యక్షుడు ఆయన అవుతారు. అన్నట్టూ, పదవిలోంచి దిగిపోయాక కార్టర్ చైనాకు ఎనిమిది సార్లు వచ్చారు.

– హు షిజిన్, చైనా సంపాదకుడు

ప్రజాస్వామ్యానికి ముప్పు




కమలా హ్యారిస్ అమెరికాకు తర్వాతి అధ్యక్షురాలు అవుతుంది. నవంబర్‌లో ఆమె గెలుపు కోసం నా పూర్తి మద్దతును ఇస్తున్నాను. ఇంతకుముందుకన్నా మరింత ఎక్కువగా అమెరికా ప్రజాస్వామ్యానికి ఉన్న ముప్పును ఎదుర్కోవడానికి గానూ డోనాల్డ్ ట్రంప్‌ను ఓడించేందుకు మన పార్టీ, మన దేశం వేగంగా ఒక్కటవ్వాలి.

– అలెక్సాండ్రియా ఒకాసియో–కోర్టెజ్, డెమోక్రాట్ నాయకురాలు

ఇన్ బాక్స్

స్వేచ్ఛ కోసం విప్లవించి...

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో విప్లవ పంథాలో పనిచేసి దేశానికి ప్రాణాలు అర్పించినవారిలో చంద్రశేఖర్ ఆజాద్ ఒకరు. 1906 జూలై 23న మధ్యప్రదేశ్‌లోని బాబానగర్‌లో ఆయన జన్మించారు. అయితే ఆయన పూర్వీకులు ఉత్తరప్రదేశ్‌కు చెందినవారు కావడంతో తల్లిదండ్రులు కాశీ విద్యా పీఠంలో సంస్కృత విద్యను అభ్యసించడానికి ఆయన్ని చేర్చారు. అప్పటికే స్వాతంత్ర్య ఉద్యమానికి ఆకర్షితుడై 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో భాగంగా తాను చదువుకుంటున్న సంస్కృత విద్యాపీఠం ముందే ధర్నా చేశాడు. పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. 'నీ పేరేమిటి?' అన్న జడ్జి ప్రశ్నకు ఆ 15 ఏళ్ల బాలుడు 'ఆజాద్' (స్వేచ్ఛ) అని సమాధానం ఇచ్చాడు. అప్పటి నుంచి అతడి పేరులో ఆజాద్ భాగమయ్యింది. ఇటువంటి సమాధానాలకు అతడికి 15 కొరడా దెబ్బలు శిక్షగా విధించాడు జడ్జి.



చంద్రశేఖర్ ఆజాద్

పెద్దవాడవుతున్న కొద్దీ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం రాదని ఆయన నమ్మాడు. భగత్ సింగ్, రాంప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా, అష్ఫాకుల్లాఖాన్‌లతో మైత్రి ఏర్పడింది. వీరంతా కలిసి 'హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థను స్థాపించారు. వారి పోరాటానికి అవసరమైన వనరులను సమకూర్చుకోవడానికి 1925లో కకోరి వద్ద బ్రిటిష్ ప్రభుత్వ ధనాన్ని తరలిస్తున్న రైలును ఆపి దోపిడీ చేశారు. ఈ కేసులో అష్ఫాకుల్లా ఖాన్, రాంప్రసాద్ బిస్మిల్ లాంటివారిని పట్టుకుని ఉరితీసింది బ్రిటిష్ ప్రభుత్వం. ఆజాద్ అజ్ఞాతంలోకి వెళ్లి పనిచేయసాగాడు. 1931 ఫిబ్రవరి 27 ఉత్తర ప్రదేశ్‌లోని 'ఆల్ఫ్రెడ్ పార్కు'లో ఆజాద్ ఉన్నాడని తెలిసిన పోలీసులు చుట్టుముట్టారు. ఆజాద్ తన తుపాకితో వీరోచితంగా పోరాడి చివరి బుల్లెట్‌తో తనను తాను కాల్చుకొని పోలీసులకు ప్రాణాలతో చిక్కకుండా ఆత్మగౌరవాన్ని కాపాడుకున్నాడు. అలా స్వతంత్ర భారత యజ్ఞంలోస్వీయ సమిధయ్యాడు.

– ఛత్రపతి చౌహాన్ । ఏబీవీపీ తెలంగాణ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు
(నేడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి)

బడ్జెట్ 3.0లోనైనా సంక్షేమం వికసించేనా?

అభిప్రాయం



తండ సదానందం

మన దేశంలో బడ్జెట్‌ను ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెడతారు. ఈ సంవత్సరం సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి నెలలో మధ్యంతర బడ్జెట్‌ను మాత్రమే ప్రవేశపెట్టారు. అందుకే పూర్తిస్థాయిలో నేడు (జూలై 23న) 18వ లోక్ సభలో 2024–25 బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేశారు. గత బడ్జెట్లు అన్నీ సంపన్నులకు లాభం చేకూర్చేవిగానే ఉన్నాయనీ, ఈసారైనా కాస్త సామాన్యులకు ఊరట కలిగించేవిగా ఉండాలనీ జనం ఎదురుచూస్తున్నారు. భాగస్వామ్య పక్షాల వెన్నుదన్నుతో నడుస్తున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ దూకుడు తగ్గించి సామాన్యుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందనీ, ఇవ్వాలనీ ప్రజలు ఆశిస్తున్నారు.

కోవిడ్ కాలం నుండి పేదల బతుకుల్లో ఆశించిన మార్పులు లేవు. ఉపాధి కోల్పోయి కొనుగోలు శక్తి లేక ఆకలి సైతం తీర్చుకోలేక విలవిలలాడుతున్న దుర్భర పరిస్థితులు ఉండడం బాధాకరం. ఇప్పటికీ వ్యవసాయం, చేనేత, లఘు పరిశ్రమలు వంటివి సంక్షోభంలో పడిపోగా కోట్లాదిమంది అర్ధాకలితో, పస్తులతో గడుపుతున్నారు. 125 దేశాలను పరిగణనలోకి తీసుకున్న అంతర్జాతీయ ఆకలి సూచికలో 111వ స్థానంలో భారత్ ఉంది. దీన్ని బట్టి ఇక్కడ పేదరికం ఎంతగా ఉందో అర్థమవుతుంది. ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలోనే గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఫలితంగా ఆహార ధాన్యాలతోపాటు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి.పెరిగిన ఆహార ద్రవ్యోల్బణం తగ్గించేలా 3.0 బడ్జెట్‌లో చర్యలు ఉండాలి.

గత ఎన్నికలలో ఇచ్చిన హామీల మేరకు పేద



ప్రజలందరికీ గృహ నిర్మాణ పథకాన్ని సక్రమంగా అమలు చేయాలి. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలి. 2022–23 బడ్జెట్‌తో పోలిస్తే 2024–25 మధ్యంతర బడ్జెట్లో వ్యవసాయ అనుబంధ కార్యకలాపాలకు వేల కోట్ల రూపాయలు తగ్గించారు. ఇది సరికాదు. రైతన్నను ఆదుకోవడానికి తగిన కేటాయింపులు ఈసారన్నా జరగాలి. దేశ ప్రగతికి కీలక అవసరమైన విద్యపై గత బడ్జెట్లో ఆశించిన కేటాయింపులు లేవు. ప్రైవేటు విద్యను ప్రోత్సహించేలా ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయి. ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధికి నిధుల కేటాయింపు పెంచాలి.

అలాగే ప్రభుత్వమే ఉచిత వైద్యం అందించేలా బడ్జెట్ రూపొందించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం ప్రజారోగ్యంపై స్థూల జాతీయోత్పత్తిలో ఐదు శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా కేవలం 2.1 శాతం మాత్రమే మన దేశంలో ఖర్చు పెడుతున్నారు. ఈ బడ్జెట్‌లోనైనా 5 శాతం నిధులు ప్రజారోగ్యంపై కేటాయించి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలి.


స్టాండర్డ్ డిడక్షన్ కొత్త పన్ను విధానంలో 7 లక్షల నుండి 12 లక్షల వరకు పెంచాలి. అదేవిధంగా నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలి. 'బేటీ పఢావో బేటీ బచావో' అనేది నినాదాలకు పరిమితం చేయకుండా మహిళా సాధికారత దిశగా బడ్జెట్‌లో కేటాయింపులు ఉండాలి. మహిళల పట్ల వేధింపులు లేకుండా ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలకు రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధిని కల్పించడానికి ఏకైక మార్గమైన 'ఉపాధి హామీ పథకా'నికి ఎక్కువ నిధులు కేటాయించాలి. మొత్తం మీద ఈ బడ్జెట్ నిరుపేద, మధ్య తరగతి వర్గాలను దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెడతారని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

వ్యాసకర్త టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్
మొబైల్: 99895 84665

స్వ స్వరూపాన్ని గుర్తించే సాధనం

ఉపవాసం అంటే పస్తు ఉండటం, నిరాహారంగా ఉండటం అని వాడుక. కానీ 'ఉప–వాసం' అనే పదబంధానికి ఆహారంతో సంబంధం కనిపించదు. 'ఉప' అంటే 'సమీపం', 'వాసం' అంటే 'నివాసం'. కాబట్టి 'ఉపవాసం' అంటే దగ్గరగా ఉండటం. దేనికి దగ్గరగా ఉండటం? ఉపవాసం చేసే సాధకుడు దేనికి దగ్గరగా ఉండాలనుకొంటున్నాడో దానికి!

ఉదాహరణకు, ఒక భక్తుడు కొంత సమయం పాటు, ఎప్పటికంటే ఎక్కువగా, మనో–వాక్–కాయ–కర్మల ద్వారా తన ఇష్ట దైవానికి సన్నిహితంగా ఉండాలని సాధన చేస్తే, అది ఉపవాస సాధన అవుతుంది. శరీరాన్ని వీలయినంత ఎక్కువ సమయం భగవన్మూర్తికి దగ్గరగా ఉంచుతూ, ఇతర లౌకిక విషయాలకు దూరంగా ఉంచటం శారీరకమైన ఉపవాసం. వాక్కును కొంతకాలం పాటు భగవత్ స్తోత్రాలకూ, భగవద్విషయమైన చర్చలకూ పరిమితం చేయటం వాక్కుపరమైన 'ఉపవాసం'.



జ్యోతిర్మయం

మనసును ఆహార విహారాల లాంటి ఇంద్రియ విషయాల మీదనుంచి కొంతసేపు మళ్ళించి, దైవం మీద నిలిపి ఉంచటం మానసికమైన ఉపవాసం. అలాగే లౌకికమైన పనులకు కొంతకాలం సెలవిచ్చి, ఆ సమయాన్ని పూజలకూ, ఆరాధనలకూ, అభిషేకాలకూ, వ్రతాలకూ వెచ్చించడం... కర్మల పరంగా దైవానికి సమీపంగా ఉండే 'ఉపవాసం'.

ఈ దేహమూ, ఇంద్రియాలూ, మనస్సు– ఇవే 'నేను' అన్న మిథ్యా భావనలో మునిగిపోయి, వీటికి అతీతంగా వెలుగుతుండే ఆత్మజ్యోతి తన అసలు రూపం అని మరిచిపోయిన జీవుడు, కొంతకాలం పాటన్నా దేహేంద్రియ వ్యవహారాలకు దూరంగా, తన స్వ స్వరూపానికి దగ్గరగా వెళ్ళి దానిని గుర్తించేందుకు చేసే సాధన 'ఉపవాసం' అని వేదాంతులు వివరణ ఇచ్చారు.

మామూలుగా రోజూ తినే ఆహారం మీద నుంచి దృష్టి మళ్ళించేసి, ఒక్కపూట మరేదయినా ఆహారం పుచ్చుకొంటే ఇహానికీ పరానికీ మంచిదన్న భావనతో, దాని మీద దృష్టి పెట్టడం కూడా 'ఉపవాసమే'. కానీ అది మనో వాక్ కాయ కర్మలన్నిటి ద్వారా, ఆ కొత్త ఆహారానికి 'సమీపంగా ఉండటం' మాత్రమే అవుతుంది.

– ఎం. మారుతి శాస్త్రి

క్లుప్తంగా...

చిన్నారిపై లైంగిక దాడి.. 20 ఏళ్ల జైలు

- రూ.12 వేల జరిమానా.. చెల్లించకుంటే మరో ఆరు నెలలు జైలు
- చిన్నారికి రూ.4 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం

విశాఖ లీగల్: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది సోమవారం తీర్పు చెప్పారు. జైలుశిక్షతోపాటు రూ.12 వేల జరిమానా చెల్లించాలని.. లేనిపక్షంలో అదనంగా ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు. బాధిత బాలికకు రూ.4 లక్షలు పరిహారం చెల్లించాలని ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు బోడిపల్లి మురళీకృష్ణ (37) విశాఖలోని జనతా కాలనీలో ఉంటున్నాడు. వృత్తి రీత్యా పెయింటింగ్ పనిచేస్తూ ఉండేవాడు. 2022 జూలై 24వ తేదీన మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బాధిత బాలిక సమీపంలో ఆడుకుంటూ ఉండగా నిందితుడు బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాల మధ్య బాలిక ఇంటికి చేరుకుంది. జరిగిన ఘటనను చిన్నారి కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఆమె తండ్రి మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెల్లడించారు.

రక్తాన్ని పారిస్తున్నారు

- హత్యలు, అత్యాచారాలు దోపిడీలను ప్రోత్సహిస్తున్నారు
- అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస: రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ టీడీపీ నాయకులు రాష్ట్రంలో రక్తాన్ని పారిస్తున్నారని అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శించారు. ఆయన సోమవారం శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు, దాడులు, దౌర్జన్యాలు, ప్రభుత్వ–ప్రైవేటు ఆస్తుల ధ్వంసం.. కొత్త ప్రభుత్వం అందించిన పాలన అని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లో 35 హత్యలు, 305 హత్యాయత్నాలు, 20 అత్యాచారాలు జరిగాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు నెలకొల్పాలని కోరారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇళ్లపై దాడి చేసి వారి వాహనాలకు నిప్పు పెట్టి ధ్వంసం చేశారని చెప్పారు. ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వినుకొండలో మైనార్టీ యువకుడు రషీద్‌ను నడిరోడ్డుపై నరికి చంపి రాక్షసపాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఎప్పుడూ ఒకరే పాలించరనేది గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అటకెక్కించడానికి ప్రభుత్వం చూస్తోందని ఆయన విమర్శించారు.

నాగార్జున యాదవ్‌కు 41ఏ నోటీసులు

- కక్ష సాధింపుగానే ఆదివారం అర్ధరాత్రి అదుపులోకి
- తమిళనాడు సరిహద్దులో బంధువులకు అప్పగింత



పోలీసుల అదుపులో నాగార్జున యాదవ్

కుప్పం (చిత్తూరు జిల్లా): బెంగళూరు నుంచి విజయవాడకు వెళుతున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు సోమవారం 41ఏ నోటీసులు జారీ చేసి, తమిళనాడు సరిహద్దులో ఆయన బంధువులకు అప్పగించారు. ముందస్తు బెయిల్‌పై ఉన్న నాగార్జున యాదవ్‌ను ఆదివారం అర్ధరాత్రి బంగారుపాళ్యం సమీపంలోని కళాగ్రాండ్ హోటల్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కక్షసాధింపుగా అక్కడి నుంచి 125 కిలోమీటర్ల దూరంలోనున్న కుప్పానికి తరలించారు. పది రోజులు క్రితం ఓ టీవీ ఇంటర్వ్యూలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన విమర్శలపై నాగార్జున యాదవ్‌పై టీడీపీ చిత్తూరు జిల్లా టీడీపీ యువత నేత వరుణ్‌కుమార్ కుప్పం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు కేసు నమోదు చేసిన విషయం విదితమే.

హాస్టల్ విద్యార్థిని అదృశ్యం

గుడివాడరూరల్/గుడివాడ టౌన్: గుడివాడలోని ఎస్సీ వసతి గృహంలో ఉంటున్న ఓ ఇంటర్ విద్యార్థిని ఆదివారం అర్ధరాత్రి అదృశ్యం అయిన ఘటన అధికారులకు ముచ్చెమటలు పట్టించింది. వివరాల్లోకి వెళితే.. కృష్ణాజిల్లా గుడివాడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ విద్యార్థిని లింగవరం రోడ్డులోని ఎస్సీ వసతి గృహంలో ఉంటోంది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో బాత్‌రూమ్‌కని చెప్పి.. బయటకు వచ్చిన విద్యార్థిని తిరిగి వసతిగృహానికి వెళ్లలేదు. ఈ విషయాన్ని సహచర విద్యార్థినులు వార్డెన్‌కు తెలిపారు. వెంటనే వార్డెన్ గుడివాడ వన్‌టౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. దీంతో వసతిగృహాన్ని వన్‌టౌన్ సీఐ రమేష్ సిబ్బందితో కలసి పరిశీలించారు. విద్యార్థిని స్నేహితుల నుంచి వివరాలు సేకరించారు. దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ఉగ్ర గోదావరి



పోలవరం స్పిల్‌వే వద్ద వరద ప్రవాహం

కాళేశ్వరం నుంచి ధవళేశ్వరం వరకు ప్రమాదకర స్థాయిలో గోదావరి

- భద్రాచలం వద్ద 50.10 అడుగులకు వరద
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- పోలవరంలోకి 11,06,947 క్యూసెక్కులు.. దిగువకు వదిలేస్తున్న అధికారులు
- ధవళేశ్వరం నుంచి 12,51,907 క్యూసెక్కులు సముద్రంలోకి
- మంగళవారం వరద ఉధృతి మరింత పెరుగుతుందని సీడబ్ల్యూసీ అంచనా
- పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచన



భద్రాచలం రామాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/ధవళేశ్వరం/ఎటపాక/చింతూరు/ముంచంగిపుట్టు: పరివాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటం, ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, సీలేరు, తాలిపేరు, పెద్దవాగు, కిన్నెరసాని, వాగులు, వంకలు ఉరకలెత్తుతుండటంతో గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ప్రాణహిత కలిసే కాళేశ్వరం (తెలంగాణ) నుంచి సముద్రంలో కలిసే అంతర్వేది వరకు నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి 10 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీలోకి 12,54,407 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటిమట్టం 13.50 అడుగులకు చేరింది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తున్నారు. గోదావరి డెల్టాకు 2,500 క్యూసెక్కులను విడుదల చేస్తూ.. మిగిలిన 12,51,907 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రికి ధవళేశ్వరం బ్యారేజీలోకి వరద ఉధృతి మరింత పెరిగి, నీటిమట్టం 13.75 అడుగులు దాటుతుందని, మంగళవారం ప్రమాద హెచ్చరిక జారీ చేస్తామని అధికారులు తెలిపారు. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీలోకి 9,54,130 క్యూసెక్కులు చేరుతున్నాయి. ఈ నీరు మొత్తాన్ని దిగువకు వదిలేస్తున్నారు. వాటికి ఇంద్రావతి జలాలు తోడవుతుంటంతో తుపాకులగూడెం (సమ్మక్క) బ్యారేజీలోకి 10,15,170 క్యూసెక్కులు వస్తున్నాయి. అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు.

భద్రాచలం వద్ద గోదావరి దూకుడు

తెలంగాణలోని దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బ్యారేజీలోకి 11,86,801 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. దీనికి కిన్నెరసాని, తాలిపేరు, పెద్దవాగు వరద తోడవుతుండటంతో భద్రాచలం వద్ద సోమవారం రాత్రి 7 గంటలకు 12,17,861 క్యూసెక్కులు చేరుతున్నాయి. వరద మట్టం 49.40 అడుగులకు చేరింది. దాంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

గంట గంటకూ పెరుగుతున్న వరద

భద్రాచలం నుంచి వస్తున్న గోదావరికి కూనవరం నుంచి వస్తున్న శబరి ప్రవాహం తోడవుతుండటంతో పోలవరం ప్రాజెక్టులో వరద గంట గంటకూ పెరుగుతోంది. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో 11,06,947 క్యూసెక్కుల జలాలు వస్తున్నాయి. స్పిల్ వే వద్ద నీటి మట్టం 33.15 మీటర్లకు చేరుకుంది. దీంతో 48 గేట్లను ఎత్తి వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. మధ్య గోదావరి సబ్ బేసిన్‌తోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మంగళవారం గోదావరి మరింత ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అంచనా వేసింది. నదీ పరివాహక ప్రాంతంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని బేసిన్‌లోని రాష్ట్రాలకు సూచించింది.

గోదావరి జిల్లాల కలవరం



కోనసీమ జిల్లా చాకలిపాలెం-కనకాయలంక కాజ్‌వేపై పడవపై ప్రమాదకర ప్రయాణం

సాక్షి, రాజమహేంద్రవరం/సాక్షి ప్రతినిధి, ఏలూరు/అమలాపురం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు కలవరం కలిగిస్తోంది. పోలవరం ముంపు మండలాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వేలేరుపాడు మండలంలో 33 గ్రామాలను జలాలు చుట్టుముట్టాయి. మరోవైపు శుక్రవారం నుంచి విద్యుత్ సరఫరా లేకపోవడంతో మండలంలో జనజీవనం మరింత దుర్భరంగా మారింది. కుక్కునూరు మండలంలోని పలు గ్రామాల్లో కూడా వరద నీరు చేరింది. రెండు మండలాల్లో కలిపి 12 పునరావాస కేంద్రాల్లో 6 వేల మందికి ఆశ్రయం కల్పించినట్లు అధికారులు తెలిపారు. ఎర్ర కాలువ, కొవ్వాడ కాలువ కూడా ఉధృతంగా ప్రవహిస్తుండటంతో తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 18 మండలాల పరిధిలోని 211 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి. 18,204 మంది రైతులకు చెందిన 16,249 హెక్టార్ల విస్తీర్ణంలో వరి, చెరకు, మినుము పంటలు నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం, అయినవిల్లి, మామిడికుదురు, ముమ్మిడివరం మండలాల్లో ఉద్యాన పంటలు నీట మునిగాయి. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాలు, పశ్చిమ గోదావరి జిల్లా పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వే, ముక్తేశ్వరం–అయినవిల్లిలంక మధ్య ఎదురుబిడెం వద్ద కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం రాయనపేట వద్ద జాతీయ రహదారిపైకి వరద చేరటంతో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి–326, ఆంధ్రా, తెలంగాణ జాతీయ రహదారి–30పైనా రాకపోకలను నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వాగు దాటలేక బిడ్డను కోల్పోయిన గర్భిణి

ముంచంగిపుట్టు: వాగు దాటలేక ఓ తల్లి కడుపులోనే బిడ్డను కోల్పోయింది. అల్లూరి జిల్లా ముంచంగిపుట్టు మండలం కోడాపుట్టు వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. అదే గ్రామానికి చెందిన కె.నాగేశ్వరరావు భార్య సోనాయి (25) పురిటి నొప్పులు రావడంతో ముంచంగిపుట్టు ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ ఆస్పత్రి 7కిలోమీటర్ల దూరంలో ఉంది. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ప్రైవేటు వాహనంలో కోడాపుట్టు నుంచి ఒడిశా రాష్ట్రం బెజ్జంగి మార్గంలో అతికష్టం మీద 70 కిలోమీటర్లు ప్రయాణించి ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి తీసుకువచ్చి.. పాడేరు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కడుపులోని శిశువు మృతి చెందడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

వృద్ధురాలు మృతి

రాజవొమ్మంగి మండలం గింజర్తి గ్రామానికి చెందిన కుంజం రాజులమ్మ (60)కు ఆదివారం రాత్రి గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో వట్టిగెడ్డ వాగు దాటేందుకు వీలు కాలేదు. దీంతో ఆమె అక్కడే ప్రాణాలు విడిచింది.

రషీద్‌ది రాజకీయ హత్యే

వైఎస్సార్‌సీపీలో చురుగ్గా తిరిగాడనే టీడీపీ నేతలు చంపించారు

- రషీద్‌కు నేర చరిత్ర లేదు.. పాత కక్షలు లేవు
- రషీద్ గురించి మాట్లాడే హక్కు జగన్‌కి లేదా?
- పోలీసులు జగన్‌ను అసెంబ్లీ వద్ద ఎందుకు అడ్డుకున్నారు?
- రషీద్ తల్లి బడేబీ, తండ్రి ఫరేషా



రషీద్ తల్లిదండ్రులు బడేబీ, ఫరేషా

సాక్షి, నరసరావుపేట: వినుకొండలో ఇటీవల హత్యకు గురైన రషీద్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని అతని తల్లి బడేబీ, తండ్రి ఫరేషా స్పష్టం చేశారు. 'మా కుమారుడికి పాత కక్షలు ఏమీ లేవు. నేర చరిత్ర లేదు. ఎవరినీ చంపలేదు, నరకలేదు. కేవలం వైఎస్సార్‌సీపీలో చురుగ్గా తిరుగుతున్నాడన్న కారణంతోనే టీడీపీ నేతలు నడి రోడ్డుపై దారుణంగా హత్య చేయించారు. ఇందుకు జిలానీని అడ్డుపెట్టుకొన్నారు. బుల్లెట్ బండి తగలబెట్టడానికి, మా కుమారుడికి సంబంధం లేదు. ఈ విషయాలన్నీ వినుకొండలో ఎవరిని అడిగినా చెబుతారు' అని చెప్పారు.

జగన్‌ను ఎందుకు అడ్డుకున్నారు?

తన పార్టీ కార్యకర్తను అన్యాయంగా టీడీపీ నేతలు హత్య చేస్తే అసెంబ్లీలో ప్రశ్నించే హక్కు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి లేదా అని నిలదీశారు. వైఎస్ జగన్‌ను అసెంబ్లీ వద్ద ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. 'రషీద్ గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదా? ప్లకార్డులను ఎందుకు చింపేశారు? జగన్ చేతిలో ప్లకార్డులు ఉంటే ప్రజలంతా చూస్తారు. మాకు జరిగిన అన్యాయం అందరికీ తెలుస్తుందని కదా' అని అన్నారు. కొడుకును కోల్పోయి బాధలో ఉన్న తమకు వైఎస్ జగన్ భరోసానిచ్చారని తెలిపారు. ఢిల్లీలో ధర్నా చేసి పోరాడతానన్నారని చెప్పారు. తమకు న్యాయం చేద్దామన్న ఆలోచన ప్రభుత్వానికి ఉంటే ఇంటి వద్దకు వచ్చి భరోసా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇప్పటికీ తమ పిల్లల్ని టీడీపీ వారు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంకా నలుగురు ఉన్నారు, మిమ్మల్నీ చంపుతామంటూ ఫోన్లు చేస్తున్నారన్నారు. పిల్లలకు ఫోన్లు చేయిస్తున్న వారెవరో తేల్చాలని కోరారు. 'ఆమె ఎవరో హోంశాఖ మంత్రి అనిత అంట.. ఎంత అన్యాయంగా మాట్లాడుతోంది! పాత కక్షలు, ముస్లింలు ముస్లింలు కొట్టుకున్నారని ఆమె చెప్పడం సరి కాదు. మా కడుపు కోతను అర్థం చేసుకొని మరోసారి పాతకక్షల వల్ల హత్య అని అనవద్దు. మాకు న్యాయం చేయండి' అని అన్నారు. బొండాలు కొట్టే కత్తితో రషీద్‌ను హత్య చేశారని అంటున్నారని, ఆ కత్తిని ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు. అది ఎక్కడ తయారు చేశారు, ఎవరు చేయించారో పోలీసులు తేల్చాలని డిమాండ్ చేశారు.

అజ్ఞాతంలోకి హిందూపురం సీఐ రియాజ్

- రెండో పెళ్లి చేసుకుని తనకు అన్యాయం చేశారని మొదటి భార్య ఫిర్యాదు
- తన బిడ్డలకు న్యాయం చేయాలని ఎస్పీకి వినతి

పుట్టపర్తి టౌన్: తన భర్త రెండో పెళ్లి చేసుకుని.. తనకు అన్యాయం చేశాడంటూ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం టూటౌన్ సీఐ రియాజ్ అహమ్మద్‌పై భార్య సల్మా ఫిర్యాదు చేశారు. సోమవారం పుట్టపర్తిలో ఎస్పీ రత్నను కలసి వినతిపత్రం అందజేశారు. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన మహమ్మద్ సల్మాను పుంగనూరుకు చెందిన రియాజ్ అహమ్మద్ 2001లో వివాహం చేసుకున్నారు. అప్పట్లో సల్మా కుటుంబ సభ్యులు రూ.6 లక్షల నగదు, 30 తులాల బంగారం కట్నం కింద ఇచ్చారు. వారికి ఇద్దరు ఆడపిల్లలు. పెళ్లయిన ఏడాదికే పరాయి స్త్రీల వ్యామోహంలో పడి భార్యను నిత్యం వేధించేవాడు. వేధింపులు అధికం కావడంతో ఒకానొక సందర్భంలో ఆమె ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. కానీ.. పిల్లల్ని చూసి ఆగిపోయింది. రియాజ్ గుంతకల్లులో పని చేసినప్పుడు ఓ మహిళా కానిస్టేబుల్‌ను కూడా వేధించాడు. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపారు. అయినప్పటికీ ఆయనలో మార్పు రాలేదు. రాజంపేటలో ఉన్నప్పుడు భార్యతో గొడవ పడి ఇంటినుంచి నెట్టేశారు. అప్పటి నుంచి ఆమె భర్తకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికల ముందు హిందూపురం సీఐగా వచ్చారు. ఈ ఏడాది జూలై రెండో తేదీన హిందూపురంలో ఓ అమ్మాయిని రెండో వివాహం చేసుకున్నాడు. తాను విడాకులు తీసుకోలేదని, అయినా రెండో పెళ్లి చేసుకున్నాడని, తనకు, బిడ్డలకు న్యాయం చేయాలని ఎస్పీ రత్నను కోరింది. ఇదిలా ఉండగా.. హిందూపురానికి చెందిన రెండో భార్య కూడా ఇటీవల సీఐ రియాజ్ అహమ్మద్‌పై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. మొదటి భార్యకు విడాకులు ఇవ్వకుండానే తనను రెండో పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసు ఉన్నతాధికారులు ఆయన్ను వీఆర్‌కు పిలిచారు. వీఆర్‌కు వెళ్లకుండానే సస్పెండ్ చేస్తారనే భయంతో రియాజ్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

కృష్ణమ్మ పరవళ్లు

శ్రీశైలం ప్రాజెక్టులోకి 1,09,814 క్యూసెక్కులు

- శ్రీశైలంలోకి గంటగంటకు పెరుగుతున్న ప్రవాహం
- నిండుకుండలా తుంగభద్ర డ్యామ్.. 55 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల



తుంగభద్ర డ్యాంలో వరద పరవళ్లు

సాక్షి, అమరావతి/హొళగుంద/హొసపేట: శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణమ్మ పరుగుపరుగున చేరుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు 1,09,814 క్యూసెక్కులు వస్తుండటంతో నీటినిల్వ 832.5 అడుగుల్లో 52.14 టీఎంసీలకు చేరుకుంది. పరివాహక ప్రాంతం (బేసిన్)లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా ప్రధాన పాయతోపాటు ఉపనదులు వరదతో పరవళ్లు తొక్కుతున్నాయి. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లు ఇప్పటికే నిండుకుండలా మారడంతో వచ్చిన వరదను వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు. ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో జూరాల ప్రాజెక్టులో విద్యుదుత్పత్తి చేస్తూ.. గేట్లు ఎత్తి వరద ప్రవాహాన్ని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరుతున్న వరద గంటగంటకు పెరుగుతోంది. కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,04,972 క్యూసెక్కులు వస్తుండటంతో నీటినిల్వ 87.42 టీఎంసీలకు చేరుకుంది. తుంగభద్ర డ్యామ్ నిండుకుండలా మారడం, ఎగువ నుంచి భారీవరద వస్తుండటంతో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు గేట్లు ఎత్తి ఐదువేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. క్రమేణ పెంచుతూ రాత్రికి 55 వేల క్యూసెక్కులు విడుదల చేస్తామని, నదీతీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జలవనరులశాఖ అధికారులను తుంగభద్ర బోర్డు ఆదేశించింది. తుంగభద్ర డ్యామ్ నుంచి విడుదల చేసే జలాలు సుంకేశుల బ్యారేజ్ మీదుగా శ్రీశైలం ప్రాజెక్టులోకి చేరనున్నాయి. ఇటు జూరాల నుంచి కృష్ణా, అటు సుంకేశుల నుంచి తుంగభద్ర జలాలు వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి మరింతగా పెరగనుంది.

టీడీపీ నేత వేధింపులతో ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- 15 ఏళ్లుగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యాంగుడు గంగరాజు
- రూ.35 వేలు ఇవ్వకపోతే జాబ్ లేకుండా చేస్తామంటూ టీడీపీ నేత బెదిరింపులు
- నిద్రమాత్రలు మింగిన గంగరాజు



చికిత్స పొందుతున్న గంగరాజు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కూటమి ప్రభుత్వం రావడంతో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, ఆగడాలకు హద్దు లేకుండా పోయింది. అడిగినంత ఇవ్వకపోతే.. ఉద్యోగం నుంచి తొలగిస్తామంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న దివ్యాంగుడిని ఓ టీడీపీ నాయకుడు బెదిరించాడు. దీంతో ఆ ఉద్యోగి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలోని గణపవరంలో సోమవారం జరిగింది. వివరాలు.. గణపవరానికి చెందిన దివ్యాంగుడు తన్నీరు గంగరాజు 15 ఏళ్లుగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గంగరాజుకు భార్య, వృద్ధులైన తల్లి, తండ్రి ఉన్నారు. ఆ కుటుంబానికి గంగరాజు చేస్తున్న ఉద్యోగమే జీవనాధారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక టీడీపీ నాయకుడు నంబూరి శ్యామ్‌ప్రసాద్.. గంగరాజును బెదిరించడం మొదలుపెట్టాడు. రూ.35 వేలు ఇవ్వకపోతే.. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడివనే నెపం వేసి ఉద్యోగాన్ని ఊడగొడతానంటూ బెదిరించాడు. తాను ఏ పార్టీకి అనుకూలం కాదని గంగరాజు ఎంత బతిమిలాడినా వినని శ్యాంప్రసాద్.. టీడీపీ కార్యకర్తలతో గంగరాజు మీద ఎంపీడీవోకు ఫిర్యాదు చేయించాడు. ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడ్డాడని ఆరోపించాడు. దీంతో శ్యామ్‌ప్రసాద్ వేధింపుల వల్లే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు గంగరాజు లెటర్ రాసి సోమవారం మధ్యాహ్నం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఇది గుర్తించిన కుటుంబసభ్యులు గంగరాజును మైలవరం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడకు తరలించారు.

కొత్త నేర చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు



కొత్త నేర చట్టాల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏపీ జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు

ఆరిలోవ(విశాఖ తూర్పు): కొత్తగా అమల్లోకి వచ్చిన నేర చట్టాలపై జైళ్ల శాఖ సిబ్బంది అవగాహన పెంచుకోవాలని రాష్ట్ర జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాసరావు సూచించారు. 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్‌డీ) ఆధ్వర్యాన విశాఖ కేంద్ర కారాగారంలో మూడు రోజులు నిర్వహించనున్న జాతీయస్థాయి సదస్సును సోమవారం ఆయన ప్రారంభించారు. బీపీఆర్‌డీ అసిస్టెంట్ డైరెక్టర్ కేకే మీనా, విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్‌తో కలిసి కొత్త చట్టాలతో కూడిన పుస్తకాన్ని ఇండ్ల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. సదస్సులో చర్చించిన, అవగాహన కల్పించిన అంశాలపై నివేదికను తయారుచేసి న్యూఢిల్లీలోని బీపీఆర్‌డీకి పంపిస్తామని వివరించారు. మొదటి రోజు దామోదర సంజీవయ్య లా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ నందని, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ దయానందమూర్తి నూతన చట్టాల గురించి వివరించారు. విశాఖ కేంద్ర కారాగారం అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జగన్, వైఎస్సార్, రాచమల్లు ఫొటోలు ఎందుకు తొలగించారు

- రెండురోజుల్లో సమాధానం ఇవ్వకపోతే చెట్టుకింద నుంచే పాలన సాగిస్తా
- ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి



ప్రొద్దుటూరు: తెలుగుదేశం పార్టీకి చెందిన బయటి వ్యక్తులు దౌర్జన్యంగా వచ్చి తన చాంబర్‌లోని మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఫొటోలు తొలగించడంపై అధికారులు రెండురోజుల్లో తనకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి కోరారు. ఆమె సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు సమాధానం ఇవ్వని పక్షంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెట్టుకింద కూర్చొని పరిపాలన సాగిస్తానని చెప్పారు. దౌర్జన్యంగా తన చాంబర్‌లోకి చొరబడి తమ నేతల ఫొటోలను తొలగించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఫొటో మాత్రమే ఉండాలని కమిషనర్ తెలిపారన్నారు. ఆ విషయాన్ని తాము ఎంతో గౌరవించామని, తమ నాయకుల ఫొటోల తొలగింపుపై ప్రభుత్వం ఏదైనా జీవో ఇచ్చి ఉంటే చూపాలని కోరామని తెలిపారు. తాను మహిళనైనందునే అధికారులు ఇలా మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. తమ నాయకులు వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలు లేకుండా తనకు చైర్‌పర్సన్ చాంబర్ అవసరం లేదన్నారు. తొలగించిన ఫొటోలు పెట్టకుండా, జీవో చూపించకుండా ఉంటే తాను ఆరుబయట చెట్టు కింద కూర్చొని పరిపాలన సాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు జిలాని, మన్నె సత్యం, అనిల్‌కుమార్, జయంతి పాల్గొన్నారు.

తప్పుకుంటారా? తప్పించమంటారా?

- ఫీల్డ్ అసిస్టెంట్లకు కూటమి నేతల వేధింపులు
- తమ కష్టాలను కలెక్టర్‌కు విన్నవించుకున్న ఉద్యోగులు



మాట్లాడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

తిరుపతి అర్బన్: 'ఉపాధి హామీ పథకంలో 18 ఏళ్లుగా మేమంతా పనిచేస్తున్నాం. ఇప్పుడు మాకు రాజకీయ రంగు పులిమి రాజీనామా చేయండి.. లేదా ఎంక్వయిరీ వేయించి ఉద్యోగాల్లోంచి తొలగిస్తాం' అంటూ అధికార పార్టీకి చెందిన గ్రామ, మండలస్థాయి నాయకులు వేధిస్తున్నారంటూ ఫీల్డ్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'తిరుపతి జిల్లాలో 757 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పొట్టకొట్టకండి ప్లీజ్..' అంటూ సోమవారం కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు తమను కొనసాగించాలంటూ వినతిపత్రం సమర్పించారు. తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం వచ్చాక ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తామంటూ స్థానిక టీడీపీ నేతలతో పాటు మండల టీడీపీ నేతలు భయాందోళనకు గురిచేస్తున్నారు. రాజకీయ నాయకుల అనుచరులు ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి ఉపాధి హామీ పథకానికి సంబంధించిన లాగిన్లు, పాస్వర్డ్‌లు తీసుకుని.. ఆయా ఫీల్డ్ అసిస్టెంట్లకు సంబంధించి తప్పుడు సమాచారాన్ని ఫీడ్ చేస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ తప్పు చేయకున్నా.. నేతలే ఇలా తప్పులు ఆపాదించి వారిని ఉద్యోగాల్లోంచి తప్పించాలని భావిస్తున్నారు. ఈ పథకం ద్వారా చేపట్టిన పనులకు అధికారులు సోషల్ ఆడిట్ నిర్వహిస్తుంటారు. తప్పులు చేసి ఉంటే వారే చర్యలు తీసుకుంటారు. అయినా కూటమి నేతలు వీరిని వదిలిపెట్టడం లేదు. తప్పుకుంటారా.. లేదా తప్పులు చేయించి తప్పించమంటారా? అంటూ బెదిరిస్తుండటంతో వారు కలెక్టర్‌ను కలవాల్సి వచ్చింది.

రాయచోటిలో దస్తగిరి హల్‌చల్



రాయచోటిలో సైట్ సెటిల్మెంట్‌లో దస్తగిరి

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో అధికార పార్టీ నాయకులు భూ ఆక్రమణలను వేగవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి.. అన్నమయ్య జిల్లా రాయచోటిలో భూమి పంచాయితీలపై హల్‌చల్ చేశాడు. పట్టణ సమీపంలోని పట్టా భూములను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ల్యాండ్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. తహసీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ రామాంజులతో చర్చించినట్లు తెలిసింది. భూమికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవాలంటే జేసీని కలవాలని సూచించినట్లు సమాచారం. అక్కడ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లగా జేసీ అందుబాటులో లేకపోవడంతో మరోరోజు వస్తానని వెళ్లిపోయినట్లు తెలిసింది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ భూములు, అసైన్మెంట్ కమిటీ అందజేసిన పట్టాలపై కన్నేసి.. అధికారుల ద్వారా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

అడ్వాంటేజ్ హారిస్



- డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి రేసులో ముందంజ!
- ఆమెకే జై కొడుతున్న సొంత పార్టీ ప్రత్యర్థులు


వాషింగ్టన్: జో బైడెన్ డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా వైదొలగడంతో భారతీయ అమెరికన్, ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు అవకాశాలు మెరుగయ్యాయి. అధ్యక్ష అభ్యర్థిగా కమలకు బైడెన్ మద్దతు ప్రకటించారు. ఇది ఆమెను అధ్యక్ష టికెట్ రేసులో ముందు వరుసలో నిలుపుతుంది. అయితే బైడెన్ మద్దతిచ్చినంత మాత్రాన ఆటోమేటిగ్గా కమల డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి అవ్వలేరు. డెమొక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో డెలిగేట్ల మద్దతును సంపాదించాల్సి ఉంటుంది. డేలిగేట్ల ఓటింగ్‌లో ఎవరైతే మెజారిటీ సాధిస్తారో వారే డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి అవుతారు. డెమొక్రాటిక్ పార్టీ టికెట్ కోసం కమలకు గట్టి పోటీదారులుగా మారతారని భావించిన పలు రాష్ట్రాల గవర్నర్లు తమ మద్దతు ఉపాధ్యక్షురాలికేనని బాహటంగా ప్రకటిస్తున్నారు. ప్రస్తుతానికైతే అధికారికంగా కమల ఒక్కరే రేసులో ఉన్నారు. బైడెన్ విరమణ ప్రకటన అనంతరం కమల తక్షణం రంగంలోకి దిగారు. పార్టీలోని సహచరులకు ఆదివారమే 100 పైగా ఫోన్‌కాల్స్ చేసి మద్దతు కూడ గట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు భారతీయ అమెరికన్, ఆఫ్రికన్ అమెరికన్ చట్టసభ సభ్యులు, బైడెన్ అనుచరులు కమలకు మద్దతుగా ముమ్మర లాబీయింగ్ మొదలుపెట్టారు. వివిధ రంగాల్లోని మహిళలు కూడా ఆమెకు బాసటగా నిలుస్తున్నారు. బైడెన్ ప్రచార బృందం కూడా సోషల్ మీడియాలో తమ అకౌంట్ల పేర్లను హారిస్ పేరు మీదకు మార్చేసింది. ప్రచార టీమ్‌లోని 1,000 మంది ఉద్యోగులు తక్షణం ఆమె తరఫున పనిచేయనున్నారు.

పెలోసి, క్లింటన్‌ల మద్దతు

ప్రతినిధుల సభ మాజీ స్పీకర్, డెమొక్రాటిక్ పార్టీలో కీలక నాయకురాలు నాన్సీ పెలోసి కూడా సోమవారం హారిస్‌కు మద్దతు ప్రకటించారు. శ్రామికవర్గ కుటుంబాల కోసం శ్రమించే, సునిశిత మేధోశక్తి గల రాజకీయ నాయకురాలిగా కమలను అభివర్ణించారు. బైడెన్‌ను వైదొలిగేలా ఒప్పించడంలో పెలోసిది కీలక పాత్ర. డజన్ల కొద్ది ప్రతినిధుల సభ సభ్యులు, సెనేటర్లు కూడా కమలకు మద్దతు తెలిపారు. గట్టి పోటీదారులైన పెన్సిల్వేనియా గవర్నర్ జోస్ షాపిరో, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఆదివారమే ఆమెకు మద్దతు ప్రకటించేశారు. అమెరికాలోనే అత్యంత ధనవంతుడైన రాజకీయ నాయకుడు, హయత్ హోటల్ గ్రూపు వారసుడు, ఇల్లినాయిా గవర్నర్ జె.బి.ప్రిట్జ్‌కర్, రెండుసార్లు కెంటకీ గవర్నర్ అండీ బెషియర్ అభ్యర్థిత్వ రేసులో ఉంటారని భావించినా సోమవారం వారిద్దరూ కమలకే జైకొట్టారు. మిషిగన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్ కూడా ఇదే బాటలో నడిచారు. మేరీలాండ్ గవర్నర్ వెస్ మూర్ కూడా కమలకే మద్దతు ప్రకటించారు. మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్‌ల మద్దతు కూడా లభించింది. కమలకు ఉదారంగా విరాళాలివ్వాలని హిల్లరీ సోమవారం పిలుపిచ్చారు. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఆమోద ముద్ర కూడి పడితే ఆమెకు తిరుగు ఉండదు. కమల ప్రత్యర్థులుగా ప్రస్తుతానికి రాయ్ కూపర్ (67), అరిజోనా సెనేటర్ మార్క్ కెల్లీ పేర్లు వినిపిస్తున్నాయి.

ప్రధాని గొంతే నొక్కజూస్తారా!

విపక్షాలపై మోదీ ధ్వజం ● ప్రతికూల రాజకీయాలంటూ విమర్శలు



సాక్షి, న్యూఢిల్లీ: విపక్షాలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రతికూల రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ ఆరోపించారు. అందుకు పార్లమెంటును కూడా దుర్వినియోగం చేసే ప్రయత్నంలో పడ్డాయని మండిపడ్డారు. ఆ క్రమంలో ప్రధానమంత్రి గొంతునే నొక్కే పోకడలకు పాల్పడుతున్నాయని దుయ్యబట్టారు. కేంద్ర బడ్జెట్‌పై సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. "లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇక రాజకీయాలను పక్కన పెట్టి వచ్చే ఐదేళ్లలో దేశాభివృద్ధి కోసం పార్టీలన్నీ ఒక్కతాటిపైకి రావాలి" అని పిలుపునిచ్చారు. "పార్లమెంటు ఉన్నది ఏదో ఒక్క పార్టీ కోసం కాదు. మొత్తం దేశం కోసం" అంటూ విపక్షాలను ఉద్దేశించి హితవు పలికారు. "మళ్లీ 2029 జనవరిలో మరోసారి లోక్‌సభ ఎన్నికల క్షేత్రంలోకి దిగండి. కావలిస్తే అందుకు పార్లమెంటును కూడా వాడుకోండి. అప్పటిదాకా ప్రజా సంక్షేమం కోసం పాటుపడదాం" అని పిలుపునిచ్చారు.

విపక్షాల తీరు మారాలి

సభా కార్యకలాపాలను అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న కొన్ని విపక్షాల తీరుతో ఆయా పార్టీల ఎంపీలకు పార్లమెంటులో మాట్లాడే అవకాశమే రాలేదని మోదీ అన్నారు. "ఇది విచారకరం. అన్ని పార్టీలు సభ్యులందరికీ, ముఖ్యంగా తొలిసారి ఎన్నికైన వారికి మాట్లాడే అవకాశమివ్వాలి. తొలి సమావేశాలకు విపక్షాలు అంతరాయం కలిగించాయి. దాంతో 140 కోట్ల భారతీయుల ఆదేశంతో ఎన్నికైన ప్రభుత్వ స్వరం పదేపదే మూగబోయింది. ఇవి ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. నిజానికి ప్రతికూల రాజకీయాలకు మన పార్లమెంటరీ వ్యవస్థలో ఎప్పుడూ స్థానం లేదు" అన్నారు.

ఇది అమృతకాల బడ్జెట్

> మేం ప్రవేశపెట్టబోతోంది అమృతకాల బడ్జెట్. వచ్చే ఐదేళ్లకే గాక 2047 నాటికి వికసిత్ భారత్‌ను సాకారం చేసుకునే కలకు పునాది.

బడ్జెట్ మథనంలో అమృతం చిలికేనా!

నేడే కేంద్ర బడ్జెట్

రికార్డు స్థాయిలో వరుసగా ఏడోసారి ప్రవేశపెట్టనున్న నిర్మల

- సంక్షేమనాదమా, అభివృద్ధి నినాదమా?
- వేతనజీవికి ఈసారైనా 'ఐటీ' ఉపశమనం దక్కేనా?
- ఈవీ, ఫార్మా, రియల్టీ తదితర రంగాల్లో ఎన్నో ఆశలు

అమృతకాల బడ్జెట్‌గా మోదీ అభివర్ణిస్తున్న కేంద్ర బడ్జెట్-2024 అన్ని వర్గాల ఆశలపైనా నిజంగానే అమృతం చిలికిస్తుందా? పన్ను వాతలు, ఎడాపెడా కోతలతో ఖేదమే మిగులుస్తుందా? 2047కల్లా వికసిత భారత లక్ష్యాన్ని సాకారం చేసుకునే దిశగా పడుతున్న బలమైన పునాదిగా ప్రధాని చెప్పుకున్న ఈ బడ్జెట్లో మధ్య తరగతిని ఎంతో కొంత మురిపిస్తారా? ముఖ్యంగా ఐటీ మినహాయింపులు పెంచి వేతన జీవులకు కాస్తయినా ఉపశమనం కలిగిస్తారా? కేవలం ప్రగతి పరుగులకే మరింత ఊపునిస్తారా? ఈ ప్రశ్నలన్నింటికీ మరికొద్ది గంటల్లో జవాబులు లభించనున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తిస్థాయి కేంద్ర బడ్జెట్‌ను విత్త మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గత ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం తెలిసిందే. కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలకు ఇది రికార్డు స్థాయిలో వరుసగా ఏడో బడ్జెట్ కావడం విశేషం. మోదీ 3.0 సర్కారు తొలి బడ్జెట్ నుంచి ఏ రంగాలు ఏం ఆశిస్తున్నాయంటే... - సాక్షి, నేషనల్ డెస్క్

ఐటీ ఊరట.. ఈసారైనా...!

ఆదాయ పన్ను చెల్లించే మధ్య తరగతి, వేతన జీవులు ఈ బడ్జెట్లోనన్నా ఎంతో కొంత ఊరట దక్కుతుందని ఆశిస్తున్నారు. ఐటీ శ్లాబులను సవరించాలన్నది వారి ప్రధాన డిమాండ్. ఓటాన్ అకౌంట్లో నిర్మల దీని జోలికి పోలేదు. నూతన పన్ను విధానంలో పన్ను మినహాయింపును ప్రస్తుత రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడంతో పాటు పాత విధానంలో మినహాయింపులను కూడా పెంచుతారని అంచనాలున్నాయి. తద్వారా వేతన జీవుల చేతిలో మరిన్ని డబ్బులు ఆడతాయని, వారి కొనుగోలు సామర్థ్యం పెరిగి ఆర్థిక వ్యవస్థ మరింతగా కళకళలాడుతుందని నిపుణులు చెబుతున్నారు. చాలామంది పాత పన్ను విధానానికే మొగ్గుతున్నందున వారిని కొత్త విధానానికి మారేలా ప్రోత్సహించేందుకు మరిన్ని పన్ను మినహాయింపులకు చోటు దక్కవచ్చని అంచనా. 80సీ కింద మినహాయింపు మొత్తం రూ.1.5 లక్షలను 2014 నుంచీ పెంచలేదు. ఈపీఎఫ్, పీపీఎఫ్, ఇంటి రుణాలు, జీవిత బీమా, ఈక్విటీ ఆధారిత సేవింగ్ పథకాల వంటివన్నీ దీని పరిధిలోకే వస్తాయి. 80సీ తో పాటు స్టాండర్డ్ డిడక్షన్ పరిధిని కూడా పెంచాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో ఉంది. అది నెరవేరితే రియల్టీ పరిశ్రమకు కూడా మరింత ఊపు వస్తుంది.



రియల్టీ

డేటా సెంటర్లతో పాటు రియల్టీ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టు (ఆర్‌ఈఐటీ)లకు పలు తాయిలాలు ప్రకటించవచ్చని భావిస్తున్నారు. ఆర్థిక వృద్ధికి ఊతమివ్వడమే గాక ఉద్యోగావకాశాల సృష్టికి ఇదెంతో దోహదపడుతుందన్నది రియల్టీ పరిశ్రమ ముఖ్యుల అభిప్రాయం. రియల్టర్లకు నగదు అందుబాటును పెంచేందుకు ఆర్‌ఈఐటీలను ఈక్విటీ ఇన్‌స్ట్రుమెంట్లుగా పరిగణించే అవకాశం ఉందంటున్నారు. ఈ రంగానికి జీఎస్టీ చట్టం కింద ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను అనుమతించాలన్న ఆర్‌ఈఐటీ సంఘం డిమాండ్ ఏ మేరకు నెరవేరుతుందన్నదీ ఆసక్తికరమే.

ఈవీలపై ఏం చేస్తారో...

ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) జోరు నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిశ్రమకు మరింతగా ప్రోత్సాహకాలను అందించాలన్న డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈవీలకు పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల పథకం తెస్తే బాగుంటుందన్న అభిప్రాయముంది. అన్నిరకాల ఈవీ వాహనాల తయారీ పూర్తిగా భారత్‌లోనే జరిగేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాలని పరిశ్రమ వర్గాలు కోరుతున్నాయి. అలాగే ఆటో విడి భాగాలన్నింటిపై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో పాటు పలు రకాలైన మినహాయింపులను ఆశిస్తున్నాయి. ఈవీ రంగంలో స్టార్టప్‌లకు దన్నుగా నిలిచే దిశగా చర్యలు ఉండవచ్చంటున్నారు. తుక్కు విధానాన్ని కూడా మరింతగా సరళీకరిస్తారేమో చూడాల్సి ఉంది.

ఫార్మా

కరోనా అనంతర పరిస్థితుల నేపథ్యంలో మరింత కీలకంగా మారిన ఫార్మా రంగానికి పలు ప్రోత్సాహకాలు నిర్మల బడ్జెట్లో చోటుచేసుకునే అవకాశముంది. ముఖ్యంగా పరిశోధన, ఇన్నొవేషన్ కార్యక్రమాలను ప్రోత్సహించే చర్యలు ఉండవచ్చంటున్నారు. ఇప్పటికీ సంక్లిష్టంగానే ఉన్న పలురకాల అనుమతుల ప్రక్రియలను మరింత సరళతరం చేయవచ్చని చెబుతున్నారు. కీలకమైన ఔషధాల తయారీ తదితరాలకు ఆర్థిక ప్రోత్సాహకాలకు సంబంధించిన ప్రకటనపై కూడా ఫార్మా దిగ్గజాలు ఆశలు పెట్టుకున్నాయి.

'స్వదేశీ' రక్షణ!

అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు, చైనా దూకుడు తదితర నేపథ్యంలో రక్షణ రంగానికి కేటాయింపులను ఈసారి కూడా ఇతోధికంగా పెంచడం ఖాయంగా కన్పిస్తోంది. అదే సమయంలో రక్షణ సంబంధిత ఉత్పత్తి, మౌలిక సదుపాయాల పరిశ్రమల్లో 'ఆత్మ నిర్భరత'కు మరింత పెద్దపీట వేసేలా మరిన్ని చర్యలు ఉండనున్నాయి. ఇది ఆర్థిక రంగానికి మరింత ఊపునివ్వడమే గాక అపారమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని, అంతిమంగా ప్రజల జీవన నాణ్యతనూ పెంచుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరొచ్చు

1966 నాటి నిషేధాన్ని ఎత్తివేసిన కేంద్రం

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగులు హిందుత్వ సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)లో చేరడంపై 1966 నుంచి కొనసాగుతున్న నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ నెల 9వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు తాజాగా బయటకు వచ్చాయి. దీనిపై ప్రతిపక్షాలు మండిపడగా.. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ స్వాగతించాయి. గత ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసమే నిషేధం అమలు చేశాయని పేర్కొన్న ఆర్‌ఎస్‌ఎస్..నిషేధం ఎత్తివేతతో దేశంలో ప్రజాస్వామ్య విధానం మరింత బలోపేతమవుతుందని పేర్కొంది. కేంద్రం సరైన సమయంలో ఈ నిర్ణయం తీసుకుందని ప్రశంసించింది. బీజేపీ నేత, కేంద్ర మంత్రి పియూష్ గోయెల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనరాదంటూ రాజకీయాల కారణాలతోనే 1966లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధం విధించిందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ జాతీయవాద సంస్థ అనీ, దాని సభ్యులు దేశభక్తులని కితాబునిచ్చారు. ప్రతిపక్షాలవి బుజ్జగింపు రాజకీయాలని, హిందూ వ్యతిరేక వైఖరి అని ఆరోపించారు.

ఉద్యోగులను విభజించే కుట్ర

ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుకూలంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. ఉద్యోగులను సిద్ధాంత ప్రాతిపదికన విభజించేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఆర్‌ఎస్‌ఎస్ ద్వారా రాజ్యాంగ బద్ధ, స్వతంత్ర సంస్థలను ఆధీనంలోకి తెచ్చుకునేందుకు బీజేపీ చేస్తున్న కుట్రగా ఖర్గే అభివర్ణించారు. ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై నిక్కర్లతో కనిపిస్తారంటూ, ఆర్‌ఎస్‌ఎస్ యూనిఫాంను ఉద్దేశిస్తూ కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వాన్ని మంచి చేసుకునేందుకే మోదీ ప్రభుత్వం నిషేధం ఎత్తివేసిందని బీఎస్‌పీ అధినేత్రి మాయావతి విమర్శించారు.

బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేం: కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ: బిహార్‌కు ప్రత్యేక హోదా కుదరదని, ఆ అర్హత రాష్ట్రానికి లేదని కేంద్రం సోమవారం లోక్‌సభలో తెలిపింది. కొండ ప్రాంతాలు, కఠినతరమైన రవాణా సదుపాయాలు, అతితక్కువ జనసాంద్రత, జనాభాలో గిరిజనుల శాతం ఎక్కువగా ఉండటం, ఇతర దేశాలతో వ్యూహాత్మక సరిహద్దులను పంచుకోవడం, ఆర్థిక వెనుకబాటు, మౌలిక సదుపాయాల లేమి, ఆర్థిక నిర్భలత.. తదితర పరామితులను ప్రత్యేక హోదాకు ప్రామాణికంగా తీసుకుంటారని, ఇవేవీ బిహార్‌కు వర్తించవు కాబట్టి హోదా ఇవ్వడం సాధ్యం కాదని ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు తెలిపారు.

రెండిట్లో 'సరైన' సమాధానం ఏమిటి?

- ఇందుకోసం ముగ్గురు నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయండి
- మంగళవారం మధ్యాహ్నంకల్లా నివేదించండి
- నీట్ ప్రశ్నపై ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్యవిద్యలో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్-యూజీ, 2024 పరీక్షలో పేపర్ లీకేజీ ఉదంతంపై పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టులో సోమవారం ఒక ప్రశ్నపై తీవ్రమైన చర్చ జరిగింది. ఒక ప్రశ్నకు ఇచ్చిన ఆప్షన్లలో రెండు సరైన సమాధానాలు ఉన్నాయని, వీటిల్లో ఒకటి ఎంచుకున్న అభ్యర్థులకు మార్కులేసి రెండోది ఎంచుకున్న అభ్యర్థులకు మార్కులు వేయలేదని దీనిపై తేల్చాలని కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ కేసులను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం విచారించింది. రెండింటిలో సరైన సమాధానం ఏది? అనే దానిపై స్పష్టత వస్తే అభ్యర్థుల తుది జాబితా మెరిట్ లిస్ట్‌లో మార్పులు చేసుకునే అవకాశం ఉంది. ఈ అంశంపై తొలుత పిటిషన్ల తరఫు న్యాయవాది వాదించారు. "ఈ ప్రశ్నకు సమాధానం రాసేందుకు ప్రయత్నించిన అభ్యర్థుల్ని మూడురకాలుగా విడగొట్టాలి. ఎందుకంటే రెండు 'సరైన' సమాధానాల్లో ఒకదానికి ఎంచుకున్న వాళ్లకు నెగిటివ్ మార్కింగ్ కారణంగా ఐదు మార్కులు పోయాయి. రెండో సమాధానం ఎంచుకున్న వాళ్లకు నాలుగు మార్కులు పడ్డాయి. రెండింటిలో ఏది కరెక్టో తేల్చుకోలేక, నెగిటివ్ మార్కింగ్ వల్ల మార్కులు పోతాయన్న భయంతో సమాధానం రాయకుండా వదిలేసిన వాళ్లూ ఉన్నారు" అని న్యాయవాది వివరించారు. దీంతో ధర్మాసనం స్పందించింది. "ఫిజిక్స్ విభాగంలో అణువుకు సంబంధించిన ప్రశ్నలో నాలుగు ఆప్షన్లలో రెండు సరైన సమాధానాలు ఉన్నాయన్న వాదనల నడుమ అసలైన సమాధానాన్ని తేల్చాల్సిన సమయమొచ్చింది. అందుకోసం ముగ్గురు విషయ నిపుణులతో కూడిన బృందాన్ని ఏర్పాటుచేయండి. మంగళవారం మధ్యాహ్నం 12 గంటలలోపు మాకు సరైన సమాధానమేంటో నివేదించండి" అని ఢిల్లీ ఐఐటీ డైరెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. తమ ఆదేశాలు ఐఐటీ ఢిల్లీ డైరెక్టర్‌కు చేరేలా చూడాలని సుప్రీంకోర్టులో సెక్రటరీ జనరల్‌కు ధర్మాసనం సూచించింది. 'పరీక్ష నిర్వహణలో లోపాలు చూస్తుంటే ఇది వ్యవస్థాగత వైఫల్యమని తెలుస్తోంది. గుజరాత్‌లో ఒక విద్యార్థి 12వ తరగతిలో ఫెయిల్ అయ్యాడుగానీ నీట్ పరీక్షలో చాలా ఎక్కువ మార్కులు తెచ్చుకున్నాడు. కొన్ని కేంద్రాల్లో అడ్రస్ వెరిఫికేషన్ చేయలేదు. మరి కొన్నింటిలో సీసీటీవీ కెమెరాలే లేవు' అని లాయర్ నరేందర్ హూడా వాదించారు.

కొలిక్కి వస్తున్న నీట్-యూజీ వివాదం!

నీట్ యూజీ పరీక్షను రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని దాదాపు 40 పిటిషన్లు దాఖలైన విషయం తెల్సిందే. పరీక్ష రద్దు చేయాలంటూ, రద్దు చేయొద్దంటూ దాఖలు చేసిన వారి వాదనలు సుప్రీంకోర్టులో పూర్తయ్యాయి. ఇక కేంద్రం తరఫు వాదనలు మిగిలి ఉన్నాయి. మంగళవారం కేంద్రం వాదనలు పూర్తయితే త్వరగా తీర్పు వెలువరించే అవకాశాలున్నాయి.

ఆహార బోర్డులు ప్రదర్శిస్తే చాలు

దుకాణాల యజమానుల పేర్లు అక్కర్లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ/భోపాల్: ఉత్తరాదిన వివాదం రేపుతున్న కావడి యాత్ర వివాదానికి తెరదించే దిశగా సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. భక్తులు వెళ్లే మార్గాల్లో దుకాణాలు, హోటళ్ల ముందు యజమానులు, సిబ్బంది పేర్లతో బోర్డులు ప్రదర్శించాలన్న యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల ఆదేశాలపై స్టే విధిస్తూ సోమవారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. బదులుగా లభించేది శాకాహారమో, మాంసాహారమో తెలిపే బోర్డులు ప్రదర్శిస్తే సరిపోతుందని స్పష్టం చేసింది. శ్రావణమాసంలో గంగాజలాన్ని కావడిలో సేకరించి భక్తులు తిరిగి తమ సొంతూరిలోని శివాలయాల్లో జలాభిషేకం చేస్తారు. పుణ్యజలాలను తీసుకెళ్లే భక్తులకు శాకాహారం అందించే హోటళ్ల వివరాలు తెలియాలంటూ ఆయా రాష్ట్రాలు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. తాను కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా ముస్లింలు నడిపే శాకాహార భోజనంలోనే తినేవాడినని జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి ఈ సందర్భంగా చెప్పారు. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాల తరఫున ఎవరూ హాజరు కాకపోవడంతో విచారణను శుక్రవారానికి ధర్మాసనం వాయిదా వేసింది.

చేయని తప్పుకు 43 ఏళ్లు కారాగారంలోనే


- 63 ఏళ్ల వయసులో ఎట్టకేలకు విడుదలైన అమాయకురాలు
- అమెరికాలో ఘటన



వాషింగ్టన్: చేయని నేరానికి 43 ఏళ్లపాటు జైలుశిక్ష అనుభవించిన అమాయకురాలికి ఎట్టకేలకు విముక్తి లభించింది. అమెరికాలోని ఒహాయోకు చెందిన 63 ఏళ్ల సాండ్రా హెమ్మీ కథ ఇది. మిస్సోరీలో 1980లో ఓ లైబ్రరీ వర్కర్‌ను కత్తితో పొడిచి చంపిందని సాండ్రాను అరెస్ట్ చేశారు. లాయర్‌తో వాదించుకునే అవకాశం కూడా ఇవ్వలేదు. మానసిక చికిత్సకు అధిక మోతాదులో తీసుకున్న ఔషధాల మత్తులో ఆమె చెప్పిన నేరాంగీకార వాంగ్మూలాన్నే పోలీసులు కోర్టుకు సమర్పించారు. దాంతో ఆమెకు జీవితఖైదు విధించారు. కానీ అసలు హంతకుడు మైఖేల్ హోల్‌మ్యాన్ అనే పోలీసు అధికారి. ఈ విషయాన్ని సాండ్రా లాయర్లు ఆధారసహితంగా తాజాగా కోర్టులో నిరూపించారు. దాంతో ఆమె శుక్రవారం విడుదలయ్యారు. కూతురు, మనవరాలిని హత్తుకుని బోరున విలపించారు. అమెరికా చరిత్రలో చేయని నేరానికి అత్యంత ఎక్కువ కాలం శిక్ష అనుభవించిన మహిళగా సాండ్రా పేరు నిలిచిపోనుంది.

ధనికులైతే చాలు పరీక్ష విధానాన్నే కొనేయొచ్చు

నీట్ వివాదంపై లోక్‌సభలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ: ధనికులైతే చాలు పరీక్షా విధానాన్నే కొనేయొచ్చంటూ నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్ వేదికగా విపక్షనేత రాహుల్‌గాంధీ ప్రభుత్వం తీవ్ర విమర్శలుచేశారు. గత ఏడేళ్లలో ప్రశ్నాపత్రాలు లీక్ అయినట్లు ఆధారాలు లేవంటూ లోక్‌సభలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పడంతో ప్రశ్నోత్తరాల సందర్భంగా రాహుల్ మాట్లాడారు. "నీట్ పేపర్ లీకేజీ ఉదంతంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్వీయతప్పిదాన్ని ఒప్పుకోవట్లేదు. ప్రతి ఒక్కరిపై నిందలేస్తూ తప్పుబడుతున్నారు. అసలు ఇక్కడ ఏం జరుగుతుందనే కనీస అవగాహన కూడా ఆయనకు లేనట్లుంది. వరస లీకేజీలతో తమ భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడిందని కోట్లాది మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. భారత్‌లో పరీక్షల నిర్వహణ అనేది ఒక మోసపూరిత వ్యవహారమని అభ్యర్థులు ఒక నిర్ణయానికొచ్చారు. ధనికులైతే చాలు పరీక్షావిధానాన్నే కొనేయొచ్చు అనే పరిస్థితి నెలకొంది. ఈ తప్పు వ్యవస్థీకృతంగా జరుగుతోంది. ఈ పరిస్థితిని రూపుమాపేందుకు మీ వంతుగా ఎలాంటి కృషిచేస్తున్నారు?' అని మంత్రిని రాహుల్ నిలదీశారు. దీంతో మంత్రి ప్రధాన్ మాట్లాడారు. "మొత్తం పరీక్ష విధానమే నిష్ఫలం అన్నట్లుగా మాట్లాడటం దురదృష్టకరం. ఏడేళ్లలో 70 పేపర్లు లీక్ అయ్యాయని కాంగ్రెస్ సభ్యుడు మాణిక్యం ఠాకూర్ చెబుతున్నదంతా అబద్ధం. నిజానికి ఎన్‌టీఏను స్థాపించాక 240కిపైగా పరీక్షలను విజయవంతంగా నిర్వహించాం. ఐదు కోట్ల మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకున్నారు. 4.5 కోట్ల మంది వివిధ పరీక్షలు రాశారు" అని మంత్రి చెప్పారు. దీంతో ఠాకూర్ కలగజేసుకుని "పేపర్ లీకేజీల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా ఎలాంటి నిర్ణయాలు ఆచరణలో పెడుతున్నారో మంత్రి చెప్పాలి. లేదంటే రాజీనామా చేయాలి' అని అన్నారు. దీంతో మంత్రి స్పందించారు. "ఇక్కడ మాలో ఏ ఒక్కరో జవాబుదారీ కాదు. ఏం జరిగినా ప్రభుత్వం మొత్తం జవాబుదారీగా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. "పేపర్ లీకేజీల విషయంలో మోదీ సర్కార్ రికార్డ్ సృష్టించనుంది. ఒకే చోట రాసిన వారిలో ఎక్కువ మందికి అత్యధిక మార్కులు వచ్చిన పరీక్షకేంద్రాల జాబితాను విడుదలచేయాలి' అని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ డిమాండ్‌చేశారు. అనంతరం టీఎంసీ, డీఎంకే సహా విపక్ష సభ్యులంతా వాకౌట్ చేశారు.



'బ్రహ్మపుత్ర'లో భారీ అగ్ని ప్రమాదం

పూర్తిగా పక్కకు ఒరిగిపోయిన యుద్ధ నౌక

ముంబై/న్యూఢిల్లీ: ముంబై డాక్ యార్డులో మరమ్మతుల కోసం ఉన్న ఐఎన్ఎస్ బ్రహ్మపుత్ర నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనతో యుద్ధ నౌక పూర్తిగా ఒక పక్కకు ఒరిగిపోగా ఒక నావికుడు గల్లంతయ్యారని నేవీ ఒక ప్రకటనలో తెలిపింది. ముంబై డాక్‌యార్డులో రీఫిట్ పనులు జరుగుతున్న మల్టీరోల్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ బ్రహ్మపుత్రలో ఆదివారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుందని నేవీ తెలిపింది. సోమవారం ఉదయం కల్లా మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చామని వివరించింది. అయితే, మధ్యాహ్నం నుంచి యుద్ధ నౌక పక్కకు ఒరిగిపోవడం మొదలైందని, నిటారుగా సరైన స్థితిలో ఉంచేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని వివరించింది. ప్రస్తుతం బ్రహ్మపుత్ర పూర్తిగా పక్కకు ఒరిగి ఉందని తెలిపింది. ప్రమాదంపై విచారణ జరుగుతోందని, గల్లంతైన ఒక జూనియర్ నావికుడి కోసం గాలింపు చేపట్టామని తెలిపింది. దేశీయంగా మొదటిసారిగా రూపొందిన బ్రహ్మపుత్ర క్లాస్‌కు చెందిన గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ ఇది. 2000 ఏప్రిల్ నుంచి విధుల్లో ఉన్న ఈ షిప్‌పై 40 మంది అధికారులు, 330 మంది నావికులు విధుల్లో ఉంటారు.

జమ్మూలో నక్కిన 50 మంది ఉగ్రవాదులు



శ్రీనగర్: జమ్మూ ప్రాంతంలోని ఎత్తైన కొండ ప్రాంతాల్లో కనీసం 40 నుంచి 50 మంది పాకిస్తానీ ఉగ్రవాదులు నక్కి ఉంటారని ఆర్మీ వర్గాలు అనుమానిస్తున్నాయి. వీరి పనిపట్టేందుకు బలగాలు భారీ కూంబింగ్ చేపట్టాయని ఆర్మీ తెలిపింది. వీరు పాక్ నుంచి దొంగచాటుగా దేశంలోకి ప్రవేశించారని పేర్కొంది. వీరి వద్ద రాత్రి వేళ కూడా స్పష్టంగా చూడగలిగే పరికరాలను అమర్చిన అమెరికా తయారీ ఎం4 కార్బైన్ రైఫిళ్ల వంటి అత్యాధునిక మారణాయుధాలు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలను కూడా చొచ్చుకుపోయి ధ్వంసం చేయగలిగిన చైనా తయారీ స్టీల్ కోటెడ్ బుల్లెట్లు ఉన్నాయని తెలిపింది. వారిని వేటాడేందుకు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టామని వెల్లడించింది.

రోహిణి-560 రాకెట్ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): ఇస్రో శాస్త్రవేత్తలు సోమవారం శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుంచి రోహిణి-560 సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించారు. దేశీయంగా తాము అభివృద్ధి చేసిన ఎయిర్ బ్రీతింగ్ ప్రొపల్షన్ టెక్నాలజీని ప్రయోగించడమే ప్రయోగం లక్ష్యమని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ రెండు దశల ఉప కక్ష్య సౌండింగ్ రాకెట్‌కు రెండు వైపులా ప్రొపల్షన్ వ్యవస్థలు సాలిడ్ మోటార్లు ఉంటాయి. ఇప్పటి వరకు తాము ప్రయోగించిన అతి భారీ సౌండింగ్ రాకెట్ ఇదేనని అన్నారు. ప్రయోగం సందర్భంగా రాకెట్ పనితీరును పరిశీలించేందుకు పరిగణనలోకి తీసుకున్న 110 పరామితులను సాధించామన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం । 23 । జూలై । 2024


సోమవారం రాయచూరులో మహాత్మాగాంధీ కూడలిలో కూలిన ఓ స్వాగత తోరణం, ఇద్దరు గాయపడ్డారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ హంపనగౌడ బాదర్లి అభిమానులు ఆర్చ్ వేయగా, అది కూలిపోయింది

న్యూస్‌రీల్

వాల్మీకి స్కాంలో సీఎం దిగిపోవాలి

- విధానసభ నుంచి బీజేపీ వాకౌట్



శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్ల కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య రాజీనామా చేయాలని గత గురువారం నుండి అసెంబ్లీలో నిర్వహిస్తున్న ధర్నాను బీజేపీ, జేడీఎస్ ఎమ్మెల్యేలు సోమవారం ఉదయం స్పీకర్ ముందు బైఠాయించారు. ఈ సమయంలో స్పీకర్ యూటీ ఖాదర్ శుక్రవారం సభకు సకాలంలో వచ్చిన ఎమ్మెల్యేల పేర్లను చదివారు. ముఖ్యమంత్రి గురువారం సమాధానం ఇచ్చారని, ఇప్పుడు అతి ముఖ్యమైన అంశాలపై చర్చించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. బీజేపీ పక్ష నాయకుడు ఆర్.అశోక్ మాట్లాడుతూ, వాల్మీకి అభివృద్ధి మండలిలో రూ.187 కోట్లు అక్రమంగా బదిలీ అయ్యింది. ఆ సొమ్ము తిరిగి ఖజానాకు రావాలి. తప్పు చేసినవారికి శిక్ష పడాలి. ఈ విషయాన్ని తారాస్థాయికి తీసుకెళ్లాలని అసెంబ్లీ బయట పోరాటం చేశామని, ముఖ్యమంత్రి వాల్మీకి మండలి స్కామ్ తప్ప అన్ని విషయాలకు కూడా సమాధానమిచ్చారు. ముడా ఇళ్ల స్థలాల కేసులోనూ చర్యలు తీసుకోవాలి. వీటిపై వెంటనే చర్చ జరగాలి అని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రాజీనామా ఇచ్చేదాకా తమ పోరాటం జరుగుతుందని చెప్పి సభ నుంచి వాకౌట్ చేశారు. ఇందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

కొండచరియల్లో అన్వేషణ



బనశంకరి: అంకోలా- శిరూరు వద్ద 66వ జాతీయ రహదారిలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో కేరళకు చెందిన లారీ డ్రైవరు అర్జున్ ఆచూకీ కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి. కోజికోడ్ నుంచి 30 మంది కేరళ సహాయక సిబ్బంది వచ్చి గాలింపులో పాల్గొంటున్నారు. ఫైర్ సిబ్బంది, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా గాలింపు ముమ్మరం చేశారు. ఈ నెల 19వ తేదీ శుక్రవారం అర్జున్ మొబైల్‌ఫోన్ రింగ్ అయ్యిందని కుటుంబసభ్యులు తెలిపారు. అర్జున్ నడిపే ట్రక్ జీపీఎస్ సిగ్నల్ ఘటనాస్థలిలో ఉన్నట్లు చూపుతోంది. మరో ముగ్గురు ఆచూకీ కూడా లేదు.

చెట్టుపడి ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల మృతి



బనశంకరి: వెళుతున్న బైకుపై చెట్టు కూలిపోవడంతో ఇద్దరు హెస్కాం ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన హావేరి జిల్లా హిరేకరూరు పట్టణంలో చోటుచేసుకుంది. మృతులు హిరేకరూరు హెస్కాం ఉద్యోగులైన మంజునాథ (35), హనుమంతప్ప (25) గా గుర్తించారు. వీరిద్దరూ విద్యుత్‌శాఖ ఉద్యోగులు, సోమవారం మధ్యాహ్నం భోజనం చేసి హెస్కాం కార్యాలయానికి బైకులో బయలుదేరారు. దారిమధ్యలో చెట్టు యమపాశంలా వీరి మీద కూలింది, ఇద్దరు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించారు. ఇద్దరూ స్థానిక గ్రామాలకు చెందినవారు.

డబుల్‌డెక్కర్ ఫ్లై ఓవర్‌పై కమిషనర్ బైక్ షికారు


బైకులో ఫ్లై ఓవర్‌పై ప్రయాణిస్తున్న కమిషనర్ దయానంద్

బనశంకరి: బెంగళూరు నగరంలోని డబల్‌డెక్కర్ ఫ్లైఓవర్‌పై ఆదివారం బుల్లెట్ రైడ్ చేసిన నగర పోలీస్ కమిషనర్ దయానంద్ అత్యంత సులభతర ప్రయాణమని కొనియాడారు. దక్షిణ భారత దేశంలోనే మొదటిసారిగా డబల్‌డెక్కర్ ఫ్లై ఓవర్‌ను గత వారం ప్రారంభమైంది. ఆదివారం రాగిగుడ్డ నుంచి సిల్క్‌బోర్డు వరకు కమిషనర్ దయానంద్ ఎన్‌ఫీల్డ్ బైకును నడిపి తన అనుభవం సోషల్ మీడియాలో పంచుకున్నారు. గతవారం డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ రాగిగుడ్డ మెట్రో స్టేషన్ వద్ద డబల్‌డెక్కర్ ఫ్లై ఓవర్‌లో కారును డ్రైవింగ్ చేయడం ద్వారా వంతెనను ప్రారంభించారు. ప్రస్తుత కమిషనర్ దయానంద్ బుల్లెట్ బైక్‌లో ప్రయాణం చేసి ప్రయాణం సులభతరంగా ఉందని ఎక్స్ అకౌంట్‌లో తెలిపారు.

వన్యజీవుల ప్రాణాలు.. గాలిలో దీపాలు


బండీపుర అరణ్యంలో అడవి దున్నల సంచారం

మరణించిన వన్యజీవుల సంఖ్య		
ఏడాది	పులులు	ఏనుగులు
2020-2021	13	74
2021-22	19	89
2022-23	16	74
2023-24	12	101
2024	6	34

- మూడేళ్లలో 66 పులులు, 373 ఏనుగులు మృత్యువాత

మండ్య: కన్నడనాట దేశంలో ఎక్కడా లేనంత విశిష్టమైన అడవులు, వన్యప్రాణులకు నిలయంగా ఉంది. సుమారు 5 వందలకు పైగా పులులు, 6 వేలకు పైగా గజరాజులకు నివాసంగా ఉంది. అయితే విపత్తులు, రోగాలు, వేటగాళ్ల దాడుల వల్ల ఈ అరుదైన జీవులు కనుమరుగు అవుతున్నాయి. రాష్ట్రంలో 2020-21 ఏడాది నుంచి 2024 జూన్ చివరి నాటికి పలు కారణాలతో 66 పులులు, 373 ఏనుగులు మరణించాయి. పులుల్లో 48 సహజ మరణాలు, ఏడు అసహజ మరణాలు, మరో 11 పులుల చావుకు కారణాలు తెలియరాలేదు. అలాగే ఏనుగుల్లో 305 సహజ కారణాలతో, 67 అసహజ కారణాలతో మరణించాయి. ఈ గణాంకాలను అటవీ శాఖ మంత్రి ఈశ్వరఖండ్రే సోమవారం అసెంబ్లీలో తెలిపారు.

గణనీయంగా సంతతి

2021-22 కాలంలో చేపట్టిన పులుల గణన ప్రకారం రాష్ట్రంలో మొత్తం 563 పులులు ఉన్నాయి. ఈ సంఖ్య దేశంలోనే రెండో స్థానంలో ఉంది. అలాగే 2023లో జరిగిన ఏనుగుల గణన ప్రకారం రాష్ట్రంలో మొత్తం 6,395 గజరాజులు ఉన్నాయి. దేశంలోనే అత్యధిక ఏనుగులతో కర్ణాటక అగ్రస్థానంలో ఉంది.


మైసూరు సమీపంలో అడవుల్లో అస్వస్థతకు గురైన పెద్ద పులి (ఫైల్)


కొడగు జిల్లాలో కాఫీ తోటలో చనిపోయిన ఏనుగు (ఫైల్)

వన్యజీవుల చిహ్నాలు అప్పగింత

రాష్ట్రంలో మొత్తం 192 మంది తమ వద్దనున్న పులి గోర్లు, ఏనుగు దంతాలు, జింక, పులి, చిరుత చర్మాలు కలిసి 703 వన్యజీవుల చిహ్నాలను అటవీశాఖ ఆఫీసుల్లో అప్పగించారని మంత్రి తెలిపారు. విధాన పరిషత్‌లో కాంగ్రెస్‌పార్టీ సభ్యుడు మధు జి.మాదేగౌడ అడిగిన ప్రశ్నకు మంత్రి ఈశ్వర ఖండ్రే బదులిచ్చారు. ఏప్రిల్ 9 వరకు మొత్తం 192 మంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నట్లు తెలిపారు. అలాగే గడువు ముగిసినా ప్రభుత్వానికి వన్యజీవుల అవయవాలు తిరిగి సమర్పించని 14 మంది పై కేసులు నమోదు చేశారు.

కేఆర్‌ఎస్‌లో వినోద ఉద్యానవనం

- గంగాహారతి తరహాలో కావేరి హారతి
- డీసీఎం డీకే శివకుమార్

మండ్య: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కృష్ణరాజ సాగర (కేఆర్‌ఎస్) బృందావనానికి కొత్త రూపు ఇచ్చే దిశలో నీటిపారుదల శాఖ కృషి చేస్తోందని, కేబినెట్ అనుమతి పొందిన అనంతరం ప్రైవేట్ భాగస్వామ్యంతో కావేరి బృందావన అమ్యూజ్‌మెంట్ పార్క్‌ను నిర్మిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఆయన సోమవారం రైతుల జీవనాడి అయిన కేఆర్ ఎస్ జలాశయాన్ని అధికారులతో కలిసి సందర్శించి విలేకరులతో మాట్లాడారు. కావేరి మన బ్రాండ్ నేమ్, దానిని కాపాడుకుంటూ వినోద ఉద్యానవన నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి పరోక్షంగా సుమారు 10 వేల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కన్నంబాడి ఆనకట్టు, కావేరి బృందావనం రాజధాని బెంగళూరుకు సుమారు 150 కిమీల దూరంలో ఉన్నందున కేవలం గంటన్నర ప్రయాణంతో చేరుకోవచ్చన్నారు. కేఆర్‌ఎస్, రంగనతిట్టు, మైసూరుతో పాటు పొరుగున ఉన్న ఊటీతో సహా పలు పర్యాటక స్థలాలను కలిపే కేంద్ర బిందువుగా కేఆర్‌ఎస్ రూపొందుతుందన్నారు.

గంగాహారతి తరహాలో కావేరి హారతి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వారణాసిలో జరిగే గంగాహారతి తరహాలో కావేరి హారతి నిర్వహించడం ద్వారా కావేరి మాతకు గౌరవం సమర్పించాలని ప్రభుత్వం యోచిస్తోందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. మండ్య, మైసూరు, కొడగు ప్రజాప్రతినిధులు, అధికారుల బృందాన్ని వారణాసికి పంపుతామన్నారు. వారు నెల రోజుల్లోగా నివేదిక అందించిన అనంతరం ఎలా, ఎక్కడ కావేరి హారతి నిర్వహించాలో నిర్ణయిస్తామన్నారు. వరుణుడి కృపతో కావేరీ బేసిన్‌లోని జలాశయాలు ఇప్పటికే భర్తీ అయ్యాయన్నారు. వరుణుడి కృపతో ఇప్పటికే 30 టీఎంసీల నీరు పారిందని, ఇంకా 10 టీఎంసీలను ఇస్తే తమిళనాడు కోటా పూర్తవుతుందన్నారు.

జీపీ అధ్యక్షుని అక్రమ ఆస్తులు


నాగేశ్ ఇంటిలో సీజ్ చేసిన బంగారు, డబ్బు, సొత్తు


నాగేశ్ విలాసవంత నివాసం

శివమొగ్గ: భద్రావతి తాలూకా అంతరగంగ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు బి.నాగేశ్ ఇంటిపై, అతనికి సంబంధించి స్థలాల్లో లోకాయుక్త అధికారులు దాడులు నిర్వహించారు. సుమారు రూ. 1.33 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులను సంపాదించాడని ఫిర్యాదులు రావడంతో ఈ నెల 19 నుంచి నాగేశ్‌కు చెందిన ఐదు స్థలాల్లో ఏకకాలంలో అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సోదాల్లో రెండు ఖాళీ స్థలాలు, రెండు నివాస భవనాలు, రూ. 5 లక్షల నగదు, రూ. 12.80 లక్షల విలువ చేసే 5.14 ఎకరాల పొలం, బంగారు, వెండి, కార్లు, బైక్‌లు, విలువైన ఇంటి సామగ్రిని గుర్తించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అంగన్‌వాడి కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు

- ప్రారంభించిన మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

శివాజీనగర: దేశంలోనే ప్రప్రథమంగా రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సమగ్ర శిశు పథకం కింద ప్రభుత్వ మాంటిస్సోరి (ఎల్‌కేజీ, యూకేజీ) తరగతులను మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ సోమవారం ప్రారంభించారు. బెంగళూరులోని గోవిందరాజనగర పరిధిలోని పట్టేగార పాళ్యలో ఉన్న అంగన్‌వాడి కేంద్రంలో తూర్పు ప్రాథమిక తరగతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల ఉన్నతీకరణ తొలి భాగంగా బెంగళూరు నగర జిల్లాలో సోమవారం తూర్పు ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించి, ముందు తమ చిన్నారులు అంగనవాడి కేంద్రాల్లోనే కన్నడ, ఇంగ్లిష భాషల్లో విద్యను నేర్చుకొంటారు. నేడు తొలి దశలో బెంగళూరు నగర జిల్లాలో 250, రాష్ట్ర వ్యాప్తంగా 500 అంగన్‌వాడి కేంద్రాల్లో తూర్పు ప్రాథమిక పాఠశాలలు ఆరంభంకానున్నాయి. ఈ సమయంలో విజయనగర నియోజకవర్గ ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, ఎమ్మెల్సీ చన్నరాజ్ హట్టిహోళి, మహిళా శిశు అభివృద్ధి శాఖ కార్యదర్శి డాక్టర్ జీ.సీ.ప్రకాశ్, శాఖ డైరెక్టర్ ఎన్.సిద్దేశ్వర్, దివ్యాంగుల శాఖ కమిషనర్ దాస్ సూర్యవంశీ, పాల్గొన్నారు.

పలు బిల్లులపై చర్చ

బనశంకరి: నీరావరి ప్రాంతాల్లోని కాలువల్లో అక్రమంగా బోర్లు వేయడాన్ని అడ్డుకునేలా కర్ణాటక నీరావరి బిల్లు- 2024ని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోమవారం విధానసభలో ప్రవేశపెట్టారు. నీరావరి చట్టం - 1965లో కొన్ని మార్పులు చేశారు. భూ స్వాధీన నిబంధన-1894 బదులుగా భూ ఆర్జన పునర్ వ్యవస్థీకరణ నిబంధనని రూపొందించారు. అలాగే కర్ణాటక మున్సిపాలిటీ చట్టాలను సవరించి నగర స్థానిక ప్రాదికార పరిధిలో అన్ని ఆస్తులను, వాటి ఆర్థిక, మానవ వనరులను పర్యవేక్షించే కర్ణాటక మున్సిపాలిటి - 2024, ఇతర న్యాయచట్టాల బిల్లును నగరాబివృద్ధి శాఖ మంత్రి బైరతి సురేశ్ ప్రవేశపెట్టారు.

జనం చూస్తుండగానే హత్య

యశవంతపుర: యువకున్ని దారుణంగా హత్య చేసిన ఘటన బెళగావి జిల్లా మూడలగి తాలూకా లక్ష్మేశ్వర వద్ద జరిగింది. సోమవారం ఉదయం 10:30 గంటల సమయంలో స్థానికుడు మౌలాసాబ్ యాసిన్ మోమిన్ (28) బైక్‌పై వెళ్తుండగా ఒక గుంపు అడ్డుకుంది. మచ్చు కొడవళ్లతో మోమిన్‌ను నరికి చంపి పరారయ్యారు. జనం చూస్తుండగానే హత్యాకాండ చోటుచేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కులగోడ పోలీసులు ఘటన స్థలంను పరిశీలించారు.

ఎస్పీ ఏమన్నారు

హత్యకు కారకుడైన అమోఘ దవలేశ్వరను పోలీసులు అరెస్టు చేశారు. అమోఘ భార్య శిల్పాను యాసిన్ మోమిన్ బైక్‌లో తీసుకెళ్తుండగా దవలేశ్వర చూశాడు. దీంతో అనుచరులతో కలిసి దాడి చేశాడు, గాయపడిన యాసిన్ అక్కడిక్కడే మృతి చెందగా, గాయాలైన శిల్పా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు బెళగావి ఎస్పీ భీమాశంకర్ గులేద్ తెలిపారు.

పంచె ఫక్కీరప్పకు సన్మానం

శివాజీనగర: ఈ నెల 17న బెంగళూరు మాగడి రోడ్డులో ఉన్న జీటీ మాల్‌కు ఫక్కీరప్ప అనే రైతు పంచెతో వెళ్లగా సిబ్బంది ప్రవేశాన్ని నిరాకరించడం, దీనిపై కన్నడ సంఘాలు ధర్నా చేయడం తెలిసిందే. ప్రభుత్వం ఆగ్రహించి మాల్‌ను వారంరోజులు బంద్ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం విధానసౌధలో ఫకీరప్ప కుటుంబాన్ని స్పీకర్ యూ.టీ.ఖాదర్ సన్మానించారు.

పంచె మన సంస్కృతి: డీసీఎం

డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విధానసభలో మాట్లాడుతూ మాల్‌తో పాటు ఎక్కడికి వెళ్లినా వస్త్ర ధారణపై నిషేధం లేకుండా మార్గదర్శకాలను విడుదల చేస్తామని, పంచె తమ సంస్కృతి అని తెలిపారు. జీటీ మాల్ పన్ను బకాయిలు ఉన్నందున సీజ్ చేయించినట్లు తెలిపారు. కొన్ని క్లబ్‌లు, ప్రదేశాలలో వస్త్రధారణపై నియమాలు ఉన్నాయని జేడీఎస్ ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు.

పీయూసీ విద్యార్థిని కిడ్నాప్

యశవంతపుర: బెంగళూరులో జాలహళ్లి క్రాస్ వద్ద బస్సు కోసం ఎదురుచూస్తున్న ద్వితీయ పీయూసీ విద్యార్థిని (17)ని నలుగురు యువకులు అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జూన్ 6న జాలహళ్లి క్రాస్‌లో తుమకూరుకు వెళ్లడానికి అమ్మాయి బస్సు కోసం వేచి ఉంది. అక్కడకు వచ్చిన నలుగురు యువకులు ఆమె ముఖం మీద ఏదో పొడిని చల్లగానే అచేతనమైంది. ఆమెకు మాస్క్ వేసి కారులో ఎక్కించుకొని మైసూరులో వెళుతుండగా స్పృహలోకి వచ్చింది, కారులోంచి దిగి దుండగుల నుంచి తప్పించుకుంది. మైసూరులో లష్కర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఇద్దరు యువతులతో పాటు మరో నలుగురు యువకులు కారులో ఉన్నట్లు తెలిపింది. ఘటన జరిగిన స్థలం పీణ్య పీఎస్ పరిధిలోకి వస్తుంది కాబట్టి పీణ్య పోలీసులు కేసు నమోదు చేశారు.

కబ్జాకోరు జాన్ మోషన్‌పై కోకా చట్టం

బనశంకరి: సిలికాన్ సిటీలో పేరుమోసి భూకబ్జాదారుడు జాన్ మోషన్ ను సీఐడీ పోలీసులు అరెస్టు చేసి కోకా చట్టం కింద కేసు నమోదుచేశారు. నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో నకిలీ రికార్డులు సృష్టించి, కోర్టుల్లో కేసులు వేసి అమాయకుల ఆస్తులను కబ్జాచేయడంలో జాన్ మోషన్ సిద్ధహస్తుడు. ఇతనిపై హలసూరుగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. సీఐడీ విచారణ చేపట్టగా మరిన్ని నేరాలు బయటపడ్డాయి. ఇతనిపై, అనుచరులపై 100 కి పైగా కేసులు నమోదు అయ్యాయి. 51 కేసుల్లో ఆయా ఠాణాల పోలీసులు దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ వేశారు. తరచూ నేరాలకు పాల్పడుతూ ఉండడంతో కర్ణాటక వ్యవస్థీకృత నేరాల నిరోధక చట్టం (కోకా) కింద అరెస్టు చేశారు. దీని వల్ల బెయిలు దొరకదు.

నాగేంద్రకు ముగిసిన ఈడీ కస్టడీ

బనశంకరి: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి నిధుల కుంభకోణంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బీ.నాగేంద్రకు ఆగస్టు 3వ తేదీ వరకు కోర్టు జుడిషియల్ కస్టడీ విధించింది. నాగేంద్రకు ఈడీ కస్టడీ పూర్తికావడంతో సోమవారం 82వ ప్రజాప్రతినిధుల కోర్టులో హాజరుపరిచారు. తనకు గుండె సంబంధ జబ్బు ఉన్నందున చికిత్స అందించేలా జైలు అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని నాగేంద్ర విన్నవించారు. జడ్జి అంగీకరించి, ఆగస్టు 3వ తేదీ వరకు జుడిషియల్ కస్టడీకి ఆదేశించారు. ఆయనను పరప్పన అగ్రహార జైలుకు తరలించారు. ఈ కేసులో ప్రముఖ నిందితునిగా ఉన్న సత్యనారాయణ వర్మను కస్టడీకి తీసుకోవడానికి ఈడీ అర్జీ వేసింది.

అల్లుని కోసం మంత్రి ఆరాటం

శివాజీనగర: సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వం మరో వివాదానికి గురవుతోంది. సీనియర్ మంత్రి కే.హెచ్. మునియప్ప అల్లుడు కేసీ శశిధర్ కోసం నియామాలకు విరుద్ధంగా కార్యదర్శి-2 ఉద్యోగాన్ని సృష్టించేందుకు సర్కారు సిద్ధమైనట్లు సమాచారం. శశిధర్ ప్రస్తుతం విధానసభ సచివాలయంలో గణక విభాగపు డైరెక్టర్‌గా ఉన్నారు. ఆయనకు 2వ శ్రేణి కార్యదర్శిగా పదోన్నతి కల్పించాలని ఒత్తిళ్లు వస్తున్నాయి. ఇందుకు మామ మునియప్ప, భార్య, ఎమ్మెల్యే రూపా ద్వారా సిఫార్సులు వెళ్లాయని సమాచారం.

1 నుంచి వేతనాల పెంపు

సాక్షి బెంగళూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల వేతనాలను పెంచుతూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ నెల 15న జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. సోమవారం గవర్నర్ అనుమతి రావడంతో వేతనాల పెంపు చేస్తూ ప్రభుత్వ ఆర్థిక ముఖ్య కార్యదర్శి ఎల్.అతీక్ జీవో జారీ చేశారు. పెరిగిన ఈ జీతాలు ఆగస్టు 1వ తేదీ నుంచి వర్తిస్తాయని జీవోలో పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్ కరుణ చూపేనా?

- నేడే కేంద్ర బడ్జెట్ సమర్పణ
- నిర్మలా సీతారామన్‌పై రాష్ట్రం ఆశలు


కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



రాష్ట్ర పారిశ్రామిక, ఐటీ, సేవల రంగానికి చేయూత కోసం చూపు

సాక్షి, బెంగళూరు: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేడు మంగళవారం అందరూ ఎదురు చూస్తున్న కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రకటించబోతున్నారు. కేంద్ర బడ్జెట్‌పై కర్ణాటక గంపెడు ఆశలు పెట్టుకుంది. అనేక పెండింగ్ ప్రాజెక్టులు, కార్యక్రమాలు, పలు పథకాలకు నిధులను ఆశిస్తోంది. కన్నడనాడు నుంచి రాజ్యసభ ఎంపీగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటివరకు ఆశించిన మేర నిధులు విడుదల చేయలేదనే విమర్శలు ఉన్నాయి. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీకి మంచి ఫలితాలు రావడంతో కరుణ చూపుతారని ఆశ ఏర్పడింది.

నిధుల్లో అధిక వాటాకు డిమాండ్

వివిధ పన్నుల రూపంలో కేంద్రానికి కర్ణాటక నుంచి ఏటా సుమారు రూ. 4.5 లక్షల కోట్లు వెళుతున్నాయి. అయితే ఇందులో రూ. 52 వేల కోట్లు మాత్రమే కేటాయింపులు, నిధుల రూపంలో తిరిగి వస్తున్నాయని అనేకసార్లు సీఎం సిద్దరామయ్య అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ మొత్తాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. సెస్, సర్‌చార్జ్‌లు 428 శాతం పెరిగితే అందులో రాష్ట్రాలకు వాటా లేదని వాపోయారు. తమ పన్నులు, తమకే చెందాలని పదేపదే డిమాండ్ వినిపిస్తున్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమల స్థాపన, మౌలికవసతుల కల్పన, రైతులకు చేయూత వంటి అనేక కార్యక్రమాలు, పథకాలకు కేటాయింపులు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని కోరుతున్నారు. అనేక కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల్లో రాష్ట్రం చెల్లించే నిధుల వాటాను తగ్గించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక నుంచి హెచ్‌డీ కుమారస్వామి, ప్రహ్లాద్‌జోషి, శోభ కరంద్లాజే, వి.సోమణ్ణ తదితరులు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. బడ్జెట్లో నిధుల కేటాయింపునకు సాయం చేస్తారనే ఆశాభావం నెలకొంది.

కర్ణాటక డిమాండ్లలో కొన్ని..

- భద్రా ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రకటించిన రూ. 5,300 కోట్లు విడుదల చేయాలి..
- ఫెరిపెరల్ రింగ్‌రోడ్డు, బెంగళూరు చెరువుల పునరుద్ధరణ కోసం ప్రకటించిన రూ. 6 వేల కోట్లు ఇవ్వాలి
- ఉపాధి హామీ నిధులను పెంచాలి, అలాగే కూలీ దినాలను పెంచాలి
- రాయచూరులో ఎయిమ్స్‌ను స్థాపించాలి. మైసూరు లేదా హాసన్‌లో ఐఐటీ స్థాపించాలి.
- బీదర్ విమానాశ్రయానికి ఉడాన్ పథకం నుంచి ఆర్థిక సాయం అందాలి.
- బెంగళూరు తాగునీటి సరఫరా కోసం మేకెదాటు ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు, అలాగే నిధుల కేటాయింపులు చేయాలి.
- మహదాయి జలవనరుల ప్రాజెక్టుకు ఆర్థిక సాయం అందజేయాలి
- బెంగళూరులో 60 కి.మీ. సొరంగ నిర్మాణానికి రూ. 3 వేల కోట్ల నిధులు విడుదల చేయాలి
- బెంగళూరు మెట్రో విస్తరణలో భాగంగా 44.65 కి.మీ. దూరం నిర్మాణం కోసం రూ. 15,611 కోట్లు విడుదల చేయాలి.
- చిన్న మధ్యస్థాయి పరిశ్రమలకు, ఐటీ సెక్టార్‌కు ప్రోత్సాహకాలు
- రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులకు సత్వర అనుమతులు, నిధులు కేటాయింపులు.

క్లుప్తంగా

ఈ సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెట్టాలి



రోడ్డుపై పడుకుని ఆందోళన చేస్తున్న దృశ్యం

మండ్య: కన్నడిగులకు ఉద్యోగ రిజర్వేషన్ బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని కన్నడసేన కార్యకర్తలు నగరంలో ఆందోళన చేశారు. నగరంలోని జేసీ సర్కిల్‌లో గుమిగూడిన కార్యకర్తలు కొంత సమయం రోడ్డుపైనే బైఠాయించి ట్రాఫిక్‌కు అంతరాయాన్ని కల్పించారు. అనంతరం బెంగళూరు–మైసూరు రహదారి మీదుగా జిల్లాధికారి కార్యాలయం వెళ్లి తమ వినతిపత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు కంపెనీల్లో సీ, డీ ఉద్యోగాల్లో కన్నడిగులకు రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మత మార్పిడికి యత్నంపై కేసు నమోదు

సిరుగుప్ప: ఇద్దరు యాత్రికులు సిరుగుప్ప మీదుగా మంత్రాలయానికి వెళుతుండగా తెక్కలకోట పట్టణానికి చెందిన హుసేన్ బాషా, సాయిబాబా అనే ఇద్దరు యాత్రికులను మత మార్పిడికి ప్రయత్నించిన ఘటన తెక్కలకోట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 18న జరిగింది. యాత్రికులు కేసరి ధ్వజాన్ని పట్టుకొని పాదయాత్ర చేస్తుండగా ముస్లిం మతాన్ని బోధించడం సరికాదని గాదిలింగప్ప అనే వ్యక్తి వీడియో ద్వారా తెక్కలకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇతర మతాల వ్యక్తులు తమ గురువుల గురించి బోధించడాన్ని, మొబైల్‌లో ఫోటోలు తీసుకొన్న గాదిలింగప్ప వారి మాటలు నమ్మవద్దని యాత్రికులకు నచ్చచెప్పారు. మతమార్పిడికి ప్రయత్నించిన ఆ వీడియో ఆధారంగా హుసేన్ బాషాను పోలీసులు బంధించగా ఇంకొక వ్యక్తి సాయిబాబా పరారయ్యాడు.

ఇనుప కడ్డీల చోరీ.. ముగ్గురు అరెస్ట్

హుబ్లీ: తారిహాళ గ్రామ పరిధిలో నాలుగు ఇండస్ట్రియల్ గ్యారేజీల నుంచి ఇనుప సామగ్రిని చోరీ చేసిన కేసులో హుబ్లీ గ్రామీణ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.4.39 లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అంతకు ముందు రూ.1.39 లక్షల విలువ చేసే ఇనుప సామగ్రిని చోరీ చేసిన ఘటనపై కేసు నమోదైంది. కేసు దర్యాప్తు చేపట్టిన హుబ్లీ గ్రామీణ స్టేషన్ సీఐ ఎంఆర్ చెన్నన్నవర నేతృత్వంలో దాడి చేసి నిందితులు కరియప్ప తళవాళ, సునీల్ కట్టిమని, సంగమేష్ బబళేశ్వరను అరెస్ట్ చేశారు.

గీజర్ నుండి విష వాయువు లీక్

- తల్లి, కుమారుడు మృతి



మృతి చెందిన తల్లి కుమారుడు

దొడ్డబళ్లాపురం: గీజర్ నుండి విష వాయువు లీక్ కావడంతో దాన్ని పీల్చి తల్లి, కుమారుడు మృతి చెందిన దాదారుణ సంఘటన బెంగళూరు మాగడి రోడ్డులో చోటుచేసుకుంది. శోభ (40), గిరీష్ (16) మృతి చెందిన తల్లి, కుమారుడు. గీజర్ ఆన్ చేసి ఆఫ్ చేయడం మర్చిపోవడం, ఇంట్లో తలుపులు, కిటికీలు మూసి ఉండడం వల్ల విష వాయువు లీక్ అయ్యి తల్లి, కుమారుడు మృతి చెందినట్టు ప్రాథమిక సమాచారం. మాగడి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

జడివాన.. ఉల్లి రైతుల హైరానా

- కోతకు ఇబ్బందులు
- భారీగా తగ్గిన ధరలు
- ఆదుకోవాలని రైతుల విజ్ఞప్తి



ఉల్లిగడ్డలను ఆరబెడుతున్న దృశ్యం



మిశ్రమ వ్యవసాయంలో ఉల్లి సాగు

కెజీఎఫ్ : నిత్యం కురుస్తున్న జడివానకు ఉల్లి పంట కోతకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ముంగారులో తాలూకా వ్యాప్తంగా 1200 హెక్టార్లలో మిశ్రమ కూరగాయలతో పాటు ఉల్లిని కూడా రైతులు సాగు చేశారు. ఉల్లి పంట ఇప్పటికే కోత దశకు చేరుకుంది. అయితే గత వారం రోజులుగా కురుస్తున్న తుంపర వానకు పంటకోత కష్టమవుతోంది. రెండు నెలల క్రితం క్వింటాల్ ఉల్లి రూ. 6 వేలు ఇచ్చి రైతులు విత్తారు. ప్రస్తుతం పంట చేతికి అందే సమయంలో వానల వల్ల పంట కోత చేయలేక ఇబ్బంది పడుతున్నారు. పంట కోతకు వచ్చిన సమయంలో కోత చేయకపోతే భూమిలోనే ఉల్లి వేర్లూనుతుంది. అలాగని కోత చేస్తే ఉల్లి విక్రయం కష్టమవుతుంది. ఇలా రైతులు ఏటూ చేయలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. పంటకోత చేస్తే ఎండలేక ఉల్లి కుళ్లి పోయే అవకాశం ఉంది. ఈ పంట నష్టాన్ని ప్రకృతి వైపరీత్యాల కింద పరిగణించి ఉల్లి రైతులకు పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని ఉల్లి రైతులు కోరుతున్నారు. ఇప్పటికే లక్షలు ఖర్చు చేసి అప్పులు చేసి పండించిన పంట చేతికి అందని స్థితిలో ఉండి ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి ముందుకు రావాలని కోరుతున్నారు. అంతేకాకుండా ఉల్లిధరలు ఉన్నఫళంగా తగ్గిపోవడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. కెజీఎఫ్ తాలూకాలో ఉల్లిని క్యాసంబళ్లి ఫిర్కాలోని కెంపాపుర, యర్రనాగనహళ్లి, గొల్లహళ్లి, కళ్లికుప్ప, తదితర ప్రాంతాలలో పండిస్తున్నారు. గత నెల కేరళ వ్యాపారులు క్వింటల్ ఉల్లిని రూ. 5 నుంచి 6 వేలకు కొనుగోలు చేశారు. అయితే ప్రస్తుతం క్వింటాల్ 1500 నుంచి 1800ల వరకు ధర పలుకుతుండడం పట్ల రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఉల్లి పంటను పండించడానికి ఎకరాకు రైతుకు రూ. 35 నుంచి 40 వేల వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుత ధరల వల్ల తమకు ఖర్చుల కూడా అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోత తరువాత ఉల్లిని ఎక్కువ రోజులు నిల్వ చేయడానికి వీలులేదు. మార్కెట్‌కు ఒకేసారి పెద్ద మొత్తంలో ఉల్లి రావడం వల్ల ధరలు గణనీయంగా తగ్గాయి. దీని వల్ల తమకు తీవ్ర నష్టం కలుగుతోందని రైతు రమేష్ అంటున్నారు. కెజీఎఫ్ తాలూకాలో చిన్న సైజు ఉల్లిని తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువగా రవాణా అవుతోంది. కేరళకు కూడా ఉల్లిని ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో ఉల్లిని రైతులు పండించడం వల్ల ధరలు తగ్గాయని సగటు వ్యాపారులు అంటున్నారు.

గోడ కూలి నలుగురికి గాయాలు

మైసూరు: నగరం నడిబొడ్డులో ఉన్న ఒలంపియా థియేటర్ వెనుక భాగం గోడ కూలడంతో దాని వెనుక ప్రాంతంలో దుస్తుల వ్యాపారం చేసే నలుగురు గాయపడ్డారు. వ్యాపారులు సతీశ్, తబ్రేజ్, హర్మాన్, షాకీబ్ క్షతగాత్రులు. వీరిని మైసూరు కేఆర్ ఆస్పత్రికి తరలించారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఒలంపియా థియేటర్ కట్టడం మట్టితో నిర్మించినది కావడంతో పాటు శిథిలావస్థలో ఉంది. సినిమా ప్రదర్శన కూడా నిలిపేశారు. దుస్తుల వ్యాపారానికి దుకాణాలు ఇచ్చేందుకు పనులు జరుగుతున్నాయి. ఈ సమయంలో గోడ కూలిపోయింది. అక్కడికి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చేరుకుని జేసీబీల సాయంతో గోడ పెళ్లలను, మట్టిని తొలగించి కింద ఉన్నవారిని రక్షించారు.

మహిళకు రూ. లక్షల టోపీ

ఆన్‌లైన్ మోసాల గురించి తరచూ వార్తలు వస్తున్నా ప్రజల్లో చైతన్యం రావడం లేదు. ఈ విధంగా ఓ యువతి రూ. లక్షల్లో మోసపోయింది. మైసూరు నగరంలోని బోగాదికి చెందిన బాధితురాలి మొబైల్‌కు పార్ట్‌టైం ఉద్యోగం అంటూ మెసేజ్ వచ్చింది. హోటళ్లకు గూగుల్ రివ్యూ ఇస్తే ఇంట్లో నుంచే డబ్బు సంపాదించవచ్చని ఆఫర్ ఇచ్చి, అనంతరం ట్రేడింగ్‌లో అధిక లాభాల ఆశ చూపిన దుండగులు డబ్బులు పెట్టుబడి పెట్టాలని సలహా ఇచ్చారు. వారి మాటను నమ్మిన ఆమె తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.20 లక్షలను, తన తల్లి ఖాతా నుంచి కూడా రూ.9.30 లక్షలను పెట్టుబడి పెట్టిన తర్వాత ఆమెను వంచించారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న 11 మంది అరెస్ట్

హుబ్లీ: గంజాయి విక్రయిస్తున్న 11 మందిని అరెస్ట్ చేసిన ధార్వాడ విద్యాగిరి పోలీసులు వారి నుంచి రూ.1.50 లక్షల విలువ చేసే 398 కేజీల గంజాయిని, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హుబ్లీ- ధార్వాడ మాదక వస్తు నిరోధక విభాగం ప్రత్యేక కార్యాచరణలో భాగంగా జరిపిన ఈ దాడిలో మహమ్మద్, దాదాపీర్, పరమేశ్వర, బాబాజాన్, అబుజర్, బాబాహుస్సేన్ రజాహుస్సేన్, పంచు, జీవన్ సాబ్, సల్మాన్, అసీఫ్ మహమ్మద్ గౌస్ అరెస్ట్ అయ్యారు. విద్యాగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అలాగే గంజాయి సేవిస్తున్న ముగ్గురిని విద్యాగిరి పోలీసులు అదుపులోకి తీసుకొని సంబంధిత చట్టం మేరకు కేసు దాఖలు చేసుకున్నారు. సదరు స్టేషన్ పరిధిలోని ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని శ్మశానంలో అహిం, సైఫలీ, సంకేత్ అనే ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆ స్టేషన్ ఎస్ఐ శ్రీమంత హుణసికట్టి నేతృత్వంలోని బృందం దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసింది. కిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయగా గంజాయి సేవించినట్లుగా ధృవపడింది. కేసు దాఖలు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

మలెనాడులో తగ్గిన వానలు

- జలాశయాలకు వరద తగ్గుముఖం
- నిండుగా తుంగా

శివమొగ్గ: మలెనాడు ప్రాంతంలో గత రెండు వారాలుగా కురుస్తున్న తొలకరి వర్షాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో పొంగిప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువు కట్టలు, నదులు క్రమంగా సహజస్థితికి చేరుకుంటున్నాయి. భారీ వర్షాలతో జిల్లాలోని లింగనమక్కి, భద్రా డ్యాంలు మినహా ఇతర జలాశయాలు, చెరువుల్లో నీటిమట్టాలు గరిష్టస్థాయికి చేరాయి. వరద జలాలను దిగువకు వదులుతున్నారు. సొరబ, సాగర తాలూకాల్లో వరదా నది సృష్టించిన వరద ఉధృతితో వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీటమునిగాయి. పలు చోట్ల రోడ్లు, వంతెనలపై గుండా వరద ప్రవహించింది. వర్షాల జోరు తగ్గినందున క్రమంగా నదుల్లో వరద తీవ్రత కూడా తగ్గుతోంది. తుంగా జలాశయం నుంచి 70 వేల క్యూసెక్కులకు పైగా వరద నీరు వదులుతున్నందున శివమొగ్గ నగరంలో తుంగా నది ఇంకా ప్రమాదకర స్థాయిలోనే ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాలైన నగరంలోని కోర్పళయ్యన ఛత్రం వద్ద మంటపం వరద నీటిలో మునిగిపోయింది. ఇప్పుడిప్పుడే వరద తగ్గుముఖం పట్టినందున ప్రజలు, అధికారులు బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు. భారీ వర్షాల కారణంగా ఈనెల 16 నుంచి జిల్లాలోని అన్ని తాలూకాల్లో పాఠశాలలు, కళాశాలలు, విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. అయితే ఇప్పుడు జిల్లా వ్యాప్తంగా వర్షాలు తగ్గుముఖం పట్టినందున సోమవారం నుంచి పాఠశాలలు, కళాశాలలు ఎప్పటిలానే పునః ప్రారంభమయ్యాయి.

జలాశయాలకు వరద తగ్గుముఖం

పశ్చిమ కనుమలతో పాటు జిల్లా వ్యాప్తంగా తొలకరి వర్షాల తీవ్రత తగ్గుముఖం పట్టింది. మరో వైపు జిల్లాలోని ప్రధాన జలాశయాలైన లింగనమక్కి, తుంగా, భద్రా జలాశయాలకు ఎగువ నుంచి వస్తున్న వరద స్థాయి తగ్గింది. సోమవారం ఉదయానికి లింగనమక్కి జలాశయానికి 44,387 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోండగా, 1898 క్యూసెక్కులను బయటకు వదులుతున్నారు. డ్యాం గరిష్ట స్థాయి నీటిమట్టం 1819 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 1797.60 అడుగులకు, డ్యాంలో నీటి నిల్వ 90.14 టీఎంసీలకు చేరింది. శివమొగ్గ, దావణగెరె జిల్లాల రైతుల జీవనాడిగా పేరొందిన భద్రా జలాశయానికి 25,367 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. గరిష్ట నీటిమట్టం 186 అడుగులకు గాను డ్యాంలో ప్రస్తుత నీటిమట్టం 166.6 అడుగులకు చేరింది. తుంగా డ్యాం ఇప్పటికే పూర్తిగా నిండగా, ప్రస్తుతం 36,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాం నుంచి 34,150 క్యూసెక్కుల నీటిని హొసపేటె సమీపంలోని తుంగభద్రా డ్యాంకు వదులుతున్నారు. కాగా సోమవారం ఉదయం వరకు గత 24 గంటల్లో పశ్చిమ కనుమల్లోని మాణిలో 68 మిమీ, యడూరులో 78 మిమీ, హులికల్‌లో 98 మిమీ, మాస్తికట్టెలో 104 మిమీలతో పాటు శివమొగ్గలో 6.70 మిమీ, భద్రావతిలో 7.50 మిమీ, శికారిపురలో 20.80 మిమీ, తీర్థహళ్లిలో 36.10 మిమీ, సొరబలో 39.40 మిమీ, హొసనగరలో 39.80 మిమీ, సాగరలో 57 మిమీల వర్షపాతం నమోదైంది.



ఓ లోతట్టు ప్రాంతంలో వరద



రంగనతిట్టు పక్షిధామం వద్ద జోరుగా వరద

వరద ముట్టడి

- మలెనాడుతో వర్షాలు తగ్గుముఖం
- కేఆర్ఎస్ నుంచి 52 వేల క్యూసెక్కులు విడుదల



సాయిబాబా ఆలయం వద్ద నీటి ప్రవాహం

మండ్య: కావేరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు బేసిన్‌లోని రిజర్వాయర్లు నిండాయి. అయితే లోతట్టు ప్రాంతాల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. రంగనతిట్టు పక్షిధామం, పశ్చిమ వాహిని, స్నానఘట్టం, శ్రీసాయి మందిరం, వెల్లెస్లి వంతెన తదితర ప్రాంతాలు కావేరి నది తీరంలోని లోతట్టు ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ప్రస్తుతం రిజర్వాయర్‌లోకి 60,016 క్యూసెక్కుల నీటి ఇన్‌ఫ్లో ఉండగా, 52,020 క్యూసెక్కులను బయటకు వదులుతున్నారు. రంగనతిట్టు పక్షిధామంలో బోటింగ్‌ను నిషేధించారు. పర్యాటకుల ప్రవేశాన్ని కూడా నిలిపేశారు. ఇక భద్ర, తుంగ రిజర్వాయర్లు కూడా నిండే దశలో ఉన్నాయి. రిజర్వాయర్ల నుంచి నదిలోకి భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. చాలా చోట్ల వరద ఉధృతి నెలకొంది.

గురువుకు కృతజ్ఞత తెలపడమే గురు పూర్ణిమ



నృత్య సేవలో పాల్గొన్న దిక్సూచి నాట్యాలయ కళాకారులు

గౌరిబిదనూరు: గురువుకు కృతజ్ఞత తెలపడమే గురు పూర్ణిమ ప్రధాన ఉద్దేశ్యమని, తమ జీవన సాఫల్యానికి గురువు చాలా అవసరమని దిక్సూచి నాట్యాలయ సంస్థాపకురాలు దివ్యా శివనారాయణ్ తెలిపారు. ఆదివారం రాత్రి తాలూకా డి పాళ్యం గ్రామంలోని శిరిడి సాయిబాబా దేవాలయంలో గురు పూర్ణిమను పురస్కరించుకొని దిక్సూచి నాట్యాలయ విద్యార్థుల నృత్య సేవలో పాల్గొని మాట్లాడారు. కళాకారులకు ప్రోత్సాహం అవసరమని, ఈ దిశలో డి పాళ్య గ్రామంలోని శిరిడి సాయిబాబా దేవాలయం యాజమాన్యం గురుపూర్ణిమ సందర్భంగా తమను ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు.

దేవాలయ సమితి అధ్యక్షుడు హరీశ్ మాట్లాడుతూ... కళల ద్వారా మన ధార్మికతను చాటుకున్న కళాకారులను ప్రోత్సహించడం మనందరి కర్తవ్యమన్నారు. నృత్య సేవలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అభిలాష్, కోశాధికారి అశ్వత్థనారాయణగుప్త, అనూష, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

సాగుభూముల స్వాధీనం తగదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీనివాసపురం: వందల సంవత్సరాల క్రితం మైసూరు ప్రభుత్వం నుంచి అటవీశాఖకు రెవెన్యూ శాఖ భూమి ఇచ్చే విషయం నోటిపై చేయడం జరిగిందని గత నాలుగు దశాబ్దాలుగా చట్టరీత్యా సాగు చేసుకుంటున్న రైతు సాగు భూములను అటవీశాఖ స్వాధీనం చేసుకోవాలని ఆలోచన చేయడం అన్యాయమని కెపిఎస్ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిఆర్ సూర్య నారాయణ తెలిపారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత సంవత్సరం ఆగస్టునెలలో జిల్లా అటవీశాఖ అధికారులు రాత్రికి రాత్రే జెసిబిల సహాయంతో రైతులు సాగు చేసిన మామిడి చెట్లను తొలగించి భూములను స్వాధీనం చేసుకోవాలని చూశారు. వ్యవసాయ భూమిని నాశనం చేశారు. అటవీశాఖ చర్యల వల్ల ఇబ్బందులు పడిన రైతులు సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం చేస్తున్నారన్నారు. సుప్రీంకోర్టులో రైతులకు తప్పకుండా న్యాయం లభిస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట నవీన్‌కుమార్, తాలూకా అధ్యక్షుడు ఇంజినీర్ నారాయణస్వామి, కార్యదర్శి సయ్యద్ ఫారూక్, తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా నియామకం



నూతన అధ్యక్షుడిని సన్మానించిన దృశ్యం

కోలారు : గ్యారెంటీ పథకాల ప్రాధికార జిల్లా అధ్యక్షుడిగా వై శివకుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశించింది. నూతన అధ్యక్షుడిని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ గత శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ పథకాలను ప్రకటించి దానిని కట్టుదిట్టంగా అమలు చేస్తోంది. ఈ పథకాలను అర్హులై లబ్ధిదారులకు అందించడానికి ప్రత్యేక అధ్యక్షుడిని నియమించడం జరిగిందని తెలిపారు. నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపిన వారిలో కేపీసీసీ నాయకుడు గద్దె కణ్ణూరు దయానంద్, పీఎల్‌డీ బ్యాంకు మాజీ అధ్యక్షుడు చంజిమలె బి రమేష్, బంగారుపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సీసంద్ర గోపాలగౌడ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు జిల్లాలో కన్నడ భాష అభివృద్ధి చేయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు : కోలారు జిల్లా రాష్ట్ర సరిహద్దులో ఉన్న ఈ ప్రాంతంలో కన్నడ భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని నవ కర్ణాటక స్వాభిమాన వేదిక సంస్థాపక అధ్యక్షుడు ఎంహెచ్ రామాంజనప్ప తెలిపారు. సోమవారం నగరంలోని టి చన్నయ్య రంగమందిరంలో నవ కర్ణాటక స్వాభిమాన వేదిక, కన్నడ సంస్కృతిశాఖ ఆధ్వర్యంలో నగరంలోని టి చన్నయ్య రంగమందిరంలో నిర్వహించిన సాధకులకు సన్మానం, విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సరిహద్దు ప్రాంతంలోని ఉన్న కోలారు జిల్లాలో అనేక సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగ సమస్య అధికంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని తాలూకాలలోను కన్నడ భాష అభివృద్ధికి అందరు కృషి చేయాలన్నారు. ప్రతి తాలూకాలో అతి ఎక్కువగా కన్నడ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మహర్షి నివేదిక ఆధారంగా కన్నడిగులకు రాష్ట్రంలోని అన్ని సంస్థలలో 60 శాతం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. రోటరీ అధ్యక్షుడు నాగానంద మాట్లాడుతూ... కోలారు జిల్లాలోని సరిహద్దు ప్రాంతంలో కన్నడ స్వాభిమాన సంస్థ నిర్వహిస్తున్న కన్నడ సేవా కార్యక్రమాలు శ్లాఘనీయం, కన్నడ భాష రక్షణ కోసం సంస్థ శ్రమిస్తుండడం సంతోషించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో సంఘటన కార్యాధ్యక్షుడు నరసింహయ్య, సి అశ్విని, కార్మిక విభాగం అధ్యక్షురాలు మంజుళ, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేరుగా సేకరించాలి



మాట్లాడుతున్న ప్రవీణ్

కోలారు : ప్రజలు తడి పొడి చెత్తను వేరు చేసి పౌర కార్మికులకు ఇచ్చి సహకరించాలని బెంగుళూరు సాహస్ స్వయం సేవా సంస్థ ప్రతినిధి ప్రవీణ్ విద్యార్థులకు తెలిపారు. సోమవారం తాలూకాలోని అరాభికొత్తనూరు పాఠశాలలో జిల్లా పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఘనత్యాజ్య నిర్వహణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థలకు నేడు చెత్త నిర్వహణ పెద్ద సవాలుగా మారింది. చెత్త నిర్వహణ గురించి విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. ప్రజలు ఇంట్లోనే తడి, పొడి చెత్తను వేరు చేసి పౌర కార్మికులకు అందించడం ద్వారా ఎంతో అనుకూలం అవుతోందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడిన ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు సిద్దేశ్వరి ఒక ఇంట్లో చెత్తనే తడి పొడిగా వేరు చేసి ఇవ్వడం ఎంతో సులభం అవుతందని దీని వల్ల పౌర కార్మికులకు కూడా చెత్తను నిర్వహించడం ఎంతో సులభం అవుతుందన్నారు. విద్యార్థులు ఈ విషయంపై తల్లిదండ్రులకు అవగాహన కల్గించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు భవాని, సుగుణా, శ్వేతా, వెంకటరెడ్డి, ఫరీదా, శ్రీనివాసులు రమాదేవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా పీడబ్ల్యూడీ రహదారులు



రహదారి మధ్యలో గుంతలు పడిన దృశ్యం

కెజీఎఫ్ : ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిపోతున్నాయి. అయితే ఎక్కువ ప్రమాదాలు రోడ్ల గుంతల వల్ల జరుగుతున్నాయి. నగరంలో పీడబ్ల్యూడీ రహదారులు నరకప్రాయంగా మారాయి. నగరంలోని ప్రముఖ రహదారులు సూరజ్ మల్ సర్కిల్, గాంధీ సర్కిల్ వద్ద రహదారులు అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. రహదారులు గుంతలు తేలడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రహదారులకు మరమ్మతులు చేయాలని పలుమార్లు పీడబ్ల్యూడీ శాఖ దృష్టికి తీసుకెళ్లిన ఫలితం కనిపించలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమస్య తమకు సంబంధించింది కాదేమో అనే విధంగా వ్యవహరిస్తున్నారని నగర ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ఇదే రహదారిలో తిరుగుతున్నా గుంతల మయమైన రహదారి కనిపించడం లేదా అని నగర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరచి గుంతలను పూడ్చే ప్రయత్నం చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

గోమాతకు భద్రత ఏదీ?



బెంగళూరులో ఆవులు



హాసన్ జిల్లాలో గోవుల అక్రమ రవాణా (ఫైల్)

- పెరిగిన ఆవుల చోరీ, అక్రమ రవాణా కేసులు
- ఏడాది కాలంలో 1,104 నమోదు

సాక్షి, బెంగళూరు: రాష్ట్రంలో కర్ణాటక గోహత్య నిషేధ చట్టం –2020 అమల్లో ఉన్నప్పటికీ వాటి దొంగతనం, అక్రమ రవాణా ఘటనలు తగ్గడం లేదు. మాంసం కోసం వాటిని వధించడం పెరిగినట్లు జీవ కారుణ్య సంఘాలు ఆరోపిస్తున్నాయి. గడిచిన ఏడాది కాలంలో సుమారు 1,104 గోవులను దొంగతనం చేసి అక్రమంగా తరలించిన కేసులు నమోదు అయ్యాయి. దొరకని కేసులు ఎంతో ఎక్కువగా ఉండవచ్చు.

నిత్యం సంఘటనలు

రాష్ట్రంలో ఎక్కడో ఒక చోట నిత్యం గోవుల దొంగతనం, వాటి అక్రమ రవాణా ఘటనలు జరుగుతూనే ఉన్నా, అన్ని సందర్భాల్లో కేసులు మాత్రం నమోదు కావడం లేదు. అయినప్పటికీ రాష్ట్రంలో గడిచిన ఏడాది కాలంలో వెయ్యికి పైగా కేసులు రికార్డవ్వడం విశేషం.. ఇందులో 447 గోవులు దొంగతనానికి సంబంధించినవి కాగా, మరో 657 కేసులు అక్రమ రవాణాకు సంబంధించినవి. కర్ణాటక–తెలంగాణ సరిహద్దు జిల్లా అయిన బీదర్‌లో అత్యధికంగా 54 కేసులు నమోదయ్యాయి. హాసన్ జిల్లాలో 84 రావడం గమనార్హం.

బెంగళూరులో అధికం

రాజధాని బెంగళూరు కూడా గోవుల దొంగతనాలకు అతీతమేమీ కాలేదు. ఐటీ సిటీలో 48 గోవుల దొంగతనాల కేసులు రికార్డయ్యాయి, ఉత్తర కన్నడ జిల్లాల్లో గోవుల అక్రమ రవాణాకు సంబంధించి 64 కేసులు వచ్చాయి, బెళగావి, చిక్కబళ్లాపుర, బాగలకోటె, రాయచూరు జిల్లాల్లో ఈ తరహా ఎలాంటి కేసులు నమోదు కాకపోవడం విశేషం. కేజీఎఫ్‌లో కూడా ఒక్క కేసు కూడా నమోదు కాలేదు. గోవుల దొంగతనాలు, అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులను తెరిచారు. అనుమానస్పద వాహనాలను తనిఖీ చేసి గోవులను అధికారులు రక్షిస్తున్నారు.

అత్యధికంగా కేసులు నమోదైన జిల్లాలు

జిల్లా	దొంగతనం	అక్రమ రవాణా
బెంగళూరు	86	29
బీదర్	54	17
కలబురిగి	28	35
మైసూరు	23	51
హాసన్	18	84
చిత్రదుర్గ	21	10
శివమొగ్గ	17	35
దావణగెరె	20	7
చిక్కమగళూరు	22	12
కలబురిగి	18	23
కొప్పళ	17	3

క్లుప్తంగా

రైల్వేలైను ఇరువైపులా అడ్డుగోడ నిర్మించండి

గౌరిబిదనూరు: నగరం మధ్యభాగంలో వెళ్లే రైల్వే లైనుకు ఇరువైపులా అడ్డుగోడ కాని, మెటల్ ఫెన్సింగ్ కాని నిర్మించాలని సమాజ సేవకుడు హీరేబిదనూరు రాజణ్ణ కేంద్ర జల శక్తి, రైల్వే శాఖ మంత్రి సోమణ్ణకు వినతి పత్రం సమర్పించారు. ఆదివారం సాయంత్రం ఆయన స్వగృహంలో అందజేశారు. నగర రైల్వే స్టేషను అప్‌గ్రేడ్ చేయబడింది ఈ స్టేషను గుండా ప్రతి 20 నిమిషాలకొక రైలు వెళ్తుంది. నగర పౌరులు త్వరగా చేరుకోవాలని రైల్వేలైనును దాటి పోతూ వుంటారు. ఈ క్రమంలో జటీవల పీయూసీ చదివే విద్యార్థిని రైల్వేలైను దాటుతూ రైలు ఢీకొని మృతి చెందింది. దీంతో కిలోమీటరు పొడవునా నగరంలో రైల్వే లైన్‌కు ఇరువైపులా గోడ, లేక ఫెన్సింగ్ నిర్మించాలని వినతిపత్రంలో కోరారు.

లారీ ఢీకొని, బైకిస్టు దుర్మరణం

మండ్య: లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన మళవళ్లి తాలూకా మార్కాలు గేట్ వద్ద జరిగింది. తాలూకాలోని కొదేనకొప్పలు గ్రామానికి చెందిన మాదేగౌడ (63) మృతుడు. బైక్‌పై వెనుక కూర్చొన్న బసవేగౌడ తీవ్రంగా గాయపడ్డాడు. మాదేగౌడ తన బైక్‌లో బసవేగౌడతో కలసి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మార్కాలు గేట్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఢీ కొట్టిన ధాటికి మాదేగౌడ రెండు భాగాలుగా తెగిపడ్డాడు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు అక్కడికి చేరుకునే వరకు ప్రజలు మొబైల్‌లో వీడియోలు తీస్తూ ఉండడం విచారకరం. కిరుగావలు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ఎన్నికల పట్ల అవగాహన కలిగి వుండాలి



మాక్ పార్లమెంటు ఎన్నికలలో పాల్గొన్న విద్యార్థులు

గౌరిబిదనూరు: విద్యార్థి దశ నుంచే ఎన్నికల పట్ల అవగాహన కలిగి వుండాలని నగరగెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షమీర్ పాషా తెలిపారు. తాలూకా నగరగెరె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాక్ పార్లమెంటు ఎన్నికలను జరిపించి అవగాహన కల్పించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వ విలువలు, ఎన్నికలు, ఓటు హక్కు వినియోగం పట్ల విద్యార్థులకు తెలిసేలా ఎన్నికలు పాఠశాలలో నిర్వహించారు. 15 మంది పోటీ చేయగా 10 మంది విద్యార్థులు ఎన్నికయ్యారు. ఎన్నిక ప్రక్రియ, నియమ నిబంధనలు తెలిపారు. విద్యార్థులు తమ ఆధార్ కార్డును చూపించి బ్యాలెట్ పేపరు మూలకంగా ఓటు వేశారు. ఈ మాక్ ఎన్నికల నిర్వహణలో వెంకటాచల నాయక్, మమత, రుక్మిణమ్మ, అక్షతా, సుమనా తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాయం



విద్యార్థులకు చెక్కుల వితరణ

గౌరిబిదనూరు: కరేకల్లహళ్ళిలోని నేతాజీ యువక సంఘం ద్వారా నిరుపేద పీయూసీ విద్యార్థులను గుర్తించి ఆర్థిక సాయం అందించారు. 5 మంది ఎయూసీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5 వేల రూపాయల చొప్పున చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా నేషనల్ కాలేజీ అధ్యక్షులైన ముదుగెరె నాగాజప్ప మాట్లాడుతూ యువత సేవా భావం అభినందనీయమని కొనియాడారు. సంఘం ముఖ్యులు అశోక్, రాజేశ్, గౌరీశ్, ద్వారకీశ్, రవీంద్ర, లక్ష్మీకాంత పాల్గొన్నారు.

డ్రైవర్ల ఆందోళన




వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

మైసూరు: పర్యాటక వాహనాలకు అశాస్త్రీయంగా ప్యానిక్ బటన్, జీపీఎస్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మైసూరు జిల్లా పర్యాటక వాహన డ్రైవర్లు, యజమానుల క్షేమాభివృద్ధి సంఘం సోమవారం నగరంలో ఆందోళన చేసింది. నగరంలోని బల్లాళ్ సర్కిల్ వద్ద ఉన్న ఆర్టీఓ కార్యాలయం ఎదుట గుమిగూడిన డ్రైవర్లు, యజమానులు కొంతసమయం నినాదాలు చేసి తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన జీపీఎస్, ప్యానిక్ బటన్ డబ్బులను సర్కార్ భరించాలని డిమాండ్ చేశారు. పర్యాటక వాహనాలపై ఉన్న పన్నును 30 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. వైట్‌బోర్డులో పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వాహనాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

శిల్పకళా తోరణం బాదామి

- భారతీయ శిల్ప కళలకు ప్రతీకలు బాదామి గుహలు
- మృదువైన ఇసుక రాతితో నిర్మించిన భూతనాథ ఆలయం ప్రసిద్ధి



ప్రఖ్యాత మల్లికార్జున ఆలయం



బాదామి గుహలో విష్ణుమూర్తి చిత్రం

బనశంకరి: బాదామి కర్ణాటకలోని బాగల్‌కోటే జిల్లాలో ఉంది. రాతి ఆకారంలో ఉన్న దేవాలయాలకు ఇది చాలా ప్రసిద్ధి చెందింది. పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే రాతిగుహ దేవస్థానాలు కోటలకు బాదామి ప్రసిద్ధి చెందింది. ప్రముఖ పర్యాటక ఆకర్షణల్లో అగస్త్య సరస్సు పురావస్తు మ్యూజియం ఉన్నాయి. భూతనాథ దేవాలయాలు కూడా చూడటానికి నయనమనోహరంగా ఉంటాయనడంలో ఎలాంటి సందేహంలేదు. బాదంపప్పును దాని పౌరాణికపేరు వాతాపి అని పిలుస్తారు. ఇది క్రీశ. 757 వరకు బాదామి చాళుక్యులు గర్వించదగిన రాజధాని. క్రీ.శ 500లో చాళుక్య రాజవంశం ప్రాచుర్యం పొందిన తరువాత చాళుక్యరాజు పులకేశి వాతాపి వద్ద ఒక కోటను నిర్మించి దీనినే రాజధానిగా చేసుకున్నాడు. బాదామి చాళుక్యులు అద్భుతమైన కట్టడాలను నిర్మించారు. భవనాల్లో ప్రదర్శించబడిన ద్రావిడ నిర్మాణ శైలులు కూడా చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. బాదామి విజయనగర సామ్రాజ్యం అదిపాహి రాజవంశం, మొఘలులు, మరాఠాలు, మైసూరు రాజ్యం బ్రిటీష్‌వారితో సహా అనేకరాజవంశాలు నియంత్రణలోకి వచ్చింది.

బాదామి గుహ దేవస్థానాలు..

అద్భుతమైన బాదామి గుహదేవస్థానాలు 6–7వ శతాబ్దాల బాదామి చాళుక్యులకు చెందినవి. బాదామి గుహ దేవస్థానాలు ఎలా నిర్మించబడ్డాయంటే నగరంలో ఉన్న పెద్ద ఇసుకరాయికొండతో వీటిని సున్నితంగా రూపొందించారు. మీరు రాతి నుండి ఇసుకరాయిని ఎన్నుకున్నప్పుడు చెక్కిన ప్రయోజనం కోసం ఇది అనువైన ఎంపిక. గుహదేవాలయాలు బాదామి చాళుక్యులకు అద్భుతమైన ఉదాహరణలు. ఈ దేవస్థానాలు లోయలు మధ్యలో సమీపంలో భారీరాళ్లు కలిగి ఉంది. బాదామి గుహదేవాలయాలు నిర్మాణ నమూనాలు ఉత్తర భారతదేశం దక్షిణ భారతదేశంలోని ద్రావిడ మిశ్రమం.

భూతనాథ దేవస్థానం

భూతనాథ దేవస్థానాన్ని మృదువైన ఇసుక రాతితో నిర్మించారు. ఇది ఈ ప్రాంతంలో బాగా ప్రాచుర్యం పొందింది. క్రీశ.7–11వ శతాబ్దాల మధ్య బాదామి చాళుక్యులు నిర్మించారు. హిందూదేవత భూతనాథుడు అంటే ప్రియమైన శివుడు అని కూడా పిలువబడే దేవాలయాలకోసం ప్రత్యేకంగా ఒక మందిరం కేటాయించారు.

మల్లికార్జున ఆలయాలు

మల్లికార్జున దేవస్థానాలు దేవాలయాలు పక్కనే ఉండగా ప్రత్యేకమైన నిర్మాణాలు ఇతర దేవస్థానాలకంటే భిన్నంగా ఉంటాయి. ఎందుకంటే వాటి పిరమిడ్ ఆకారం, వాటి మూలాలు 11వ శతాబ్దం నాటివి. బాదామి చాళుక్యులు నిర్మించారు.

బాదామికోట

క్రీశ. 543లో చాళుక్య రాజు పులకేశి నిర్మించిన పురాతనకోట అందమైన పరిసరాలతో పర్యాటకులను కనువిందు చేస్తుంది. క్రీశ 642లో పల్లవులు కోటను స్వాధీనం చేసుకుని పూర్తిగా ధ్వంసం చేశారు. కోటకోడలు, నిర్మాణ శిథిలాలు పర్యాటకులను ఆకట్టుకుంటాయి.

మాలేగిట్టి శివాలయం


అగస్త్య సరస్సును శివాలయం పైన గల మాలెగిట్టి ఆలయం మెరిసే నీటి అందమైన దృశ్యాన్ని అందిస్తుంది. క్రీశ 6వ శతాబ్దంలో శివాలయం నిర్మించారు. బాదామిలో పురాతన ఆలయం.

బనశంకరీ దేవస్థానం


బనశంకరీ దేవస్థానం చోలచగుడ్డ వద్ద వెలసింది. ఈ దేవస్థానంలో అమ్మవారు పూర్తిగా పార్వతీదేవి స్వరూపం అయిన బనశంకరీదేవికి అంకితం చేయబడింది. కర్ణాటకలో చాలా ప్రాచుర్యం పొందిన దేవస్థానం. నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న బనశంకరీదేవి జనవరి నెలలో నిర్వహించే బ్రహ్మరథోత్సవానికి భక్తులు లక్షలాదిగా తరలిరావడం విశేషం. బాదామి రైల్వేస్టేషన్‌కు 5 కిలోమీటర్ల దూరంలో బాదామి బస్‌స్టేషన్ కలదు. బెంగళూరు, హుబ్లీ, బీజాపుర, గదగ్, సోలాపుర తదితర నగరాలకు రైలు మార్గం అనుసంధానంగా ఉంది. బెంగళూరు నుంచి కాకుండా రాష్ట్రంలోని వివిధ నగరాలనుంచి బాదామికి బస్సులు అందుబాటులో ఉన్నాయి.




బనశంకరీదేవి దేవస్థానం



బాదామిలోని ఓ ఆలయం



భూతనాథ ఆలయం



బాదామిలో అద్భుత రాతి గుహలు

అగ్ని ప్రమాదాలపై అవగాహన

మైసూరు: నగరంలోని విజయ విఠల విద్యా పాఠశాలలో అగ్నిప్రమాదాలపై ముందు జాగ్రత్తలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పాఠశాల ఉపాధ్యాయులకు, బీఎస్ఎస్ పాఠశాల ఉపాధ్యాయులకు, సిబ్బందికి శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా సరస్వతిపురం అగ్నిమాపక అధికారి నాగరాజ్ అరసు మాట్లాడుతూ నిప్పును ఆర్పే విధానాలు, విద్యుత్‌తో జరిగే అగ్ని ప్రమాదాల గురించి ఉదాహరణలతో వివరించారు. అగ్ని ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలో ముందు జాగ్రత్త చర్యలను తెలిపారు. పిరియాపట్టణ విభాగం అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్, విజయ విఠల విద్యా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ఏ వీణ, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎంటీసీలో కారుణ్య నియామకాలు

బనశంకరి: బీఎంటీసీ సంస్థలో సోమవారం కారుణ్య నియామకాలను చేపట్టారు. మృతి చెందిన ఉద్యోగుల కుటుంబీకులకు మానవతా దృక్పథంతో సోమవారం నియామక పత్రాలను రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి అందజేశారు. నగరంలోని బీఎంటీసీ సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అర్హతలకు అనుగుణంగా పోస్టులను ఇచ్చారు. సంస్థలో ఎక్కువగా డ్రైవర్లు, కండక్టర్లు, టెక్నికల్ పోస్టులు ఖాళీ ఉండగా వాటికి ఎంపిక చేయడం సాధ్యంకాదు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న అసిస్టెంట్ టెక్నికల్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది కింద 48 పోస్టులను భర్తీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రామచంద్రన్, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అని బెదిరించి దోపిడీ

కృష్ణరాజపురం: పోలీస్ అని నమ్మించి మహిళా మసాజ్ థెరపిస్ట్‌ను దోచుకున్న ఘటన రామమూర్తినగర పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు... మహేంద్రకుమార్ అనే వ్యక్తి మసాజ్ కోసం ఈనెల 3న తన పేరు సురేష్ అని ఆన్‌లైన్ ద్వారా థెరపిస్ట్‌ను బుక్ చేసుకున్నాడు. ఆమెను రామమూర్తినగరలోని ఓ అపార్ట్‌మెంట్ వద్దకు పిలిపించుకున్నాడు. రాత్రి 10.30 గంటలకు అక్కడకు చేరుకున్న థెరపిస్ట్‌ను కారులో ఒక కి.మీ.దూరం తీసుకెళ్లి తాను పోలీసు కానిస్టేబుల్ అని, తనకు రూ.10 లక్షలు ఇవ్వకుంటే అత్యాచారం చేస్తానని బెదిరించాడు. దీంతో భయపడిన ఆమె తన స్నేహితులకు ఫోన్ చేసి తాను చిక్కుల్లో ఉన్నానని, వెంటనే తనకు డబ్బులు కావాలని అడిగింది. ఆమె ఓ స్నేహితుడి నుంచి మహేంద్ర ఖాతాకు రూ.1.50 లక్షలను బదిలీ చేయించింది. అనంతరం ఆమెను రాత్రంతా హెబ్బాళతో పాటు పలు చోట్ల తిప్పి తెల్లవారుజామున ఎయిర్‌పోర్ట్ వద్ద దింపి సొంత ఊరికి వెళ్లమని, లేకుంటే కేసు పెడతానని బెదిరించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామమూర్తినగర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు.

ముడా కుంభకోణంలో విపక్షాల పాత్ర అధికం

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో జరిగిన ఇళ్లస్థలాల పంపిణీ కుంభకోణంలో బీజేపీ, జేడీఎస్‌ల పాత్ర ఎక్కువగా ఉందని, ఈ విషయంపై తాను మంగళవారం దాఖలాలతో సహా రుజువు చేస్తానని కేపీసీసీ అధికార ప్రతినిధి ఎం.లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలోని కాంగ్రెస్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. ముడా స్థలాల కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య కుటుంబ సభ్యులను దోషులుగా చూపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ దిశలో రెండు రోజుల క్రితం బీజేపీ నాయకులు మల్లికార్జున స్వామి ద్వారా జిల్లాధికారి ఫిర్యాదు చేశారన్నారు. కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి కూడా ముడాలో ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎలా పొందారో మంగళవారం బెంగళూరులో ప్రెస్‌మీట్ పెట్టి దాఖలాలతో సహా వెల్లడిస్తానన్నారు. ముడా కుంభకోణంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర పాత్ర కూడా ఉందన్నారు. మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప సోదరి కుమారుడి ద్వారా విజయేంద్ర ఈ అక్రమానికి పాల్పడ్డారన్నారు. అయితే వారి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు సీఎం సిద్ధరామయ్యపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. మైసూరు, కొడగు జిల్లాల్లో నిరంతరంగా వానలు కురుస్తున్నాయన్నారు. కొడగుతో సహా పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. మడికేరి జాతీయ రహదారిలో కొంచరియలు విరిగిపడ్డాయన్నారు. తాను ఓటమి పాలైనా కూడా 40కు పైగా చోట్లను సందర్శించానన్నారు. ఎంపీ యదువీర్ ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. రైల్వేస్టేషన్‌ను సందర్శించి బీజేపీ నాయకులతో కలిసి చెత్తను ఎత్తివేసి ఫొటో సెషన్‌కు ఫోజులిచ్చారన్నారు. ఎన్ఆర్ నియోజకవర్గంలో వారికి 65 వేల ఓట్లు లభించాయని, ఈవైపు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు.

ముడాలో దళితులకు న్యాయం చేయండి

మైసూరు: మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో జరిగిన ఇళ్ల స్థలాల కుంభకోణంలో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు దళితుల భూములను కొనుగోలు చేయడం ద్వారా అన్యాయం చేశారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.మహేష్ ఆరోపించారు. ఆయన నగరంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముడాలో 50:50 నిష్పత్తిలో ఇళ్లస్థలాల పంపిణీ కుంభకోణంలో సీఎం సిద్ధరామయ్య భార్య పార్వతి సోదరుడు మల్లికార్జున స్వామి తన సోదరి పార్వతికి పసుపు కుంకుమ కానుకగా ఇచ్చిన మైసూరులోని కెసరెలోని సర్వే నంబర్–464లోని 3.16 ఎకరాల భూమిని నింగ అనే వ్యక్తి 1935లో వేలంలో కొనుగోలు చేశారన్నారు. వీరికి మల్లయ్య, మైలారయ్య, దేవరాజు అనే సంతానం ఉండేవారన్నారు. వీరిలో దేవరాజు పిత్రార్జిత ఆస్తి అయినా సోదరుడు చనిపోయిన నేపథ్యంలో వారి సంతానం సమ్మతి, సంతకం తీసుకోకుండా అక్రమంగా తన పేరిట ఖాతా చేయించుకుని మల్లికార్జున స్వామికి విక్రయించారని ఆరోపించారు. ఈ భూమి డీనోటిఫై అయిన తర్వాత పార్వతి సిద్ధరామయ్య సోదరుడు మల్లికార్జునస్వామి కొనుగోలు చేశారన్నారు. చట్టవ్యతిరేకంగా జరిగిన ఆస్తి మార్పిడిని మరోసారి పరిశీలించి అన్యాయానికి గురైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముడా కుంభకోణం వెలుగు చూసిన తర్వాత సీఎం సిద్ధరామయ్య తమకు మైసూరులోని విజయనగరలో ప్రస్తుతం కేటాయించిన ప్రత్యామ్నాయ స్థలం వద్దు, అందుకు బదులుగా మార్కెట్ విలువ ప్రకారం రూ.62 కోట్ల పరిహారం ఇవ్వాలని కోరారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆ పరిహార మొత్తంలో భూమి సొమ్ములో మూల హక్కుదారులకూ వాటా రావాల్సి ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే టీఎస్ శ్రీవత్స, మాజీ ఎమ్మెల్యే ఎన్.బాలరాజు, బీజేపీ బీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రఘు కౌటిల్య, మైసూరు మాజీ ఉపమేయర్ శైలేంద్ర, మాజీ కార్పొరేటర్ అశ్విని పాల్గొన్నారు.

విద్యార్థిని అపహరణ

యశవంతపుర: జాలహళ్లి క్రాస్ వద్ద బస్సుకోసం ఎదురుచూస్తున్న 17 ఏళ్ల ద్వితీయ పీయూసీ విద్యార్థిని నలుగురు యువకులు అపహరించిన ఘటన అలస్యంగా వెలుగులోకి వచ్చింది. అపహరణకు గురైన విద్యార్థిని నిందితుల నుంచి తప్పించుకుంది. జూన్ 6న జాలహళ్లి క్రాస్‌లో తుమకూరుకు వెళ్లటానికి బస్సు కోసం విద్యార్థిని వేచి ఉంది. అక్కడికి వచ్చిన నలుగురు యువకులు విద్యార్థిపై రసాయనిక పొడిని చల్లారు. ఆమె స్పృహ కోల్పోవడంతో విద్యార్థిని అపహరించారు. కారులో ఎక్కించుకుని మైసూరు రోడ్డులో వెళ్తుండగా విద్యార్థిని స్పృహలోకి రాగానే కారులోంచి దిగి తప్పించుకుంది. అనంతరం విద్యార్థిని మైసూరు లష్కర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును పీణ్యకు బదిలీ చేశారు.

పిల్లలకు సంస్కారాన్ని నేర్పాలి



స్వామీజీని ఊరేగింపుగా తోడ్కొని వస్తున్న దృశ్యం

తుమకూరు: ప్రస్తుతం పిల్లలకు సంస్కారాన్ని నేర్పడానికి తల్లిదండ్రులకు సమయం లేదని, తెలియజెప్పే అవ్వాతాతలకు ఇంట్లో నివసించే అవకాశం లేదని, అలాంటప్పుడు పిల్లలకు సంస్కారం నేర్పించేదెవరు? ఈ విషయాన్ని తల్లిదండ్రులు తీవ్రంగా ఆలోచించాలని భీమసేతు మునివృంద మఠం పీఠాధిపతి రఘువరేంద్రతీర్థ శ్రీపాదంగళ్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం వ్యాసపూర్ణిమ రోజున తుమకూరులోని శ్రీకృష్ణమందిరంలో ఏర్పాటు చేసిన తమ 16వ చాతుర్మాస కార్యక్రమంలో ఆశీర్వచనం పలికారు. నేడు పిల్లలకు ఉద్యోగం సంపాదించే విద్య మాత్రం లభిస్తోందన్నారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలు, సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని వాటి నుంచి బయటపడే ఎలాంటి విద్య ఇంటిలో, సమాజంలో లభించడం లేదన్నారు. అనంతరం స్వామీజీ సంస్థాన పూజ చేశారు. కార్యక్రమంలో కృష్ణ మందిరం అధ్యక్షుడు శ్రీనివాస్ హత్వార్, కార్యాధ్యక్షుడు బాలకృష్ణ హెబ్బార్, ప్రముఖులు జీకే శ్రీనివాస్, నాగరాజ ధన్య, గురుప్రసాద్, వ్యవస్థాపకుడు జనార్ధన భట్‌లతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతకు ముందు స్వామీజీని నగరంలోని టౌన్‌హాల్ సర్కిల్ నుంచి ఊరేగింపుగా కృష్ణ మందిరానికి తోడ్కొని వచ్చారు.

హోసూరు వార్తలు..

ఉత్సాహంగా పుస్తక ప్రదర్శన

హోసూరు: ఆధునిక పరిజ్ఞానంతో విద్యా విధానం అంతర్జాలమయంగా మారిపోతున్న నేటి తరుణంలో విద్యార్థుల్లో పఠనాశక్తిని పెంచడానికి పుస్తక ప్రదర్శనలు ఎంతగానో అవసరముందని విద్యావేత్తలంటున్నారు. అందులో భాగంగా క్రిష్ణగిరి జిల్లాలోని హోసూరులో జిల్లా యంత్రాంగం 13 ఏళ్లుగా పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు చైతన్యం కల్పిస్తున్నారు. గత 12వ తేదీ హోసూరు పారిశ్రామికవాడ హోటల్ హిల్స్‌లో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనలో వందకుపైగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ హోసూరు, డెంకణీకోట, సూళగిరి, అంచెట్టి తాలూకాలకు చెందిన పాఠశాల, కళాశాలల విద్యార్థులు పుస్తకర ప్రదర్శనను తిలకించి, విలువైన పుస్తకాలను కొనుగోలు చేశారు.

బైక్ ప్రమాదంలో మహిళ మృతి

హోసూరు: ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో భర్త కళ్ల ముందే భార్య మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు హోసూరు సమీపంలోని తొరపల్లి గ్రామానికి చెందిన రామన్ (25). భార్య పూర్ణిమ (20)తో కలిసి ఆదివారం బైక్‌లో వెళ్తుండగా రాయకోట కూడలి రోడ్డు వద్ద ఏదో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో పూర్ణిమ ఘటనా స్థలంలోనే మృతి చెందగా రామన్‌కు తీవ్ర గాయాలు తగిలాయి. పట్టణ పోలీసులు చేరుకొని గాయపడిన రామన్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

కలెక్టర్‌కు వినతుల వెల్లువ

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణలో కలెక్టర్ శరయుకు ప్రజలు తాగునీరు, రోడ్ల వసతి, వీధిదీపాల ఏర్పాటు, ఉచిత కుట్టుయంత్రాలు, విద్యుత్ కనెక్షన్‌లు, వృద్ధాప్య పెన్షన్ కోరుతూ 287 మంది ఫిర్యాదులను అందజేశారు. పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంగవికల సంక్షేమ శాఖ ద్వారా పలువురు దివ్యాంగులకు రూ. 84 వేల విలువ చేసే కృత్రిమ కాళ్లు, ఊతకర్రలు, త్రిచక్ర వాహనాలు అందజేశారు. అధికారులు పన్నీర్‌సెల్వం, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యంగిరా దేవికి హోమం



విశేష అలంకరణతో ప్రత్యంగిరాదేవి

హోసూరు: హోసూరు సమీపంలోని మోర్నపల్లి గ్రామంలో వెలసిన ప్రసిద్ధి పొందిన రాహు, కేతు, సమేత శ్రీ అధర్వణ ప్రత్యంగిరా దేవి ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం రాత్రి మిరపకాయల యాగం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. దుష్టశక్తులు తొలగిపోవాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, పశు సంతతి పెంపొందాలని కోరుతూ పూజలు చేశారు.

అత్తమామలే హంతకులు

- హాస్టల్ నిర్వాహకుని హత్య కేసులో వీడిన మిస్టరీ

హోసూరు: హోసూరు సమీపంలో హాస్టల్ నిర్వాహకుని హత్య కేసులో అత్తా, మామతో పాటు ఎనిమిది మందిని హడ్కో పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ కడపజిల్లా కొండవారపల్లి గ్రామానికి చెందిన అసానయ్య (26). హోసూరు సమీపంలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకొని పీజీ హాస్టల్‌ను ప్రారంభించాడు. గత 5వ తేదీ హాస్టల్ భవనంలో అసానయ్యను కొందరు పొడిచి చంపారు. హడ్కో పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. అసానయ్య, పీరంభి అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకొన్నారు. వీరికి మూడు నెలల పాప ఉంది. ఈ ప్రేమ వివాహం పీరంభి తల్లిదండ్రులకు నచ్చకపోవడంతో అసానయ్యను హత్య చేసి కూతురికి రెండవ పెళ్లి చేయాలని తీర్మానించుకొన్నారు. అత్తమామలు, ఆమె బంధువు, కొందరు కిరాయి హంతకులను హోసూరుకు తీసుకువచ్చి అల్లుణ్ని కలిశారు. మాటల్లో పెట్టి అతన్ని హత్య చేసి పరారయ్యారు. అప్పటినుంచి దర్యాప్తు చేసి ఆధారాలను సేకరించారు. అసానయ్య మామ ఖాదర్‌వలి (45), అత్త భీరమ్మ (45), చిన్నత్త మాదేవి అలియాస్ వీరమ్మ (35), ఈమె ప్రియుడు శ్రీనివాసులు (38), ఇతర నిందితులు నంద్యాలకు చెందిన బండిశేఖర్ (26), కడపకు చెందిన వినోద్‌కుమార్ (29), దంటు అంకాల్ (35), సిద్దు (25)ను అరెస్టు చేశారు.

క్రికెట్ విజేతలు వీరే



హోసూరు: హోసూరులో పలు సంస్థలు కలిసి నిర్వహించిన క్రికెట్ టోర్నీ ఘనంగా ముగిసింది. వరుసగా నాలుగు ఆదివారాల పాటు జరిగిన ఈ పోటీల్లో 36 పరిశ్రమలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. వీరిలో ఫస్ట్ స్టెప్ పరిశ్రమకు చెందిన జట్టు ఫైనల్స్‌లో గెలుపొంది విజేతగా నిలిచింది. రెండవ బహుమతి నెరోల్యాక్, మూడవ బహుమతి గ్లోబల్ క్యాల్షియం పరిశ్రమలందుకొన్నాయి. ఆదివారం సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవంలో భారత మాజీ క్రికెటర్ లక్ష్మీపతి బాలాజి పాల్గొని బహుమతులందజేశారు.

గోమాంసం విక్రేత అరెస్ట్

మైసూరు: గోమాంసం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని చామరాజనగర జిల్లా రామాపుర పోలీసులు అరెస్ట్ చేశారు. హనూరు తాలూకా కురుబరదొడ్డి గ్రామానికి చెందిన వసీం పాషా తన ఇంటి ముందు ఆవు మాంసాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు రామాపుర ఎస్ఐ రాధ సిబ్బందితో దాడి జరిపి 13 కేజీల గో మాంసం స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

పెట్టుబడి పేరుతో లక్షలు టోకరా

హోసూరు: షేర్ల కొనుగోలు పేరిట అమాయలను వంచించి కోట్లు కొల్లగడుతున్నారు. తాజాగా ఓ ప్రైవేట్ ఉద్యోగి 16.30 లక్షలు పోగొట్టుకున్నాడు. వివరాలు... హోసూరు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 38 ఏళ్ల ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. ఇతని వాట్సాప్‌కు మే నెలలో ఒక సందేశం వచ్చింది. అందులో షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని ఉంది. దీంతో వారు పంపిన లింక్ ద్వారా అమాయకుడు రూ. 16.30 లక్షలు జమచేశాడు. అనంతరం ఆ నెంబర్ స్విచాఫ్ వచ్చింది. దీంతో మోసపోయినట్లు గుర్తించి బాధితుడు క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లైబ్రరీకి శంకుస్థాపన

కెలమంగలం: కెలమంగలం సమితి గోపసంద్రం గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుకు గ్రామపెద్ద భూదానం చేశారు. ఈ స్థలంలో భవన నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా రూ. 22 లక్షల నిధులను మంజూరు చేసింది. ఊరిగౌడు వెంకటరామన్ అధ్యక్షతన సోమవారం తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. పంచాయతీ అధ్యక్షులు సంగీత, అధికార్లు సతీష్‌బాబు, శాంతి, మారియప్పన్, సుబ్రమణి, కౌన్సిలర్ జయరామన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

కెలమంగలం: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మిత్రుడు తీవ్రంగా గాయపడిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...సూళగిరి తాలూకా బెగ్గిలి గ్రామానికి చెందిన కార్మికుడు దినేష్(27), అదే గ్రామానికి చెందిన మిత్రుడు గణేష్‌తో కలిసి ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో మలేమాదేశ్వరస్వామి ఆలయానికి బయల్దేరారు. డెంకణీకోట– అంచెట్టి మార్గంలో వెళ్తుండగా మరగట్ట వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన దినేష్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా గణేష్‌కు తీవ్ర గాయాలేర్పడింది. విషయం గమనించిన స్థానికులు గాయపడిన గణేష్‌ను ఆస్పత్రికి తరలించి డెంకణీకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... సూళగిరి తాలూకా ఉద్దనపల్లి ప్రాంతానికి చెందిన ప్రైవేట్ వాహన డ్రైవర్ శ్రీనివాసన్ (52) డెంకణీకోట సమీపంలోని నగనూరు గ్రామంలో నివాసముంటున్నాడు. శ్రీనివాసన్ కొంత మంది వద్ద అప్పు చేశాడు. తీసుకొన్న అప్పును తీర్చలేక, అప్పు ఇచ్చినవారు ఒత్తిడి చేయడంతో జీవితంపై విరక్తి చెంది ఆదివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

క్లుప్తంగా...

మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకం పొడిగింపు

- వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఉత్తర్వులు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి 31 వరకు పొడిగించింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులిచ్చారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)కు సమాంతరంగా మెడికల్ రీయింబర్స్‌మెంట్ పథకం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఉత్తర్వుల అమలుకు ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ సీఈవో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పేదలకు వైద్య సేవలు మరింత చేరువ

- ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సీహెచ్ హరికిరణ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వైద్య, ఆరోగ్యశాఖ సేవలు పేదలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ సీహెచ్ హరికిరణ్ అన్నారు. మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరికిరణ్ మాట్లాడుతూ.. నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కార్యక్రమాలు, పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీకి మాజీ ఎమ్మెల్యే మద్దాలి రాజీనామా



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు నగర అధ్యక్ష పదవికి గుంటూరు పశ్చిమ మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ రాజీనామా చేశారు. కొన్ని వ్యక్తిగత కారణాలతో నగర అధ్యక్ష పదవికి, పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. రాజీనామా లేఖను ఆమోదించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విన్నవించారు.

రైతులందరికీ పంటల బీమా

- కేబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రులు



సాక్షి, అమరావతి: నోటిఫై చేసిన పంటలు సాగు చేసే రైతులందరికీ పంటల బీమా వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్‌లు అధికారులను ఆదేశించారు. విపత్తుల వేళ నష్టపోయే ప్రతి రైతుకు న్యాయం జరిగేలా బీమా అమలు చేయాలని సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. మెరుగైన పంటల బీమా అమలు, దిగుబడి ఆధారంగా, వాతావరణ పరిస్థితులను బట్టి బీమా అమలు, క్లెయిమ్‌ల చెల్లింపులు తదితర అంశాలపై చర్చించామని, ఇందుకు సంబంధించి నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం కోసం పంపుతామని మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వంలో పంట బీమాను చిన్నాభిన్నం చేశారని, ప్రీమియం చెల్లింపులు సకాలంలో జరగలేదని మంత్రులు ఆరోపించారు. గతంలో బీమా లేక నష్టపోయిన మామిడి రైతులకు కూడా పంటల బీమా వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రజాస్వామ్యం గురించి వైఎస్సార్‌సీపీ మాట్లాడడం సిగ్గుచేటు

- స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్యం గురించి వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతుంటే నవ్వు వస్తోందని స్త్రీ, శిశు సంక్షేమం, గిరిజనశాఖల మంత్రి గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు. అబద్ధాలు ఆడటం వారికి వెన్నతో పెట్టిన విద్య అని చెప్పారు. ఆమె సోమవారం మంగళగిరి టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేత కావలి ప్రతిభాభారతితో కలిసి విజ్ఞప్తులు స్వీకరించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ జగన్ మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గవర్నర్ దగ్గరకు వెళ్లి రాష్ట్రపతి పాలన పెట్టాలని కోరడం చూస్తుంటే నవ్వు వస్తోందని చెప్పారు. గురువింద గింజ తన కింద ఉన్న నలుపును చూసుకోకుండా మాట్లాడినట్లు వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సొంత బాబాయి చనిపోయినప్పుడు గవర్నర్ దగ్గరకు వెళ్లి ఎందుకు అర్జీ ఇవ్వలేదని ప్రశ్నించారు. దెబ్బలాటలు, కొట్లాటలకు వైఎస్సార్‌సీపీ నేతలే ఆద్యులన్నారు. చిన్న పిల్లలకు చాక్లెట్ ఇస్తే బయటకు వచ్చినట్లు జగన్‌కి శవం కనిపిస్తే బయటకు వస్తున్నారని విమర్శించారు.

ఆత్మస్తుతి.. పరనింద!

- గవర్నర్ ప్రసంగంలో అసత్యాలు, అవాస్తవాలను వల్లె వేయించిన కూటమి ప్రభుత్వం
- అరాచక పాలన కప్పిపుచ్చేందుకే వైఎస్ జగన్ ప్రభుత్వంపై నిందలు
- ఖజానాలో రూ.7–8 వేల కోట్లు నిధులున్నా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేని దైన్యం
- 2019 నాటికి రూ.వంద కోట్లే ఉన్నా పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వ తీరు ఆద్యంతం ఆత్మస్తుతి.. పరనిందను తలపిస్తోంది. తనను తాను పొగుడుకోవడం, ప్రతిపక్షంపై నిందలు వేసేందుకు సీఎం చంద్రబాబు ప్రయత్నించారు. ఇప్పటికే విడుదల చేసిన శ్వేతపత్రాల ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నించిన సీఎం చంద్రబాబు తాజాగా గవర్నర్ ప్రసంగం ద్వారా అదే రీతిలో వ్యవహరించారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్ర ప్రజల కోసం.. రాష్ట్ర అభివృద్ధి కోసం ఏం చేస్తారన్నది చెప్పకుండా దాగుడుమూతలాడారు. పోనీ అమరావతినైనా ఎప్పటిలోగా కడతారు? అసలు కడతారా? లేదా? అన్నది కూడా తేల్చి చెప్పకపోవడం గమనార్హం. కమీషన్ల దాహంతో నాడు పోలవరం దక్కించుకున్న చంద్రబాబు చారిత్రక తప్పిదంతో విధ్వంసానికి పాల్పడితే వైఎస్ జగన్ ప్రభుత్వం ఆ తప్పులను సరిదిద్ది ప్రాజెక్టును తాను చేసిన విధ్వంసాన్ని వైఎస్ జగన్‌పై నెట్టేందుకు చంద్రబాబు ప్రభుత్వం యత్నించింది. సూపర్ సిక్స్ హామీల అమలుపై కప్పదాటు వైఖరి అనుసరించారు. రాష్ట్రం పూర్తిగా ధ్వంసం అయిపోయిందని, వనరుల సమీకరణ, అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించడం చాలా క్లిష్టంగా మారిపోయిందంటూ గవర్నర్ ప్రసంగంలో చెప్పించడాన్ని బట్టి చూస్తే.. హామీలను ఎగ్గొడుతున్నట్టు కూటమి ప్రభుత్వం చెప్పకనే చెప్పినట్లయింది. వైఎస్ జగన్ 2019లో అధికారంలోకి వచ్చినప్పుడు నాడు ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉన్నాయని తాము మిగిల్చినట్లు చంద్రబాబు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా చేసిన యనమల రామకృష్ణుడు స్వయంగా చెప్పారు. అయినప్పటికీ 2019–20 పూర్తిస్థాయి బడ్జెట్‌ను వైఎస్ జగన్ ప్రవేశపెట్టి చిత్తశుద్ధితో నవరత్నాలను అమలు చేశారు. ఇప్పుడు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఖజానాలో రూ.7–8 వేల కోట్లకుపైగా నిధులున్నాయి. అయినా సరే పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టకుండా మళ్లీ ఓటాన్ అక్కౌంట్‌కు వెళ్తుండటాన్ని బట్టి ఇంతకన్నా అసమర్థత ఏముంటుందని ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు.

అప్పులకుప్పగా మార్చి అభాండాలు..

విభజన తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చిన సమయంలో 2014–19 మధ్య అప్పుల సగటు వార్షిక వృద్ధి(సీఏజీఆర్) 21.87 శాతం ఉంటే.. 2019–24లో 12.51 శాతం ఉన్నట్లు కాగ్ తేల్చి చెప్పింది. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన చంద్రబాబు ఆ నెపాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వంపై మోపడం గమనార్హం.

పారిశ్రామికాభివృద్ధిపైనా అసత్యాలే..

జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సులభతర వాణిజ్యంలో ఏపీ వరుసగా నంబర్ వన్ స్థానంలో నిలుస్తూ వస్తోంది. ఎగుమతుల్లో రాష్ట్రం చంద్రబాబు హయాంలో తొమ్మిదో స్థానంలో నిలిస్తే.. జగన్ హయాంలో ఐదో స్థానానికి చేరుకుంది. పరిశ్రమల స్థాపన కోసం చంద్రబాబు హయాంలో ఏడాదికి సగటున రూ.11,994 కోట్ల పెట్టుబడులు వస్తే.. జగన్ హయాంలో ఏటా సగటున రూ.14,896 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఎంఎస్‌ఎంఈలు చంద్రబాబు హయాంలో 1.9 లక్షలు ఉంటే.. జగన్ హయాంలో ఏడు లక్షలకు చేరుకున్నాయి. అలాగే నాలుగు పోర్టులు, పది ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, మూడు ఇండస్ట్రియల్ కారిడార్లు, పది ఇండియస్ట్రియల్ నోడ్స్‌తో పారిశ్రామికాభివృద్ధిని పరుగులెత్తించారు. రాష్ట్రం 2018–19 నాటికి 3.2 శాతంతో 22వ స్థానంలో ఉండగా.. 2021–22 నాటికి 12.8 శాతం వృద్ధి రేటుతో మూడో స్థానంలో నిలవడమే అందుకు నిదర్శనం.

కళ్లెదుటే అరాచక పాలన..

రాష్ట్రంలో 2014–19 మధ్య శాంతిభద్రతలు మచ్చుకైనా కన్పించలేదు. ప్రజల మాన, ప్రాణాలతో టీడీపీ నేతలు చెలగాటమాడారు. వైఎస్ జగన్ అధికారంలో ఉండగా పోలీసు వ్యవస్థను గాడిలో పెట్టి శాంతి భద్రతలను పరిరక్షించారు. అందువల్లే రాష్ట్రం పారిశ్రామికాభివృద్ధిలో దూసుకెళ్లింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 45 రోజుల్లో 36 మంది హత్యకు గురికాగా 300 మందిపై హత్యాయత్నాలు జరిగాయి. టీడీపీ నేతల వేధింపులు భరించ లేక 35 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులను, 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. అరాచకాలు భరించలేక దాదాపు 2,700 కుటుంబాలు గ్రామాలు విడిచి వెళ్లిపోయాయి. ఇవన్నీ కాకుండా 1,050కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయి.

పోలవరాన్ని వెంటాడుతున్న చంద్రశాపం

చంద్రబాబు కమీషన్ల దాహంతో పోలవరంలో స్పిల్ వేను పూర్తి చేయకుండా ప్రధాన డ్యామ్ గ్యాప్–2లో పునాది డయాఫ్రమ్‌వాల్ నిర్మించి చారిత్రక తప్పిదం చేశారు. దీనివల్లే 2019, 2020లలో గోదావరికి వచ్చిన వరదల ఉధ్ధృతికి డయాఫ్రమ్‌వాల్ కోతకు గురై దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలో కోతకు గురై భారీ అగాధాలు ఏర్పడ్డాయి. రూ.2,917 కోట్ల విలువైన పనులను నాడు నవయుగకు అక్రమంగా నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టారు. పోలవరాన్ని చంద్రబాబు కమీషన్ల కోసం ఏటీఎంగా మార్చుకున్నారని 2019లో ప్రధాని మోదీ స్వయంగా చెప్పారు. 2005 నుంచి 2019 మే 29 నాటికి పోలవరంలో పూర్తయిన పనుల శాతం 24.85 శాతం మాత్రమే. కానీ గవర్నర్‌తో మాత్రం 72 శాతం పనులు తామే పూర్తి చేసినట్లు అవాస్తవాలు చెప్పించారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు రివర్స్ టెండరింగ్‌తో రూ.748 కోట్లను ఖజానాకు ఆదా చేశారు. 2024 జూన్ 11 నాటికి పోలవరం పనులు దాదాపు 49 శాతం పూర్తయ్యాయి. అంటే.. జగన్ ప్రభుత్వ హయాంలో పోలవరం పనులు 24.94 శాతం పూర్తయినట్లు స్పష్టమవుతోంది.

నాడు సంక్షేమం.. నేడు మోసం

- ఖజానాలో రూ.100 కోట్లే ఉన్నా సంక్షేమాన్ని కాంక్షించిన జగన్ సర్కారు
- అవే విషయాలు నాటి గవర్నర్ ప్రసంగంలో ప్రస్ఫుటంగా వెల్లడి
- ఇప్పుడు రూ.7 వేల కోట్లు ఉన్నా ప్రజలను మరోసారి మోసం చేసిన చంద్రబాబు
- తక్షణం హామీలు అమలు చేయలేమని గవర్నర్‌తో చెప్పించిన కూటమి
- గత ప్రభుత్వంపై నిందలతోనే సరి

కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఏదైనా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గవర్నర్ తొలి ప్రసంగం ద్వారా వెల్లడిస్తాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకిచ్చిన హామీల అమలు పైనే అప్పటి గవర్నర్ ప్రసంగం సాగింది. ప్రస్తుత చంద్రబాబు సర్కారు తీరు అందుకు పూర్తిగా భిన్నం. ఏ హామీ ఎప్పుడు అమలు చేసేది చెప్పడానికి బదులు హామీలనే అమలు చేయలేమని గవర్నర్ చేత చెప్పించడం ద్వారా మరోసారి ప్రజలను మోసం చేసింది.

సాక్షి, అమరావతి: ప్రజలకు మేలు చేయాలన్న ఆకాంక్ష ఉంటే ఖజానాలో నిధులెన్ని ఉన్నాయన్న ప్రశ్నే ఉత్పన్నం, కాదని నాడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరూపించారు. ప్రజలకు మేలు చేయాలన్న ఉద్దేశమే లేనప్పుడు ఎన్ని నిధులున్నా ఆ ఆలోచనే ఉండదని నేడు మరోసారి ముఖ్యమంత్రి పీఠమెక్కిన నారా చంద్రబాబునాయుడు నిరూపిస్తున్నారు. 2019 ఎన్నికల అనంతరం అప్పటి గవర్నర్ ప్రసంగ పాఠం, తాజాగా సోమవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగ పాఠం ఈ విషయాన్ని నిరూపిస్తున్నాయి. 2019 వరకు రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు దిగిపోయేనాటికి ఖజానా ఖాళీ చేసేశారు. అప్పుడు ఖజానాలో ఉన్న నిధులు రూ.100 కోట్లు మాత్రమే. అయినా 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తరువాత ఆ ఏడాది జూన్ 14న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ నర్సింహన్ చేసిన తొలి ప్రసంగం మొత్తం ప్రజలకిచ్చిన హామీలను, నవరత్నాలను అమలు చేయడమే లక్ష్యంగా సాగింది. నవరత్నాలను ప్రతి ఇంటికీ చేరుస్తామని గవర్నర్ తన ప్రసంగంలో స్పష్టం చేశారు. 2019 జూన్ 10న జరిగిన తొలి కేబినెట్ సమావేశంలోనే నవరత్నాల్లో ప్రజలకిచ్చిన 60 శాతం పైగా హామీల అమలుకు జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఆ నిర్ణయాలన్నీ గవర్నర్ ప్రసంగంలో వెల్లడించారు. సవాళ్లు ఎన్ని ఉన్నా ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తూ పారదర్శక పాలన అందిస్తామని భరోసా ఇచ్చారు. లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ ప్రయోజనాలను తీసుకెళ్తామని కూడా తెలిపారు. అంతేకాదు.. పింఛన్లు దశలవారీగా పెంపు, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ బీమా, సున్నా వడ్డీ రుణాలు, ఉద్యోగులకు ఐఆర్, ఆరోగ్య శ్రీ పథకం అమలు వంటి వాటికి తొలి బడ్జెట్‌లోనే నిధులు కేటాయించి, వాటిని సమర్థంగా అమలు చేయడానికి ప్రయత్నించారు.

ఇప్పుడు పూర్తి వ్యతిరేకంగా

ఇప్పుడు చంద్రబాబు కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్ర ఖజానాలో రూ.7 వేల కోట్ల నిధులున్నాయి. అయినా, నాటి వైఎస్ జగన్ ప్రభుత్వంలో గవర్నర్ తొలి ప్రసంగానికి పూర్తి పూర్తి భిన్నంగా సోమవారంనాటి గవర్నర్ ప్రసంగ పాఠం ఉంది. ప్రజలకిచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చలేమని చంద్రబాబు ప్రభుత్వం గవర్నర్ చేత విస్పష్టంగా చెప్పించింది. లేని అప్పులను చూపిస్తూ ఆర్థికరంగం అస్తవ్యస్తం అంటూ గవర్నర్‌తో అసత్యాలు చెప్పించింది. పూర్తి స్థాయి బడ్జెట్‌ను కూడా ఇప్పుడు పెట్టలేమని చెప్పించింది. కేవలం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందారోపణలు చేయించింది. శ్వేతపత్రాల పేరుతో గవర్నర్ చేత అవాస్తవాలు చెప్పించింది.

గవర్నర్ ప్రసంగం ప్రతి మాయం

నాడు వైఎస్ జగన్ సర్కారులో గవర్నర్ చేసిన తొలి ప్రసంగం ప్రతిని ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి చంద్రబాబు సర్కారు మాయం చేసింది. 2019 జూన్ 14న అప్పటి గవర్నర్ నర్సింహన్ ఉభయ సభలనుద్దేశించి చేసిన ప్రసంగాన్ని సాధారణ పరిపాలన శాఖ వెబ్‌సైట్ నుంచి మాయం చేసింది. దాని స్థానంలో 2019 ఎన్నికలకు ముందు ఆ ఏడాది జనవరి 30న అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా గవర్నర్ చేసిన ప్రసంగం ప్రతులను ఉంచింది.

ఆకాంక్షలు ఆవిరి!

సాక్షి, అమరావతి: "రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆకాంక్షలతో ఎన్డీఏ కూటమికి బలమైన తీర్పునిచ్చారు. కానీ ఇప్పటికిప్పుడు వారి ఆకాంక్షలు (హామీలు) నెరవేర్చే పరిస్థితి ఏమాత్రం కనిపించడం లేదు. ఉద్యోగులు, పింఛన్‌దారులకు బకాయిల చెల్లింపులతో పాటు రాష్ట్రంపై రూ.10 లక్షల కోట్ల అప్పుల భారం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఉదారంగా సాయం అందించాలి. లేకుంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో వనరుల సమీకరణ, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం చాలా కష్టం, సంక్లిష్టం. సంక్షోభాన్ని అధిగమించే మార్గాలను అన్వేషించాల్సి ఉంది. మేధావులు, విద్యావేత్తలతో విస్తృతమైన చర్చలు జరపాలి. అందుకే అర్థవంతమైన చర్చల తర్వాతే పూర్తి స్థాయి బడ్జెట్‌కు వెళ్లాలని మా ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రజలందరూ ప్రభుత్వానికి సహకరించాలి'' అని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సోమవారం అసెంబ్లీ హాలులో ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు.

నాడు 13.5% సమ్మిళిత వృద్ధి సాధించాం

కొత్తగా ఎన్నికైన సభ్యులకు శుభాకాంక్షలు. ప్రజలు మార్పు కావాలని కోరుకున్నారు. వారి ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత మీపై ఉంది. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితంగా భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్‌ను 2014 జూన్‌లో మెజార్టీ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా అశాస్త్రీయంగా, అప్రజాస్వామికంగా విభజించారు. జనాభాలో 58.32 శాతం ఉన్న మన రాష్ట్రానికి 46 శాతం వనరులు వారసత్వంగా వచ్చాయి. ఆస్తులు, అప్పుల పంపిణీ సజావుగా జరగలేదు. హైదరాబాద్ నగరాన్ని కోల్పోవడంతో ఆర్థికంగా నష్టం జరిగింది. రుణభారం పెరిగింది. తలసరి ఆదాయం రూ.1,06,176 నుంచి రూ.93,121కి పడిపోయింది. ఈ సవాళ్లను అధిగమించి సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ దిశగా 2014–19లో గట్టి పునాది వేశాం. గోదావరి, కృష్ణాను అనుసంధానిస్తూ ప్రతిష్టాత్మక పట్టిసీమ ప్రాజెక్టును రికార్డు సమయంలో పూర్తి చేశాం. రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశాం. వృద్ధాప్య పింఛన్ల పెంపుదల, రైతు రుణమాఫీ లాంటి సంక్షేమ కార్యక్రమాలు అమలుతో 2014–19 మధ్య 13.5 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు సాధించాం.

విధ్వంసకర పాలనతో బ్రాండ్ ఏపీకి తీరని నష్టం

2019 జూన్‌లో బాధ్యతలు స్వీకరించిన ప్రభుత్వం



ప్రజావేదిక కూల్చివేత ద్వారా విధ్వంసకర పాలనతో బ్రాండ్ ఏపీకి భారీ నష్టం జరిగింది. ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు నిర్వీర్యమయ్యాయి. రాష్ట్రానికి చెప్పుకోదగ్గ కంపెనీలు రాలేదు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు ఇతర రాష్ట్రాలకు తరలి పోయారు. ఆదాయవృద్ధి పరిమితంగా ఉండగా ఖర్చులు అపరిమితంగా పెరిగిపోయాయి. మునుపెన్నడూ లేని రీతిలో బిల్లుల చెల్లింపులకోసం దాదాపు 25 వేల కేసులు దాఖలు అయ్యాయి. 2014–19తో పోలిస్తే 2019–24 మధ్య మూలధన వ్యయం 60 శాతం తగ్గిపోయింది. ప్రధానంగా జల వనరులపై 56 శాతం, రోడ్లు భవనాలపై 85 శాతానికి మూలధన వ్యయం తగ్గిపోయింది. సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు 12.8 శాతం నుంచి 8.1 శాతానికి పడిపోయింది. రెవెన్యూ వ్యయం 7.8 శాతం నుంచి 10.5 శాతానికి పెరగగా మూలధన వ్యయం వృద్ధి 26.4 శాతం నుంచి 3.4 శాతానికి క్షీణించింది.

మూడు రాజధానుల ఆలోచనతో ప్రజలను గందరగోళానికి గురిచేసింది. అమరావతి రాజధాని ప్రాంతం పూర్తిగా నాశనమైంది. ఏకపక్ష ప్రకటనతో రాజధాని ప్రాంత అభివృద్ధి అథారిటీ అధికార పరిధిని 6,993 చ.కి.మీకు కుదించారు. ప్రాంతీయ బృహత్తర ప్రణాళికను ప్రక్కన పెట్టారు. 191 ఎకరాలలో మాత్రమే భూసేకరణ చేశారు. ఫలితంగా రూ.2 లక్షల కోట్ల సంపద నష్టానికి దారి తీసింది. 2018 నాటికి ఇంధన మిగులు రాష్ట్రంగా నిలవగా గత ప్రభుత్వ చర్యల ఫలితంగా ఇంధన రంగం రూ.1,29,503 కోట్ల భారీ నష్టాలకు గురైంది. భూములు, గనులు, ఖనిజాలు, అడవులు లాంటి సహజ వనరులు పెద్ద ఎత్తున దుర్వినియోగమయ్యాయి. రీ–సర్వే, ఏపీ భూ హక్కు చట్టం ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. 1.75 లక్షల ఎకరాలలో రూ.35,576 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇసుకను కొల్లగొట్టడంతో రూ.19,000 కోట్ల నష్టం వాటిల్లింది. ఖనిజ రాబడిలో రూ.9,750 కోట్ల నష్టం వాటిల్లింది. అనైతిక ఇసుక విధానం వల్ల 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు.

ఇప్పటికిప్పుడు హామీలన్నీ అమలు చేయలేం

ప్రజలు ప్రభుత్వ మార్పును బలంగా కోరుకోవడం వల్లే 93 శాతం స్ట్రయిక్ రేట్‌తో ఎన్డీఏకు చారిత్రక తీర్పునిచ్చారు. గాడి తప్పిన పాలనను తిరిగి గాడిలో పెట్టడం సవాలుతో కూడుకున్న పని. ఎన్నికల హామీలను నెరవేర్చడం ప్రారంభించాం. 'సూపర్ సిక్స్' నాగ్దానాల అమలుకు కట్టుబడి ఉన్నాం. ఇప్పటికే 16,347 ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మెగా డీఎస్సీని ప్రకటించడం, ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయడం, సామాజిక భద్రత పింఛన్లను రూ.4 వేలకు పెంచడం, నైపుణ్య గణన, ఉచితంగా ఇసుక సరఫరా లాంటివి చేపట్టాం. అన్న క్యాంటీన్లను కూడా ప్రారంభిస్తున్నాం. మిగిలిన హామీల అమలుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఇప్పటికిప్పుడు వారి ఆకాంక్షలను నెరవేర్చడం సాధ్యం కాదని తెలియజేస్తున్నా. వనరుల సమీకరణ చాలా కష్టంగా ఉంది. నిధుల లేమి కారణంగా అభివృద్ధి ప్రణాళిక చాలా సంక్లిష్టంగా ఉంది. ఇప్పటికే ప్రధానితో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వివరించాం. రాష్ట్రానికి ఉదారంగా సాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేశాం. ప్రస్తుతమున్న ఆందోళనకరమైన ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వానికి సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

చిన్నారులపై నేరాలు.. అత్యాచారాలు పెరిగాయి

గత ఐదేళ్లలో మహిళలు, చిన్నారులపై నేరాలు.. ఎస్సీలు, ఎస్టీలు, ఇతర బలహీన వర్గాలపై అఘాయిత్యాలు పెరిగాయి. ఎక్సైజ్ ఆదాయ మార్గాలను గత ప్రభుత్వం అపహాస్యం పాలు చేసింది. ఎక్సైజ్‌పై వ్యాట్‌ను తగ్గించి ప్రత్యేక మార్జిన్‌గా రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్‌కు మళ్లించారు. మద్యం ధరపై ప్రభుత్వం అదనపు రిటైల్ ఎక్సైజ్ సుంకాన్ని విధించింది. అధిక ధరలకు నాణ్యత, గుర్తింపు లేని బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేయడం, ప్రభుత్వ విధానాలు ఎక్సైజ్ ఆదాయ మార్గాలకు కోలుకోలేని నష్టాన్ని కలిగించాయి. ప్రభుత్వ అనైతిక చర్యల వల్ల గత ఐదేళ్లలో అప్పులు రెట్టింపు కంటే మించిపోయాయి. జీతాలు, పింఛన్ల భారీ బకాయిలతో పాటు సుమారు రూ.10 లక్షల కోట్ల రుణ భారం తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వంపై పడింది. రంగాల వారీగా విడుదల చేస్తున్న శ్వేతపత్రాల ద్వారా ఐదేళ్ల పాలనలో వ్యవస్థల వైఫల్యం, అవినీతికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్తున్నాం.

మీడియా పాయింట్

గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకోవడం సరికాదు

ప్రత్తిపాడు టీడీపీ ఎమ్మెల్యే బి.రామాంజనేయులు



సాక్షి, అమరావతి: గౌరవ స్థానంలో ఉన్న గవర్నర్ ప్రసంగాన్ని వైఎస్సార్‌సీపీ సభ్యులు అడ్డుకుని సభ నుంచి వెళ్లిపోవడం సరికాదు. ఈ చర్య రాష్ట్ర ప్రజల మనోభావాలను అగౌరవ పరిచేలా ఉంది. గత ఐదేళ్లలో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలు, అభివృద్ధి ఎలా కుంటుపడిందో గవర్నర్ వివరించారు. వాస్తవాలు ప్రజలకు తెలియకుండా అడ్డుకునేందుకే వైఎస్సార్‌సీపీ సభ్యులు నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వ విజన్‌ను గవర్నర్ ప్రసంగంలో ప్రజలకు తెలియజేశారు.

ప్రభుత్వ విధానాలపై స్పష్టత ఏది?

పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు



గవర్నర్ ప్రసంగంలో గత ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపారే తప్ప.. ప్రస్తుత ప్రభుత్వం ఏం చేయబోతోంది, దాని విధానాలపై స్పష్టత ఇవ్వలేదు. చివరగా 30వ పేరాలో కేవలం 9 లైన్లు మాత్రమే రాష్ట్రం దిశ గురించి సంక్షిప్తంగా ప్రస్తావించారు. ప్రధానంగా విద్యా రంగం గురించి ఈ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చెప్పలేదు. మెగా డీఎస్సీ అని చెబుతున్న ప్రభుత్వం.. 16,347 పోస్టుల భర్తీ ప్రక్రియను డిసెంబర్ వరకు పొడిగించడం సరికాదు. ఇప్పటికే ఆరున్నరేళ్లుగా పాఠశాల విద్యారంగంలో పోస్టుల భర్తీ లేదు. మరో ఏడాది నెట్టేస్తే ఎలా? దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదు.

ప్రజావ్యతిరేక విధానాలను ఉపేక్షించేది లేదు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు చేపడితే ఉపేక్షించేది లేదు. గవర్నర్ ప్రసంగం 20 పేజీలు ఉన్నా ఎక్కడా కొత్త ప్రభుత్వ విజన్ ఏమిటో స్పష్టత ఇవ్వలేదు. ప్రధానంగా అమరావతి, పోలవరం వంటి వాటి విషయంలో ప్రభుత్వం ఏం చేస్తుందో చెప్పలేదు. భవిష్యత్‌లో ఈ ప్రభుత్వం ఏం చేస్తుందో కనీసం చెప్పలేదు.

జగన్ మాటలు వినేందుకు ప్రజలు సిద్ధంగా లేరు

తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్



సేవ్ ఆంధ్రప్రదేశ్ అని జగన్ నినాదాలు ఇస్తున్నారు. ప్రజలు మాత్రం సేవ్ ఆంధ్రప్రదేశ్ ఫ్రం జగన్‌మోహన్‌రెడ్డి అని తీర్పు చెప్పారు. ఐదేళ్లు అధికారంలో ఉన్న జగన్ చేసిన అనేక చర్యలకు వ్యతిరేకంగా ప్రజలు 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అని అనేక సందర్భాల్లో నినాదాలు చేశారు. పెత్తందారీ మనస్తత్వం కలిగిన, ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్... గవర్నర్ ప్రసంగం ప్రారంభం కాగానే సభ నుంచి వెళ్లిపోయారు. ఆయన ఇప్పుడు సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ గల్లీలో, ఢిల్లీలో ఏం మాట్లాడినా వినేందుకు ప్రజలు, నమ్మేందుకు నాయకులు సిద్ధంగా లేరు.

గవర్నర్‌తో పచ్చి అబద్ధాలు చెప్పించారు

- పోలవరం, హోదా సూపర్ సిక్స్ ఏవి?
- హామీల అమలుపై చేతులెత్తేశారు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చంద్రశేఖర్



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో పచ్చి అబద్ధాలు వల్లె వేసిందని, అసెంబ్లీ సాక్షిగా నయవంచన చేసిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు హయాంలో అద్భుతాలు చోటుచేసుకున్నట్లు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందంటూ పచ్చి అబద్ధాలు మాట్లాడించారని ఆయన విమర్శించారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే.. రాష్ట్రంలో గత 45 రోజులుగా కొనసాగుతున్న దారుణాలను ప్రశ్నిస్తూ తామంతా నల్ల కండువాలతో సభకు వస్తుంటే అడ్డుకోవడం.. ప్లకార్డులను చించివేయడం అనైతిక చర్య. ప్రజలకు ఏం చేస్తామనేది చెప్పకుండా, మాపై దూషణలే లక్ష్యంగా గవర్నర్ ప్రసంగాన్ని రూపొందించారు. పోలవరం, ప్రత్యేక హోదా, రాజధాని అమరావతి, సూపర్ సిక్స్ హామీల ప్రస్తావన ఏదీ గవర్నర్ ప్రసంగంలో లేదు. ఈ పథకాల అమలు అసాధ్యమని గవర్నర్ ప్రసంగం ద్వారా ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. ఇక ఒక్క నెలలో తీసుకొచ్చిన రూ.14,200 కోట్ల రుణాలు ఏం చేశారు? ఆ మొత్తం ఎవరెవరి జేబుల్లోకి వెళ్లిందో చెప్పాలి. ఈ ప్రభుత్వం అతి తక్కువ వ్యవధిలో అత్యధిక అప్పుచేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రాగా మారుస్తోంది. గత నెలలో ఎన్నికల ఫలితాల వచ్చిన రోజు నుంచే రాష్ట్రంలో ఇసుక దోపిడీ మొదలుపెట్టారు. వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని నిల్వచేసిన 75లక్షల టన్నుల ఇసుకలో దాదాపు సగం దోచేశారు. మరోవైపు.. హామీలను అమలు చేయలేకే చంద్రబాబు ఓటాన్ అకౌంట్‌కు వెళ్తున్నారు. దేశంలో ఏ ప్రభుత్వం కూడా ఏడు నెలల కాలాన్ని ఇలా ఓటాన్ అకౌంట్‌తో వెళ్లదీయలేదు.

ప్రతిపక్షం లేకుండా కుట్ర

ప్రతిపక్ష నేతగా జగన్‌కి అవకాశమిస్తే ప్రభుత్వ తప్పుల్ని, దుర్మార్గాల్ని ఎత్తిచూపుతాం కాబట్టి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వని పరిస్థితి. ఢిల్లీలో 70 సీట్లకు గానూ మూడు సీట్లు వచ్చిన పార్టీకి ప్రతిపక్ష హోదా ఇస్తే, 40 శాతం ఓటింగ్ సాధించిన వైఎస్సార్‌సీపీకి ఎందుకివ్వరు? సభలో అసలు ప్రతిపక్షం లేకుండా కుట్ర చేస్తున్నారు.

చంద్రబాబు 'వాయిస్'లా షర్మిల

పీసీసీ అధ్యక్షురాలు షర్మిల చంద్రబాబు వాయిస్‌లా పనిచేస్తున్నారు. ఆయనకు ఏ కష్టం వచ్చినా ఆమె బయటికొచ్చి మాట్లాడుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించని షర్మిల.. అదే పనిగా మా పార్టీ పైనా, మా ప్రభుత్వం పైనా పిచ్చి విమర్శలు చేస్తున్నారు. రాష్ట్రంలో గత 45 రోజులుగా రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తున్నా.. వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నా.. ఆమె ఏనాడూ నోరు మెదపలేదు. వీటిపై ఎందుకు స్పందించడం లేదు?



కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో విజయసాయిరెడ్డి భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాతో వైఎస్సార్‌సీపీ రాజ్యసభాపక్ష నేత విజయసాయిరెడ్డి భేటీ అయ్యారు. పార్లమెంటులోని అమిత్‌షా కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజా ప్రయోజనాలకు సంబంధించి పలు అంశాలపై వారిద్దరూ చర్చించారు. ఈ మేరకు ఎంపీ విజయసాయిరెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఏపీలో జాతీయక్రీడలు నిర్వహించాలి

కేంద్రాన్ని కోరిన టీడీపీ ఎంపీ హరీష్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో జాతీయక్రీడలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ ఎంపీ జి.ఎం. హరీష్‌బాలయోగి విజ్ఞప్తి చేశారు. పారిస్ ఒలింపిక్స్ సన్నాహకాలపై సోమవారం లోక్‌సభలో నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో ఆయన మాట్లాడారు.

వచ్చే నెలాఖరులోగా పూర్తి చేయాలి

- రాజధానిలో 'సిటిస్' పనులపై అధికారులకు మంత్రి నారాయణ ఆదేశం

సాక్షి, అమరావతి: రాజధానిలోని పలు గ్రామాల్లో సిటిస్ (సిటీ ఇన్వెస్ట్‌మెంట్స్ టూ ఇన్నోవేటివ్ ఇంటిగ్రేట్ అండ్ సస్టెయిన్ – సీఐటీఐఐఎస్) చాలెంజ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చేపట్టిన అన్ని నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోపు పూర్తి చేయాలని మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. విజయవాడ సీఆర్‌డీఏ కార్యాలయంలో అధికారులు, కాంట్రాక్టర్లతో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. రాజధాని ప్రాంతంలో చేపట్టిన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి, తాడికొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 24 గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఏ దశలో ఉన్నాయని ఆరా తీశారు. సీఐటీఐఐఎస్ ప్రాజెక్ట్‌లో భాగంగా 14 ప్రభుత్వ పాఠశాలలు, 17 అధునాతన అంగన్‌వాడీ సెంటర్లు, 16 ఈ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, ఒక బహుళ అత్యాధునిక పర్యావరణ స్మశాన వాటిక నిర్మాణం పనులు పూర్తి చేసేలా గడువును నిర్దేశించారు.

బ్యూటిప్స్



- ఆపిల్ ముక్కతో ముఖమంతా మృదువుగా రబ్ చేసి, పది నిమిషాల తర్వాత శుభ్రపరుచుకోవాలి. ముఖంలోని అదనపు జిడ్డు తొలగిపోవడంతో మొటిమలు తగ్గి చర్మం తాజాగా కనిపిస్తుంది.
- కీరా రసంలో రోజ్‌వాటర్, నిమ్మరసం కలపాలి. రాత్రి పడుకోబోయే ముందు ఈ మిశ్రమాన్ని వేళ్లతో అద్దుకొని ముఖానికి రాసుకోవాలి. మరుసటి రోజు ఉదయాన్నే శుభ్రపరుచుకోవాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు తగ్గడమే కాకుండా ముఖం తాజాగా కనిపిస్తుంది.



● సిద్దిపేట స్టీల్ బ్యాంక్

ప్రతి ఊరికి కావాలి ఇలాంటి స్టీల్ బ్యాంక్

పెళ్లయినా శుభకార్యమైనా పార్టీ మీటింగ్ అయినా ప్రభుత్వ హెల్త్ క్యాంప్‌లైనా భోజనాల దగ్గర ప్లాస్టిక్ వాడకం ఉంటుంది. చెత్త పేరుకు పోతుంది. డబ్బు కూడా వృథా. అదే స్టీల్ గిన్నెలు ఉంటే? ఒకసారి కొంటే ప్రతిసారి ఉపయోగించుకోవచ్చు. ఈ ఆలోచనతో 2020లో తెలంగాణాలోని సిద్దిపేటలో ఏర్పడిన స్టీల్ బ్యాంక్ 'ఎకానమిక్ సర్వే 2023-24 బుక్'లో తాజాగా చోటు సంపాదించుకుంది. ఇది మహిళా నిర్వహణకు వారి పర్యావరణ దృష్టికి దక్కిన విజయం.

ఇది మహిళల విజయం. జాతీయంగా దక్కిన గుర్తింపు. కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే సమయంలో ఎకనామిక్ సర్వే రిపోర్ట్‌ను విడుదల చేస్తారు. సోమవారం విడుదల చేసిన రిపోర్ట్ 12వ చాప్టర్‌లో మౌలిక సదుపాయాలు, వృద్ధిలో భాగంగా సిద్దిపేట స్టీల్ బ్యాంక్ వలన జరిగిన ఉపయోగం గురించి వివరించారు. దీనితో స్టీల్ బ్యాంక్ నిర్వాకులైన మహిళలతో పాటు సిద్దిపేట ఎం.ఎల్.ఏ. హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ వద్దనుకుని

2022లో సిద్దిపేట మున్సిపాలిటీలో 'కంటి వెలుగు కార్యక్రమం'లో భాగంగా వైద్య సిబ్బందికి ఆయా గ్రామ పంచాయతీలు భోజన ఏర్పాట్లు చేశాయి. వైద్య సిబ్బంది భోజనం చేసేందుకు ప్లాస్టిక్‌ను వినియోగించాల్సి వచ్చింది. ఇది ఊళ్లో అనవసర చెత్తను పోగు చేస్తోంది. అదే సమయంలో పర్యావరణానికి హాని కూడా. ఈ పారేసిన ప్లాస్టిక్‌ని పశువులు తింటే ప్రమాదం. అందుకే డీపీఓ దేవకీదేవి ప్లాస్టిక్‌కు బదులు స్టీలు వాడాలని నిర్ణయం తీసుకున్నారు. ఒక్కో గ్రామ పంచాయతీ నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకూ సేకరించి స్టీల్ ప్లేట్‌లు, గ్లాస్‌లు, స్పూన్‌లు, వాటర్ బాటిల్‌లను కొనుగోలు చేశారు. ఇలా ఏ గ్రామానికి ఆ గ్రామం కొని జిల్లాలోని 499 గ్రామ పంచాయతీల్లో వినియోగించారు. దీంతో రోజుకు 6 కిలోల నుంచి 8 కిలోల ప్లాస్టిక్‌ను వినియోగించకుండా నిర్మూలించారు.

సంతోషంగా ఉంది...



ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేయించాం. మనం పాటించి తర్వాత ప్రజలు పాటించాలన్న స్ఫూర్తితో బ్యాంక్‌ల ఏర్పాటు. కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య సిబ్బందికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేశాం. వీరికి స్టీల్ ప్లేట్, గ్లాసులు, వాటర్ బాటిల్‌ల ద్వారానే అందించాం. మా కృషికి గుర్తింపు దొరకడం సంతోషంగా ఉంది

– దేవకీదేవి, డీపీఓ

కిరాయి రేట్లు ఇవీ... ● స్టీల్ ప్లేట్ - రూ1.25 ● టిఫిన్ ప్లేట్ - రూ1.00 ● వాటర్ గ్లాస్ - రూ 0.25 ● టీ గ్లాస్ - రూ 0.25 ● చెంచాలు - రూ 0.25

సంఘం మహిళలు

'మాది సిద్దిపేటలోని వెన్నెల సమైక్య మహిళా సంఘం. శ్రీసాయితేజ సమైక్య మహిళా సంఘంకు చెందిన గడ్డమీది నవ్య ఇద్దరం కలిసి గత నాలుగేళ్లుగా స్టీల్ బ్యాంక్‌ను కొనసాగిస్తున్నాం. మా ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ప్రత్యేక చొరవతో సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 34 వార్డుల్లో స్టీల్ బ్యాంక్‌లను ఏర్పాటు చేశారు. 29, ఫిబ్రవరి 2020న మా స్టీల్ బ్యాంక్ ప్రారంభించారు. మా వార్డు పరిధిలో వివాహాలు, ఇతర శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలు జరిగితే ముందుగానే సామాగ్రి కోసం సమాచారం ఇస్తారు. వారు ఎంత మందితో కార్యక్రమం నిర్వహిస్తున్నారో చెబితే వారికి సరిపడా సామాగ్రిని అందజేస్తాం. వీటిని ప్రత్యేక సంచిలో వేసి ఇస్తాం. వారి కార్యక్రమం అయిపోయిన తర్వాత క్లీన్ చేసి తీసుకువస్తారు. ఏదైనా వస్తువులు మిస్ అయితే వాటికి డబ్బులు తీసుకుంటాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్లేట్‌లు, గ్లాస్‌లు, కప్‌లు ధర కంటే తక్కువ అద్దెకే కిరాయికి ఇస్తున్నాం. ప్లాస్టిక్ నిర్మూలిస్తున్నామనే సంతోషంతో పాటు మాకు ఆర్థికంగా సైతం దోహద పడుతుంది. మా కమిషనర్ ప్రసన్న రాణి, చైర్ పర్సన్ కడవేర్గు మంజుల, కౌన్సిలర్ దీప్తిల సహకారంతో ముందుకు వెళ్తున్నాం. పెళ్లిళ్ల సీజన్ అయితే ఎక్కువ మంది తాకిడి ఉంటుంది. మా దగ్గర అన్ని కిరాయికి పోతే మా పక్క వార్డులో ఉంటే తీసుకుని వారికి అద్దెను చెల్లిస్తాం. ప్రజల నుంచి బాగా స్పందన వస్తోంది.



ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి రేపటి తరాలకు మంచి పర్యావరణాన్ని బహుమతిగా ఇవ్వాలనే లక్ష్యంతో వీటి బాధ్యతలను నిర్వర్తిస్తున్నాం.

– బాలగోని దీప్తి,
వెన్నెల సమైక్య మహిళా సంఘం.

సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 34 స్టీల్ బ్యాంక్‌లో ఉన్న పాత్రల వివరాలు

భోజనం ప్లేట్లు 25,500, అల్పాహార ప్లేట్లు 8,500, వాటర్ గ్లాసులు 25,500, టీ గ్లాసులు 8,500, చెంచాలు 25,500, చిన్న గిన్నెలు 25,500, స్టీల్ ట్రేలు 612, బకెట్లు 272, ఇతరములు 3వేలు వస్తువులున్నాయి.

– గజవెల్లి షణ్ముఖ రాజు, సిద్దిపేట, సాక్షి
– ఫొటోలు: **కె. సతీష్ కుమార్**



● రేస్‌లో పాల్గొన్న అతికా మీర్

ఫస్ట్ టైమ్

తొమ్మిదేళ్ల రేసర్

'రోటాక్స్ మ్యాక్స్ ఛాలెంజ్' ప్రతి ఏటా జరిగే అంతర్జాతీయ స్థాయి గోకార్ట్ రేసింగ్. 7 నుంచి 15 ఏళ్ల లోపు వయసు పిల్లలు అనేక దేశాల నుంచి పాల్గొంటారు. 9 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లల 'మైక్రో మ్యాక్స్' రేస్‌లో ఈసారి విజేతగా నిలిచింది మన కశ్మీర్ చిన్నారి అతికా మీర్. దాదాపు గంటకు 65 కిలోమీటర్ల వేగంతో గోకార్ట్ నడుపుతూ డ్రైవింగ్ మెళకువలు ప్రదర్శిస్తూ ఈ విజయం సాధించింది. మోటర్‌స్పోర్ట్స్ చరిత్రలో గోకార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో రేస్ గెలిచిన ఫస్ట్-ఫిమేల్ రేసర్‌గా చరిత్ర సృష్టించింది అతికా మీర్....



ప్రతిష్ఠాత్మకమైన రోటాక్స్ మాక్స్ ఛాలెంజ్(ఆర్ఎంసీ) ఇంటర్నేషనల్ ట్రోఫీలో మైక్రో మాక్స్ కేటగిరీ రేస్ 2లో అతికా మీర్ విజయం సాధించింది. గోకార్ట్ ఇంటర్నేషనల్ సర్క్యూట్(ఫ్రాన్స్)లో పాల్గొనడం మీర్‌కు ఇదే తొలిసారి. ముందస్తు ప్రాక్టీస్ లేకపోయినప్పటికీ కొత్త బ్రాండ్ కార్ట్‌ను వేగంగా ఎడాప్ట్ చేసుకొని తన ప్రతిభ చాటుకుంది. రోటాక్స్ మాక్స్ చాలెంజ్ ప్రతిష్ఠాత్మకమైన రేస్. ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులైన కార్ట్ డ్రైవర్స్‌కు వేదిక. రేస్ 2లో అతికా విజయాన్ని 'స్పీడ్ అండ్ స్ట్రాటజీ'కి సంబంధించి మాస్టర్‌క్లాస్ అంటున్నారు విశ్లేషకులు.

'రేస్ విన్ అయినందుకు చాలా సంతోషంగా ఉంది. యూరప్‌లో ఇది నా తొలి విజయం. ఈ విజయం కోసం చాలా శ్రమ పడ్డాను. నా టీమ్ ఎంతో సహకారాన్ని అందించింది. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం నాకెంతో బలం' అంటుంది అతికా మీర్.

దుబాయ్‌లోని మాల్స్‌లో మీర్ సరదాగా ఎలక్ట్రిక్ కార్లు నడిపేది. మీర్ డ్రైవింగ్ స్కిల్స్‌ను చూసి తండ్రితో సహా మాల్‌లో ఉన్న వాళ్లు ముక్కున వేలేసుకునేవారు. మీర్ తండ్రి ఆసిఫ్ నజీర్ మీర్ మన దేశ తొలి నేషనల్ కార్టింగ్ ఛాంపియన్. డ్రైవింగ్‌కు సంబంధించి తండ్రి ఇచ్చిన రకరకాల టైమ్ చాలెంజ్‌లను బీట్ చేసి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తేది మీర్.

'ఇక టైమ్ వృథా చేయవద్దు. మీర్‌ను కార్టింగ్ ప్రపంచంలోకి తీసుకురావాల్సిందే' అనుకున్నాడు ఆసిఫ్ నజీర్.

ఇక ఆరోజు నుంచి మీర్‌లో కార్టింగ్‌పై మొదలైన ఇష్టం అంతకంతకూ పెరుగుతూ పోయింది. ఫిట్‌నెస్ స్కిల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఫార్ములా వన్‌లో విజయకేతనం ఎగరేసి చరిత్ర సృష్టించాలని కల కనేలా చేసింది.


ఆరు సంవత్సరాల వయసులో ఎఫ్ఐఏ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకున్న ఫస్ట్ అండ్ యంగెస్ట్ ఫిమేల్ డ్రైవర్‌గా రికార్డ్ సృష్టించింది. మీర్ తొలి ఫుల్ సీజన్ రేసింగ్ యూఏఇలో జరిగిన మినీ ఆర్ కేటగిరితో మొదలైంది. ఈ రేస్‌లో వైస్-చాంపియన్ టైటిల్ గెలుచుకుంది.

వచ్చే ఆగస్టులో మీర్ యూకేలోని వరల్డ్-ఫేమస్ 'కార్ట్‌మాస్టర్స్'లో డ్రైవింగ్ చేయనుంది. ఇటలీలోని ఐరన్ డేమ్స్ యంగ్ టాలెంట్ ఈవెంట్‌కు కూడా ఎంపికైంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ పోటీకి ఎంపికైన 11 మంది బాలికలలో ఆసియా నుంచి ఎంపికైన ఏకైక బాలిక మీర్.

'రేస్‌కు ముందు నెర్వస్‌గా ఉంటాను. కారులో కూర్చున్న తరువాత మాత్రం పరిస్థితి మరోలా ఉంటుంది. ఎలాగైనా ఈ రేస్‌లో గెలవాల్సిందే అనే పట్టుదల పెరుగుతుంది. భయాలు కొట్టుకుపోతాయి' అంటుంది మెరిసే కళ్లతో అతికా మీర్.

ఈ చిన్నారి భవిష్యత్‌లో ఎన్నెన్ని మెరుపులు మెరిపించనుందో వేచిచూద్దాం!

కృత్రిమ మేధతో 'గులాబీ'కి స్మార్ట్ వల!



దేశవ్యాప్తంగా పత్తి పంటకు పెనునష్టం కలిగిస్తున్న గులాబీ పురుగును సమర్థంగా అరికట్టే కృషిలో నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ (ఐసిఎఆర్-సిఐసిఆర్) పెద్ద ముందడుగు వేసింది. కృత్రిమ మేధ (ఎఐ)తో నడిచే హైటెక్ ఫెరమోన్ ట్రాప్‌లను పంజాబ్ రైతులకు ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తెచ్చింది. పంటలపై పురుగుల నియంత్రణలో కృత్రిమ మేధ సాంకేతికతను దేశంలోనే మొట్టమొదటి సారిగా వాడిన ఘనతను సిఐసిఆర్ దక్కించుకుంది.

- ఎఐతో నడిచే సోలార్ స్మార్ట్ ఫెరమోన్ ట్రాప్‌కు సిఐసిఆర్ రూపుకల్పన..
- పంజాబ్‌లో పైలట్ ప్రాజెక్ట్ అమలు
- పురుగుల తీవ్రతపై గంటకోసారి మొబైల్‌కు క్షేత్రస్థాయి సమాచారం..
- సకాలంలో స్పందించి గులాబీ పురుగు నష్టాలను తగ్గించుకుంటున్న రైతులు





● సీఐసీఆర్ రూపొందించిన ఏఐ స్మార్ట్ ట్రాప్‌తో పంజాబ్ రైతు జగదేవ్ సింగ్

సంప్రదాయ లింగాకర్షక బుట్టలతో పోల్చితే ఈ అత్యాధునిక సాంకేతికతతో కూడిన ట్రాప్‌లు చాలా మెరుగైన ఫలితాలను అందిస్తున్నాయని పంజాబ్ పత్తి రైతులు సంతోషిస్తున్నారు. పురుగుల తీవ్రతపై ప్రతి గంటకు రైతుల మొబైల్‌కు, కంప్యూటర్‌కు సమాచారం అందించటం ఈ ఎఐ ఫెరమోన్ ట్రాప్ ప్రత్యేకత. దీని ప్రకారం వ్యవసాయ విస్తరణాధికారులు, శాస్త్రవేత్తలు రైతులకు వెంటనే నియంత్రణ చర్యలు సూచిస్తున్నారు. అదే రోజు ఆ చర్యలను రైతులు అమలు చేస్తుండటం వల్ల గులాబీ పురుగు వల్ల నష్టం జరగకుండా కాపాడుకోగలుగుతున్నానని పంజాబ్ రైతు జగదేవ్‌సింగ్ చెప్పారు. 2021 నుంచి వరుసగా మూడేళ్లుగా ఉగ్రరూపం దాల్చిన గులాబీ పురుగు బారిన పడి పంటను తీవ్రంగా నష్టపోయిన రైతుల్లో ఈయన ఒకరు. ఎకరంన్నరలో బీజీ2 పత్తి సాగు చేస్తున్నారు. మూడు జిల్లాల్లో మరో 17 మంది రైతులు సిఐసిఆర్ పైలట్ ప్రాజెక్టు వల్ల ఈ ఏడాది పత్తి పంటపై దిగులు లేకుండా గడుపుతున్నారు.

పత్తి పంటలో గులాబీ పురుగు తీవ్రతను గుర్తించడానికి హెక్టారుకు 5 చొప్పున లింగాకర్షక బుట్టలు పొలంలో వేలాడగడతారు. గాసిప్లూర్ అనే రసాయనిక ల్యూర్‌ను ఈ బుట్టలో పెడతారు. అది ఆడ పురుగుల వాసనగా పొరపడి ఆకర్షితులై వచ్చే మగ పురుగులు ఆ బుట్టలో చిక్కుకుంటాయి. వీటి సంఖ్యను బట్టి గులాబీ పురుగు తీవ్రతను అంచనా వేసి, క్రిమిసంహారకాలు చల్లుతారు.

స్మార్ట్ ట్రాప్ ఎలా పనిచేస్తుంది?

డిజిటలీకరించిన ఈ స్మార్ట్ ట్రాప్ సోలార్ విద్యుత్‌తో నడుస్తుంది. ఈ స్మార్ట్ ట్రాప్ వ్యవస్థలో సింగిల్ బోర్డ్ కంప్యూటర్, కెమెరా మాడ్యూల్, వాతావరణ సెన్సార్, సోలార్‌తో నడిచే జీఎస్ఎం ట్రాన్స్‌మిటర్, రీచార్జిబుల్ బ్యాటరీ ఉంటాయి. ట్రాప్‌లోకి వచ్చి అతుక్కుపోయిన పురుగులను నిరంతరం ఈ కెమెరా ఫొటోలు తీసి, క్లౌడ్‌లోని రిమోట్ సర్వర్‌కు ఎప్పటికప్పుడు పంపుతుంది. ఆ ఫొటోలను మెషిన్ లెర్నింగ్ అల్గారిథమ్‌ను ఉపయోగించి ఏయే రకాల పురుగులన్న విశ్లేషణ జరుగుతుంది. గులాబీ పురుగునకు చెందిన రెక్కల పురుగులు ఎన్ని అనే విషయం ఇలా నిర్ధారణ అవుతుంది. ఈ సమాచారంతో పాటు వాతావరణ వివరాలు స్మార్ట్ ట్రాప్‌కు అనుసంధానించిన మొబైల్/కంప్యూటర్లకు సంక్షిప్త సందేశాల రూపంలో చేరుకుంటాయి. ఈ విధంగా రైతులు సకాలంలో పురుగు తీవ్రతను గుర్తించి, క్రిమిసంహారాలు వాడి పత్తిని గులాబీ పురుగు నుంచి రక్షించుకుంటున్నారు.

'గతంలో సాధారణ లింగార్షక బుట్టలను పత్తి పొలంలో పెట్టి, ప్రతి 3 రోజులకోసారి స్వయంగా పొలానికి వెళ్లి చూసేవాడిని. నేను వెళ్లి చూసినప్పుడు పురుగులు పెద్దగా లేకపోవచ్చు. కానీ, తర్వాత రెండు రోజులు అటు వెళ్లను. ఆ తర్వాత రోజు వెళ్లేటప్పటికే పురుగు ఉధృతితో పంటకు తీవ్ర నష్టం జరిగిపోతూ ఉండేది. ఏ రోజు, ఏయే వేళలో పురుగు ఎక్కువ పంటను ఆశించిందీ మాకు తెలిసేది కాదు. కానీ, ఇప్పుడు ఆ సమస్యల్లేవు. ప్రతి గంటకు మెసేజ్ వస్తుంది. అవసరమనిపిస్తే వెంటనే స్పందించి పిచికారీలు చేసి పంటను కాపాడుకుంటున్నాం..' అన్నారు రైతు జగదేవ్‌సింగ్.

సకాలంలో గులాబీ పురుగుకు చెక్

పత్తి పొలంలోని లింగాకర్షక బుట్టల్లో వరుసగా 3 రోజులు రోజుకు 8 చొప్పున గులాబీ రెక్కల పురుగులు కనిపిస్తే.. పంట దిగుబడిని భారీగా నష్టపరిచే స్థాయిలో పురుగు ఉందని అర్థం. అయితే, సాధారణ లింగాకర్షక బుట్టలను రైతులు పొలంలో పెట్టుకున్నప్పటికీ.. వాటిలో ఎన్ని పురుగులు పడుతున్నాయో గమనించే రైతులను మేం గతంలో చాలా అరుదుగా చూశాం. ఎందుకంటే, ఆ పని చేయటానికి వారికి చాలా సమయం అవసరం పడుతుంది. రైతులు పత్తితో పాటు ఇతర పంటల పనులు కూడా చూసుకోవాల్సి ఉంటుంది కదా. ఈ కొత్త వ్యవస్థ వారి సమస్యలను అధిగమించేందుకు దోహదపడుతుంది. ఫోన్‌లోకి వచ్చే సమాచారంతో పత్తి రైతులు గులాబీ పురుగు ఉనికిని సకాలంలో గుర్తించగలుగుతారు. తగిన సమయంలో క్రిమిసంహారకాలను చల్లి, పంట నష్టాన్ని సమర్థవంతంగా తగ్గించుకుంటున్నారు. కృత్రిమ మేధతో రూపొందించిన ఈ స్మార్ట్ ఫెరమోన్ ట్రాప్ తక్కువ ఖర్చుతోనే గులాబీ పురుగును సమర్థవంతంగా అరికడుతోంది. ఇవి రైతులు స్వయంగా పొలాల్లో ఏర్పాటు చేసుకోవటానికి ఉద్దేశించి రూపొందించినవి కాదు. తహసిల్ స్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు పురుగు తీవ్రతను సకాలంలో గుర్తించి, రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వటానికి డిజిటల్ సాధనాలుగా వాడుకోవడానికి స్మార్ట్ ట్రాప్స్ ఉపయోగపడుతాయి. తక్కువ సాంద్ర గ్రిడ్ పద్ధతిలో రైతుల పొలాల్లో ప్రభుత్వం ఈ స్మార్ట్ ట్రాప్‌లను ఏర్పాటు చేయవచ్చు.



– డా. వై.జి. ప్రసాద్, డైరెక్టర్,
కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ, నాగపూర్

సాగుబడి

పుష్యమి కార్తె:
జూలై 20 నుంచి

భూమి హీరో!



సిద్ధేశ్ సాకోర్ (28)... ఒక మారుమూల గ్రామంలో ఓ పేద రైతు కుటుంబంలో పుట్టారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ చదివారు. అయినప్పటికీ, తన తండ్రి వంటి చిన్న, సన్నకారు మెట్ట రైతుల ఆదాయాలు పెంచటం కోసం స్వగ్రామంలోనే ఉంటూ తన వంతుగా ఏదైనా చెయ్యాలన్నదే తపనంతా! ఈ తపనకు తోడైన ఆచరణే సిద్ధేశ్‌కి గత నెలలో ఓ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాన్ని తెచ్చిపెట్టింది! దాని పేరే.. భూమి హీరో!

ఐక్యరాజ్య సమితికి చెందిన కన్వెన్షన్ టు కంబాట్ డిసర్టిఫికేషన్ గత నెల 17న బ్రెజిల్‌లో భూమి పరిరక్షణ కృషిలో క్రియాశీలపాత్ర నిర్వహిస్తున్న పది మంది యువతకు భూమి హీరో పురస్కారాలు అందించింది. ఈ పురస్కార విజేతల్లో సిద్ధేశ్ ఒకరు. మన దేశం నుంచి ఈయనొక్కరికే ఈ గుర్తింపు దక్కింది. ఆయన ప్రయాణం ఆసక్తిదాయకం.. స్ఫూర్తిదాయకం..

అతనిది మహారాష్ట్ర పుణే జిల్లా షిరూర్ తాలూకా ధామరి గ్రామం. పేద వ్యవసాయ కుటుంబంలో పెరిగిన సిద్ధేశ్ కరువు పీడిత మెట్ట ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతులు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా చూశాడు. తాను వ్యవసాయం చేసి మార్పు తేవాలనుకున్నాడు. కొడుకు వ్యవసాయం చేయటం తండ్రికి ఇష్టం లేదు. కుటుంబ పొలాన్ని ఇవ్వనన్నాడు తండ్రి. మెకానికల్ ఇంజనీరింగ్ డిగ్రీ చదవమన్నాడు. ఆ ప్రకారంగానే డిగ్రీ చదివిన సిద్ధేశ్ ఆ తర్వాత తమ జిల్లాలోనే గల విజ్ఞానాశ్రమంలో చేరి అనేక చిన్న యంత్రాలను ఆవిష్కరించాడు. వంటింటి వ్యర్థాలతో తక్కువ సమయంలో కంపోస్టు ఎరువు తయారు చేసే యంత్రాలను రూపొందించి శభాష్ అనిపించుకున్నాడు. ఈలోగా కరోనాతో తండ్రి చనిపోయారు. అప్పటికి తండ్రి బ్యాంకు ఖాతాలో రూ. 3వేలు నిల్వ ఉందని చెబుతూ.. ఇదీ చిన్న రైతుల దుస్థితి అంటారాయన. భూములను సారవంతం చేసుకుంటూ రైతుల ఆదాయం పెంచే పునరుజ్జీవన సేంద్రియ వ్యవసాయంతో రైతుల తలరాత మార్చవచ్చని సిద్ధేశ్ బలంగా నమ్మాడు.

ఐదెకరాల్లోపు వర్షాధార వ్యవసాయం చేసే రైతులు తగినంత ఆదాయం లేక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యల పాలవుతున్నారు. ఆదాయం ఎందుకు రావటం లేదు? వారి భూములు అతిగా రసాయనాలు వాడటం వల్ల నిస్సారమైపోతున్నాయి. సేంద్రియ కర్బనం 0.5% కన్నా తక్కువగానే ఉంది. ఆ నేలల్లో అరకొర దిగుబడులు రావటం, గిట్టుబాటు ధర రాకపోవటం వల్ల బడుగు రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారు. ఈ వెతలన్నిటికీ మూలం సాగు భూమి అతిగా నిస్సారమైపోవటం అని గ్రహించిన సిద్ధేశ్ స్వగ్రామంలోనే ఉండి, వారసత్వ చిన్నకమతంలో పునరుజ్జీవన సేంద్రియ వ్యవసాయం చేస్తూ.. తోటి రైతులను కూడా ఆ దిశగా నడిపించే పనిని ప్రారంభించారు. 'ఆగ్రో రేంజర్స్' అనే లాభాపేక్ష లేని సంస్థను ఐదేళ్ల క్రితం స్థాపించాడు.

సీజనల్ పంటలపైనే ఆధారపడకుండా చిన్న కమతాల రైతులు కూడా కొంత మేరకు పండ్ల తోటలు పండించుకుంటూ.. రసాయన వ్యవసాయం నుంచి స్థిరమైన సేంద్రియ వ్యవసాయానికి మారడానికి ఆగ్రో రేంజర్స్ రైతులకు మద్దతు ఇస్తోంది.

బహుళ పంటలు పండించే పండ్ల చెట్ల ఆధారిత ఆగ్రో ఫారెస్ట్రీ నమూనాను ఆగ్రో రేంజర్స్ అభివృద్ధి చేసింది. ఇది రైతులకు స్థిరంగా ఆదాయం వచ్చేలా చేస్తుంది. అదే సమయంలో నేల నాణ్యతను మెరుగుపరుస్తుంది.

గత 5 సంవత్సరాలుగా సిద్ధేశ్ బృందం 1,200 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. 23 గ్రామాల్లో వందకు పైగా ఎకరాల్లో రీజనరేటివ్ ఆగ్రో ఫారెస్ట్రీ నమూనాను క్షేత్రస్థాయిలో అమల్లోకి తేగలిగారు. రెండు, మూడు సంస్థల్లో నైపుణ్య శిక్షణ పొందటం ద్వారా, అనేక సంస్థల ఆర్థిక తోడ్పాటుతో ఆగ్రోరేంజర్స్ బృందం లోపాలను సరిదిద్దుకొని పురోగమిస్తోంది.

రైతులు శిక్షణ తీసుకున్నప్పటికీ సాగు పద్ధతి మార్చుకోవటానికి ముందుకు రాకపోవటాన్ని గమనించి.. పండ్ల మొక్కలను, డ్రిప్ లేటరల్స్‌తో పాటు నాణ్యమైన శిక్షణ ఇవ్వటంతో మార్పు క్రమంగా వస్తోందని సిద్ధేశ్ తెలిపారు. వారికి ఎప్పుడు ఏమి అవసరమైతే అది చెబుతూ ముందుకు తీసుకువెళ్తే ఒక్కసారి ఈ పద్ధతి వల్ల ఆదాయం పెరిగితే ఇక వారికి నమ్మకం కుదురుతుంది. నేల క్షీణతను, వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనే దిశగా పునరుజ్జీవ ఆగ్రో ఫారెస్ట్రీ నమూనా సాగు పద్ధతిని చిన్న, సన్నకారు రైతులకు అందించే కృషిలో గ్రామీణ యువతను విరివిగా భాగస్వామ్యం చేయాలని సిద్ధేశ్ ఆశిస్తున్నారు.

పుణేలోని లఖేవాడికి చెందిన రైతు జలంధర్ చేమాజీ మాష్లే మాటల్లో చెప్పాలంటే.. 'భూతాపం పెరిగిపోవటం అనే సమస్యను ఎదుర్కోవడానికి, సాధ్యమైనంత ఎక్కువ చెట్లను పెంచటం ఉత్తమం. అందువల్ల, పండ్ల మొక్కలు, బిందు సేద్యం, విలువైన పాఠాలతో నాకు సహాయం చేసిన ఆగ్రో రేంజర్స్ బృందంతో నేను కనెక్ట్ అయ్యాను. ఇది వాతావరణ మార్పుపై పోరాటంలో మాత్రమే కాదు. నాకు స్థిరమైన ఆదాయం కూడా వస్తోంది. రెండు ఎకరాల భూమి గతంలో పండ్ల మొక్కలు నాటాను. ఈ సంవత్సరం మరో మూడు ఎకరాల భూమి కోసం ప్లాన్ చేస్తున్నాను'.

https://agrorangers.org/



అమెరికా బృందం పతాకధారిగా లెబ్రాన్ జేమ్స్

పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొనే అమెరికా క్రీడాకారుల బృందానికి పతాకధారిగా బాస్కెట్‌బాల్ దిగ్గజం లెబ్రాన్ జేమ్స్ వ్యవహరిస్తాడు. 39 ఏళ్ల లెబ్రాన్ నాలుగోసారి ఒలింపిక్స్ క్రీడల్లో పోటీపడనున్నాడు. 6 అడుగుల 9 అంగుళాల ఎత్తున్న లెబ్రాన్ 2004 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో కాంస్యం... 2008 బీజింగ్, 2012 లండన్ ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకాలు నెగ్గిన అమెరికా జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. లండన్ గేమ్స్ తర్వాత లెబ్రాన్ రియో, టోక్యో ఒలింపిక్స్‌కు దూరంగా ఉన్నాడు. ఎన్‌బీఏ లీగ్ చరిత్రలో అత్యధిక పాయింట్లు (48,177) సాధించిన ప్లేయర్‌గా లెబ్రాన్ రికార్డు నెలకొల్పాడు.

చమరి అటపట్టు సూపర్ సెంచరీ

ఆసియా కప్ మహిళల టి20 క్రికెట్ టోర్నీలో భాగంగా దంబుల్లాలో సోమవారం మలేసియాతో జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక 144 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా శ్రీలంక 20 ఓవర్లలో 4 వికెట్లకు 184 పరుగులు చేసింది. కెప్టెన్ చమరి అటపట్టు (69 బంతుల్లో 119 నాటౌట్; 14 ఫోర్లు, 7 సిక్స్‌లు) తన టి20 కెరీర్‌లో మూడో సెంచరీ సాధించింది. మలేసియా 19.5 ఓవర్లలో 40 పరుగులకే కుప్పకూలింది.



సీనియర్లు అన్ని మ్యాచ్‌లు ఆడాల్సిందే

భారత కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టీకరణ

సూటిగా, మొహమాటానికి తావు లేకుండా... భారత క్రికెట్ జట్టు కొత్త హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ తనదైన శైలిలో భవిష్యత్తు గురించి తన ఆలోచనలేమిటో చెప్పేశాడు. సీనియర్ ఆటగాళ్లయినా సరే తమకు నచ్చినట్లుగా సిరీస్‌లు ఆడతామంటే కుదరదని స్పష్టం చేశాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వచ్చే 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలని కోరుకుంటున్నాను అని చెబుతూ ఫిట్‌నెస్ ఉంటేనే అంటూ అది సాధ్యమవుతుందని పరోక్షంగా తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఆటగాళ్లపై ఒత్తిడి పెంచకుండా పూర్తి స్వేచ్ఛనిచ్చే ఫలితాలు రాబడతానన్న గంభీర్... విరాట్ కోహ్లితో తనకు ఎలాంటి విభేదాలు లేవని పునరుద్ఘాటించాడు.


గంభీర్ అగార్కర్

న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్‌గా కొత్త ప్రయాణం మొదలు పెట్టాడు. శనివారం నుంచి శ్రీలంకతో జరిగే సిరీస్‌లో అతను బాధ్యతలు చేపడుతున్నాడు. ఈ నేపథ్యంలో గంభీర్ తొలిసారి మీడియాతో అన్ని విషయాలపై మాట్లాడాడు. టీమిండియా భవిష్యత్తు, తన ప్రణాళికల గురించి వివరించాడు. విశేషాలు అతని మాటల్లోనే...

కోచ్‌గా తన ఆలోచనలపై...

నేను ఒక విజయవంతమైన జట్టు బాధ్యతలు తీసుకుంటున్నాను. టి20 వరల్డ్ చాంపియన్, వన్డేలు, టెస్టుల్లో రన్నరప్ టీమ్ ఇది. అనూహ్య మార్పులతో నేను పరిస్థితిని చెడగొట్టను. ఒక హెడ్ కోచ్, ఆటగాడి మధ్య ఉండే బంధం తరహాలో కాకుండా వారికి స్వేచ్ఛనివ్వడం చాలా ముఖ్యం. పరస్పర నమ్మకంతోనే ఫలితాలు వస్తాయి. నేను అన్ని సమయాల్లో ఆటగాళ్లకు అండగా నిలుస్తా. ఏం చేసినా జట్టు గెలుపే లక్ష్యం కావాలి. వేరే మాటకు తావు లేదు. ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుదలను ప్రదర్శించాలి. విజయాలు లభిస్తేనే డ్రెస్సింగ్ రూమ్ మొత్తం సంతోషంగా ఉంటుంది. నేను అడిగిన సహాయక సిబ్బందిని ఇచ్చిన బోర్డుకు కృతజ్ఞతలు.

ఆటగాళ్లు సిరీస్‌లు ఎంచుకోవడంపై...

నా దృష్టిలో బుమ్రాలాంటి బౌలర్లకు మాత్రమే



విశ్రాంతి అవసరం. ప్రతీ ఒక్కరు జట్టులో ఉండాలనుకునే బుమ్రా ఒక అరుదైన బౌలర్. కాబట్టి అతడిని, ఇతర పేసర్లకు కూడా జాగ్రత్తగా చూసుకోవాలి. అంతే గానీ బ్యాటర్లకు పని భారం అనేది ఉండదు. నిలకడగా ఆడుతూ ఫామ్‌లో ఉంటే అన్ని మ్యాచ్‌లు ఆడవచ్చు. రోహిత్, కోహ్లి ఇప్పుడు రెండు ఫార్మాట్‌లే ఆడుతున్నారు కాబట్టి వారు అన్ని మ్యాచ్‌లకు అందుబాటులో ఉండవచ్చు. ఆటగాళ్లు తమకు నచ్చినట్లుగా ఒక సిరీస్‌లో ఆడతామని, మరో సిరీస్‌లో ఆడమని అంటే కుదరదు.

రోహిత్, కోహ్లి వన్డే భవిష్యత్తుపై...

వారిద్దరిలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని నా భావన. వారు జట్టుకు ఎంత విలువైన ఆటగాళ్లో అందరికీ తెలుసు. ఏ జట్టయినా తమకు అలాంటి ఆటగాళ్లు కావాలని కోరుకుంటుంది. ఫిట్‌గా ఉంటే మాత్రం రోహిత్, కోహ్లి 2027 వన్డే వరల్డ్ కప్‌లో కూడా ఆడవచ్చు. జట్టుకు ఉపయోగపడగలమనే భావన వారిలో ఉంటే ఎప్పటి వరకు ఆడగలరనేది వారి వ్యక్తిగత నిర్ణయం. ఎందుకంటే చివరికి ఏదైనా జట్టు కోసమే.

కోహ్లితో విభేదాలపై...

నాకు, విరాట్‌కు మధ్య ఎలాంటి బంధం ఉందనేది మా ఇద్దరికీ బాగా తెలుసు. ఇది జనం ముందు చూపించేది కాదు. టీఆర్‌పీ రేటింగ్స్ కోసం ఏదైనా చెప్పుకోవచ్చు. మైదానంలో తన జట్టు కోసం పోరాడే హక్కు ప్రతీ ఒక్కరికీ ఉంటుంది. కానీ ఇప్పుడు మేం భారత్‌కు ప్రాతినిధ్యం వహించబోతున్నాం. జట్టు గెలుపు కోసమే ప్రయత్నిస్తాం. అది మా బాధ్యత. నేను కోచ్‌గా ఎంపికయ్యాక, అంతకుముందు కూడా చాలా మాట్లాడుకున్నాం. అత్యుత్తమ ఆటగాడైన కోహ్లి అంటే నాకు ఎంతో గౌరవం ఉంది.

'సూర్యను అందుకే కెప్టెన్‌ను చేశాం'

భారత టి20 కెప్టెన్‌గా అయ్యే అర్హత అతనికి అన్ని విధాలా ఉంది. ఈ ఫార్మాట్‌లో ప్రస్తుతం అత్యుత్తమ బ్యాటర్. గత ఏడాది కాలంగా అతని గురించి, నాయకత్వ లక్షణాల గురించి డ్రెస్సింగ్ రూమ్ సహచరులు కూడా గొప్పగా చెప్పారు. జట్టు సారథి అన్ని మ్యాచ్‌లు ఆడాలని కోరుకుంటాం. హార్దిక్ పాండ్యా జట్టులో కీలక ఆటగాడే. ఆల్‌రౌండర్‌గా అతని సామర్థ్యం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే ఫిట్‌నెస్ సమస్యలే ప్రధాన బలహీనత. గత కొంత కాలంగా అతను వీటిని ఎదుర్కొంటున్నాడు. మూడు ఫార్మాట్‌లు ఆడే నైపుణ్యంతో పాటు శుబ్‌మన్ గిల్‌కు నాయకత్వ లక్షణాలు ఉన్నాయి. అందుకే వైస్ కెప్టెన్‌ను చేశాం. అతను మరింత నేర్చుకుంటాడు. అక్షర్‌కు వన్డేల్లో మరిన్ని అవకాశాలు ఇవ్వడం కోసమే జడేజాకు విరామం ఇచ్చాం తప్ప అతడిని తప్పించలేదు. పంత్, రాహుల్ ఉన్నాక మరో కీపర్ అవసరం లేదు కాబట్టి సామ్సన్‌ను పక్కన పెట్టక తప్పలేదు. రెండేళ్ల తర్వాత జరిగే టి20 వరల్డ్ కప్ కోణంలో కొన్ని ప్రయోగాలతో కొత్తగా ప్రయత్నిస్తున్నాం. ఫలితాలు ఎలా వస్తాయో చూడాలి.

–అజిత్ అగార్కర్, సెలక్షన్ కమిటీ చైర్మన్

భారత్‌తో బంధం... మరో దేశానికి ప్రాతినిధ్యం

పారిస్ ఒలింపిక్స్‌లో పలువురు భారత సంతతి క్రీడాకారులు

ప్రతి క్రీడాకారుడి జీవితాశయం ఒలింపిక్స్‌లో పోటీపడటం, దేశానికి పతకం సాధించడం. అయితే ఈ విశ్వ క్రీడల్లో పాల్గొనాలంటే కొన్ని దేశాల్లో తీవ్రమైన పోటీ ఉంటుంది. చాలా మందికి జాతీయ జట్టుకు ఆడే అవకాశం దక్కదు. ఫలితంగా సత్తా ఉన్న వాళ్లు వేరే దేశాలకు వలస వెళ్లి అక్కడే స్థిరపడి మరో మార్గంలో ఒలింపిక్స్‌లో పాల్గొనాలనే తమ కలను నిజం చేసుకుంటారు. మరికొందరేమో తల్లిదండ్రుల వృత్తిరీత్యా స్వదేశాన్ని వీడి వేరే దేశంలో స్థిరపడతారు. వారి పిల్లలు క్రీడలను కెరీర్‌గా ఎంచుకొని ఒలింపిక్స్ స్థాయికి వెళతారు. మరో మూడు రోజుల్లో ఆరంభమయ్యే పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌తో బంధం ఉన్నా వేరే దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు ఉన్నారు. వారి వివరాలు క్లుప్తంగా...

PARIS 2024
మరో 3 రోజుల్లో...



రాజీవ్ రామ్ (టెన్నిస్; అమెరికా): రాజీవ్ రామ్ తల్లిదండ్రులు రాఘవ్, సుష్మా బెంగళూరు నుంచి చాలా ఏళ్ల క్రితం అమెరికాకు వచ్చి స్థిరపడ్డారు. రాజీవ్ అమెరికాలోని డెన్వర్‌లో పుట్టి పెరిగాడు. ఆ తర్వాత టెన్నిస్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు. 40 ఏళ్ల రాజీవ్ ఐదు గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్ సాధించాడు. వీనస్ విలియమ్స్‌తో కలిసి రాజీవ్ రామ్ 2016 రియో ఒలింపిక్స్‌లో అమెరికాకు మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో రజత పతకం అందించాడు. పారిస్‌లో రాజీవ్ పురుషుల డబుల్స్‌లో పోటీపడనున్నాడు.



ప్రీతిక పవాడే (టేబుల్ టెన్నిస్; ఫ్రాన్స్): ప్రీతిక తల్లిదండ్రులు విజయన్, సుగుణ పుదుచ్చేరిలో జన్మించారు. 2003లో విజయన్ ఫ్రాన్స్‌కు వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. 2004లో ప్రీతిక పారిస్‌లో జన్మించింది. 16 ఏళ్లకే ప్రీతిక ఫ్రాన్స్ తరఫున టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడింది. స్వదేశంలో జరగనున్న ఒలింపిక్స్‌లో 19 ఏళ్ల ప్రీతిక మహిళల సింగిల్స్‌లో 12వ సీడ్‌గా బరిలోకి దిగనుంది. మహిళల డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ఆమె తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది.



శాంతి పెరీరా (అథ్లెటిక్స్; సింగపూర్): సింగపూర్ 'స్ప్రింట్ క్వీన్'గా పేరొందిన వెరోనికా శాంతి పెరీరా పూర్వీకులది కేరళ. సింగపూర్‌లో వాళ్ల తాతకు ఉద్యోగం రావడంతో తిరువంతనపురం నుంచి సింగపూర్‌కు వచ్చి స్థిరపడ్డారు. గత ఏడాది హాంగ్జౌ ఆసియా క్రీడల్లో శాంతి 100 మీటర్ల విభాగంలో రజత పతకం గెలిచి 49 ఏళ్ల తర్వాత ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో సింగపూర్‌కు తొలి పతకాన్ని అందించింది. పారిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవంలో సింగపూర్ బృందానికి శాంతి పతాకధారిగా వ్యవహరించనుంది.



కనక్ ఝా (టేబుల్ టెన్నిస్; అమెరికా): ఇప్పటికే రియో, టోక్యో ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొన్న కనక్ ఝా నాలుగుసార్లు టేబుల్ టెన్నిస్‌లో అమెరికా జాతీయ చాంపియన్‌గా నిలిచాడు. కనక్ తల్లి సుగుణ స్వస్థలం ముంబైకాగా.. తండ్రి అరుణ్ కోల్‌కతా, ప్రయాగ్‌రాజ్‌లలో పెరిగారు. వీరిద్దరు ఐటీ ప్రొఫెషనల్స్. వృత్తిరీత్యా అమెరికాకు వెళ్లి కాలిఫోర్నియాలో స్థిరపడ్డారు. 24 ఏళ్ల కనక్ 2018 యూత్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచాడు.



అమర్ ఢేసి (రెజ్లింగ్; కెనడా): అమర్‌వీర్ తండ్రి బల్బీర్ జాతీయ గ్రీకో రోమన్ చాంపియన్. పంజాబ్ పోలీసులో కొంత కాలం పనిచేశాక బల్బీర్ 1979లో కెనడాకు వచ్చి స్థిరపడ్డారు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కెనడాకు ప్రాతినిధ్యం వహించిన అమర్ 125 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో 13వ స్థానంలో నిలిచాడు. పారిస్ ఒలింపిక్స్‌లో పతకంపై గురి పెట్టాడు. 28 ఏళ్ల అమర్ 2021 పాన్ అమెరికన్ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించాడు. అనంతరం 2022 బర్మింగ్‌హమ్ కామన్వెల్త్ గేమ్స్‌లో స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

సుమిత్ శుభారంభం



కిట్జ్‌బుహెల్ (ఆస్ట్రియా): జెనరాలి ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ 6–4, 1–6, 7–6 (7/3)తో 119వ ర్యాంకర్ లుకాస్ క్లీన్ (స్లొవేకియా)పై విజయం సాధించాడు. చివరి సెట్‌లో సుమిత్ 3–5తో వెనుకబడి పుంజుకోవడం విశేషం.

ఒలింపిక్స్ తర్వాత శ్రీజేశ్ వీడ్కోలు

న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీలోని అత్యుత్తమ గోల్ కీపర్లలో ఒకడైన భారత స్టార్ పీఆర్ శ్రీజేశ్ వచ్చే నెలలో రిటైర్ కానున్నాడు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత అంతర్జాతీయ హాకీ నుంచి వీడ్కోలు తీసుకుంటానని కేరళకు చెందిన 36 ఏళ్ల శ్రీజేశ్ సోమవారం ప్రకటించాడు. 2006లో దక్షిణాసియా క్రీడల్లో తొలిసారి భారత సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీజేశ్ ఇప్పటి వరకు 328 మ్యాచ్‌లు ఆడాడు. వరుసగా నాలుగోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్న శ్రీజేశ్ 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత జట్టుకు కాంస్యం దక్కడంలో కీలక పాత్ర పోషించాడు. 2014, 2022 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకాలు, 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన టీమిండియాలో శ్రీజేశ్ సభ్యుడిగా ఉన్నాడు. నాలుగుసార్లు ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో (2011, 2016, 2018, 2023) బంగారు పతకాలు నెగ్గిన భారత జట్టులోనూ శ్రీజేశ్ సభ్యుడిగా ఉన్నాడు. 2014 గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్, 2022 బర్మింగ్‌హమ్ కామన్వెల్త్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టుకు శ్రీజేశ్ గోల్‌కీపర్‌గా వ్యవహరించాడు. 2021లో శ్రీజేశ్‌కు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'ఖేల్‌రత్న' లభించింది.



సినిమా


• రాజమౌళి

మోడ్రన్ మాస్టర్స్

'బాహుబలి, ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో తెలుగు సినిమా కీర్తి పతాకాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఎగురవేశారు దర్శక ధీరుడు రాజమౌళి. తెలుగు చిత్ర పరిశ్రమకి తొలి ఆస్కార్(ఆర్ఆర్ఆర్ మూవీ) అవార్డు తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే. అలాంటి ప్రతిభావంతుడైన రాజమౌళి జీవిత విశేషాలతో 'మోడ్రన్ మాస్టర్స్' అనే పేరుతో ఓ డాక్యుమెంటరీ రూపొందించింది ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్. ఇందులో రాజమౌళి సినీ ప్రయాణాన్ని చూపించనున్నారు. ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానున్న ఈ డాక్యుమెంటరీ ట్రైలర్‌ని విడుదల చేశారు. ట్రైలర్ చూస్తే టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు ప్రభాస్, ఎన్టీఆర్, రామ్‌చరణ్, కరణ్ జోహార్, జేమ్స్ కామెరూన్, కీరవాణి, రమా రాజమౌళి వంటి వారు రాజమౌళిపై తమ అభిప్రాయాలతో పాటు పనిచేసిన అనుభవాన్ని పంచుకున్నారు. 'మోడ్రన్ మాస్టర్స్' ట్రైలర్‌కి అనూహ్యమైన స్పందన వస్తోందంటే రాజమౌళి లైఫ్ స్టోరీ తెలుసుకోవాలనే క్యూరియాసిటీ సినీ అభిమానుల్లో ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేశ్ బాబు హీరోగా రాజమౌళి తెరకెక్కించనున్న సినిమా త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది.


• అజిత్

అందుకే ఆపరేషన్ రావణ్ టైటిల్ పెట్టాం

- వెంకట సత్య



''రామాయణం'లోని కొన్ని రిఫరెన్స్‌లను తీసుకుని మా సినిమా కథను రెడీ చేసుకున్నాం. అందుకే మా చిత్రానికి 'ఆపరేషన్ రావణ్' అనే టైటిల్ పెట్టాం. అయితే 'రామాయణం'లో రావణుడు మారువేషం వేసుకుని వచ్చాడు. మా మూవీలో మాస్క్ పెట్టుకుని వస్తాడు'' అని డైరెక్టర్ వెంకట సత్య అన్నారు. రక్షిత్ అట్లూరి, సంగీర్తనా విపిన్ జోడీగా రాధికా శరత్‌కుమార్, చరణ్‌రాజ్ కీలక పాత్రల్లో నటించిన న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీ 'ఆపరేషన్ రావణ్'. ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకట సత్య మాట్లాడుతూ– ''కేవీ రెడ్డి, ఆదుర్తి సుబ్బారావు, రాజమౌళి, స్టీవెన్ స్పిల్‌బర్గ్‌గార్లు నా ఫేవరేట్ డైరెక్టర్స్. రాజమౌళిగారిలాంటి దర్శకుడు ధైర్యంగా ముందడుగు వేసి 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్'లాంటి సినిమాలు చేయకపోతే తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయికి వెళ్లి ఆస్కార్ అందుకునేది కాదు. ఇక 'ఆపరేషన్ రావణ్' విషయానికొస్తే.. ఓ మనిషి సైకోగా ఎందుకు మారతాడు? అనే అంశాన్ని చూపిస్తున్నాం. అనుకున్న సమయంలో అనుకున్న బడ్జెట్‌తో షూటింగ్ పూర్తి చేశాం. అయితే సినిమా తీసినంత సులభంగా రిలీజ్ చేసుకోలేమని తెలుసుకున్నాను. నా కొడుకు రక్షిత్ అట్లూరి పాత్ర, నటన బాగుంటాయి. 'పలాస 2' సినిమా ఆలోచనలో ఉన్నాం. మా బ్యానర్ నుంచి ఏడాదికో సినిమా రిలీజ్ చేస్తాం'' అన్నారు.

నువ్వు సిద్ధమా..?

హాలీవుడ్ సూపర్‌హీరో హిట్ ఫ్రాంచైజీ 'డెడ్‌పూల్' నుంచి వస్తున్న తాజా సినిమా 'డెడ్‌పూల్ అండ్ వుల్వరీన్'. ర్యాన్ రేనాల్డ్స్, హ్యూ జాక్‌మన్, ఎమ్మా కోరిన్, మాథ్యూ మాక్‌ఫాడ్యేయన్ లీడ్ రోల్స్‌లో నటించిన ఈ సినిమాకు షాన్ లేవీ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో డెడ్‌పూల్‌గా ర్యాన్ రేనాల్డ్స్, వుల్వరీన్‌గా హ్యుయ్‌జాక్‌మెన్ కనిపిస్తారు. వాల్ట్ డిస్నీ స్టూడియోస్ మోషన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని ఈ నెల 26న విడుదల చేస్తోంది. తెలుగులోనూ విడుదల కానున్న ఈ మూవీ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''నా కంటూ ఉంది ఈ తొమ్మిదిమందే... నా ప్రపంచం మొత్తం ఈ ఫోటోలో ఉంది. ఒక్కడ్నే వీళ్లను ఎలా కాపాడాలో తెలియడం లేదు. కానీ.. నువ్వు వీళ్లను కాపాడగలవు', 'నువ్వు సిద్ధమా..?', 'ఎల్లప్పుడూ సిద్ధం' వంటి డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి.


• 'డెడ్‌పూల్ అండ్ వుల్వరీన్' పోస్టర్

అజర్‌బైజాన్‌కు బై

అజర్‌బైజాన్‌కు బై బై చెప్పారు అజిత్. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విడాముయర్చి'. ఈ చిత్రంలో త్రిష హీరోయిన్‌గా, అర్జున్, ఆరవ్, రెజీనా, నిఖిల్ ఇతర రోల్స్‌లో నటిస్తున్నారు. మగిళ్ తిరుమేని దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా అజర్‌బైజాన్‌లో ఈ సినిమా లాంగ్ షెడ్యూల్ పూర్తయింది. అజిత్‌తో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలతో పాటుగా, ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారట మేకర్స్. కాగా దాదాపు పదమూడేళ్ల క్రితం తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'గ్యాంబ్లర్' (2011) సినిమా తర్వాత అజిత్–అర్జున్–త్రిష కలిసి నటిస్తున్న సినిమా 'విడాముయర్చి' కావడం విశేషం. హీరో కుటుంబం విహారయాత్రకు వెళ్తుంది. అక్కడ హీరో భార్య, అతని కుమార్తె అదృశ్యం అవుతారు. వారి ఆచూకీని హీరో ఎలా కనుక్కున్నాడు? ఏ విధంగా రక్షించాడు? అన్నది 'విడాముయర్చి' కథ అని కోలీవుడ్ టాక్.

విక్రమార్క వస్తున్నాడు

రామ్‌చరణ్ హీరోగా నటించిన బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'మగధీర' సినిమాలో విలన్ పాత్రలో నటించిన దేవ్ గిల్ హీరోగా నటించిన చిత్రం 'అహో! విక్రమార్క'. పేట త్రికోటి దర్శకుడు. దేవ్ గిల్ ప్రొడక్షన్స్‌పై ఆర్తి దేవిందర్ గిల్, మీహిర్ కుల్కర్ణి, అశ్విని కుమార్ మిస్రా నిర్మించారు. ఈ మూవీని తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఆగస్టు 30న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. దేవ్ గిల్ మాట్లాడుతూ– ''అహో! విక్రమార్క' సినిమాలో పోలీసుల ధైర్యం, అంకితభావాన్ని గొప్పగా చూపించబోతున్నాం. నటుడిగా నాలోని మరో కోణాన్ని ఈ మూవీ ద్వారా ప్రేక్షకులు చూస్తారు'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్, ఆర్కో ప్రవో ముఖర్జీ.


• దేవ్ గిల్

ఓటీటీ
ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో హిందీ మూవీ 'కాకుడా' కూడా ఒకటి. ఈ సినిమా గురించి తెలుసుకుందాం.

కాకుడా రివ్యూ



మానవుని జీవితంలో అత్యంత సున్నితమైన మరియు భయోత్పాతమైన ఉదంతం ఏదైనా ఉంది అంటే అది మరణమే. ఆ మరణ ఇతివృత్తాంతాన్ని వినోదాత్మకంగా మలిచిన చిత్రమే 'కాకుడా'. ఈ సినిమా జోనర్ హారర్ కామెడీ. దీనికి దర్శకులు ఆదిత్య సరపోతదార్. మామూలుగా హారర్ కామెడీ చిత్రాల్లో దెయ్యం మనుషులను భయపెట్టడం లేదా మనిషే దెయ్యాలను భయపెట్టడం చూశాం. వాటన్నిటికీ విరుద్ధంగా 'కాకుడా' సినిమా కాన్సెప్ట్ ఉండడం విశేషం. ఉత్తరాది రాష్ట్రంలోని ఓ మారుమూల గ్రామానికి సంబంధించిన కథ ఇది. ఆ గ్రామం పేరే కాకుడా. ప్రతి మంగళవారం సరిగ్గా రాత్రి 7.15 నిమిషాలకు గ్రామంలోని ప్రతి ఇంటి చిన్న ద్వారం తలుపులు తీసి ఉంచాలి. ఇదే కథాంశం. ఎవరికైనా ఫలానా రోజున తాము మరణించే రోజు అని తెలిస్తే... ఇంకేముంది... క్షణక్షణం బాధతో నరకం అనుభవిస్తారు. కానీ ఈ సినిమాలో ప్రధాన పాత్రకి తాను మరణించే రోజు తెలిసినా పైకి కొంత బాధపడుతూనే అందరితో మామూలుగా ఉంటూ కథను నడిపిస్తాడు. రితేష్ దేశ్‌ముఖ్, సోనాక్షీ సిన్హా వంటి పెద్ద తారలు నటించిన ఈ చిన్న సినిమా ఆద్యంతం కాలక్షేపదాయకం. కొన్ని కొన్ని సన్నివేశాల్లో దెయ్యం రూపం కాస్త పిల్లలను భయపెట్టినా సినిమా మొత్తం సకుటుంబ సపరివార సమేతంగా సరదా సరదాగా చూడొచ్చు. ఈ వారానికి 'కాకుడా' సినిమా వినోదం కోసం గొప్ప ఛాయిస్ అని చెప్పొచ్చు. ఈ చిత్రం జీ5 ఓటీటీ వేదికగా స్ట్రీమ్ అవుతోంది.


– ఇంటూరు హరికృష్ణ


• సీతా నారాయణన్, అలీ రేజా

పుట్టిన ఊరు కోసం...

'బిగ్‌బాస్' ఫేమ్ అలీ రేజా, సీతా నారాయణన్ జోడీగా నటించిన చిత్రం 'రామ్ ఎన్ఆర్ఐ'. 'పవర్ ఆఫ్ రిలేషన్ షిప్' అనేది ఉపశీర్షిక. ఎస్.లక్ష్మీ నందా దర్శకత్వం వహించారు. ఎస్ఎంకే ఫిల్మ్స్ సింగులూరి మోహన్‌కృష్ణ సమర్పణలో ముమ్వా సత్యనారాయణ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 26న విడుదలఅవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి నిర్మాతలు ప్రసన్న కుమార్, సాయి వెంకట్, రామకృష్ణ గౌడ్, రామ సత్యనారాయణ వంటి వారు ముఖ్య అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఎస్.లక్ష్మీ నందా మాట్లాడుతూ– ''పుట్టిన ఊరు కోసం ఎన్ఆర్ఐలు ఏం చేశారు? అనే కథాంశంతో 'రామ్ ఎన్ఆర్ఐ' రూపొందింది'' అన్నారు. ''లక్ష్మీ నందాగారితో సోలోగా ఓ సినిమా తీస్తున్నాను'' అన్నారు సింగులూరి మోహన్‌కృష్ణ. ''మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు ముమ్వా సత్యనారాయణ. నటుడు రవి వర్మ మాట్లాడారు.

స్కూల్ లైఫ్ ఆరంభం


• సావిత్రీ కృష్ణ, మహేశ్, కిరణ్ అబ్బవరం

పులివెందుల మహేశ్ హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రీ కృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నైనీషా, రాహుల్ త్రిశూల్ నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ మూవీ పూజా కార్యక్రమానికి హీరో కిరణ్ అబ్బవరం, డైరెక్టర్ వి. సముద్ర ముఖ్య అతిథులుగా హాజరై, యూనిట్‌కి అభినందనలు తెలిపారు. పులివెందుల మహేశ్ మాట్లాడుతూ– ''స్కూల్ లైఫ్' నా ఒక్కడిదే కాదు. సినిమా మీద ఉన్న ఇష్టంతో పాటు కథ నచ్చి క్రౌడ్ ఫండింగ్ ద్వారా వచ్చిన డబ్బుతో పాటు నా ఇల్లు అమ్మి ఈ సినిమా తీస్తున్నాను. మా బడ్జెట్ సరిపోకపోవడంతో కథ నచ్చి, నన్ను నమ్మి సహకారం అందిస్తున్న నిర్మాత రాహుల్ త్రిశూల్‌గారికి కృతజ్ఞతలు'' అన్నారు. రాహుల్ త్రిశూల్ మాట్లాడుతూ– ''స్కూల్ లైఫ్' రెగ్యులర్ షూటింగ్‌ని ఆగస్టు 2న ప్రారంభించి సెప్టెంబర్ 2 వరకు సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ధర్మ ప్రభ, సంగీతం: హర్ష ప్రవీణ్.

కంచర్ల సందేశం


• ఉపేంద్ర బాబు, మీనాక్షి

'ఉపేంద్రగాడి అడ్డా' ఫేమ్ కంచర్ల ఉపేంద్ర బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'కంచర్ల'. యాద్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ జైస్వాల్ హీరోయిన్. సుమన్, అజయ్ ఘోష్ ఇతర పాత్రలు చేశారు. ఎస్ఎస్ఎల్‌వీ క్రియేషన్స్‌పై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్నారు. అరకులో చిత్రీకరించిన తాజా షెడ్యూల్‌తో ఈ మూవీ చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ–''మా ఇంటి పేరైన 'కంచర్ల' టైటిల్‌తో సినిమా నిర్మించడం సంతోషంగా ఉంది. ఆగస్టు 15 తర్వాత సినిమా విడుదల చేస్తాం'' అన్నారు. ''మంచి కథాంశంతో తీసిన మా చిత్రం గొప్ప విజయం అందుకుంటుంది'' అన్నారు కంచర్ల ఉపేంద్ర బాబు. ''కంచర్ల' సినిమాలో మంచి సందేశం ఉంటుంది'' అన్నారు యాద్ కుమార్. ''మా మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుంటుంటుంది'' అన్నారు మీనాక్షీ జైస్వాల్.

సాక్షి బిజినెస్
మంగళవారం
23-7-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
102	22
80,502	24,509

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,015	△ 286
డోజోన్స్	40,403	△ 115
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,199	△ 43
డాక్స్	18,407	△ 235
షాంఘై	2,964	▽ 18
నికాయ్	39,599	▽ 465

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	73,218
బంగారం (99.5 స్వచ్ఛత)	72,925
వెండి (కేజీ)	88,196

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.27	84.29
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	106.97	109.56
€	యూరో	ఒకటి	90.08	92.46
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	52.60	53.76
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.95	56.90
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.83	64.51
SAR	సౌదీ రియాల్	ఒకటి	21.42	22.97
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటి	21.89	23.67
¥	చైనా యువాన్	ఒకటి	10.38	12.45

ఉపాధికి ఊతం.. ధరలకు కళ్లెం!

మోదీ 3.0 ఆర్థిక సర్వేలో ప్రభుత్వం ఉద్ఘాటన...

- ఈ ఏడాది జీడీపీ వృద్ధి రేటు 6.5–7 శాతంగా అంచనా
- లక్షలాది ఉద్యోగాల కల్పనే లక్ష్యం...
- 2030 నాటికి ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు సృష్టించాలి
- తయారీ, ఎగుమతులకు చైనా పెట్టుబడుల దన్ను...
- నిర్మాణాత్మక సంస్కరణలతో 7 శాతం పైగా వృద్ధి..
- ప్రైవేటు పెట్టుబడులు, చిన్న పరిశ్రమలకు ఊతం...
- విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని పూడ్చాల్సిందే...
- కార్మిక, వ్యవసాయ సంస్కరణలు తక్షణావసరం..
- పార్లమెంట్‌లో సర్వేను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



పార్లమెంట్‌లో ఆర్థిక సర్వే ప్రవేశపెట్టిన నేపథ్యంలో బడ్జెట్ బృందంతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, సహాయమంత్రి పంకజ్ చౌదరి

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25)లో వృద్ధి రేటు అంచనాలను ప్రభుత్వం అచితూచి నిర్దేశించింది. స్థూలదేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 6.5–7 శాతం స్థాయిలో ఉండొచ్చని ఆర్థిక సర్వేలో లెక్కగట్టింది. ఉపాధి కల్పనను పెంచాల్సిన అవసరం ఉందని కూడా నొక్కిచెప్పింది. ధరాభారంతో అల్లాడుతున్న పేదలు, అల్పాదాయ వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీ లేదా కూపన్ల రూపంలో నిర్దిష్టంగా ఆర్థిక తోడ్పాటు కల్పించాల్సిన అవసరం ఉందని కూడా సర్వే సూచించింది. దేశంలో తయారీ రంగానికి తోడ్పాటు అందించడంతో పాటు ఎగుమతులను పెంచాలంటే చైనా నుంచి ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెంచాల్సిందేనని స్పష్టం చేసింది. కాగా, గతేడాది (2023–24) 8.2 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే, ఈ ఏడాది వృద్ధి రేటు అంచనాలు చాలా తక్కువగా ఉండటం విశేషం. ఆర్‌బీఐ నిర్దేశించిన 7.2 శాతం వృద్ధి రేటు అంచనాలతో పోల్చినా సర్వేలో వృద్ధి అంచనా తగ్గింది. అనిశ్చిత వర్షపాతం, ప్రైవేటు రంగంలో పెట్టుబడుల మందగమనం వంటివి వృద్ధి అంచనాల తగ్గుదలకు ప్రధాన కారణంగా సర్వే పేర్కొంది. 'భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన వృద్ధి బాటలో పయనిస్తోంది. ప్రపంచ భౌగోళిక, రాజకీయ సవాళ్లన్నింటినీ దీటుగా ఎదుర్కొంటోంది' అని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ సర్వే ముందుమాటలో పేర్కొన్నారు. కాగా, నిర్మాణాత్మక సంస్కరణలను అమలు చేయడం ద్వారా మధ్యకాలం పాటు నిలకడగా 7% వృద్ధి రేటు కొనసాగవచ్చని సర్వే తేల్చిచెప్పింది.

వికసిత భారత్ వైపు పయనం



వికసిత భారత్‌ను నిర్మించే దిశగా ముందుకు సాగుతున్నందున ప్రస్తుత పటిష్టతలతోపాటు మరింత పురోగతికి అవకాశాలు ఉన్న మార్గాలను సర్వే గుర్తించింది. ఆర్థిక సర్వే మన ఆర్థిక వ్యవస్థ ప్రబలమైన పటిష్టతలతను హైలైట్ చేస్తోంది. మా ప్రభుత్వం తీసుకువచ్చిన వివిధ సంస్కరణల ఫలితాలను కూడా సుస్పష్టం చేస్తోంది.

– ఎక్స్ పోస్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ

అంచనాలు సుసాధ్యం



7 శాతం వృద్ధి రేటు సాధన భారత్‌కు తేలికే. మేము నిరాశావాదులం కాదు. రుతుపవనాల పురోగతి సవాళ్లను కూడా మేము పరిగణనలోకి తీసుకుంటున్నాము. ఫైనాన్షియల్ రంగం అవుట్‌లుక్ పటిష్టంగా కనబడుతోందని, పొదుపులను ఫైనాన్షియల్ మార్కెట్లవైపునకు మళ్లించడాన్ని చూస్తే.. భారత్ కుటుంబాలు కష్టాల్లో లేవన్న విషయాన్ని స్పష్టం చేస్తోంది.

– వి. అనంత నాగేశ్వరన్, సీఈఏ

కార్మిక సంస్కరణలు వేగవంతం...

కేంద్రంలో వరుసగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కారు 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగా 2024–25 పూర్తి స్థాయి బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రకటించే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రైవేటు పెట్టుబడులను పెంచడం, చిన్న–మధ్య తరహా వ్యాపారాలకు చేయూతనందించడం, సాగును లాభసాటిగా మార్చేలా వ్యవసాయ సంస్కరణలు, వాతావరణ మార్పుల సమస్యను ఎదుర్కొనేందుకు వనరుల సమీకరణ, ఆర్థిక అసమానతలను తగ్గించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించను న్నారు. విద్య, ఉపాధి మధ్య అంతరాన్ని పూడ్చాలని కూడా సర్వే నొక్కిచెప్పింది. దేశంలో ఉద్యోగ కల్పనకు మరింత సానుకూల వాతావరణాన్ని సృష్టించాలంటే కార్మిక సంస్కరణల అమలును వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని కూడా పేర్కొంది. 'దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి అనుగుణంగా 2030 నాటికి వ్యవసాయేతర రంగంలో ఏటా సగటున 78.5 లక్షల ఉద్యోగాలను కల్పించాల్సి ఉంటుంది' అని సర్వే తెలిపింది.

చైనా పెట్టుబడులు పెరగాలి...

భారత్ ఎగుమతులు, దేశీ తయారీ రంగం మరింత పుంజుకోవాలంటే, చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) పెరగాలని, లేదంటే చైనా సరఫరా వ్యవస్థతో భారత్ అనుసంధానం కావాల్సి ఉంటుందని సర్వే అభిప్రాయపడింది. మరోపక్క, చైనా నుంచి దేశంలోకి దిగుమతులు తగ్గాలని కూడా పేర్కొంది. 'అమెరికా తదితర కీలక మార్కెట్లకు భారత్ ఎగుమతులు భారీగా పెరగాలంటే చైనా పెట్టుబడులపై మనం మరింత దృష్టి సారించాలి. తూర్పు ఆసియా దేశాలు గతంలో ఇదే విధంగా లబ్ధి పొందాయి' అని సర్వే తెలిపింది. 2020లో గాల్వాన్‌లో చోటు చేసుకున్న సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా భారత్ టిక్‌టాక్, యూసీ బ్రౌజర్‌తో సహా 200 చైనా మొబైల్ యాప్‌లను నిషేధించిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా చైనా ఎలక్ట్రిక్ వాహన దిగ్గజం బీవైడీ భారీ పెట్టుబడి ప్రతిపాదనలను కూడా తిరస్కరించింది. 2000–2024 మధ్య భారత్ అందుకున్న మొత్తం ఎఫ్‌డీఐలలో చైనా కేవలం 0.37% (2.5 బిలియన్ డాలర్లు) వాటాతో 22 స్థానంలో ఉంది. కాగా, కీలక ఖనిజాల విషయంలో చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని సర్వే స్పష్టం చేసింది.

వ్యవసాయంలో సత్వర సంస్కరణలు

వ్యవసాయ రంగంలో సంస్కరణలను వెంటనే చేపట్టాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే నొక్కి చెప్పింది. లేదంటే ఈ రంగంలో నెలకొన్న వ్యవస్థీకృత సమస్యలు దేశ వృద్ధికి అడ్డుపడతాయని విధానకర్తలను హెచ్చరించింది. తూర్పు ఆసియా దేశాలు, అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాలతో పోల్చితే.. దేశ వ్యవసాయరంగం సామర్థ్యాలను ఇంకా పూర్తి స్థాయిలో వెలుగులోకి తేవాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పనకు వ్యవసాయరంగ సామర్థ్యాలను ఉపయోగించుకోవాలని సూచించింది. ఈ రంగంపై దేశవ్యాప్తంగా చర్చలు అవసరమని నాగేశ్వరన్ పిలుపునిచ్చారు. ''దేశ వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎలాంటి సంక్షోభంలో లేదు. కాకపోతే నిర్మాణాత్మక మార్పు అవసరం. ఎందుకంటే వాతావరణ మార్పులు, నీటి సమస్య రానున్న రోజుల్లో పెద్దవి కానున్నాయి''అని సర్వే స్పష్టం చేసింది. ప్రస్తుతం రైతులకు ఎరువులు, విద్యుత్, ఆదాయపన్ను, మద్దతు ధరల పరంగా సబ్సిడీలు, ప్రోత్సాహకాలు ఇస్తున్నప్పటికీ ప్రస్తుత విధానాలను తిరిగి సమీక్షించాలని అభిప్రాయపడింది. టెక్నాలజీ ఆధునీకీకరణ, మార్కెటింగ్ మార్గాలను మెరుగుపరచడం, సాగులో ఆవిష్కరణలు, వ్యవసాయం–పరిశ్రమల మధ్య అనుసంధానత పెంపు దిశగా సంస్కరణలను సూచించింది.




ఆర్థిక సర్వే హైలైట్స్..

- అసాధారణరీతిలో వరుసగా మూడోసారి ప్రజలు మోదీ 3.0 సర్కారుకు పట్టం కట్టడం దేశంలో రాజకీయపరమైన, విధానపరమైన స్థిరత్వానికి అద్దం పడుతోంది.
- అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితి నెలకొన్నప్పటికీ దేశీయ వృద్ధి చోదకాలు 2023–24లో ఆర్థిక పురోగతికి దన్నుగా నిలిచాయి.
- భౌగోళిక, రాజకీయ సవాళ్లను దీటుగా ఎదుర్కొంటూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన, స్థిరమైన ప్రగతిని సాధిస్తోంది.
- కరోనా మహమ్మారి తదనంతరం దేశీయ వ్యాపార, వాణిజ్య రంగం రికవరీ కోసం ప్రభుత్వం అనేక కీలక చర్యలు తీసుకుంది.
- వాణిజ్యం, పెట్టుబడులు, వాతావరణ మార్పుల వంటి ప్రపంచ సమస్యల విషయంలో వివిధ దేశాలతో ఒప్పందాలు క్లిష్టతరంగా మారాయి.
- స్వల్పకాలానికి ద్రవ్యోల్బణం అంచనాలు తగ్గుముఖ ధోరణిలోనే ఉన్నప్పటికీ, పప్పుధాన్యాల కొరత , ధరల ఒత్తిడి నిలకడగా కొనసాగుతోంది.
- సాధారణ వర్షపాతం, దిగుమతులకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా ధరలు శాంతించడంతో ఆర్‌బీఐ సానుకూల ద్రవ్యోల్బణం అంచనాలకు దన్నుగా నిలుస్తోంది.
- అధిక ఆహార ధరలతో అల్లాడుతున్న పేదలు, అల్పాదాయ వర్గాలకు ప్రత్యక్ష నగదు బదిలీలు, నిర్దిష్ట కొనుగోళ్లకు కూపన్‌ల రూపంలో కొంతకాలం పాటు ప్రయోజనాలను అందించాలి.
- భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధానంపై ప్రభావం చూపొచ్చు.
- భారతదేశ ఆర్థిక సేవల రంగం పటిష్టమైన అవకాశాలున్నాయి. ఈ రంగంలో కీలకమైన మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అంతర్జాతీయంగా, దేశీయంగా తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి.
- కార్పొరేట్ కంపెనీలు, బ్యాంకుల బ్యాలెన్స్ షీట్లు పటిష్టంగా ఉండటంతో ప్రైవేటు పెట్టుబడులు మరింత పుంజుకోనున్నాయి.
- పన్ను నిబంధలనను సరళతరం చేయడం, వ్యయ నియంత్రణ, డిజిటైజేషన్ వంటివి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను సాధించేందుకు దోహదం చేస్తున్నాయి.
- భారత వృద్ధి పథానికి క్యాపిటల్ మార్కెట్లు కీలకంగా నిలుస్తున్నాయి. ప్రపంచ రాజకీయ, ఆర్థిక షాక్‌లకు మన మార్కెట్లు ఎదురొడ్డి నిలుస్తున్నాయి.
- చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) జోరందుకోవడం వల్ల ప్రపంచ సరఫరా వ్యవస్థలు మెరుగుపరచడంలో, ఎగుమతులను పెంచుకోవడంలో భారత్‌కు దన్నుగా నిలుస్తుంది.
- 2024లో దేశంలోకి వచ్చిన రెమిటెన్సులు (ప్రవాసులు స్వదేశానికి పంపిన నిధులు) 3.4 శాతం వృద్ధితో 124 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఈ మొత్తం 129 బిలియన్ డాలర్లను తాకనుంది.



ప్రయివేట్ రంగ పెట్టుబడులు కీలకం

ప్రయివేట్ రంగ ఫైనాన్సింగ్, కొత్త వర్గాల నుంచి వనరుల సమీకరణ దేశీయంగా నాణ్యమైన మౌలిక సదుపాయాల(ఇన్‌ఫ్రా) నిర్మాణానికి కీలకమని ఆర్థిక సర్వే పేర్కొంది. ఇందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి పాలసీలు, సంస్థాగత మద్దతుతోపాటు.. రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు సైతం ప్రధాన పాత్ర పోషించవలసి ఉంటుంది. మౌలిక రంగంలోని వివిధ విభాగాలకు పెట్టుబడులు సమకూర్చడంలో గణాంకాలు, మార్గదర్శకాలు తదితర నివేదికలు అత్యవసరం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కున్న డిమాండ్‌ను అంచనా వేయడం, ఉపవిభాగాల కల్పనలో సౌకర్యాల వినియోగం వంటి అంశాలకు ప్రస్తుత డేటాబేస్ సామర్థ్యం సరిపోదు. ఆర్థికపరమైన ఒత్తిడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏకీకృత ప్రణాళికల నేపథ్యంలో ఆచరణసాధ్యమైన ప్రాజెక్టులను చేపట్టి పూర్తిచేయవలసి ఉంటుంది. ఇందుకు ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యం కీలకమవుతుంది.



పేదలకు కూపన్లు లేదా ప్రత్యక్ష నగదు బదిలీ

వడ్డీరేట్ల నిర్ణయంలో ఆహార ధరలను పక్కనబెట్టండి... ఆర్‌బీఐకి సర్వే సూచన

వడ్డీ రేట్లను నిర్ణయించడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆహార ద్రవ్యోల్బణాన్ని చూడటం మానేయాలని ఆర్థిక సర్వే సూచించింది. అధిక ఆహార ధరలను ఎదుర్కోవటానికి పేదలకు కూపన్లు లేదా ప్రత్యక్ష నగదు బదిలీని ప్రభుత్వం అన్వేషించాలని సర్వే పేర్కొంది. ''భారతదేశ ద్రవ్యోల్బణ లక్ష్య ఫ్రేమ్‌వర్క్.. ఫుడ్ ఆర్టికల్స్‌ను పక్కనబెట్టాలి. అధిక ఆహార ధరలు చాలా సందర్భాల్లో సరఫరాలకు సంబంధించిన సమస్యే తప్ప, డిమాండ్ ప్రేరితం కాదు'' అని ఆర్థిక సర్వే పేర్కొంది. మధ్య, దీర్ఘకాలిక ద్రవ్యోల్బణం అవుట్‌లుక్ ధరల యంత్రాంగం పటిష్టత, మార్కెట్ అంశాలు, నిత్యావసారాల దేశీయ ఉత్పత్తి, దిగుమతులు వంటి అంశాలపై ఆధారపడుతుందని వివరించింది. అననుకూల వాతావరణం, తక్కువ రిజర్వాయర్ స్థాయిలు, పంట నష్టం వ్యవసాయ ఉత్పత్తిని ప్రభావితం చేసి, గత రెండేళ్లలో ఆహార ధరలను పెంచడానికి దారితీసిందని కూడా సర్వే పేర్కొంది. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు–రెపో (ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి ఆర్‌బీఐ వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణంపై ఆధారపడే సంగతి తెలిసిందే. ప్లస్ 2 లేదా మైనస్ 2తో ఇది 4 శాతంగా ఉండాలే చూడాలని ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తోంది. ఈ సూచీలో ఫుడ్ ఆర్టికల్స్ ఒక భాగం. రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం లక్ష్యాన్ని సాధించడంలో ఆహార ధరలు ఒడిదుడుకులు తీవ్ర అడ్డంకిగా మారుతున్నాయి. ఇదే అంశంపై ఆందోళన వ్యక్తంచేస్తూ ఆర్‌బీఐ 2023 ఫిబ్రవరి నుంచి యథాతథ వడ్డీరేట్ల వ్యవస్థను కొనసాగిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. దీనిని పక్కనపెట్టి... రుణ రేట్లను తగ్గిస్తే ఆ నిర్ణయం వృద్ధికి దోహదపడుతుందన్నది సర్వే అభిప్రాయం.



రైల్వేల సామర్థ్యం పెరగాలి..



సామర్థ్యాలను వేగంగా పెంచుకోవడం, కార్యకలాపాలను ఆధునీకరించుకోవడం, ఇంధన ఆదా తదితర అంశాలపై రైల్వేస్ ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఎకనమిక్ సర్వే సూచించింది. ఇందుకు అనుగుణంగా సరకు రవాణా కోసం ప్రత్యేక కారిడార్లు, హై స్పీడ్ రైళ్లు, వందే భారత్.. అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ .. ఆస్థా స్పెషల్ ట్రెయిన్స్ వంటి ఆధునిక ప్యాసింజర్ సర్వీస్ రైళ్లు, అధిక సామర్థ్యం ఉండే రైల్వే కోచ్‌లు, లాస్ట్–మైల్ రైల్ లింకేజీలు మొదలైన వాటిపై ఇన్వెస్ట్ చేయాలని పేర్కొంది. లాజిస్టిక్స్ వ్యయాలను, కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు రైల్వేస్ 3 ప్రధాన కారిడార్ల రూపకల్పనలో ఉందని వివరించింది. ట్రాఫిక్ సాంద్రత అధికంగా ఉండే కారిడార్లు, ఇంధన.. ఖనిజ.. సిమెంట్ కారిడార్లు, రైల్ సాగర్ (పోర్టు కనెక్టివిటీ) కారిడార్లు వీటిలో ఉన్నాయని పేర్కొంది.

ఏటా 78 లక్షల కొలువులు సృష్టించాలి..



కార్మిక శక్తి పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయేతర రంగాల్లో 2030 నాటికి ఏటా దాదాపు 78.5 లక్షల ఉద్యోగాలను కల్పించాల్సిన అవసరం ఉందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఈ విషయంలో ప్రైవేట్ రంగం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని పేర్కొంది. ఆర్థిక వృద్ధి అనేది ఉద్యోగాల కల్పన కన్నా జీవనోపాధి కల్పించడంపై ఆధారపడి ఉంటుందని సర్వే వివరించింది. వ్యవసాయ రంగంలో కార్మిక శక్తి 2023లో 45.8 శాతం స్థాయి నుంచి 2047 నాటికి 25 శాతానికి తగ్గుతుందని తెలిపింది. ఇదంతా వ్యవసాయేతర రంగాల వైపు మళ్లుతుంది కాబట్టి ఆ మేరకు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఏర్పడుతుందని సర్వే పేర్కొంది. పీఎల్ఐ స్కీములు, మిత్రా టెక్స్‌టైల్ స్కీము మొదలైనవి ఇందుకు కొంత తోడ్పడగలవని తెలిపింది. స్టాఫింగ్ కంపెనీల ద్వారా తాత్కాలిక సిబ్బంది నియామకాలు పెరుగుతున్నందున అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు దీన్నొక మాధ్యమంగా ఉపయోగించుకోవచ్చని వివరించింది. తయారీ రంగ శ్రేయస్సు, ఆర్థిక వృద్ధి సాధన దిశగా మెరుగైన ఫలితాలు సాధించేందుకు వ్యాపారసంస్థలకు ఇచ్చే ప్రోత్సాహకాలను పునఃసమీక్షించాలని సూచించింది. వర్కర్ల తొలగింపునకు కాకుండా ఉద్యోగాల కల్పనకు కృత్రిమ మేథ(ఏఐ)రెని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై కార్పొరేట్లు మరింతగా దృష్టి పెట్టాలని ముందుమాటలో ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ పేర్కొన్నారు.

గ్రీన్ ఎనర్జీ @ రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు



దేశీయంగా 2024–2030 మధ్య కాలంలో పునరుత్పాదక ఇంధన (ఆర్‌ఈ) రంగంలో రూ. 30.5 లక్షల కోట్ల పెట్టుబడులు రాగలవని ఆర్థిక సర్వే అంచనా వేసింది. ఇందుకోసం స్థల సమీకరణ సమస్యలను పరిష్కరించుకోవడం, సానుకూల నిబంధనలతో నిధులను సమీకరించుకోవడం కీలకమని పేర్కొంది. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యాలను సాధించే క్రమంలో వివిధ విభాగాలకు ఆర్థికంగా లబ్ధి చేకూరగలదని వివరించింది. మరోవైపు, ఉద్గారాల విషయంలో 2070 నాటికి తటస్థ స్థాయికి చేరుకోవాలంటే భారత్‌కు ఏటా సగటున 28 బిలియన్ డాలర్ల పెట్టుబడులు అవసరమవుతాయని సర్వే తెలిపింది. నిధులను సమకూర్చుకోవడమనేది ఒక అసాధారణ సవాలు కాగలదని వివరించింది.

పర్యాటక రంగంలో అవకాశాలు అపారం..



పర్యాటక రంగం కల్పిస్తున్న అవకాశాలను సొంతం చేసుకోవాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే సూచించింది. కరోనా విపత్తు తర్వాత పర్యాటక రంగం వేగంగా కోలుకోవడాన్ని ప్రస్తావించింది. '2023లో 92 లక్షల మంది విదేశీ పర్యాటకులు భారత్‌ను సందర్శించారు. క్రితం ఏడాదితో పోల్చి చూస్తే 43.5 శాతం ఎక్కువ. భారత పర్యాటక రంగం వేగంగా విస్తరిస్తోంది. ప్రపంచంలో 39వ ర్యాంక్ సొంతం చేసుకుంది. పర్యాటకం ద్వారా రూ. 2.3 లక్షల కోట్ల విదేశీ మారక ద్రవ్యం లభించింది. ఇది క్రితం ఏడాదితో పోల్చితే 65.7% అధికం'అని సర్వే తెలిపింది. కృత్రిమ మేథ (ఏఐ) భారత సేవల ఎగుమతులపై ప్రభావం చూపిస్తుందన్న 'క్యాపిటల్ ఎకనమిక్స్' నివేదికను ప్రస్తావిస్తూ.. ఉపాధి కల్పన విషయంలో తక్కువ నైపుణ్యాలపై ఆధారపడిన పర్యాటకం ప్రాధాన్యాన్ని గుర్తు చేస్తోందని పేర్కొంది.

14 శాతం ఐఫోన్ల తయారీ ఇక్కడే



ఎలక్ట్రానిక్స్ తయారీలో అంతర్జాతీయంగా భారత్ తన వాటాను పెంచుకుంటున్నట్టు ఆర్థిక సర్వే తెలిపింది. 2023–24లో స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ యాపిల్ 14% ఐఫోన్లను భారత్‌లోనే అసెంబుల్ చేసినట్టు వెల్లడించింది. దేశ ఎలక్ట్రానిక్స్ తయారీ 2014 తర్వాత నుంచి గణనీయమైన వృద్ధిని చూస్తోందంటూ, 2021–22లో అంతర్జాతీయంగా మన వాటా 3.7%. దేశ జీడీపీలో 4% వాటాను ఆక్రమించింది. ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో మొబైల్ ఫోన్ల విభాగం అధిక వృద్ధిని చూస్తోందని, అమెరికాకు మొబైల్ ఫోన్ల ఎగుమతులు 2022–23లో 2.2 బిలియన్ డాలర్లుగా ఉంటే, 2023–24లో 5.7 బిలియన్ డాలర్లకు దూసుకుపోయినట్టు వివరించింది. 2022–23లో దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ రూ.8.22 లక్షల కోట్లకు చేరితే, ఎగుమతులు రూ.1.9 లక్షల కోట్లకు పెరిగినట్టు తెలిపింది.

వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్లు కీలకం

దేశీ ఆర్థిక వ్యవస్థ వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్లు కీలకంగా మారుతున్నట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. టెక్నాలజీ, ఇన్నొవేషన్, డిజిటైజేషన్ దన్నుతో మూలధన నిర్మాణం, పెట్టుబడుల విస్తరణలో క్యాపిటల్ మార్కెట్ల వాటా బలపడుతోంది. అంతేకాకుండా దేశీ స్టాక్ మార్కెట్లు ప్రపంచ భౌగోళిక, రాజకీయ, ఆర్థిక విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నాయి. పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ రిస్కులు, వడ్డీ రేట్లుసహా కమోడిటీ ధరల హెచ్చుతగ్గుల నేపథ్యంలోనూ దేశీ క్యాపిటల్ మార్కెట్లు గతేడాది(2023–24) ఉత్తమ పనితీరు చూపిన వర్ధమాన మార్కెట్లలో ఒకటిగా నిలిచాయి. ఈ కాలంలో బీఎస్‌ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ ఇన్వెస్టర్లకు భారీ(25%కిపైగా) రిటర్నులు అందించాయి. ఇందుకు స్థూల ఆర్థిక పరిస్థితుల స్థిరత్వం, దేశీ ఇన్వెస్టర్ల బలిమి తోడ్పాటునిచ్చినట్లు సీతారామన్ పేర్కొన్నారు. 2024 మే నెలలో ఈక్విటీ మార్కెట్ల విలువ 5 ట్రిలియన్ డాలర్ల(రూ. 415 లక్షల కోట్లు)కు చేరింది. ప్రస్తుతం 9.5 కోట్ల మంది రిటైల్ ఇన్వెస్టర్లు ప్రత్యక్షంగా 2,500 లిస్టెడ్ కంపెనీలలో 10% వాటాను కలిగి ఉన్నారు. గతేడాది ప్రైమరీ మార్కెట్ల ద్వారా రూ. 10.9 లక్షల కోట్ల మూలధన ఏర్పాటుకు సహకారమందించింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఐవోబీ లాభం జూమ్	ఎఫ్అండ్‌వో ట్రేడింగ్ ప్రమాదకరం

బడ్జెట్‌కు ముందు అప్రమత్తత

రిలయన్స్, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు • సూచీలకు స్వల్ప నష్టాలు



ముంబై: కేంద్ర బడ్జెట్‌కు ముందు ఇన్వెస్టర్లు అచితూచి వ్యవహరించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు బ్యాంకింగ్ రంగ షేర్లు డీలా పడ్డాయి. ఇటీవల విడుదలైన కొన్ని కార్పొరేట్ కంపెనీల క్యూ1 ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడమూ సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచింది. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 102 పాయింట్లు నష్టపోయి 80,502 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 22 పాయింట్లు పతనమై 24,509 వద్ద నిలిచింది. ఉదయం బలహీనంగా మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ లాభనష్టాల మధ్య కదలాడాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 504 పాయింట్లు క్షీణించి 80,101 వద్ద, నిఫ్టీ 169 పాయింట్లు పతనమై 24,362 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకాయి. మిడ్ సెషన్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(2%), ఇన్ఫోసిస్(1%)తో పాటు చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు కొంత తగ్గాయి. ఇంధన, రియల్టీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకుల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మెటల్, ఫార్మా, ఇండస్ట్రీయల్, విద్యుత్ రంగాల షేర్లు రాణించాయి.

- రిలయన్స్ ఇండస్ట్రీస్ జూన్ త్రైమాసిక ఫలితాలు అంచనాలను అందుకోలేకపోవడంతో షేరు 3.50% నష్టపోయి రూ.3,001 వద్ద స్థిరపడింది.
- విప్రో షేరు 9% పతనమై రూ.506 వద్ద స్థిరపడింది. క్యూ1 ఆర్థిక ఫలితాల సందర్భంగా నిరుత్సాహక అవుట్‌లుక్ షేరు పతనానికి కారణం.
- జూన్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడంతో కోటక్ మహీంద్రా బ్యాంకు షేరు 3.55% నష్టపోయి రూ.1757 వద్ద స్థిరపడింది.

అంబులెన్స్ లేక.. మోటారు బైక్‌పై...



రాజవొమ్మంగి: అభాగ్యురాలైన ఓ గిరిజన మహిళ ఆస్పత్రిలో కన్నుమూస్తే ఆమెను మోటారుసైకిల్‌పై ఇంటికి తరలించిన ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలంలో జరిగింది. మిరియాలవారి వీధి గ్రామానికి చెందినకుంజం అన్నపూర్ణ (60) అనారోగ్యంతో సోమవారం జడ్డంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వెళ్లింది. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె వెంట కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేకపోవడంతో మృతదేహాన్ని తరలించేవారు కరువయ్యారు. ఆస్పత్రిలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో చేసేదిలేక జడ్డంగి లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గణజాల మల్లికార్జున్ చొరవచూపి మృతదేహాన్ని యువకుల సహాయంతో మోటారు సైకిల్‌పై 5 కిలోమీటర్ల దూరంలోని మిరియాలవారి వీధి గ్రామానికి చేర్చారు.

ఆటో డ్రైవర్ @ మైక్రోసాఫ్ట్ టెక్కీ



యశవంతపుర: బెంగళూరులో మైక్రోసాఫ్ట్ టెక్కీ ఒకరు ఆటో నడుపుతున్నట్లు ఎక్స్‌లో పోస్టు చేసిన ఓ ఫొటోకు నెటిజన్ల నుంచి విశేష స్పందన లభించింది. వివరాల్లోకి వెళితే... వెంకటేశ్ గుప్తా అనే ఇంజినీర్ బెంగళూరులోని కోరమంగళలో ఓ ఆటో ఎక్కారు. ఆటో డ్రైవర్ మైక్రోసాఫ్ట్ ఉద్యోగులు ధరించే జాకెట్‌ను ధరించియున్నాడు. ఆ జాకెట్ విషయమై వెంకటేశ్ గుప్తా ఆటో డ్రైవర్‌ని ప్రశ్నించగా, తాను సదరు కంపెనీలో టెక్కీనని చెప్పడంతో కంగుతిన్నాడు. తన వయస్సు 35 సంవత్సరాలు అని, సెలవు రోజుల్లో ఒంటరిగా ఇంట్లో ఉండలేక ఇలా ఆటో నడుపుతున్నట్లు డ్రైవర్ చెప్పాడు. ఈ విషయమై ఈ నెల 21వ తేదీన వెంకటేశ్ గుప్తా ఫొటో ఎక్స్‌లో పోస్టు చేయగా, 3.50 లక్షల వ్యూస్ వచ్చాయి. లక్షల రూపాయల జీతాలు వచ్చినా ఒంటరితనం వేధిస్తుందని కొందరు నెటిజన్లు టెక్కీల పరిస్థితిపై సానుభూతితో కామెంట్లు పెట్టారు. మరికొందరు మాత్రం అతడు టెక్కీ కాదని, అలాంటి జాకెట్ ఎక్కడో కొని వేసుకుని ఉంటాడని కొట్టిపారేశారు.

జలాధివాసానికి చేరువలో సంగమేశ్వరాలయం




కొత్తపల్లి: నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని ప్రాచీన సంగమేశ్వరాలయం జలాధివాసానికి చేరువలో ఉంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 834 అడుగులకు చేరింది. మరో ఏడు అడుగుల మేర వరద నీరు వస్తే గర్భాలయంలోకి నీరు చేరి వేపధారు శివలింగం జలాధివాసం కానుంది. జలాధివాసానికి ముందు సోమవారం రావడంతో కృష్ణాజలాలకు ఆలయ పురోహితుడు రఘురామశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

‘రంగు’ మారింది!



వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలంలోని తెల్లపాడు ప్రాథమిక పాఠశాలకు ఆదివారం పసుపు రంగు వేశారు. దీనిపై సోమవారం ‘సాక్షి’లో ‘పాఠశాల భవనానికి పచ్చ రంగు’ అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు అదే రోజు పాఠశాలకు పచ్చ రంగును తొలగించి తెలుపు రంగు వేశారు. – కలసపాడు

మీటేతండాలో వజ్రం లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మీటేతండాలో ఆదివారం పొలంలో కలుపు తీస్తున్న ఓ రైతుకు వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఈ వజ్రాన్ని సోమవారం ఓ వజ్రాల వ్యాపారి రూ.1.10 లక్షలకు కొన్నట్టు తెలిసింది.

శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా లేళ్ల అప్పిరెడ్డి



సాక్షి, అమరావతి: శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా వైఎస్సార్‌సీపీ సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డిని చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు నియమించారు. ఈ ఉత్తర్వులు ఆదివారం (జూలై 21) నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ మేరకు స్టేట్ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ సూర్యదేవ ప్రసన్న కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జనసేన డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా నాదెండ్ల



సాక్షి, అమరావతి: శాసనసభలో జనసేన పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌గా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నియమితులయ్యారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్‌కు సోమవారం ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సమాచారం అందించారు. పార్టీ విప్‌గా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, కోశాధికారిగా భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, కార్యదర్శులుగా విశాఖ సౌత్ ఎమ్మెల్యే చెన్నుబోయిన వంశీకృష్ణ శ్రీనివాస్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నియమితులయ్యారు. శాసనసభలో జనసేన శాసనసభా పక్ష నాయకుడిగా పవన్‌కళ్యాణ్ గతంలో ఎన్నికైన విషయం తెలిసిందే.

ఎమ్మెల్సీల ప్రమాణస్వీకారం

ఇటీవల ఎమ్మెల్యేల కోటాలో జనసేన నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పి. హరిప్రసాద్, టీడీపీ ఎమ్మెల్సీగా ఎన్నికైన సి.రామచంద్రయ్య సోమవారం శాసనమండలి చైర్మన్ ఛాంబర్‌లో ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేశారు. మండలి చైర్మన్ మోషెన్‌రాజు వారితో ప్రమాణం చేయించారు.

తొలి రోజు కౌన్సెలింగ్ ప్రశాంతం



తొలి అడ్మిషన్ పొందిన లిఖితకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీలో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు 515మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు ఆహ్వానిస్తూ కాల్ లెటర్లు పంపించగా, 436మంది హాజరయ్యారు. వారందరికీ సీట్లను కేటాయించారు. అడ్మిషన్లు పొందిన తొలి ముగ్గురికి నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్ ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరమని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మేరుగ అర్జునరావు పర్యవేక్షణలో తొలిరోజు ఎలాంటి అవాంతరాలు లేకుండా కౌన్సెలింగ్ ప్రక్రియ జరిగింది.

ఈ వీడియోలు యమా టేస్టీ..

విభిన్న దేశీయ రుచులపై ఇన్‌స్టా, యూట్యూబ్‌లో విదేశీయుల వంటకాలు



- నెట్టింట ఘుమఘుమలకు లక్షలాది మంది వీక్షకులు
- మరోవైపు.. దేశంలో తినుబండారాల ఆహార రంగం వ్యాపారానికి భలే గిరాకీ
- ప్రస్తుతం దేశంలో ఏటా రూ.5.69 లక్షల కోట్ల వ్యాపారం
- 2028 నాటికి ఇది రూ.7.76 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా
- ఇండియా ఫుడ్ సర్వీస్ రిపోర్టు-2024 వెల్లడి

ది ఇండియా ఫుడ్ సర్వీస్ రిపోర్టు–2024 ప్రకారం..

- ప్రస్తుతం దేశంలో ఏటా ఆహార రంగ వ్యాపారం రూ.5.69 లక్షల కోట్లు
- 2028 నాటికి చేరుకునే మొత్తం రూ.7.76 లక్షల కోట్లు
- ఆహార రంగం వ్యాపార లావాదేవీల్లో అసంఘటిత రంగం వాటా 56.7 %
- 2028 నాటికి ఈ రంగం వ్యాపార లావాదేవీల్లో సంఘటిత రంగం వాటా 53 %
- ప్రస్తుతం ఈ రంగంలో ఏటా ఉపాధి అవకాశాలు 85 లక్షల మందికి
- 2028 నాటికి ఉపాధి కోటి మందికి

సాక్షి, అమరావతి : జేక్ డ్రయాన్, ఆండ్రియా, చెయ్‌సింగ్, సారా టాడ్, బెరిల్ షెరెషెవ్‌స్కీ.. వీరంతా ప్రపంచంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు. జేక్ డ్రయాన్‌ది ఇంగ్లండ్ అయితే.. ఆండ్రియా ఒక జర్మన్.. సారా టాడ్ ఒక ఆస్ట్రేలియన్.. బెరిల్ షెరెషెవ్‌స్కీది న్యూయార్క్. వీరందరిలో ఒక సారూప్యత ఉంది. రకరకాల భారతీయ వంటకాలను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు ఈ ఫుడ్ ఇన్‌ఫ్లుయెన్సర్లు. ఇలా వారు ఇన్‌స్టాగ్రాం రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ ద్వారా సోషల్ మీడియా వేదికపై లక్షలకొద్దీ ఫాలోవర్లను సంపాదించుకుని ఘుమఘుమలాడే మన దేశీయ రుచులకు ఎక్కడలేని ప్రాచుర్యం కల్పిస్తున్నారు.

యూట్యూబ్ వంటల వీడియోల్లో ఇటీవల కాలంలో కొత్త ఒరవడి మొదలైంది. కేవలం మన దేశానికి పరిమితమై ఉండే, లేదంటే ఇక్కడే కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉండే చాలారకాల వంటలపై మన దేశంతో ఏ సంబంధంలేని విదేశీయులు కొందరు రూపొందిస్తున్న వీడియోలు లక్షల మంది భారతీయులు మెచ్చుకునేలా ఉంటున్నాయి. ఫుడ్ బ్లాగర్ అయిన జేక్ డ్రయాన్ తనకు తానుగా దక్షిణాది భారతీయులకు అత్యంత ప్రియమైన సాంబారు–ఇడ్లీ వండుతూ చేసిన వీడియోను 25 లక్షల మంది వీక్షించారు. కేవలం ఇన్‌స్టాలోనే దాదాపు 18 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న డ్రయాన్ మన దేశంలో ఎక్కువ ప్రాచుర్యం పొందిన 17 రాష్ట్రాలకు చెందిన వంటకాలపై వీడియోలు చేశారు. ఇతను మన దేశాన్ని ఎప్పుడూ సందర్శించనప్పటికీ మనవాళ్ల ఆసక్తి, అభిరుచుల నాడి పట్టుకుని పసందైన వీడియోలు చేస్తున్నారు. బిహార్‌లో ఎక్కువ ప్రాచుర్యం పొందిన ‘సత్తు కా పరంత’.. రాజస్థాన్ ‘దాల్ బాటి చుర్మా’ వీడియోలకు నెట్టింట అత్యంత ఆదరణ దక్కింది. అలాగే, జర్మనీకి చెందిన ఆండ్రియా మన దేశంలోని పంజాబ్ యువకుడిని పెళ్లి చేసుకుంది. దాంతో భారతీయ వంటకాలపై ఆమెకు ఆసక్తి పెరిగింది. అలా ఆండ్రియా రూపొందించిన భారతీయ వంటల వీడియోలకు సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రాంలో ఆమెకు 1.69 లక్షల మంది ఫాలోవర్లను తెచ్చిపెట్టింది. అంతేకాదు.. ఆస్ట్రేలియాకు చెందిన సారా టాడ్, న్యూయార్క్‌లో నివాసం ఉండే బెరిల్ షెరెషెవ్‌స్కీ లాంటి విదేశీయుల భారతీయ వంటల వీడియోలు మన దేశంలో యమా క్రేజ్ పొందాయి.

ఉపాధి అవకాశాల్లోనూ అదరహో..

ఇక మన దేశంలో అత్యధిక మంది ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న రెండో అతిపెద్ద రంగంగా కూడా ఆహార రంగం ప్రగతి సాధించిందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రంగంలో ఏటా 85 లక్షల మందికి కొత్తగా ఉపాధి అవకాశాలు తెచ్చి పెడుతుండగా, 2028 నాటికి ఏటా కోటికి మందికి దక్కే అవకాశం ఉందని అంచనా.

వంటలపైనే ఏటా రూ.5.69 లక్షల కోట్ల వ్యాపారం..

ఇలా యూట్యూబ్‌లో వంటల వీడియోలు చూస్తూ నచ్చిన వంటలను చేసుకుని తినడమే కాదు.. అప్పుడప్పుడూ ఇంటిల్లిపాదీ రెస్టారెంట్లకు వెళ్లి అక్కడి రుచులను ఆస్వాదించే సంస్కృతి కూడా బాగా పెరిగిపోయింది. పెద్ద పెద్ద నగరాల్లోనే కాదు, విజయవాడ, విశాఖపట్నంతోపాటు ఓ మోస్తరు పట్టణాల్లో సైతం పుట్టగొడుగుల్లా వెలుస్తున్న రెస్టారెంట్లు వీకెండ్స్, సెలవు రోజుల్లో కిక్కిరిసిపోయి ఉంటున్నాయంటే ఫుడ్ బిజినెస్‌కు ఏ స్థాయిలో ఆదరణలో ఉందో తెలుస్తుంది. నిజానికి.. ఆర్థికవేత్తలు చెబుతున్న గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం మన దేశంలో ఏటా రూ.5.69 లక్షల కోట్ల మేర వ్యాపారం ఈ ఆహార రంగంలో జరుగుతోంది. ఇంకోవైపు.. దేశంలో అన్ని వ్యాపార రంగాల్లో కొనసాగుతున్న వృద్ధి కంటే ఒక్క ఆహార రంగంలోని వ్యాపార వృద్ధే అధికంగా ఉన్నట్లు వారంటున్నారు. ది ఇండియా ఫుడ్ సర్వీస్ రిపోర్టు–2024 ప్రకారం.. దేశ ఆహార రంగంలో ఏటా రూ.5.69 లక్షల కోట్ల మేర వ్యాపారం కొనసాగుతుండగా, 2028 నాటికి అది ఏకంగా రూ.7.76 లక్షల కోట్లకు చేరుకుంటుందని వారు అంచనా వేస్తున్నారు.

బడా పారిశ్రామికవేత్తల పెట్టుబడులు..

ఇలా.. ఈ రంగంపై భారీ వృద్ధి అంచనాలు ఉండడంతో బడా పారిశ్రామిక వ్యాపారవేత్తలు సైతం ఈ రంగంపై కన్నేసి కొత్తగా పెట్టుబడులు పెడుతున్నారు. ప్రస్తుతం దేశంలోని ఆహార రంగం వ్యాపార లావాదేవీల్లో 56.7 శాతం మేర అసంఘటిత రంగంలోని చిన్న హోటళ్ల ద్వారా సాగుతుండగా, 2028 నాటికి ఈ లావాదేవీలు 47 శాతానికి పరిమితమై ప్రభుత్వం వద్ద గుర్తింపు పొందిన సంఘటిత రంగం ద్వారా 53 శాతం లావాదేవీలు కొనసాగుతాయని నిపుణులు చెబుతున్నారు.

చంద్రబాబును కలిసిన హరియాణ గవర్నర్ దత్తాత్రేయ



సాక్షి, అమరావతి : హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని సీఎం నివాసానికి వెళ్లిన దత్తాత్రేయకు చంద్రబాబు స్వాగతం పలికి లోపలికి తీసుకెళ్లారు. ఇరువురు సమావేశమై పలు అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు.

రాష్ట్ర సమస్యలపై జగన్ ఎన్ని ధర్నాలు చేశారు?

ఏపీసీసీ చీఫ్ షర్మిల



సాక్షి, అమరావతి : ఓ కార్యకర్త హత్యకు నిరసనగా ఢిల్లీలో జగన్ ధర్నా అంటున్నారని, అధికారంలో ఉండగా రాష్ట్ర సమస్యలపై ఆయన ఎన్ని ధర్నాలు చేశారో చెప్పాలని ఏపీసీసీ చీఫ్ షర్మిల డిమాండ్ చేశారు. వినుకొండలో జరిగింది రాజకీయ హత్య కాదు వ్యక్తిగత హత్యేనని తమ విచారణలో తెలిసిందని చెప్పారు. కానీ, పొలిటికల్ మర్డర్ అని జగన్ కలరింగ్ ఇచ్చారని విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ జరుగుతుంటే, శాసనసభలో ఉండాల్సిన జగన్ ఢిల్లీ వెళ్లడమేంటని షర్మిల ప్రశ్నించారు. ఇక రాష్ట్రంలో వరదలతో నష్టపోయిన రైతులను కూటమి సర్కారు ఆదుకోవాలని ఆమె కోరారు. రాష్ట్ర విపత్తుగా పరిగణించి ప్రతి రైతుకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

వలంటీర్లపై ముందడుగా, వెనకడుగా?



- వలంటీర్ల కొనసాగింపు, వేతనాల పెంపుపై వైఎస్సార్‌సీపీ సభ్యుల ప్రశ్న
- నేడు అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల్లో చర్చ
- ప్రభుత్వ ఉద్దేశంపై కొంత స్పష్టత వచ్చే అవకాశం
- వలంటీర్లను కొనసాగిస్తామని, వేతనం పెంచుతామని ఎన్నికల్లో బాబు హామీ
- అధికారంలోకి వచ్చాక పక్కన పెట్టిన బాబు సర్కారు

సాక్షి, అమరావతి: ఐదేళ్ల క్రితం రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన వలంటీర్ల వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం కొనసాగించే ఆలోచనలో ఉందా లేదా అన్న అంశంపై మంగళవారం శాసన సభ సమావేశాల ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో చర్చ జరగనుంది. మంగళవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ముందుగా నిర్ణయించిన పది ప్రశ్నల్లో ఈ అంశం మూడోది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, బి. విరూపాక్షి లేవనెత్తిన ఈ ప్రశ్నకు సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామ, వార్డు సచివాలయాల శాఖల మంత్రి డోలా బాల వీరాంజనేయులు సమాధానం చెప్పనున్నారు. ఈ సందర్భంగా సభలో జరిగే చర్చలో వలంటీర్ల వ్యవస్థపై ప్రభుత్వ ఆలోచనలు, సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ప్రకారం వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తారా.. వారి గౌరవ వేతనం పెంపు హామీని నిలబెట్టుకుంటారా అన్న విషయాలపై చాలా వరకు స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

త్రిశంకుస్వర్గంలో వలంటీర్ల వ్యవస్థ

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి, వారికి అన్ని విధాలా సహకరించేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 2019 ఆగస్టులో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఈ వ్యవస్థపై అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రంగా విరుచుకుపడేవారు. దారుణమైన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి మాట మార్చేశారు. వలంటీర్లను కొనసాగిస్తామని, గౌరవ వేతనాన్ని రూ. 10 వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తీరా చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ ఊసే ఎత్తడంలేదు. పైగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి జూలై ఒకటి నుంచి చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వలంటీర్లను తప్పించారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్లు ప్రతి నెలా కీలకంగా నిర్వహించే విధుల్లో పింఛన్ల పంపిణీ ప్రధానమైనది. అటువంటి కార్యక్రమానికే దూరంగా పెట్టడంతో వలంటీర్ల వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు ఏమిటన్న విషయంపై అధికార, రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తుందా లేదంటే ఇంకేమైనా తీవ్రమైన నిర్ణయం తీసుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇవే అనుమానాలతో రాష్ట్రంలో పలుచోట్ల వలంటీర్లు ఆందోళనలు చేస్తున్నారు. సోమవారం విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయం వద్ద ప్రస్తుతం అధికారికంగా విధుల్లో కొనసాగుతున్న పలువురు వలంటీర్లు నిరసన తెలియజేశారు. వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, ఎన్నికల ముందు చెప్పిన ప్రకారం గౌరవ వేతనం రూ. 10 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

కొడాలి నాని మాజీ పీఏ లక్ష్మోజీపై దాడి

కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మోజీ




దాడిలో గాయపడిన లక్ష్మోజీ

గుడివాడ రూరల్: కృష్ణాజిల్లా గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని మంత్రిగా పనిచేసిన సమయంలో ఆయనకు పీఏగా వ్యవహరించిన లక్ష్మోజీపై సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేశారు. ప్రస్తుతం మచిలీపట్నంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మోజీ సాయంత్రం విధులు ముగించుకుని రాత్రికి గుడివాడ చేరుకున్నారు. గుడివాడ రైల్వేస్టేషన్ వద్ద సీఎస్‌ఐ చర్చ్‌లో మాటేసిన గుర్తుతెలియని ఎనిమిది మంది అతడిపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. గాయపడిన లక్ష్మోజీని గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం విజయవాడ తరలించారు. ఈ దాడిని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం తీవ్రంగా ఖండించింది. తక్షణమే బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేసింది. దాడి జరిగినట్లు సమాచారం అందుకున్న ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు గుడివాడ వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. టూ టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ దాడికి సంబంధించి ఫిర్యాదు రాలేదని, ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామని టూ టౌన్ సీఐ తెలిపారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

నిధులు మళ్లించారంటూ ఫిర్యాదులేం రాలేదు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంపై టీడీపీ సభ్యుల ప్రశ్నకు కేంద్రం సమాధానం

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులు మళ్లించారంటూ ఎలాంటి ఫిర్యాదులూ రాలేదని కేంద్రం స్పష్టం చేసింది. సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల్లో టీడీపీ ఎంపీలు దగుమళ్ల ప్రసాదరావు, కేశినేని చిన్ని అడిగిన ప్రశ్నలకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌధరి ఈ మేరకు స్పష్టంగా సమాధానమిచ్చారు. ‘కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి ఏపీకి 2019–20లో రూ.11,003.60 కోట్లు, 2020–21లో రూ.12,928.69 కోట్లు, 2021–22లో రూ.9,696.98 కోట్లు, 2022–23లో రూ.16,114.94 కోట్లు, 2023–24లో రూ.13,313.77 కోట్లు ఇచ్చాం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అవినీతికి సంబంధించి ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు రాలేదు’ అని మంత్రి విస్పష్టంగా చెప్పారు.

2026 డిసెంబరుకల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తి

ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు 2026 డిసెంబరుకల్లా పూర్తవుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహోల్ తెలిపారు. రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. జూన్ 2024 వరకు 31.04 శాతం పనులు పూర్తయ్యాయని కేంద్ర మంత్రి చెప్పారు. ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ విమానాశ్రయం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ తీర ప్రాంత అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

దేశంలో సమగ్ర జాతీయ తీర ప్రాంత అభివృద్ధి కార్పొరేషన్ లేదా ఏజెన్సీ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబూరావు సూచించారు. సోమవారం రాజ్యసభలో ఎంపీ ఈ అంశాన్ని ప్రస్తావించారు. తీర ప్రాంతాల్లో రిసార్టులు, హోటళ్లు, రిక్రియేషన్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వీటి ద్వారా తీరప్రాంత అభివృద్ధితోపాటు స్థానికులకు ఉపాధి కూడా పెరుగుతుందని, విదేశీ మారక ద్రవ్యమూ పెరుగుతుందన్నారు. ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీర ప్రాంతాలు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ సృజనాత్మక ఆలోచనను పరిశీలించాలని కోరారు.

రూ.52.64 కోట్ల ప్రాజెక్టులు

2019 నుంచి 2024 వరకూ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద చమురు సంస్థలు ఏపీలో రూ.52.64 కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టినట్లు రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి సమాధానమిచ్చారు.

ఏటేటా తగ్గిన ‘దీన్‌దయాళ్’ నిధులు

దీన్ దయాళ్ అంత్యోదయ యోజన – నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్స్ మిషన్ కింద ఏపీకి ఐదేళ్లలో విడుదల చేసిన నిధులు ఏటేటా తగ్గాయని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ సభ్యుడు బీద మస్తానరావు ప్రశ్నకు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల సహాయ మంత్రి తోఖన్ సాహూ ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. 2019–20లో రూ.98.45 కోట్లు ఇవ్వగా, 2020–21లో 58.23 కోట్లు, 2021–22లో రూ.60.50 కోట్లు, 2022–23లో రూ.37.63 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.2023–24లో నిధులు విడుదల చేయలేదని పేర్కొన్నారు.

మూడేళ్లలో 17 లక్షల ఎంఎస్‌ఎంఈలు

ఏపీలో గత మూడేళ్లలో (2021–22 నుంచి ఈ నెల 16వ తేదీ వరకు) 17,09,850 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు) ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకున్నట్లు కేంద్ర ఎంఎస్‌ఎంఈ సహాయ మంత్రి శోభా కరాంద్లాజే తెలిపారు. వైఎస్సార్‌సీపీఎంపీ బీద మస్తానరావు ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

హొసపేటె: తాలూకాలోని నాగరహుసె గ్రామంలో హులికుంటెప్ప అనే రైతు గత సెప్టెంబర్‌లో తన పొలంలో చెట్టు పైనుంచి కింద పడి మృతి చెందిన నేపథ్యంలో ఆ రైతు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును కూడ్లిగి ఎమ్మెల్యే ఎమ్మెల్యే శ్రీనివాస్ సోమవారం బాధిత కటుంబానికి అందించారు.

రైల్లో ఆభరణాల బ్యాగ్ చోరీ

హుబ్లీ: బెంగళూరు నుంచి హుబ్లీ వస్తున్న రాణి చెన్నమ్మ ఎక్స్‌ప్రెస్ రైల్లో రూ.5.82 లక్షల విలువైన ఆభరణాలు ఉన్న బ్యాగ్ చోరీకి గురైంది. ధార్వాడ నివాసి మేఘా దేశ్‌పాండేకు చెందిన ల్యాప్‌టాప్, ఆభరణాల బ్యాగ్‌ను దావణగెరె దగ్గర దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన పై హుబ్లీ రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పనులు అప్పగించాలని వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న కాంట్రాక్టర్లు

రాయచూరు రూరల్: ప్రభుత్వ పరంగా క్యాషుటెక్,నిర్మితి కేంద్రాలకు అప్పగించకుండా కాంట్రాక్టర్లకు ప్రభుత్వ పనులు అప్పగించాలని కాంట్రాక్టర్ల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయంలో జిల్లాధ్యక్షుడు నాగప్ప జిల్లాధికారి కె.నితీష్‌కు వినతిపత్రం సమర్పించి మాట్లాడారు. ప్రభుత్వ పనులు చేయాలంటే టెండర్ ద్వారా చేపట్టాలని, పనులను క్యాషుటెక్, నిర్మితి కేంద్రాలకు అప్పగించరాదని, ఈ విషయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని సమస్యలను పరిష్కరించేలా ఆదేశించాలని జిల్లాధికారికి విన్నవించారు.

ఘనంగా గురువందన ఉత్సవాలు


స్వామీజీకి తులాభారం నిర్వహిస్తున్న భక్తులు

రాయచూరురూరల్ : నగరంలో గురువందన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సోమవారపేట మఠంలో గురువందన కార్యక్రమాన్ని మఠాధిపతి అభినవ రాచోటి శివాచార్య ప్రారంభించారు. శిష్య గణం, భక్తులు తులాభారం నిర్వహించారు. ఆదివారం రాత్రి గీతా మందిర్‌లో హిందూ జన జాగృతి సంస్థ ఆధ్వర్యంలో వ్యాస పీఠానికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆషాఢ మాసం గురుపౌర్ణమి సందర్భంగా పరమపూజ్య భక్త మహారాజ్, డాక్టర్ జయంత్ అథవాలే చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేసి సనాతన సంస్థ కార్యకర్తలనుద్దేశించి సంస్థ సంచాలకుడు వెంకట రమణ నాయక్ మాట్లాడారు. ధర్మ శిక్షణ, హిందూ ఆధ్యాత్మిక చింతన, హిందూ సనాతన సంప్రదాయాలు, ఆచార విచారాల గురించి ప్రసంగించారు. కార్యక్రమంలో అరుణ కుమారి, రూప, సువర్ణ, కృష్ణవేణి, శోభా, వినోద్, శకుంతల, జయ పాటిల్, లక్ష్మి, రాఘవేంద్రలున్నారు.

సమస్యలు పరిష్కరించరూ


వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

రాయచూరు రూరల్: కట్టడ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కట్టడ కార్మికుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కార్మిక శాఖ జిల్లాధికారి కార్యాలయంలో జిల్లాధ్యక్షుడు అణ్ణప్ప మాట్లాడారు. కట్టడ కార్మికుల విద్యార్థులకు రెండేళ్ల నుంచి శిష్యవేతనాలు చెల్లించక పోవడాన్ని తప్పుబట్టారు. నూతనంగా కార్డుల పంపిణీ, మరు నమోదుకు అవకాశం కల్పించాలన్నారు. కట్టడ కార్మికులకు నేరుగా కిట్‌లను పంపిణీ చేయాలని కోరుతూ కార్మిక శాఖాధికారిణి ఆరతికి వినతిపత్రం సమర్పించారు.

అనారోగ్యంతో యాదగిరి మాజీ ఎమ్మెల్యే మృతి

సాక్షి,బళ్లారి: యాదగిరిని ప్రత్యేక జిల్లా చేసేందుకు పోరాటం చేసిన మాజీ ఎమ్మెల్యే వీరబసవంతరెడ్డి ముద్నాళ(76) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన యాదగిరిలోని వీబీఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. 2004లో యాదగిరి నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది రికార్డు సృష్టించిన ఆయన జిల్లా ఏర్పాటుకు, అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. 2010లో జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. జిల్లాలో మంచి పేరు ఉన్న రాజకీయవేత్తగా గుర్తింపు ఉంది. ముద్నాళ మృతితో ఆయన అభిమానులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

తుంగభద్ర డ్యాం 3 గేట్ల ఎత్తివేత


వరద నీటితో తొణికిసలాడుతున్న తుంగభద్ర డ్యాం


డ్యాం నుంచి గేట్ల ద్వారా నదికి నీరు వదిలిన దృశ్యం

- పరవళ్లు తొక్కుతున్న తుంగభద్ర జలాశయం
- ఎగువ నుంచి లక్షకు పైగా క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- డ్యాంలో 87 టీఎంసీలకు పైగా చేరిన నీటి నిల్వ
- లోతట్టు ప్రాంతవాసులకు హెచ్చరికలు జారీ

సాక్షి,బళ్లారి/హొసపేటె: తుంగభద్ర డ్యాంకు వరద నీరు పోటెత్తుతుండటంతో సోమవారం సాయంత్రం డ్యాం వద్ద 3 క్రస్ట్‌గేట్లను పైకెత్తి దిగువకు సుమారు 3,987 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం గేట్ల ఎత్తివేతకు ముందు తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఓ.రామకృష్ణారెడ్డి, ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి క్రస్ట్‌గేట్లకు ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం గేట్ల బటన్ నొక్కి దిగువకు నీటిని విడుదల చేశారు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పలు జిల్లా ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్ర డ్యాంకు ఎగువ నుంచి భారీగా 1,13,402 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండటంతో గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1627.21 అడుగులకు చేరుకొంది. నీటినిల్వ 87.056 టీఎంసీలకు చేరుకోగా ఔట్‌ఫ్లో 5,700 క్యూసెక్కులుగా ఉందని మండలి అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, ఏ సమయంలో అయినా డ్యాం మరిన్ని క్రస్ట్ గేట్లను పైకెత్తి దిగువకు అదనంగా నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలి అధికారులు హెచ్చరించారు.

ఆయకట్టు రైతుల్లో హర్షాతిరేకాలు

జూలై నెల ముగిసేలోపు డ్యాం పూర్తి స్థాయిలో నిండిపోవడంతో రాష్ట్రంతో పాటు పొరుగున ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పరిధిలోని తుంగభద్ర ఆయకట్టు రైతులతో పాటు తాగునీటి కోసం ఉపయోగించే ప్రజానీకం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు ఇన్‌ఫ్లో కూడా మరికొన్ని రోజులు కూడా దాదాపు ఇదే స్థాయిలో ఉండే అవకాశాలు ఉండటంతో డ్యాం గేట్లు ఎత్తే పరిస్థితులు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. డ్యాం గరిష్ట సామర్థ్యం 105 టీఎంసీలు కాగా నీటి నిల్వ 87 టీఎంసీలు మించడంతో నదికి నీటిని వదులుతున్నారు. ఇప్పటికే ఎల్‌ఎల్‌సీ, ఎల్‌బీఎంసీ కాలువలకు నీరు వదిలిన నేపథ్యంలో సోమవారం హెచ్‌ఎల్‌సీ కాలువకు కూడా నీరు వదిలారు. మూడు రాష్ట్రాల పరిధిలో బళ్లారి, రాయచూరు, కొప్పళ, విజయనగర, అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లా, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఆయకట్టు రైతులకు దామాషా ప్రకారం నీటిని విడుదల చేసేందుకు తుంగభద్ర బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఆమేరకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఆయకట్టులో వరినాట్లతో పాటు ఇతర పంటల సాగుకు రైతులు ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు.

జూలై ఆఖరులోపు భర్తీ కావడం ఘనతే

తుంగభద్ర చరిత్రలో జూలై ఆఖరు వారంలోపు గేట్లు ఎత్తే పరిస్థితి రావడం చాలా వరకు తక్కువగా కనిపించేది. గత ఏడాది కనీసం డ్యాం నిండేంతగా కూడా వర్షాలు కురవకపోవడంతో ఖరీఫ్ పంట పండించుకోవడం కూడా గగనమైంది. ఈ సారి ముందస్తు వర్షాలు పెద్ద ఎత్తున రావడంతో డ్యాం పూర్తిగా నిండుతున్నందున ఖరీఫ్‌కు ఢోకా లేనట్లేనని చెప్పవచ్చు. గత ఏడాది రబీ పంటకు క్రాప్ హాలీడే ప్రకటించిన నేపథ్యంలో ముందస్తుగా డ్యాంలోకి నీరు చేరడంతో రబీలో కూడా పంటలు పండించుకునేందుకు వరుణదేవుడు కరుణిస్తాడని రైతన్నలు ఆశలు పెట్టుకుంటున్నారు. తుంగభద్రమ్మ జలకళ సంతరించుకోవడంతో పర్యాటకుల సందడి కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆమేరకు డ్యాం వద్ద పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. తుంగభద్ర డ్యాం గేట్లు ఎత్తడంతో ప్రతి రోజు డ్యాం వద్ద గేట్ల ద్వారా డ్యాం నుంచి బయటకు నదిలోకి వెళ్లే నీటి పరవళ్లను చూసి ఆనందించేందుకు వచ్చే పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరగనుంది. డ్యాంకు ఉన్న మొత్తం 33 గేట్లను క్రమేణా ఎత్తి నదికి నీరు వదిలే అవకాశాలు ఉన్నందున లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న 11 మంది అరెస్ట్

హుబ్లీ: గంజాయి విక్రయిస్తున్న 11 మందిని అరెస్ట్ చేసిన ధార్వాడ విద్యాగిరి పోలీసులు వారి నుంచి రూ.1.50 లక్షల విలువ చేసే 398 కేజీల గంజాయిని, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హుబ్లీ- ధార్వాడ మాదక వస్తు నిరోధక విభాగం ప్రత్యేక కార్యాచరణలో భాగంగా జరిపిన ఈ దాడిలో మహమ్మద్, దాదాపీర్, పరమేశ్వర, బాబాజాన్, అబుజర్, బాబాహుస్సేన్ రజాహుస్సేన్, పంచు, జీవన్ సాబ్, సల్మాన్, ఆసీఫ్ మహమ్మద్ గౌస్ అరెస్ట్ అయ్యారు. విద్యాగిరి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అలాగే గంజాయి సేవిస్తున్న ముగ్గురిని విద్యాగిరి పోలీసులు అదుపులోకి తీసుకొని సంబంధిత చట్టం మేరకు కేసు దాఖలు చేసుకున్నారు. సదరు స్టేషన్ పరిధిలోని ఆర్ట్స్ కాలేజీ సమీపంలోని శ్మశానంలో అహీం, సైఫలీ, సంకేత్ అనే ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఆ స్టేషన్ ఎస్‌ఐ శ్రీమంత హుణసికట్టి నేతృత్వంలోని బృందం దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేసింది. కిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయగా గంజాయి సేవించినట్లుగా ధృవపడింది. కేసు దాఖలు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

మత మార్పిడికి యత్నంపై కేసు నమోదు

సిరుగుప్ప: ఇద్దరు యాత్రికులు సిరుగుప్ప మీదుగా మంత్రాలయానికి వెళుతుండగా తెక్కలకోట పట్టణానికి చెందిన హుసేన్ బాషా, సాయిబాబా అనే ఇద్దరు యాత్రికులను మత మార్పిడికి ప్రయత్నించిన ఘటన తెక్కలకోట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 18న జరిగింది. యాత్రికులు కేసరి ధ్వజాన్ని పట్టుకొని పాదయాత్ర చేస్తుండగా ముస్లిం మతాన్ని బోధించడం సరికాదని గాదిలింగప్ప అనే వ్యక్తి వీడియో ద్వారా తెక్కలకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇతర మతాల వ్యక్తులు తమ గురువుల గురించి బోధించడాన్ని, మొబైల్‌లో ఫోటోలు తీసుకొన్న గాదిలింగప్ప వారి మాటలు నమ్మవద్దని యాత్రికులకు నచ్చచెప్పారు. మతమార్పిడికి ప్రయత్నించిన ఆ వీడియో ఆధారంగా హుసేన్ బాషాను పోలీసులు బంధించగా ఇంకొక వ్యక్తి సాయిబాబా పరారయ్యాడు.

వైష్ణోదేవి ఆలయ పూజారి దారుణ హత్య

- హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణం
- పోలీస్ కమిషనర్ శశికుమార్ వెల్లడి

హుబ్లీ: నగరంలోని అమరగోళ ఏపీఎంసీ సమీపంలోని ఈశ్వర్ నగర్‌లోని వైష్ణవిదేవి దేవస్థానం వ్యవస్థాపకులు, ప్రధాన పూజారి దేవేంద్రప్ప వనహళ్లి(55) ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యారు. రాత్రి భోరున కురుస్తున్న వర్షంలోనే ఈ హత్య జరగడం సంచలనం సృష్టించింది. వానలోనే ఆలయం ఆవరణలోకి వచ్చిన దుండగులు ఆలయం వెనుక ఆయన్ను హత్య చేసి పరారయ్యారు. విషయం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి పోలీసులు, ప్రజలు చేరుకొని దేవేంద్రప్పను కిమ్స్ ఆస్పత్రికి తరలించే లోపే ప్రాణాలు కోల్పోయారు. కాగా ఈ ఘటనపై డీసీపీ మహాలింగ నందగావితో పాటు నవనగర ఏపీఎంసీ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి చురుగ్గా దర్యాప్తు ప్రారంభించారు. దేవేంద్రప్ప అందరికీ కావాల్సిన వాడిగా, సదా తన పనిలో ముఖ్యంగా ఆలయ పూజలు చేసుకొనే ఉండేవారు. భక్తులతో సత్సంబంధాలు కలిగి ఉండేవారు. హత్య చేసే అంత కక్షలు లేవు. ఆయన హత్య జరగడం భక్తులకు, సన్నిహిత మిత్రులను తీరని ఆవేదనకు గురి చేసింది. అయితే ఆయన ఆర్థిక వ్యవహారాలు చేసేవారని చెబుతున్నారు.


మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శశికుమార్

30 ఏళ్లుగా దైవారాధన


ఈ కారణంగానే హత్య జరిగి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఆయన స్వగ్రామం హుబ్లీ తాలూకాలోని కుసుగల్. ఆయన 30 ఏళ్లుగా స్థానిక పత్రిక ప్రూఫ్ రీడర్‌గా పని చేసి ఆ తర్వాత ఆధ్యాత్మికం, ముఖ్యంగా దైవారాధనలో నిమగ్నులయ్యారు. దేవేంద్రప్పను దేవప్పగా భక్తులు భక్తితో పిలుచుకొనే వారు. ఇదే పేరుతో ఆయన ఖ్యాతి గడించారు. ఈశ్వర్ నగర్‌లో వైష్ణవిదేవి దేవస్థానం స్థాపించారు. ఈ దేవస్థానంలో దక్షిణ భారతంలో వైష్ణవిదేవి పూజలు చేసేవారు. అంతేగాక ఆయన సమ్మోహిని విద్యలో కూడా నైపుణ్యం గలవారని సన్నిహితులు అంటున్నారు. ఆయన చెప్పే మాటలతో ఎంతో ప్రఖ్యాతి దక్కించుకున్నారు. ఈయన్ను కలవడానికి రాష్ట్రం నుంచే కాక వివిధ రాష్ట్రాల నుంచి అధికారులు, ఇతర ప్రముఖులు కూడా వచ్చే వారు. గత 30 ఏళ్ల నుంచి ఆలయ నిర్వహణ పూజలు చేసుకుంటూ స్థానిక విద్యానగర్ లోకప్పనఅక్కళలో కుటుంబంతో కలిసి నివాసం ఉండేవారు.

ఏడాది క్రితం కూడా హత్యాయత్నం

ఏడాది క్రితం కూడా ఆయనపై హత్యాయత్నం జరిగింది. ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి విద్యానగర్‌లోని ఆయన ఇంటి ముందే దాడి చేయడానికి ప్రయత్నించాడు. అయితే అదృష్టవశాత్తు ఆ దాడి నుంచి వెంట్రుకవాసిలో తప్పించుకున్నారు. దీనిపై హుబ్లీ విద్యానగర పోలీసులు కేసును కూడా నమోదు చేసుకొన్నారు. ఆయన భార్య డాక్టర్ విద్య. కిమ్స్‌లో మెడిసిన్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఓ కుమారుడు అమెరికాలో వైద్యుడిగా సేవలు అందిస్తున్నారు. ఇద్దరు కుమార్తెల్లో ఒక కుమార్తె ఎంబీఏ చదువుతోంది. మరొక్క కుమార్తె వివాహితురాలు. సుమారు ఆదివారం రాత్రి 7–8 గంటల మధ్య ఆలయ వెనుక గేట్‌లో పూజారిపై దాడి చేసి హత్య చేసినట్లుగా పోలీస్ కమిషనర్ శశికుమార్ తెలిపారు. ఛాతీ, వీపుపై చాకుతో నాలుగైదు సార్లు పొడిచారన్నారు. ఈ హత్య కేసుకు సంబంధించి దర్యాప్తు కోసం 8 బృందాలను నియమించినట్లు పోలీస్ కమిషనర్ శశికుమార్ పేర్కొన్నారు.

కుడి ఎగువ కాలువకు నీటి విడుదల


బటన్‌నొక్కి నీటిని విడుదల చేస్తున్న అధికారులు


కాలువలోకి నీరు విడుదలైన దృశ్యం

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు జిల్లా ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయం తుంగభద్ర డ్యాం నుంచి సోమవారం ప్రధానంగా ఉమ్మడి బళ్లారి, అనంతపురం జిల్లాలకు నీరందించే హెచ్‌ఎల్‌సీ(కుడి ఎగువ కాలువ)కు మండలి అధికారులు నీటిని విడుదల చేశారు. నీటి విడుదలకు ముందు కాలువ గేట్లకు మండలి కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి, ఎస్‌ఈ శ్రీకాంత్ రెడ్డి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బటన్ నొక్కి కాలువకు ప్రారంభంలో 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం గంట గంటకు నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచుతూ సుమారు 500 క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

అక్రమ ఇసుక తవ్వకాలపై కొరడా

- కొత్త ఎస్పీ రాకతో అక్రమాల అడ్డుకట్టకు యత్నం
- సిరుగుప్ప తాలూకాల్లో పలు వాహనాలు సీజ్
- బళ్లారితో పాటు అన్ని తాలూకాలపై దృష్టి సారించాలని వినతి

సాక్షి,బళ్లారి: జిల్లాలో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలతో పాటు అంతే స్థాయిలో జిల్లాలో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నాయి. జిల్లాలో కొనసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలకు ఎవరూ ఇంతవరకు దాదాపు అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించకపోవడంతో కొంత సక్రమం పేరిట ఇసుకాసురులు పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు చేపట్టి కోట్లకు పడగలెత్తుతున్నారు. ఇందులో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేల సహకారంతో ఇసుకాసులు యథేచ్ఛగా ఇసుకను తవ్వి, భూగర్భ జలాలు అడుగంటేందుకు కారణం అవుతున్నారు. జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాలపై జిల్లా యంత్రాంగానికి, పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత కొన్నేళ్లుగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా తరలించి పెద్ద ఎత్తున జేబులు నింపుకుంటున్న రాజకీయ నాయకులకు, ఇసుకాసురుల వ్యాపార లావాదేవీలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ప్రస్తుతం జిల్లా కొత్త ఎస్పీగా శోభారాణి బాధ్యతలు తీసుకున్నారు. జిల్లాలో అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతానని చెప్పిన ఆమె ముందుగా ఇసుక అక్రమ దందాను నివారించేందుకు నడుం బిగించారు. ఆదివారం రాత్రి జిల్లాలోని సిరుగుప్ప తాలూకాలో అక్కడి ఎమ్మెల్యే అనుచరులు, పోలీసుల సహకారంతో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి అక్రమ ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని జిల్లా ఎస్పీకి అందిన సమాచారంతో కొందరు పోలీసులతో మెరుపుదాడి చేయించి అక్రమ ఇసుక తవ్వకాలు సాగిస్తున్న జేసీబీ, తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేశారు. జిల్లాలో అక్రమ ఇసుక తవ్వకాల అణిచివేతకు జిల్లా ఎస్పీ చర్యలు తీసుకోవడంపై జనం హర్షిస్తున్నారు. సిరుగుప్ప తాలూకాలోనే కాకుండా బళ్లారి తాలూకాలోని పీడీహళ్లి, మోకా ఫిర్కా తదితర ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. జిల్లా ఎస్పీ చొరవ తీసుకుని బళ్లారి తాలూకాలో కొనసాగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పోలీసులపైకి రాళ్లు రువ్వి దొంగలు పరారీ

సాక్షి,బళ్లారి: దొంగలను పట్టుకునేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా పథకం వేసినా దొంగలు పోలీసుల రాకను పసిగట్టి పోలీసులపైకి రాళ్లు విసిరి పారిపోయిన ఘటన చిత్రదుర్గ జిల్లాలో జరిగింది. ఆదివారం రాత్రి చిత్రదుర్గ జిల్లా కుదాపుర సమీపంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న దొంగలను పట్టుకునేందుకు పోలీసులు బయలు దేరారు. పోలీసుల రాకను గుర్తించిన సదరు దొంగలు పథకం ప్రకారం పోలీసులపైకి రాళ్లు రువ్వడంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం గాల్లోకి కాల్పులు జరిపారు. దొంగలు, పోలీసుల మధ్య పెద్ద ఎత్తున ఘర్షణకు దారి తీసింది. ఎస్‌ఐ శివకుమార్ నేతృత్వంలో పోలీసు బృందం అక్కడే మకాం వేయగా, ఏపీ పర్మిట్ ఉన్న వాహనంలో ఉన్న దొంగల మధ్య ఘర్షణ జరిగింది. డీఆర్‌డీఏ దగ్గర అనుమానాస్పదంగా తిరుగుతున్న దొంగలు తమపైకి రాళ్లు విసిరి వాహనంలో వేగంగా వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. హిరేహళ్లి, బేడరెడ్డిహళ్లి మార్గం గుండా వేగంగా వాహనంలో ఆంధ్రప్రదేశ్ వైపు దొంగలు పారిపోవడంతో పోలీసులు వారిని కొంతదూరం వరకు వెంబడించారు. ఈ ఘటన సమాచారం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ ధర్మేంద్ర ప్రధాన్ కూడా అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఘటన స్థలంలో మోహరించిన పోలీసులు

ఏడీసీగా శివప్ప భజంత్రి



రాయచూరు రూరల్: రాయచూరు ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) పరిపాలనాధికారిగా అదనపు జిల్లాధికారి దురుగేష్ బదిలీ కావడంతో హుబ్లీ-ధారవాడ బీఆర్‌టీఎస్ కంపెనీ ఎండీ శివప్ప యల్లప్ప భజంత్రి సోమవారం అదనపు జిల్లాధికారి కార్యాలయంలో దురుగేష్ నుంచి బాధ్యతలు స్వీకరించారు.

మనశ్శాంతి అవసరం


జ్యోతి వెలిగిస్తున్న శాంతమల్ల శివాచార్య

రాయచూరు రూరల్: మానవుడికి ఆధ్యాత్మికంగా మనశ్శాంతి అవసరమని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు, బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సంచాలకురాలు స్మిత పేర్కొన్నారు. ఆదివారం రాత్రి రంగమందిరలో గురు పౌర్ణమి సందర్భంగా చైతన్య శివశక్తి సంగమం అనే అంశంపై జరిగిన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయ వర్సిటీ వైస్ చాన్సలర్ హన్మంతప్ప, రవి, దేవన్న నాయక్, కమల్ కుమార్, త్రివిక్రం జోషిలున్నారు.

ఇనుప కడ్డీల చోరీ.. ముగ్గురు అరెస్ట్

హుబ్లీ: తారిహాళ గ్రామ పరిధిలో నాలుగు ఇండస్ట్రియల్ గ్యారేజీల నుంచి ఇనుప సామగ్రిని చోరీ చేసిన కేసులో హుబ్లీ గ్రామీణ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.4.39 లక్షల విలువ చేసే వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అంతకు ముందు రూ.1.39 లక్షల విలువ చేసే ఇనుప సామగ్రిని చోరీ చేసిన ఘటనపై కూడా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు చేపట్టిన హుబ్లీ గ్రామీణ స్టేషన్ సీఐ ఎంఆర్ చెన్నన్నవర నేతృత్వంలో దాడి చేసి నిందితులు కరియప్ప తళవాళ, సునీల్ కట్టిమని, సంగమేష్ బబళేశ్వరను అరెస్ట్ చేశారు. ఘటనపై హుబ్లీ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కలుషిత నీరు తాగి 16 మందికి అస్వస్థత

రాయచూరు రూరల్: జిల్లాలోని మాన్వి తాలూకా మాడగిరిలో కలుషిత నీటిని తాగి 16 మంది అస్వస్థతకు గురైన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. గ్రామంలో రెండు ఇళ్ల వారు రాత్రి మాంసాహార భోజనం చేసి నీటిని తాగారు. అనంతరం కాసేపటికి వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. వారిని చికిత్స కోసం నగరంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. గ్రామంలో ప్రైవేట్ తాగునీటి ఫిల్టర్ పని చేయక పోవడంతో వంక నీరు తాగడంతో ఈ ఘటన జరిగినట్లు తెలిసింది. ఆస్పత్రిలో రోగులను కాంగ్రెస్ పార్టీ యువ అధ్యక్షుడు అరుణ్, నగరసభ సభ్యుడు రమేష్ పరామర్శించి అధికారులతో మాట్లాడారు.


రోగులను పరామర్శిస్తున్న నాయకులు

వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడుగా పంచాక్షరప్ప

సాక్షి,బళ్లారి: అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లాధ్యక్షుడుగా బిచ్చగల్ పంచాక్షరప్ప గెలుపొందారు. ఆదివారం అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్ష స్థానంతో పాటు 30 మంది కార్యవర్గ సభ్యుల స్థానాలకు ఎన్నిక జరిగింది. పోలింగ్ అనంతరం ఆదివారం అర్ధరాత్రి దాకా ఓట్ల లెక్కింపు కొనసాగింది. జిల్లా అధ్యక్ష స్థానానికి హానగల్ కుమారస్వామి బృందం తరపున చానాల్ శేఖర్, త్రివిధ దాసోహి సిద్దగంగ శివకుమార స్వామి బృందం తరపున పంచాక్షరప్ప పోటీ చేశారు. మరొక అభ్యర్థి ఈశ్వరప్ప కూడా అధ్యక్ష స్థానానికి పోటీ పడ్డారు. గత 10 రోజుల నుంచి హోరాహోరీగా జరిగిన ఎన్నికల ప్రచారంలో శేఖర్, పంచాక్షరప్ప బృందాలు నువ్వా, నేనా? అన్న చందంగా పోటీ పడగా, చివరకు ప్రస్తుత అధ్యక్షుడుగా కొనసాగుతున్న శేఖర్‌ను ఓడించి పంచాక్షరప్ప 200 ఓట్ల తేడాతో గెలుపొంది రికార్డు సృష్టించారు. పోలైన ఓట్లలో పంచాక్షరప్పకు 2865 ఓట్లు, శేఖర్‌కు 2642 ఓట్లు రాగా, మిగిలిన ఈశ్వరప్పకు 157 ఓట్లు వచ్చాయి. హోరాహోరీగా, ఉత్కంఠగా జరిగిన ఎన్నికలు, ఓట్ల లెక్కింపులో పంచాక్షరప్ప ఘన విజయం సాధించడంతో ఆ వర్గానికి చెందిన కార్యవర్గ సభ్యులతో పాటు, ఆయన అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.


విజయచిహ్నం చూపుతున్న పంచాక్షరప్ప

వరద గుప్పెట్లో ఉత్తర కర్ణాటక జిల్లాలు


డ్యాం నుంచి పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ


నీట మునిగిన నదీ తీరంలోని ఆలయం

- నారాయణపూర్ డ్యాం నుంచి 1.80 లక్షల క్యూస్కెల నీరు విడుదల

రాయచూరు రూరల్: ఉత్తర కర్ణాటక, కళ్యాణ కర్ణాటకలోని బెళగావి, విజయపుర, బాగల్‌కోటె, కలబుర్గి, యాదగిరి, రాయచూరు జిల్లాల్లో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సోమవారం నారాయణపూర్ డ్యాం నుంచి 1.80 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. దేవదుర్గ తాలూకా కొప్పర వద్ద లక్ష్మీనరసింహ ఆలయం, హూవిన హెడగి వద్ద బసవేశ్వర ఆలయం, రోడ్డు వంతెన పూర్తిగా నీట మునిగింది. వంతెనపైకి వరద నీరు రావడంతో రాయచూరు-కలబుర్గి జిల్లాల మధ్య వాహన రాకపోకలు స్తంభించాయి. రాయచూరు జిల్లాలో జిల్లాధికారి నితీష్, యాదగిరి జిల్లా సురపురలో ఆ జిల్లాధికారి సుశీల వరద పరిస్థితిపై అధికారులతో చర్చించి సమీక్షించారు. ఇక తుంగభద్ర నదికి కూడా వరద పోటెత్తనుండటంతో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు జిల్లాధికారి సూచించారు. కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర నదీ తీరంలోని మాన్వి, రాయచూరు, గిల్లేసూగురు, కృష్ణా నదీ తీరంలోని దేవసూగూరు, దొంగరాంపూర్, ఆత్కూర్, బూడిదపాడు, నారదగడ్డ దత్తాత్రేయ ఆలయం వద్ద భక్తులు, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.